'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 6.50

సంపుటి: 18 సంచిక: 287

బుధవారం 7-1-2026

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

ఫోన్ వదలాలంటే..

కొన్ని రాష్ట్రాల్లో బడిలో పిల్లలతో న్యూస్ పేపర్లు చదివిస్తున్న ప్రభుత్వాలు -13లో

అమన్ రావు డబుల్ సెంచరీ

విజయ్‌హజారే వన్డే టోర్నీ మ్యాచ్‌లో 154 బంతుల్లో 200 పరుగులు -14లో

ట్రంప్ మలి గురి.. గ్రీన్‌లాండ్?

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తదుపరి లక్ష్యం గ్రీన్‌లాండేనా? ఆయన దూకుడు చూస్తే అవుననే అనిపిస్తోంది.

వివరాలు 6లో ▸



తీవ్ర బాధ్యతారాహిత్యం

ఢిల్లీని కాలుష్యం బారి నుంచి తప్పించడంలో సీఏక్యూఎం విభాగం ఘోరంగా విఫలమవుతోందని సుప్రీంకోర్టు మండిపడింది.

వివరాలు 6లో ▸

2.89 కోట్ల ఓట్ల తొలగింపు

ఉత్తరప్రదేశ్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సర్వే కసరత్తు అనంతరం 2.89 కోట్ల ఓట్లను తొలగించారు.

వివరాలు 6లో ▸

హెడ్ ఆఫీస్‌కు వచ్చి కలవండి

కరూర్ తొక్కిసలాట ఘటనపై టీవీకే చీఫ్, ప్రముఖ నటుడు విజయ్‌కు తాజాగా సీబీఐ సమన్లు జారీ చేసింది.

వివరాలు 6లో ▸

సాక్షి టెన్త్‌క్లాస్ స్పెషల్



బయాలజీ
ముఖ్యమైన ప్రశ్నలు- సమాధానాలు, క్విజ్

- వివరాలు 11,12ల్లో ▸

పేకాటలో దొరికి పరువు పోగొట్టారు

16లో

కడపలో టీడీపీ పరిస్థితి చక్కదిద్దలేనంత దిగజారింది: మంత్రి సవిత

నేటి గుడ్లు & చికెన్ గుంటూరు జోన్ ధరలు

12 గుడ్ల రిటైల్ ధర ₹84	ఫారం దగ్గర లైవ్ బర్డ్	157 కిలో	డ్రెస్డ్ స్కిన్‌తో	267 కిలో
	రిటైల్ లైవ్ బర్డ్	184 కిలో	స్కిన్ లెస్	304 కిలో

Conditions Apply

వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది

నంద్యాల జిల్లా జూపాడుబంగ్లా మండలంలో నిలిచిపోయిన రాయలసీమ ఎత్తిపోతల ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీమ జిల్లాల వైఎస్సార్‌సీపీ నేతలు

చంద్రబాబు సీమ జలద్రోహి

ఆయన అధికారంలోకి వచ్చాక రాయలసీమ లిఫ్ట్ పనులు నిలిపివేశారు

ప్రాజెక్టు పూర్తయితే వైఎస్ జగన్‌కు మంచి పేరొస్తుందనే కుట్రలు

సీమ ఎత్తిపోతలకు పర్యావరణ అనుమతులు లేవనేది దొంగ సాకులే

ఈ ప్రాంతం అంటే చంద్రబాబుకు మొదటి నుంచి కక్షే

పోతిరెడ్డిపాడు విస్తరణ నుంచి సీమ లిఫ్ట్ వరకు అన్నిచోట్లా కుట్రలే

తక్షణమే రాయలసీమ ఎత్తిపోతల పనులు చేపట్టాలి

చంద్రబాబు స్పందించకపోతే ఉద్యమిస్తాం

జూపాడుబంగ్లా మండలంలో నిలిచిపోయిన లిఫ్ట్ పనులను పరిశీలించిన రాయలసీమ జిల్లాల వైఎస్సార్‌సీపీ నేతలు

2లో

'సీమ ఎత్తిపోతల'తో ప్రయోజనం లేదు

మీడియా సాక్షిగా జలవనరుల శాఖ మంత్రి నిమ్మల వ్యాఖ్యలు

- గత ప్రభుత్వం 800 అడుగుల నుంచే నీటిని తరలించేలా రాయలసీమ ఎత్తిపోతల చేపట్టి ఆ పనుల కోసం రూ.990 కోట్లు ఖర్చు కూడా చేసింది
- 841 అడుగుల దిగువన శ్రీశైలంలో ఉండేది 34 టీఎంసీలే.. అందులో మన వాటా 22 టీఎంసీలే
- అందువల్ల రాయలసీమ ఎత్తిపోతల వల్ల అదనంగా ఎలాంటి ప్రయోజనం ఉండదు..
- అయినా.. పర్యావరణ అనుమతి లేకుండానే సీమ ఎత్తిపోతలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టింది
- ఎన్‌జీటీ.. 2020 మే 20న పనులు నిలిపివేయమని ఆదేశించింది

2లో

పురిటిగడ్డకు వెన్నుపోటు!

రాయలసీమ, నెల్లూరు అభివృద్ధి, ప్రయోజనాలపై చీమంతైనా చిత్తశుద్ధి లేని చంద్రబాబు

- సీమ ఎత్తిపోతలతో ఎలాంటి ప్రయోజనం లేదంటూ మంత్రి నిమ్మలతో చెప్పించిన బాబు
- 841 అడుగుల కంటే ఎగువన ఉన్నా, దిగువన ఉన్నా మనకు హక్కుగా దక్కిన వాటా జలాలను పూర్తి స్థాయిలో వాడుకోవడానికి చేపట్టిందే సీమ ఎత్తిపోతల
- శ్రీశైలంలో మట్టం 881 అడుగుల కంటే ఎక్కువ ఎత్తులో ఉన్నప్పుడే పోతిరెడ్డిపాడు ద్వారా రోజూ గరిష్టంగా 44 వేల క్యూసెక్కులు తరలించే అవకాశం
- 841 అడుగుల కంటే దిగువన ఉంటే చుక్క నీటిని కూడా తీసుకోలేం..
- మనకు హక్కుగా దక్కిన నీటిని వాడుకునేలా వైఎస్ జగన్ వడివడిగా అడుగులు

2లో

ప్రతి భారతీయుని తరఫున
ప్రపంచకప్ విజేతలను సన్మానించిన శ్రీమతి నీతా అంబానీ

ప్రపంచ కప్ విజేతలైన భారతదేశ మూడు టీమ్‌లు పురుషులు, మహిళలు మరియు మహిళల అంధుల టీమ్ సభ్యులను సోమవారం నాడు ముంబయిలో ప్రతీ భారతీయుని తరపున యునైటెడ్ ఇన్ ట్రయంఫ్ రెండవ దశలో భాగంగా శ్రీమతి నీతా అంబానీ పాల్గొన్నారు.

''ఒక ప్రత్యేక సందర్భంలో నూతన సంవత్సరంను మనం ప్రారంభిస్తున్నామని నేను భావిస్తున్నాను, భారతదేశ క్రికెట్ టీమ్స్ మూడు, పురుషుల క్రికెట్ టీమ్, మహిళల క్రికెట్ టీమ్ మరియు అంధుల క్రికెట్ టీమ్ అన్నీ ఒకే వేదికపై ఉన్నాయి. ప్రతీ భారతీయుని తరపున మనందరికీ సంతోషం, ఆనందం అందించిన వీరి గౌరవించనున్నామని'' శ్రీమతి అంబానీ తెలిపారు.

క్రీడలు మరియు వాటి పరివర్తనదాయకమైన ప్రత్యేక శక్తి గురించి మాట్లాడుతూ, ''క్రీడలు భారతదేశాన్ని, హృదయాలను ఏకం చేస్తాయి. నేడు మనం యునైటెడ్ ఇన్ ట్రయంఫ్‌లో ఉన్నాము. వారిని సన్మానిస్తూ విజయోత్సవాలను జరుపుకుందామని'' వివరించారు.

ఈ వేడుకలలో ప్రధానంగా నాయకత్వం, స్థితప్రజ్ఞత మరియు విశ్వాసాలతో చారిత్రాత్మక విజయాలను అందించిన భారత మూడు ప్రపంచ విజేతల కెప్టెన్లు – రోహిత్ శర్మ, హర్మన్‌ప్రీత్ కౌర్ మరియు దీపిక టిసి పాల్గొన్నారు.

మూడు ప్రపంచ కప్ – విజేత టీమ్‌ల క్రీడాకారులు జస్ప్రీత్ బుమ్రా, సూర్యకుమార్ యాదవ్, స్మృతి మంథాన, జెమీమా రోడ్రిగ్స్ మరియు గంగా కదంలతోపాటు క్రికెట్ దిగ్గజాలు సచిన్ టెండూల్కర్, సునీల్ గవాస్కర్ మరియు రవిచంద్రన్ అశ్విన్, ఒలింపిక్ మరియు పారాలింపిక్ దిగ్గజాలు మురళీకాంత్ పేట్కర్, దీపామాలిక్ మరియు దేవేంద్ర జాజహారియా మరియు భారతీయ సినిమా పరిశ్రమ నుండి ప్రముఖులు అమితాబ్ బచ్చన్, షారూఖ్ ఖాన్‌లు పాల్గొనడంతో సాయంత్రం కార్యక్రమం భారతదేశంలో అత్యంత ప్రముఖులతో కూడిన ఒక అద్భుతమైన, శక్తివంతమైన సంగమంగా నిలిచింది.

రోహిత్ నాయకత్వంలో...

సరిగ్గా ఏడాదిన్నర క్రితం ఈ ప్రపంచకప్‌ల హంగామా మొదలైందని చెప్పొచ్చు. బహుశా ఈ మూడు కప్‌లకు రోహిత్ గెలిచిన మొదటి కప్పే ఊతమిచ్చిందనుకోవచ్చు.

2023లో వన్డే ప్రపంచకప్‌ను కోల్పోయి దెబ్బతిన్న పులిలా ఉన్న భారత్‌కు మరుసటి ఏడాదే టి20 ప్రపంచకప్ రూపంలో వెంటనే మరో అవకాశం లభించింది. 2024 జూన్‌లో వెస్టిండీస్, అమెరికాలు సంయుక్తంగా ఆతిథ్యమిచ్చిన టి20 ప్రపంచకప్‌లో రోహిత్ శర్మ నేతృత్వంలోని టీమిండియా వరుస విజయాలతో అజేయంగా ఫైనల్‌కు చేరింది.

దక్షిణాఫ్రికాతో జరిగిన ఈ ఫైనల్ పోరులో టాస్ గెలిచిన భారత్ బ్యాటింగ్‌కు దిగింది. నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 176 పరుగులు చేసింది. భారత బ్యాటర్లు ఉన్న ఫామ్‌కు, అజేయ రికార్డును చూసి సులువుగానే బాదేస్తారనుకుంటే కెప్టెన్ రోహిత్ (9), రిషభ్ పంత్ (0), సూర్యకుమార్ యాదవ్ (3)లాంటి హిట్టర్లందరూ సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. ఈ దశలో 'కింగ్' కోహ్లి (76) జట్టు భారాన్ని, స్కోరు పెంచే బాధ్యతని తనమీదే వేసుకున్నాడు.

ముంబయిలో నిర్వహించిన యునైటెడ్ ఇన్ ట్రయంఫ్ కార్యక్రమ రెండవ ఎడిషన్‌లో శ్రీమతి నీతా అంబానీతోపాటు మూడు ప్రపంచ చాంపియన్ క్రికెట్ టీమ్‌ల కెప్టెన్‌లు, భారత మహిళల అంధుల టీమ్ కెప్టెన్ దీపిక టి.సి., రోహిత్ శర్మ మరియు హర్మన్‌ప్రీత్ కౌర్‌లు ఉన్న ఈ విశిష్ట చిత్రంలో త్యాగం, కృషి మరియు పూర్ణత్వం ప్రతిబింబిస్తున్నాయి

34 పరుగులకే 3 కీలక వికెట్లు కోల్పోయిన గడ్డు స్థితి నుంచి అక్షర్ పటేల్ (47)తో కలిసి మెరుగైన దశకు చేర్చాడు. శివమ్ దూబే (27) సైతం తనవంతు పాత్ర పోషించడంతో భారత్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 176 పరుగులు చేసింది. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన దక్షిణాఫ్రికాను బుమ్రా, అర్ష్‌దీప్ చావుదెబ్బ తీయడంతో ఆరంభంలోనే తడబడింది. అయితే ఓపెనర్ డికాక్ (39), ట్రిస్టన్ స్టబ్స్ (31) రాణించడంతో ట్రాక్‌లో పడిన సఫారీని హెన్రిచ్ క్లాసెన్ చేసిన మెరుపు ఫిఫ్టీ (52) గెలుపుదారిలో పడేసింది. ఈ దశలో హార్దిక్ పాండ్యా (3/20) తెలివైన బంతితో క్లాసెన్‌ను బోల్తాకొట్టించి మ్యాచ్ గమనాన్నే మార్చేశాడు. తర్వాత అర్ష్‌దీప్ (2/20), బుమ్రా (2/18) కట్టుదిట్టమైన బౌలింగ్‌తో టీమిండియా ఆఖరిదాకా పట్టు సడలించకుండా పోరాడి రెండో సారి (2007లో ధోనిసేన తొలిసారి) టి20 ప్రపంచకప్ గెలుచుకుంది.

హర్మన్‌ప్రీత్ అందుకుంది!

పురుషుల జట్టు రెండేసి సార్లు వన్డే ప్రపంచకప్ (1983, 2011), టి20 ప్రపంచకప్ (2007, 2024)లను గెలుచుకుంది. కానీ మహిళల జట్టుకు ప్రపంచకప్ అనేది అందని ద్రాక్షగానే మిగిలిపోయింది. ఎట్టకేలకు గతేడాది హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత మహిళా జట్టు సుదీర్ఘ నిరీక్షణకు తెరదించింది. 2025లో సొంతగడ్డపై జరిగిన వన్డే ప్రపంచకప్‌లో పడుతూ... లేస్తూ... పట్టుదలగా సాగిన హర్మన్ సేన తొలిసారి విశ్వవిజేతగా నిలిచింది. నవీ ముంబైలో జరిగిన టైటిల్ పోరులో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత మహిళల జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 298 పరుగులు చేసింది. ఓపెనర్లు షఫాలీ వర్మ (87), స్మృతి మంధాన (45) తొలి వికెట్‌కు జోడించిన 104 పరుగుల భాగస్వామ్యమే భారీస్కోరుకు, తర్వాత ప్రపంచకప్ విజయానికే బంగారు బాట వేసింది. ఆ తర్వాత దీప్తి శర్మ (58), రిచా ఘోష్ (34), జెమీమా రోడ్రిగ్స్ (24), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (20) తలా ఒక చేయి వేయడంతో భారత అమ్మాయిల జట్టు ప్రత్యర్థి ముందు కఠినమైన లక్ష్యాన్ని నిర్దేశించారు. అయితే దక్షిణాఫ్రికా ఆషామాషీ టీమ్ కాదు... ఓ రకంగా మన అమ్మాయిల జట్టుకంటే గట్టి ప్రత్యర్థి. అంతేకాదు ఈ కప్‌లోనే లీగ్ దశలో భారత్ నిర్దేశించిన లక్ష్యాన్ని ఛేదించిన జట్టు దక్షిణాఫ్రికా. ఆ ఉత్సాహంతోనే సఫారీ అమ్మాయిలు ఛేదించేందుకు దిగారు. ఓపెనర్లలో కెప్టెన్ వోల్వార్డ్, తజమిన్ బ్రిట్స్ తొలి వికెట్‌కు 51 పరుగులు జోడించి చక్కని ఆరంభాన్నిచ్చారు. అయితే వరుస విరామంలో అనెకె బాష్ (0), సునే లూస్ (25), మరిజన్ కాప్ (4)ల వికెట్లను కోల్పోవడంతో భారత జట్టుకు పట్టుదొరికింది. అయితే మరోవైపు కెప్టెన్ వోల్వార్డ్ (101) వీరోచిత శతకంతో దక్షిణాఫ్రికాను గెలిపించేందుకు శతవిధాల ప్రయత్నించింది. అయితే దీప్తి శర్మ (5/39) అసాధారణ బౌలింగ్ ప్రదర్శన, భారత క్రికెటర్ల చురుకై న ఫీల్డింగ్ దక్షిణాఫ్రికా ప్రపంచకప్ ఆశల్ని కూల్చేసింది. శతకం పూర్తయిన వెంటనే వోల్వార్డ్‌ను దీప్తి అవుట్ చేయడంతోనే ప్రపంచకప్ రేసుకు దూరమైంది. బ్యాటింగ్‌లో రాణించిన షఫాలీ వర్మ బౌలింగ్‌లోనూ అదరగొట్టింది. కీలకమైన 2 వికెట్లను తీసి భారత ప్రపంచకప్ విజయంలో భాగమైంది. దీంతో ఎట్టకేలకు అమ్మాయిల కప్ కల సాకారమైంది.

అంధుల కప్ కూడా మనదే...

వరుస ఏడాదిల్లో అటు పురుషుల జట్టు ఇటు మహిళల జట్టు ఇచ్చిన ఉత్సాహం అంధుల మహిళల ప్రపంచకప్ కూడా వశమయ్యేలా చేసింది. శ్రీలంక ఆతిథ్యమిచ్చిన ఈ అంధుల మెగా టోర్నీలో టి.సి.దీపిక నేతృత్వంలో భారత మహిళల జట్టు విశ్వవిజేతగా నిలిచింది. కొలంబోలో జరిగిన తుదిపోరులో దీపిక సేన... నేపాల్‌పై ఘనవిజయం సాధించడంతో మనకు క్రికెట్ (పురుషులు, మహిళలు, అంధుల)లో మూడో ప్రపంచకప్ చేజిక్కింది.

యునైటెడ్ ఇన్ ట్రయంఫ్ కార్యక్రమం, కేవలం విజయోత్సవాలను జరుపుకోవడమే కాకుండా, శ్రేష్ఠత, సమీకృతం మరియు ఐక్యత కొరకు క్రీడలను ఒక శక్తిగా, భారతదేశ క్రీడా పయనాన్ని నిర్వచించే విలువలు, ఉద్దేశాలకు ప్రతీకగా శ్రీమతి అంబానీ కార్యాచరణ నిలిపింది.



భావోద్వేగాలు, కలహాలు మరియు విజయాలతో నిండిన వేలాది కథలను చిత్రాలు వెల్లడిస్తాయి. ముంబయిలో జరిగిన యునైటెడ్ ఇన్ ట్రయంఫ్ కార్యక్రమంలో శ్రీమతి నీతా అంబానీ, శ్రీ అమితాబ్ బచ్చన్, శ్రీ సచిన్ టెండూల్కర్ మరియు శ్రీ జై షాలతో విజయదుందుభి మ్రోగించిన భారత మహిళల అంధుల క్రికెట్ టీమ్, ఐసిసి వరల్డ్ టి20 ఛాంపియన్‌షిప్ గెలుపొందిన భారత టీమ్‌లోని ఎంపిక చేయబడిన సభ్యులు మరియు ఐసిసి మహిళల క్రికెట్ వరల్డ్ కప్ గెలుపొందిన భారత క్రికెట్ టీమ్ సభ్యులతో కూడిన ప్రత్యేక చిత్రాలు

పురిటిగడ్డకు వెన్నుపోటు!

రాయలసీమ, నెల్లూరు అభివృద్ధి, ప్రయోజనాలపై చీమంతైనా చిత్తశుద్ధి లేని చంద్రబాబు

సీమ ఎత్తిపోతలతో ఎలాంటి ప్రయోజనం లేదంటూ మంత్రి నిమ్మల ద్వారా చెప్పించిన బాబు

- 841 అడుగుల దిగువన శ్రీశైలంలో నిల్వ ఉండే 34 టీఎంసీలను వాడుకోవడానికి చేపట్టిందే రాయలసీమ ఎత్తిపోతల అంటూ వితండవాదన
- వాటిని తరలించడానికి మల్యాల, ముచ్చుమర్రి ఎత్తిపోతల ఉన్నాయంటూ దబాయింపు
- కానీ 841 అడుగుల కంటే ఎగువన ఉన్నా, దిగువన ఉన్నా మనకు హక్కుగా దక్కిన వాటా జలాలను పూర్తి స్థాయిలో వాడుకోవడానికి చేపట్టిందే రాయలసీమ ఎత్తిపోతల
- శ్రీశైలంలో మట్టం 881 అడుగుల కంటే ఎక్కువ ఎత్తులో ఉన్నప్పడే పోతిరెడ్డిపాడు ద్వారా రోజు గరిష్ఠంగా 44 వేల క్యూసెక్కులు తరలించే అవకాశం
- 841 అడుగుల కంటే దిగువన ఉంటే చుక్క నీటిని కూడా తీసుకోలేం..
- మారిన పరిస్థితులతో వర్షాలు కురిసే రోజులు తగ్గుదల.. వరద వచ్చినప్పుడు ఒడిసి పట్టుకోవటమే శరణ్యం
- మనకు హక్కుగా దక్కిన నీటిని వాడుకునేలా వైఎస్ జగన్ వడివడిగా అడుగులు
- శ్రీశైలంలో 800 అడుగుల నుంచి రోజుకు 3 టీఎంసీల చొప్పన పోతిరెడ్డిపాడు దిగువన నీటిని ఎత్తిపోసేలా రాయలసీమ ఎత్తిపోతలకు వైఎస్సార్‌సీపీ హయాంలో అనుమతి
- సీమ, నెల్లూరు అభివృద్ధికి రాయలసీమ ఎత్తిపోతల గేమ్ ఛేంజర్ అంటూ నిపుణుల ప్రశంసలు
- అది పూర్తయితే వైఎస్ జగన్‌కు మంచి పేరొస్తుందనే ఈర్ష్యతోనే అక్కసు వెళ్లగక్కుతున్న చంద్రబాబు
- అందుకే ఆ ఎత్తిపోతలపై ఈఏసీలో ఉద్దేశపూర్వకంగానే సరైన వాదనలు వినిపించని వైనం
- పోతిరెడ్డిపాడు సామర్థ్యాన్ని 2005లో వైఎస్సార్ 11 వేల నుంచి 44 వేల క్యూసెక్కులకు పెంచినప్పడూ చంద్రబాబుది ఇదే తీరు
- ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టేలా ప్రకాశం బ్యారేజీపై దేవినేని ఉమాతో.. తెలంగాణలో మాజీ మంత్రి నాగంతో ధర్నాలు చేయించిన బాబు

సాక్షి, అమరావతి: రాయలసీమ, నెల్లూరు జిల్లాల అభివృద్ధి.. ప్రయోజనాలపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు చీమంతైనా చిత్తశుద్ధి లేదన్న నిజం మరోసారి తేటతెల్లమైంది. ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబుతో తాను ఏకాంతంగా సమావేశమై రాయలసీమ ఎత్తిపోతల పనులు ఆపివేయించానని.. ఆ పనులు ఆగిపోయాయో లేదో అన్నది తెలుసుకోవాలంటే తనిఖీ చేసుకోవచ్చని తెలంగాణ అసెంబ్లీ సాక్షిగా ఆ రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి గత శనివారం చేసిన వ్యాఖ్యలను ఇప్పటివరకు చంద్రబాబు కనీసం ఖండించలేదు. ఇక జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ద్వారా రాయలసీమ ఎత్తిపోతలతో ఎలాంటి ప్రయోజనం లేదంటూ తాజాగా మంగళవారం స్పష్టం చేయించడం ద్వారా.. తెలంగాణ సీఎం రేవంత్ చెప్పింది నిజమేనని సీఎం చంద్రబాబు పరోక్షంగా అంగీకరించారు. రాయలసీమ ఎత్తిపోతల పూర్తయితే వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌కు మంచి పేరొస్తుందనే ఈర్ష్యతోనే పనిగట్టుకుని ఆ ఎత్తిపోతల పనులు నిలిపివేయించారని సాగునీటిరంగ నిపుణులు తేల్చి చెబుతున్నారు. పిల్లనిచ్చిన మామ ఎన్టీఆర్‌కే కాదు.. జన్మనిచ్చిన రాయలసీమకు కూడా చంద్రబాబు వెన్నుపోటు పొడిచారని మండిపడుతున్నారు. దుర్భిక్ష రాయలసీమ, నెల్లూరు జిల్లాలను సస్యశ్యామలం చేసేందుకు 2005లో నాటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని 11 వేల నుంచి 44 వేల క్యూసెక్కులకు పెంచినప్పుడు.. దాన్ని నిరసిస్తూ, ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొడుతూ అటు ప్రకాశం బ్యారేజీపై దేవినేని ఉమామహేశ్వరరావుతో ఇటు తెలంగాణ ప్రాంతంలో మహబూబ్‌నగర్ జిల్లాలో మాజీ మంత్రి నాగం జనార్ధనరెడ్డితో చంద్రబాబు ధర్నాలు చేయించారని గుర్తు చేస్తున్నారు.

ముమ్మాటికీ సీమ ఎత్తిపోతల గేమ్ ఛేంజర్..

శ్రీశైలం ప్రాజెక్టు గరిష్ట నీటి మట్టం 885 అడుగులు కాగా కనీస నీటి మట్టం 854 అడుగులు. తెలుగుగంగ, ఎస్సార్బీసీ, గాలేరు–నగరి ఆయకట్టుకు సాగునీరు, చెన్నైకి తాగునీటిని శ్రీశైలం ప్రాజెక్టులో పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారానే నీటిని విడుదల చేయాలి. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌ను శ్రీశైలం ప్రాజెక్టులో 841 అడుగుల నీటి మట్టం వద్ద అమర్చారు. శ్రీశైలంలో నీటి మట్టం 881 అడుగుల కంటే ఎక్కువ ఎత్తులో ఉన్నప్పుడే పోతిరెడ్డిపాడు ద్వారా ప్రస్తుత డిజైన్ మేరకు రోజుకు గరిష్ఠంగా 44 వేల క్యూసెక్కులు తరలించే అవకాశం ఉంటుంది. అదే 854 అడుగుల్లో నీటి మట్టం ఉంటే 7 వేలు, 841 అడుగుల్లో నీటి మట్టం ఉంటే 2 వేల క్యూసెక్కులు మాత్రమే తరలించే వీలుంది. ఇక శ్రీశైలంలో 841 అడుగుల కంటే దిగువన నీటి మట్టం ఉంటే చుక్క నీటిని కూడా తీసుకోలేం. ఈ క్రమంలో విభజన తర్వాత 2014 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు సర్కార్.. తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం కొలువుదీరాయి. కృష్ణా బోర్డు పరిధిని నిర్దేశించే వరకూ ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలాన్ని ఏపీ ప్రభుత్వం.. నాగార్జునసాగర్‌ను తెలంగాణ సర్కార్ నిర్వహించాలని నాడు కేంద్రం నిర్దేశించింది. కానీ.. శ్రీశైలం ఎడమ గట్టు విద్యుత్కేంద్రం తమ భూభాగంలో ఉందంటూ అప్పట్లో తెలంగాణ సర్కార్ తన అధీనంలోకి తీసుకున్నప్పటికీ చంద్రబాబు సర్కార్ అభ్యంతరం చెప్పలేదు. ఇంతలో 2015లో ఓటుకు కోట్లు కేసులో తెలంగాణ సర్కార్‌కు సీఎం చంద్రబాబు అడ్డంగా దొరికిపోయారు. దీంతో తెలంగాణ సర్కార్ కల్వకుర్తి ఎత్తిపోతల సామర్థ్యాన్ని 25 నుంచి 40 టీఎంసీలకు పెంచుతున్నా.. అనుమతి లేకుండా శ్రీశైలం నుంచి రోజుకు 2 టీఎంసీలు తరలించేలా పాలమూరు–రంగారెడ్డి, డిండి ఎత్తిపోతల చేపట్టినా చంద్రబాబు సర్కార్ నోరు మెదపలేదు. ఫలితంగా శ్రీశైలం ఎడమ గట్టు విద్యుత్కేంద్రం నుంచి 4 టీఎంసీలు, కల్వకుర్తి నుంచి 0.4 టీఎంసీ, ఎస్సెల్బీసీ నుంచి 0.5 టీఎంసీ, పాలమూరు–రంగారెడ్డి–డిండి ఎత్తిపోతల ద్వారా 2 టీఎంసీలు వెరసి శ్రీశైలం ప్రాజెక్టులో 800 అడుగుల నీటి మట్టం నుంచే రోజుకు 6.95 టీఎంసీలు తరలించే సామర్థ్యాన్ని తెలంగాణ సర్కార్ సాధించుకుంది. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి 800 అడుగుల స్థాయిలో హంద్రీ–నీవా ద్వారా కేవలం 0.33 టీఎంసీలు తరలించే సామర్థ్యం మాత్రమే ఏపీకి ఉంది. శ్రీశైలం దిగువన తాగు, సాగునీటి అవసరాలు ఉన్నప్పుడు కృష్ణా బోర్డు అనుమతి ఇచ్చిన మేరకే నీటిని విడుదల చేస్తూ రెండు రాష్ట్రాలు విద్యుదుత్పత్తి చేయవచ్చు. కానీ.. 2014 నుంచి శ్రీశైలంలో నీటి మట్టం కనీస స్థాయికి 854 అడుగులకు చేరకున్నా.. వరద ప్రవాహం ప్రారంభం కాకపోయినా సరే తెలంగాణ సర్కార్ శ్రీశైలం దిగువన ఎలాంటి నీటి అవసరాలు లేనప్పటికీ ఎడమ గట్టు కేంద్రంలో యథేచ్ఛగా విద్యుదుత్పత్తి చేస్తూ.. దిగువకు నీటిని తరలిస్తూ శ్రీశైలాన్ని ఖాళీ చేస్తూ రాయలసీమ రైతుల హక్కులను హరిస్తున్నా చంద్రబాబు సర్కార్ నోరుమెదపలేదు. శ్రీశైలంలోకి వచ్చిన నీటిని వచ్చింది వచ్చినట్టుగా తరలించడం వల్ల పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌కు నీళ్లందక.. తెలుగుగంగ, ఎస్సార్బీసీ, గాలేరు–నగరి ఆయకట్టులో 2014–19 మధ్య ఏటా పంటలు ఎండిపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కృష్ణా బేసిన్‌లో 2015–16లో వర్షాభావ పరిస్థితుల వల్ల శ్రీశైలానికి 58.69 టీఎంసీల ప్రవాహమే రాగా..

పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌కు కేవలం 0.95 టీఎంసీని మాత్రమే సరఫరా చేశారు. ఆ ఏడాది గుక్కెడు తాగునీటి కోసం కటకటలాడారు. ఇక 2016–17లో శ్రీశైలానికి 337.95 టీఎంసీలు వచ్చినా.. తెలంగాణ 800 అడుగుల నుంచే యథేచ్ఛగా నీటిని తరలించడం వల్ల పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా కేవలం 67.44 టీఎంసీలను మాత్రమే విడుదల చేశారు. ఈ నేపథ్యంలో వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తడారిన గొంతులను తడిపేందుకు.. బచావత్ ట్రిబ్యునల్ ద్వారా హక్కుగా దక్కిన నీటిని వాడుకుని ఎండిపోతున్న పంటలను రక్షించడం కోసం.. తెలంగాణ తరహాలోనే శ్రీశైలంలో 800 అడుగుల నీటి మట్టం నుంచి రోజుకు 3 టీఎంసీల చొప్పున పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ దిగువన కుడి ప్రధాన కాలువలోకి నీటిని ఎత్తిపోసేలా రూ.3,825 కోట్ల వ్యయంతో 2020 మే 5న రాయలసీమ ఎత్తిపోతలను చేపట్టడానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ ఎత్తిపోతల రాయలసీమ, నెల్లూరు జిల్లాల రూపురేఖలను మార్చేస్తుందని.. ఆ జిల్లాల అభివృద్ధికి గేమ్ ఛేంజర్ అవుతుందని సాగునీటిరంగ నిపుణులు ప్రశంసిస్తున్నారు. మంత్రి నిమ్మల చెబుతున్నట్లుగా శ్రీశైలంలో 841 అడుగుల దిగువన నిల్వ ఉండే 34 టీఎంసీలను తరలించడానికి కాదు.. 841 అడుగుల ఎగువ నుంచి కూడా హక్కుగా దక్కిన వాటా జలాలను పూర్తి స్థాయిలో వాడుకోవడానికి చేపట్టిందే రాయలసీమ ఎత్తిపోతల అని స్పష్టం చేస్తున్నారు.

గవినోళ్ల శ్రీనివాస్‌తో ఎన్జీటీలో ఫిర్యాదు చేయించిదెవరు బాబూ..?

రాయలసీమ ఎత్తిపోతలను రూ.3,307.6 కోట్ల అంచనాతో వైఎస్ జగన్ ప్రభుత్వం కాంట్రాక్టర్‌కు అప్పగించి పనులను పరుగులెత్తించింది. సీమ ఎత్తిపోతల పథకం పూర్తయితే వైఎస్ జగన్‌కు ఎక్కడ మంచి పేరొస్తుందోననే ఈర్షతో.. తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన టీడీపీ సానుభూతిపరుడు గవినోళ్ల శ్రీనివాస్ ద్వారా ఎన్జీటీ (చెన్నై) బెంచ్‌లో చంద్రబాబు రిట్ పిటిషన్ దాఖలు చేయించారు. ఇక ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పశ్చిమ మండలాల రూపురేఖలను మార్చడానికి వైఎస్ జగన్ ప్రభుత్వం హంద్రీ–నీవాలో అంతర్భాగంగా చేపట్టిన ముదివేడు, నేతిగుంటపల్లి, ఆవులపల్లి రిజర్వాయర్ల పనులపైనా అదే గవినోళ్ల శ్రీనివాస్‌తో ఎన్జీటీలో ఫిర్యాదు చేయించారు. రాయలసీమ ఎత్తిపోతలతోపాటు ఆ మూడు రిజర్వాయర్ల నిర్మాణం వల్ల పర్యావరణానికి విఘాతం కలుగుతుందని ఎన్జీటీలో వాదించారు. అయితే తెలుగుగంగ, గాలేరు–నగరి, ఎస్సార్బీసీలకు పర్యావరణ అనుమతి ఉందని.. ఆ ప్రాజెక్టులకు నీటిని అందించడానికి చేపట్టిన రాయలసీమ ఎత్తిపోతలకు పర్యావరణ అనుమతి అవసరం లేదని వైఎస్ జగన్ ప్రభుత్వం నాడు ఎన్జీటీకి స్పష్టం చేసింది. కానీ.. పర్యావరణ అనుమతి తీసుకుని, ఆ పనులు చేపట్టాలంటూ 2020 అక్టోబర్ 29న ఎన్జీటీ ఆదేశించింది. దీంతో పర్యావరణ అనుమతి కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రయత్నిస్తూనే.. ఆ అనుమతి వచ్చేలోగా చెన్నైకి 15 టీఎంసీలు, రాయలసీమలో దుర్భిక్ష ప్రాంతాలకు తాగునీటిని సరఫరా చేసే పనులను తొలి దశలో చేపట్టాలని 2023 ఆగస్టు 11న నిర్ణయించింది. చెన్నైకి నీటిని సరఫరా చేయాలంటే.. తెలుగు గంగ ప్రధాన కాలువపై ఉన్న వెలిగోడు రిజర్వాయర్ (9.5 టీఎంసీలు), సోమశిల (17.33 టీఎంసీలు), కండలేరు (8.4 టీఎంసీలు) రిజర్వాయర్‌లలో మొత్తంగా కనీసం 35.23 టీఎంసీలు నిల్వ ఉండాలి. అప్పుడే చెన్నైకి 15 టీఎంసీలను సరఫరా చేయడానికి అవకాశం ఉంటుంది. దీనికి తోడు రాయలసీమలోని దుర్భిక్ష ప్రాంతాలకు తాగునీటి కోసం 8.6 టీఎంసీలు వెరసి 58.83 టీఎంసీలు (35.23+15+8.6) శ్రీశైలం నుంచి తరలించే పనులను పర్యావరణ అనుమతి వచ్చేలోగా చేపట్టడానికి అనుమతి ఇవ్వాలన్న అధికారుల ప్రతిపాదనకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆమోద ముద్ర వేసింది. ఆ మేరకు అధికారులు పనులు చేపట్టారు. రూ.990 కోట్ల విలువైన పనులను పూర్తి చేశారు. కానీ.. గతేడాది ఫిబ్రవరి 27న కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ నిర్వహించిన ఈఏసీ సమావేశంలో రాయలసీమ ఎత్తిపోతలను తొలి దశలో తాగునీటి అవసరాల కోసం చేపడుతున్నామని.. మలి దశలో పర్యావరణ అనుమతి తీసుకుంటామని చంద్రబాబు సర్కారు స్పష్టం చేసి ఉంటే ఆ ఎత్తిపోతల పనులకు ఎలాంటి అడ్డంకి ఉండేది కాదని సాగునీటిరంగ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. కేవలం వైఎస్ జగన్‌కు మంచి పేరొస్తుందనే ఈర్ష్యతోనే ఉద్దేశపూర్వకంగానే వాస్తవాలను ఈఏసీ సమావేశంలో చంద్రబాబు సర్కార్ చెప్పలేదని స్పష్టం చేస్తున్నారు.

పట్టిసీమ, పురుషోత్తపట్నం, చింతలపూడికి పర్యావరణ అనుమతి ఏదీ..?

రాయలసీమ ఎత్తిపోతలను వైఎస్ జగన్ ప్రభుత్వం పర్యావరణ అనుమతి తీసుకోకుండా చేపట్టిందని.. అందువల్లే ఆ ఎత్తిపోతల పనులు ఆగిపోయాయంటూ మంత్రి నిమ్మల ఏమాత్రం పసలేని వాదన చేస్తున్నారు. 2014–19 మధ్య చంద్రబాబు సర్కార్ పోలవరం ప్రాజెక్టు పనులను వేగవంతం చేయకుండా.. కమీషన్ల కోసం గోదావరి కుడి గట్టుపై పట్టిసీమ, ఎడమ గట్టుపై పురుషోత్తపట్నం ఎత్తిపోతలను చేపట్టింది. ఆ రెండు ఎత్తిపోతలకు పర్యావరణ అనుమతులు తీసుకోలేదు. ఇక చింతలపూడి ఎత్తిపోతల తొలిదశకు 2008లో నాటి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం పర్యావరణ అనుమతి తీసుకుంది. కానీ.. 2018లో ఆ ఎత్తిపోతల సామర్థ్యాన్ని చంద్రబాబు సర్కార్ పెంచింది. అయితే దానికి పర్యావరణ అనుమతి తీసుకోలేదు. ఈ మూడు ఎత్తిపోతల పథకాలపై ఎన్జీటీలో కేసులు దాఖలయ్యాయి. పర్యావరణ అనుమతి తీసుకోకుండా చేపట్టిన ఆ మూడు ఎత్తిపోతల పథకాలపై జరిమానా విధిస్తూ 2021 డిసెంబర్ 2న ఎన్జీటీ తీర్పు ఇచ్చింది. పురుషోత్తపట్నం ఎత్తిపోతలపై రూ.24.56 కోట్లు, పట్టిసీమ ఎత్తిపోతలపై రూ.24.9 కోట్లు, చింతలపూడి ఎత్తిపోతలపై రూ.73.6 కోట్లను జరిమానాగా విధించింది. నిజానికి రాయలసీమ ఎత్తిపోతలకు పర్యావరణ అనుమతి అవసరం లేదని కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ ఏర్పాటు చేసిన కమిటీ తొలుత నివేదిక ఇచ్చింది.

జగన్ హయాంలో సీమ సుభిక్షం..

నాడు వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పులిచింతల నిర్వాసితులకు పరిహారం చెల్లించి సమస్యలను పరిష్కరించింది. తెలంగాణకు పరిహారం చెల్లించి పూర్తి స్థాయిలో అంటే 45.77 టీఎంసీలను పులిచింతలలో నిల్వ చేసి కృష్ణా డెల్టాలో రెండు పంటలకు నీళ్లందించి చరిత్ర సృష్టించింది. తెలుగుగంగ లింక్ కెనాల్‌ను ఆధునికీకరించి.. వెలుగోడు రిజర్వాయర్‌ను సకాలంలో గరిష్ట సామర్థ్యం 16.95 టీఎంసీలను చేర్చి నింపింది. రూ.600 కోట్లతో తెలుగుగంగ ప్రధాన కాలువకు లైనింగ్ చేసి.. డిజైన్ మేరకు ప్రవాహ సామర్థ్యాన్ని 5 వేల క్యూసెక్కులకు పెంచింది. బ్రహ్మంసాగర్ మట్టికట్టకు రూ.90 కోట్లతో డయాఫ్రం వాల్‌ను వేసి లీకేజీలకు అడ్డుకట్ట వేసి దాని పూర్తి సామర్థ్యం మేరకు 17.74 టీఎంసీలను నిల్వ చేసింది. తెలుగుగంగలో అంతర్భాగమైన సోమశిల రిజర్వాయర్‌లో గరిష్ట సామర్థ్యం మేరకు 78 టీఎంసీలు, కండలేరు రిజర్వాయర్‌లో పూర్తి సామర్థ్యం మేరకు 68.3 టీఎంసీలను నింపి ఐదేళ్లూ ఆయకట్టులో రెండు పంటలకూ నీళ్లందించింది. ఇక గాలేరు–నగరి వరద కాలువలో అవుకు వద్ద రెండు సొరంగాలను పూర్తి చేసి.. గండికోట రిజర్వాయర్ నిర్వాసితులకు రూ.వెయ్యి కోట్లను పరిహారంగా చెల్లించి, వారికి పునరావాసం కూడా కల్పించి గరిష్ట సామర్థ్యం మేరకు 26.85 టీఎంసీలను నిల్వ చేసింది. చిత్రావతి రిజర్వాయర్ నిర్వాసితులకు రూ.250 కోట్లను పరిహారంగా చెల్లించి, పునరావాసం కల్పించి.. గరిష్ట సామర్థ్యం మేరకు పది టీఎంసీలు నిల్వ చేసింది. ఇలా ఐదేళ్లూ రిజర్వాయర్లను సకాలంలో నింపి.. రాయలసీమను సస్యశ్యామలం చేసింది. మారిన వాతావరణ పరిస్థితుల్లో వర్షాలు కురిసే రోజులు తగ్గాయి. శ్రీశైలానికి గరిష్ఠంగా వరద వచ్చినప్పుడు దాన్ని ఒడిసి పట్టుకునే సామర్థ్యం కాలువలకు లేదు. దీంతో కృష్ణా వరద జలాలను గరిష్ట స్థాయిలో ఒడిసి పట్టి శ్రీశైలానికి వరద వచ్చే 30–40 రోజుల్లోనే రాయలసీమ, నెల్లూరు ప్రాజెక్టులను నింపేలా వైఎస్సార్‌సీపీ హయాంలో కాలువల సామర్థ్యం పెంచే పనులు, అవసరమైన చోట్ల కొత్త ప్రాజెక్టుల పనులను చేపట్టింది. ఈ క్రమంలో పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని 44 వేల నుంచి 80 వేల క్యూసెక్కులకు పెంచే పనులు.. శ్రీశైలం కుడి గట్టు ప్రధాన కాలువ సామర్థ్యాన్ని, గాలేరు–నగరి వరద కాలువ, తెలుగుగంగ లింక్ కెనాల్, ప్రధాన కాలువ ప్రవాహ సామర్థ్యం పెంచే పనులను చేపట్టింది. కేసీ కెనాల్ ఆయకట్టును స్థిరీకరించడానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాజోలి, జోలదరాసి రిజర్వాయర్ల పనులను చేపట్టింది. ఇక తెలుగుగంగ ఆయకట్టుకు సమృద్ధిగా నీటిని అందించడానికి కుందూ ఎత్తిపోతల పనులను చేపట్టింది. గాలేరు–నగరి సుజల స్రవంతి–హంద్రీ–నీవా సుజల స్రవంతిలను అనుసంధానం చేస్తూ ఉమ్మడి అనంతపురం, వైఎస్సార్ కడప, చిత్తూరు జిల్లాలను సస్యశ్యామలం చేసేందుకు పనులు చేపట్టింది. హంద్రీ–నీవా ప్రధాన కాలువ సామర్థ్యాన్ని 3,850 నుంచి 6,300 క్యూసెక్కులకు పెంచే పనులను చేపట్టింది. కానీ.. చంద్రబాబు సర్కార్ ఆ పనులన్నింటినీ ఆపేసి రాయలసీమకు వెన్నుపోటు పొడిచింది.

రాయలసీమ లిఫ్ట్ పనులు నిలిపివేయించాం

- సీఎం రేవంత్ రెడ్డి కృషి వల్లే ఏపీ ప్రభుత్వం పనులు నిలిపివేసింది
- తెలంగాణ సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి కృషి కారణంగానే ఏపీ ప్రభుత్వం రాయలసీమ లిఫ్ట్ పనులు నిలిపివేసిందని తెలంగాణ సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. అలాగే ఏపీ ప్రభుత్వం పోలవరం–నల్లమల సాగర్ పనులు చేపట్టకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని తదుపరి విచారణలో సుప్రీంకోర్టును కోరతామని చెప్పారు. మంగళవారం తెలంగాణ అసెంబ్లీ లాబీల్లోని తన చాంబర్‌లో ఉత్తమ్ విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లో భాగంగా కృష్ణా నదీ జలాలపై జరిగిన చర్చ కారణంగా కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజల్లో సానుకూలత ఏర్పడిందన్నారు. కృష్ణా జలాల విషయంలో ఎప్పుడు ఏం జరిగిందో అసెంబ్లీ వేదికగా రాష్ట్ర ప్రజలకు చెప్పగలిగామన్నారు. నీటిపారుదల అంటే కేసీఆరే అని ప్రజల్లో ఉన్న అపోహను తొలగించగలిగామని తెలిపారు.

మీది మహర్జాతకమండీ..ఎవరో చేసిన కష్టాన్ని మీ ఖాతాలో వేసుకుంటారు!...

చంద్రబాబు సీమ జల ద్రోహి

కర్నూలు (సిటీ): రాయలసీమ నీటి కష్టాలను తొలగించే లక్ష్యంతో వైఎస్ జగన్ హయాంలో చేపట్టిన రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులను చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక నిలిపివేసింది. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితో చేసుకున్న చీకటి ఒప్పందంలో భాగంగానే ఇలా చేసింది. కానీ, దీనిపై పచ్చిగా అబద్ధాలు ఆడుతోంది. ఈ నేపథ్యంలో ప్రజలకు వాస్తవాలు వివరించేందుకు రాయలసీమ జిల్లాల వైఎస్సార్‌సీపీ నేతలు మంగళవారం నంద్యాల జిల్లా జూపాడుబంగ్లా మండలంలో నిలిచిపోయిన ఎత్తిపోతల పనుల ప్రదేశాన్ని సందర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. తొలినుంచి రాయలసీమ అంటే చంద్రబాబుకు వివక్షేనని విమర్శించారు. తన కోరిక మేరకే రాయలసీమ లిఫ్ట్ పనులను చంద్రబాబు ఆపేశారంటూ తెలంగాణ అసెంబ్లీలో రేవంత్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించారు. దివంగత సీఎం వైఎస్ చేపట్టిన పోతిరెడ్డిపాడు విస్తరణ నుంచి నేటి రాయలసీమ లిఫ్ట్ వరకు చంద్రబాబు కుట్రలకు సాక్ష్యాలుగా నిలిచాయన్నారు. క్లోజ్డ్ డోర్ మీటింగ్‌లో రేవంత్‌తో చేసుకున్న ఒప్పంద వివరాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు.

వైఎస్సార్‌సీపీ హయాంలోనే 85% పనులు పూర్తి

''శ్రీశైలం ప్రాజెక్టులో నీటి మట్టం 881 అడుగుల పైన ఉంటేనే రాయలసీమకు తీసుకెళ్లే పరిస్థితుల్లో అవసరమైన మేర తరలించలేక ఏటా సీమలో పంటలు చివరి దశలో ఎండిపోతున్నాయి. ఇలాంటి ఇబ్బంది తలెత్తకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాయలసీమ లిఫ్ట్‌ను ప్రతిష్ఠాత్మకంగా చేపడితే, చంద్రబాబు అడుగడుగునా అడ్డుకున్నారు. అయినా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 85 శాతం పనులు పూర్తిచేసింది. చంద్రబాబు సర్కారు ఏర్పడి 19 నెలలైనా పనులు అంగుళం కూడా కదల్లేదు. పర్యావరణ అనుమతులు లేవనే సాకు చూపించి బాబు ప్రజలను మభ్యపెట్టారు. కానీ, రేవంత్ వ్యాఖ్యలతో చంద్రబాబు చేసిన దగా, వంచన బట్టబయలైంది. ఆయన ఇకనైనా బుద్ధి తెచ్చుకుని సీమ లిఫ్ట్ పనులను మొదలుపెట్టాలి'' అని వైఎస్సార్‌సీపీ నేతలు డిమాండ్ చేశారు. కేంద్రంలో కీలకంగా ఉన్నామని చెప్పుకొంటున్న చంద్రబాబు ఈ ప్రాజెక్టుకు అనుమతులు తెచ్చే బాధ్యత తీసుకోవాలన్నారు. వెంటనే పనులు మొదలుపెట్టకపోతే సీమ రైతులు, ప్రజాసంఘాలు, రైతు సంఘాలు, సాగునీటి నిపుణులు, మేధావులతో కలసి ఉద్యమిస్తామని హెచ్చరించారు.

నంద్యాల జిల్లాలో నిలిచిపోయిన ఎత్తిపోతల పనుల ప్రదేశం వద్ద వైఎస్సార్‌సీపీ నేతలు

కేసులు వేయించి.. పనులు నిలిపివేశారు

రాయలసీమలో కరువు శాశ్వత నివారణకు వైఎస్ జగన్ రాయలసీమ లిఫ్ట్ చేపట్టారు. తెలంగాణ అడ్డుచెప్పినా జగన్ దృఢ సంకల్పంతో ముందుకుసాగారు. ఈ ప్రాజెక్టు ముందుకుసాగితే జగన్‌కు మంచి పేరు వస్తుందని.. పక్క రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి చంద్రబాబు కుట్ర చేసి పనులు నిలిపివేశారు.

–కాటసాని రాంభూపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు

రేవంత్‌తో కలిసి ప్రతిపక్షంలో ఉండగానే కుట్ర

రైతుల కన్నీరు తుడిచే అద్భుత ప్రాజెక్టు రాయలసీమ లిఫ్ట్. జగన్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే పనులు మొదలుపెట్టి 85 శాతం పూర్తిచేశారు. చంద్రబాబు ప్రతిపక్షంలో ఉండగా... రేవంత్‌తో కలిసి ఈ లిఫ్ట్ పనులను ఆపాలని కుట్ర చేశారు. సీఎం అయ్యాక పర్యావరణ అనుమతులు లేవనే సాకు చూపి నిలిపివేశారు.

– దారా సుధీర్, నందికొట్కూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి

ఆ జీవో అమలు చేయలేదు

2004లో సీఎం కాగానే సీమ ప్రాజెక్టులను శరవేగంగా పూర్తి చేసి వైఎస్సార్ రైతు బాంధవుడిగా నిలిచారు. తండ్రిని మించి..పోతిరెడ్డిపాడు సామర్థ్యాన్ని జగన్ 80 వేల క్యూసెక్కులకు పెంచారు. సీమ లిఫ్ట్ చేపట్టి రోజుకు 3 టీఎంసీలను తరలించేలా పనులు చేపట్టారు. మిగిలిన పనులను బాబు నిలిపేశారు. శ్రీశైలం కనీస నీటిమట్టం జీవోను అమలు చేయాలని ఆయనను నేను కోరినా పట్టించుకోలేదు.

– శిల్పాచక్రపాణిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, శ్రీశైలం

అమరావతి మీదున్న శ్రద్ధ సీమ మీద లేదా?

చంద్రబాబుకు అమరావతి మీద ఉన్న శ్రద్ధ రాయలసీమ ఎత్తిపోతల మీద లేదు. సీమ కరువుకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ఎత్తిపోతలు చేపట్టిన విజనరీ జగన్. కేసులతో అడ్డుకుని కుట్రలు చేసిన చరిత్ర చంద్రబాబుది. సీమ ఎడారిగా మారుతున్నా చంద్రబాబు పట్టించుకోవడం లేదు.

– ఎస్వీ మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు

ఆ నీటిని సీమకు వాడుకుంటే తప్పేంటి?

దివంగత సీఎం వైఎస్... పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని 44 వేల క్యూసెక్కులకు పెంచిన తర్వాతే మైలవరం రిజర్వాయర్‌కు నీరు చేరింది. ఇప్పుడు రాయలసీమ ప్రాజెక్టులలో సమృద్ధిగా నీరు ఉంటోంది. నీరు లేకపోతే వ్యవసాయం దెబ్బతింటుంది. వృథాగా సముద్రంలో కలిసే నీటిని సీమకు వాడుకుంటే తప్పేంటి?

– పి.రామసుబ్బారెడ్డి, ఎమ్మెల్సీ, కడప

బాబు ఎప్పడూ సీమకు మేలు చేయలేదు..

రాయలసీమ జిల్లాలను సస్యశ్యామలం చేయాలని వైఎస్..పోతిరెడ్డిపాడును 44 వేల క్యూసెక్కులకు విస్తరించే పనులు చేపడితే దేవినేని ఉమాతో ప్రకాశం బ్యారేజీ వద్ద చంద్రబాబు దీక్షలు చేయించారు. బాబు రాజకీయాల్లోకి వచ్చినప్పటినుంచి సీమకు మేలు చేయలేదు. పైగా ప్రాజెక్టులను అడ్డుకునేందుకు కుట్ర పన్నారు.

– వై.శివరామిరెడ్డి, ఎమ్మెల్సీ, అనంతపురం

సీమను నాశనం చేసే కుట్ర

సాగునీటి ప్రాజెక్టులు, రైతు సంక్షేమం గురించి ఏనాడూ ఆలోచించని వ్యక్తి చంద్రబాబు. ఓటుకు నోటు కేసుకు భయపడి సీమ ప్రయోజనాలను తెలంగాణకు తాకట్టుపెట్టారు. రెండు కళ్ల సిద్ధాంతంతో సీమను నాశనం చేసే కుట్రకు తెరలేపారు.

– సాకె శైలజానాథ్, మాజీ మంత్రి, అనంతపురం

సీమ ప్రజలు చంద్రబాబును క్షమించరు

రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై చంద్రబాబు స్పందించాలి. క్లోజ్డ్ రూమ్ మీటింగ్ ఒప్పందాలను బయట పెట్టాలి. పుట్టిన ప్రాంతానికి అన్యాయం చేసేలా కుట్రలు చేస్తున్న బాబును సీమ ప్రజలు క్షమించరు.

– కల్పలతారెడ్డి, ఎమ్మెల్సీ

రైతులు, ప్రాజెక్టుల గురించి బాబు ఆలోచించరు

చంద్రబాబు ఏనాడూ రైతులు, సాగునీటి ప్రాజెక్టుల గురించి ఆలోచించరు. ఓటుకు నోటు కేసుకు భయపడి చంద్రబాబుశ్రీశైలం నీటి వాటాను తెలంగాణకు తాకట్టు పెట్టాడు. తెలంగాణలో ఇష్టారాజ్యంగా ప్రాజెక్టులు చేపడుతున్నా నోరు మెదపడం లేదు.

– శిల్పారవిచంద్రకిషోర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, నంద్యాల

'సీమ ఎత్తిపోతల'తో ఏం ప్రయోజనం లేదు

మంత్రి నిమ్మల

సాక్షి, అమరావతి: రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా ఎలాంటి ప్రయోజనం లేదని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వ్యాఖ్యానించారు. మంగళవారం సచివాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ శ్రీశైలం రిజర్వాయర్ నుంచి ఇప్పటికే 841 అడుగుల స్థాయి వరకు గ్రావిటీ ద్వారా నీరు రాయలసీమకు వస్తోందని పేర్కొన్నారు. అయితే గత ప్రభుత్వ హయాంలో 2020లో ప్రతిపాదించిన రాయలసీమ ఎత్తిపోతల ద్వారా 800 అడుగుల స్థాయి నుంచి నీటిని తరలించేలా చేపట్టారని వెల్లడించారు. 841 అడుగుల దిగువన శ్రీశైలంలో కేవలం 34 టీఎంసీలు మాత్రమే ఉంటాయని.. అందులో కృష్ణా బోర్డు కేటాయించిన వాటా ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు దక్కేది 66 శాతం అంటే కేవలం 22 టీఎంసీలు మాత్రమేనన్నారు. ఆ నీటిని కూడా ఇప్పటికే ఉన్న మల్యాల, ముచ్చుమర్రి ఎత్తిపోతల ద్వారా రాయలసీమకు తరలించవచ్చని అందువల్ల సీమ ఎత్తిపోతల వల్ల అదనంగా ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. పర్యావరణ అనుమతి తీసుకోకుండా రాయలసీమ ఎత్తిపోతలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిందన్నారు. దీనిపై విచారించిన ఎన్జీటీ.. 2020 మే 20న పనులు నిలిపివేయమని ఆదేశాలు ఇచ్చిందన్నారు. 2024 మార్చిలో ఎన్జీటీ మళ్లీ విచారించి రూ.2.65 కోట్ల జరిమానా విధించిందన్నారు. ఇదంతా గత ప్రభుత్వ హయాంలోనే జరిగిందన్నారు. ఈ ప్రాజెక్టుకి సంబంధించిన పనుల పేరుతో రూ.990 కోట్లు ఖర్చు చేసినట్లు రికార్డులు ఉన్నాయని చెప్పారు. ఈ ఖర్చు వృథాగా జరిగినట్లు భావిస్తున్నారా? అని విలేకరులు ప్రశ్నించగా.. వృథా అని అనడం లేదని కానీ ప్రాజెక్టు నిరుపయోగంగా ఉందన్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలో 3 కొత్త రిజర్వాయర్లు..

గత ప్రభుత్వ హయాంలో జీఎన్ఎస్ఎస్–హెచ్ఎన్ఎస్ఎస్ లింక్ ప్రాజెక్ట్ (అంచనా వ్యయం రూ.5,036 కోట్లు) పేరుతో భూసేకరణ లేకుండా, పర్యావరణ అనుమతులు లేకుండా మట్టి పనులు మాత్రమే చేసి కోట్ల రూపాయలు దుర్వినియోగం చేశారని నిమ్మల ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో ముదివేడు రిజర్వాయర్ (అంచనా రూ.500 కోట్లు, ఖర్చు రూ.167.97 కోట్లు), నేతిగుంటపల్లి రిజర్వాయర్ (అంచనా రూ.571 కోట్లు, ఖర్చు రూ.494 కోట్లు), ఆవులపల్లి రిజర్వాయర్ (అంచనా రూ.482 కోట్లు, ఖర్చు రూ.28 కోట్లు) అనే 3 కొత్త రిజర్వాయర్ల నిర్మాణ పనులను పర్యావరణ అనుమతులు లేకుండా చేపట్టారన్నారు.

జీవో 36 అమలు చేయండి

సహకార ఉద్యోగుల ధర్నా

పెడన కేడీసీసీ బ్రాంచి వద్ద ధర్నా చేస్తున్న సంఘ నాయకులు, ఉద్యోగులు

పెడన: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జె.రామాంజనేయులు డిమాండ్ చేశారు. రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం కృష్ణా జిల్లా పెడనలోని కేడీసీసీ బ్యాంకు బ్రాంచ్ వద్ద పీఏసీఎస్ ఉద్యోగులు, నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ.. జీవో 36ను తక్షణమే అమలు చేసి ఉద్యోగులకు ప్రొసీడింగ్స్ ఇవ్వాలన్నారు. ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, ఉద్యోగి సర్వీసులో చనిపోతే రూ.20 లక్షల టర్మ్ ఇన్సూరెన్సు పాలసీ చేయించి కుటుంబాలకు భరోసా కల్పించాలని కోరారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వై.వి.వి.మోహనరావు మాట్లాడుతూ గ్రాట్యుటీని రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఎన్. భోగేంద్రరావు, ఎం. శ్రీనివాసరావు, ఎం రవికుమార్, గుడిసే బ్రహ్మయ్య, వి.వి.రత్నం తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ టీచర్ల సమస్యలు పరిష్కరించండి

స్కూల్ టీచర్స్ అసోసియేషన్

సాక్షి, అమరావతి: మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని మోడల్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీఎమ్‌ఎస్టీఏ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాకెట్టి శ్రీనివాసులు, తమ్మినాన చందన రావు ప్రభుత్వాన్ని ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దు కింద జీతం మాత్రమే వస్తోందని, దీంతో పాటు ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉపాధ్యాయులకు వర్తించే అన్ని సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సర్వీస్ రూల్స్ కూడా ఇవ్వాలని, వీరిని పాఠశాల విద్యా శాఖలో విలీనం చేయాలని కోరారు.

పీఎస్ హెచ్‌ఎంల అధికారాలను హరించవద్దు

ఏపీపీఎస్ హెచ్‌ఎం ఫోరం

సాక్షి, అమరావతి: ప్రభుత్వం ఇచ్చిన జీవో నం.40,70 ప్రకారం పీఎస్ హెచ్‌ఎంలకు సెలవు మంజూరు అధికారం ఉన్నా రాష్ట్రంలో కొన్నిచోట్ల ఎంఈవోలు దీన్ని అధిగమించే ప్రయత్నం చేస్తున్నారని ఏపీ పీఎస్ హెచ్‌ఎం ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్ ఓ ప్రకటనలో ఆక్షేపించారు. కొంత మంది ఎంఈవోలు పీఎస్ హెచ్‌ఎంలతో సంబంధం లేకుండా ఉపాధ్యాయులకు సెలవులు మంజూరు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. పీఎస్ హెచ్‌ఎంలకు జాబ్ చార్ట్ లేకపోవడంతోనే ఈ సమస్యలు తలెత్తుతున్నాయని, రాష్ట్ర విద్యాశాఖ వెంటనే పీఎస్ హెచ్‌ఎంల జాబ్ చార్ట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వారి హక్కులను హరించవద్దని కోరారు.

చిరుద్యోగుల వేతన వెతలు

సాక్షి, అమరావతి: గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితులను వాకబు చేసే ఆశా వర్కర్లు.. అనారోగ్య బాధితులకు బాసటగా నిలిచే కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, వైద్య శాఖలోని నేషనల్ హెల్త్ మిషన్(ఎన్‌హెచ్‌ఎం) చిరుద్యోగుల పరిస్థితి దుర్భరంగా మారింది. డిసెంబర్ నెల వేతనాలు ఇవ్వకపోవడంతో ఆశాలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఇతర చిరుద్యోగులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఎన్‌హెచ్‌ఎం పరిధిలో 60 వేల మంది ఉద్యోగులకు ప్రభుత్వం వేతనాలు జమ చేయలేదు. వీరిలో 40 వేల మంది ఆశా వర్కర్లు కావడం గమనార్హం. ఈ క్రమంలో ఇంటి అద్దెలు, కరెంట్ బిల్లులు, ఇతర ఖర్చులకు డబ్బులేక చిరుద్యోగులు అగచాట్లు పడుతున్నారు.

క్లుప్తంగా...

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

పెద్దన్న(ఫైల్)

పుట్టపర్తి టౌన్: అప్పుల బాధ తాళలేక ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నారు. శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువులో మంగళవారం చోటుచేసుకుంది. కొత్తచెరువుకు చెందిన మిద్దె పెద్దన్న(54) తన సొంత పొలం 4 ఎకరాలతోపాటు మరో 6 ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. పెట్టుబడుల కోసం రూ.15 లక్షల వరకు అప్పులు చేశారు. చంద్రబాబు ప్రభుత్వం నుంచి ఏరకంగానూ మద్దతు లభించలేదు. పంట దిగుబడి రాక, గిట్టుబాటు ధరలు లభించక నష్టాల పాలయ్యారు. ఈ క్రమంలో అప్పులు తీర్చే మార్గం కనిపించక మంగళవారం సాయంత్రం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పెద్దన్న మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భూ వివరాల నిర్ధారణ తర్వాతే పాస్‌పుస్తకాల ముద్రణ

రెవెన్యూశాఖ సమీక్షలో సీఎం చంద్రబాబు

సాక్షి, అమరావతి: గ్రామ సభల్లో రైతుల నుంచి భూ వివరాలు నిర్ధారించిన తర్వాతే కొత్త పాస్ పుస్తకాలు ముద్రించి ఇవ్వాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో రెవెన్యూ శాఖపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. భవిష్యత్తులో రైతులు పాస్ పుస్తకాలను ఆన్‌లైన్‌లో పొందే విధానాన్ని అమల్లోకి తీసుకురావాలన్నారు. అనంతరం పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ విధానాన్ని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ నెల 2వ తేదీ నుంచి ఇప్పటి వరకు 6.07 లక్షల పట్టాదార్ పాస్ పుస్తకాలను పంపిణీ చేశామని తెలిపారు. సమీక్షలో రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కొత్తగా ఇచ్చే పాస్‌బుక్కుల్లోనూ తప్పులొచ్చాయి: అనగాని

ప్రస్తుతం ఉన్న హద్దుల ప్రకారమే భూముల రీసర్వే నిర్వహిస్తున్నామని, రికార్డులతో పని లేదని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. భూ యజమానులు ఇప్పటికే నిర్ణయించుకున్న హద్దుల్లో ఉన్న భూమినే సర్వే చేస్తామన్నారు. ఆ భూముల రిజిస్టర్డ్ డాక్యుమెంట్, వారి పాస్ బుక్కుల్లో నమోదైన భూమి విస్తీర్ణంతో గానీ సంబంధం లేదని తెలిపారు. ప్రస్తుతం తాము పంపిణీ చేస్తున్న పట్టాదార్ పాస్‌పుస్తకాల్లోనూ తప్పులు ఉన్నాయనే ఫిర్యాదులు వస్తున్నాయని వాటిని సరిచేసుకునే అవకాశం ఇస్తామన్నారు.

రుణాంధ్రగా రాష్ట్రం

రెండేళ్లు గడవకుండానే రాష్ట్ర ప్రజలపై రూ.3 లక్షల కోట్ల అప్పుల భారం

సాక్షి, అమరావతి: సంక్షేమ క్యాలండర్‌కు బదులుగా చంద్రబాబు సర్కారు అప్పుల క్యాలండర్ అమలు చేస్తోంది. వారం వారం అప్పుల మోత మోగిస్తూ రాష్ట్రాన్ని రుణాంధ్రప్రదేశ్‌గా మార్చేసింది. అధికారంలోకి వస్తే సంపద సృష్టిస్తానంటూ ఎన్నికల ముందు నమ్మబలికిన చంద్రబాబు అందినకాడికి అప్పులు చేయడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. బడ్జెట్ బయట, లోపల.. రాజధాని.. వివిధ కార్పొరేషన్లు.. చివరకు గనులు, మద్యం ఆదాయాన్ని సైతం తాకట్టు పెట్టి అప్పులు చేస్తూ చంద్రబాబు తన రికార్డులను తానే అధిగమిస్తున్నారు. తాజాగా మంగళవారం 7.64 శాతం వడ్డీతో చంద్రబాబు ప్రభుత్వం మరో రూ.6,500 కోట్లు అప్పులు చేసింది. గత మంగళవారమే రూ.4,000 కోట్లు అప్పులు చేసిన చంద్రబాబు సర్కారు వారం తిరగక ముందే మళ్లీ అప్పు చేయడం గమనార్హం. వారం వ్యవధిలో ఏకంగా రూ.10,500 కోట్లు అప్పులు చేయడం ద్వారా చంద్రబాబు సర్కారు రికార్డు సృష్టించింది. కేవలం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే రూ.1,01,540 కోట్లు బడ్జెట్ అప్పులు చేస్తోంది. రాష్ట్ర చరిత్రలో ఒక ఆర్థిక ఏడాదిలో రూ.లక్ష కోట్లకు పైగా బడ్జెట్ అప్పులు చేయడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఆ ఘనత చంద్రబాబు ప్రభుత్వానికే దక్కుతుందని ఆర్థిక రంగ నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికే బడ్జెట్‌లో రూ.90,540 కోట్లు అప్పులు చేయగా, మరో రెండు నెలల్లో మరో రూ.11,000 కోట్లు అప్పు చేసేందుకు చంద్రబాబు సర్కారు ఆర్‌బీఐకి అప్పుల క్యాలెండర్ ఇచ్చింది. ఇలా చంద్రబాబు రెండేళ్ల పాలన పూర్తి కాకుండానే బడ్జెట్ లోపల, బడ్జెట్ బయట కలిపి ఏకంగా దాదాపు రూ.3 లక్షల కోట్లు అప్పులు చేయడం గమనార్హం.

సంపద సృష్టి లేదు.. అంతా ప్రైవేట్ పరం!

చంద్రబాబు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు బడ్జెట్ లోపలే చేసిన అప్పులు రూ.1,72,137 కోట్లకు ఎగబాకాయి. ఇక బడ్జెట్ బయట వివిధ కార్పొరేషన్లు, రాజధాని పేరుతో మరో రూ.1,27,632 కోట్లు అప్పులు చేశారు. వివిధ కార్పొరేషన్ల పేరుతో ప్రభుత్వ గ్యారెంటీతో చంద్రబాబు ప్రభుత్వం రూ.రూ.80,245 కోట్లు అప్పులు చేసింది. మరోపక్క రాజధాని పేరుతో ప్రపంచ బ్యాంకు, జర్మనీ సంస్థ, హడ్కో, నేషనల్ బ్యాంక్ ఫర్ ఫైనాన్సింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్‌మెంట్ (ఎన్ఏబీఎఫ్ఐడీ), ఏపీ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీపీఎఫ్‌సీఎల్), నాబార్డు నుంచి ఏకంగా రూ.47,387 కోట్లు అప్పులు చేసింది. ఇష్టానుసారంగా అప్పులు చేస్తున్నప్పటికీ సూపర్ సిక్స్‌లో ప్రధాన హామీలను సైతం అమలు చేయకుండా ఎగనామం పెట్టారు. పోనీ తీసుకున్న అప్పులతో ఆస్తుల కల్పన చేపట్టారా? అంటే అదీ లేదు. పైగా వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో 17 మెడికల్ కాలేజీలకు శ్రీకారం చుట్టి విలువైన సంపద సృష్టిస్తే .. ఇప్పుడు వాటిని చంద్రబాబు సర్కారు ప్రైవేట్‌పరం చేస్తోంది. గత ప్రభుత్వ హయాంలో సృష్టించిన సంపదను సైతం చంద్రబాబు ప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెడుతోంది. వైఎస్సార్ సీపీ హయాంలో విచ్చలవిడిగా అప్పులు చేస్తున్నారని, రాష్ట్రం శ్రీలంకలా అయిపోతోందని దుష్ప్రచారం చేసిన ఎల్లో మీడియా.. ఇప్పుడు చంద్రబాబు సర్కారు వారం వారం ఇష్టారాజ్యంగా అప్పులతో దేశంలోనే రికార్డులు సృష్టిస్తున్నా నోరు మెదపకపోవటం గమనార్హం.

బాబు సర్కారు బడ్జెట్ అప్పులు..

2024–25 మార్చి వరకు కాగ్ గణాంకాల మేరకు అప్పులు	రూ.81,597 కోట్లు
2025–26 నవంబర్ వరకు కాగ్ గణాంకాల మేరకు అప్పులు	రూ.77,040 కోట్లు
డిసెంబర్ 2వ తేదీ (ఆర్‌బీఐ)	రూ.3,000 కోట్లు
డిసెంబర్ 30వ తేదీ (ఆర్‌బీఐ)	రూ.4,000 కోట్లు
జనవరి 6వ తేదీ (ఆర్‌బీఐ)	రూ.6,500 కోట్లు
మొత్తం	రూ.1,72,137కోట్లు

బడ్జెట్ బయట వివిధ కార్పొరేషన్ల ద్వారా అప్పులు..

పౌరసరఫరాల సంస్థ	రూ.7,000 కోట్లు
మార్క్‌ఫెడ్	రూ.19,900 కోట్లు
ఏపీఎండీసీ	రూ.9,000 కోట్లు
ఏపీ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్	రూ.6,710 కోట్లు
బ్యాంకుల నుంచి విద్యుత్ సంస్థల అప్పులు	రూ.1150 కోట్లు
ఏపీ విమానాశ్రయాల అభివృద్ధి కార్పొరేషన్	రూ.1,000 కోట్లు
ఏపీ జలజీవన్ మిషన్ కార్పొరేషన్	రూ.10,000 కోట్లు
ఏపీఐఐసీ ద్వారా	రూ.8,500 కోట్లు
ఏపీసీపీడీసీఎల్, ఏపీఎస్‌పీడీసీఎల్ ద్వారా	రూ.5,473 కోట్లు
నాబార్డు నుంచి డిస్కమ్స్	రూ.3,762 కోట్లు
ఎస్‌బీఐ ద్వారా ఏపీ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్	రూ.2,000 కోట్లు
ఆంధ్రప్రదేశ్ బెవరేజెస్ కార్పొరేషన్ (బాండ్లు)	రూ.5,750 కోట్లు
మొత్తం	రూ.80,245 కోట్లు

అమరావతి అప్పులు

ప్రపంచ బ్యాంకు, ఏసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు	రూ.15,000 కోట్లు
హడ్కో	రూ.11,000 కోట్లు
జర్మనీకి చెందిన కేఎఫ్‌డబ్ల్యూ సంస్థ	రూ.5,000 కోట్లు
ఎన్ఏబీఎఫ్ఐడీ నుంచి	రూ.7,500 కోట్లు
ఏపీపీఎఫ్‌సీఎల్ నుంచి	రూ.1,500 కోట్లు
నాబార్డు నుంచి	రూ.7,387 కోట్లు
మొత్తం	రూ.47,387 కోట్లు

చాదర్, చందనం, శాండిల్ ఆయిల్ అందిస్తున్న వైఎస్ జగన్

గుంటూరు దర్గా మహోత్సవానికి వైఎస్ జగన్‌కు ఆహ్వానం

సాక్షి, అమరావతి: గుంటూరులో నిర్వహిస్తున్న శ్రీ హజరత్ కాలే మస్తాన్ షా వలీ దర్గా గంధ మహోత్సవానికి హాజరుకావాలని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌ను దర్గా ప్రతినిధులు ఆహ్వానించారు. మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌ను దర్గా ధర్మకర్త రావి రామ్మోహనరావు కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. నగరంపాలెంలో మంగళవారం నుంచి 10వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాగా, మస్తాన్ బాబాకు చాదర్, చందనం, శాండిల్ ఆయిల్‌ను వైఎస్ జగన్ సమర్పించారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు, రావి రామ్మోహనరావు సతీమణి డూండేశ్వరి, బుర్రా సత్యనారాయణ రెడ్డి, తుమ్మూరు షమిత్ సాయి గణేష్‌రెడ్డి, రావి జ్ఞానేశ్వర్, బావాజీ మస్తాన్ రావు, గుంటూరు ఏఎంసీ మాజీ చైర్మన్ రాజనారాయణ పాల్గొన్నారు.

సాక్షి పత్రిక, టీవీ రిపోర్టర్లు, కెమెరామెన్‌లపై కేసులు

తిరుపతిలో ఫొటోగ్రాఫర్ ఇంట్లో సోదాలతో పోలీసుల హల్‌చల్

- తిరుమలలో సాక్షి రిపోర్టర్లు, ఫొటోగ్రాఫర్లను పిలిచి విచారణ
- ఇతర పత్రికలు, టీవీ చానళ్లలో వచ్చినా సాక్షిపైన మాత్రమే కక్ష
- సాక్షి పత్రిక, టీవీ లక్ష్యంగా పోలీసుల వేధింపులు

సాక్షి ఫొటోగ్రాఫర్ ఇంటి వద్ద పోలీసులు

సాక్షి, అమరావతి: సాక్షి పత్రిక, టీవీ లక్ష్యంగా చంద్రబాబు సర్కారు మరోసారి వేధింపులకు పాల్పడింది. తిరుమలలో ఖాళీ మద్యం బాటిళ్లు కనిపించాయన్న కథనానికి సంబంధించి సాక్షి పత్రిక, టీవీ రిపోర్టర్లు, కెమెరామెన్‌లపై కేసులు నమోదు చేశారు. అంతేకాకుండా తిరుపతిలో, తిరుమలలో ఇష్టారీతిన వ్యవహరించారు. తిరుపతి సాక్షి ఫొటోగ్రాఫర్ ఇంట్లో మంగళవారం ఉదయం నుంచి ఒక సీఐ, ఎస్ఐ, 20 మంది పోలీసులు సోదాలతో హల్‌చల్ చేశారు. టెర్రరిస్టులు, స్మగ్లర్లు, హంతకుల కోసం గాలించినట్లు ఉదయం నుంచి సాయంత్రం వరకు నాలుగైదుసార్లు ఫొటోగ్రాఫర్ ఇంట్లో సోదాలు చేశారు. సాక్షి ఫొటోగ్రాఫర్ ఇంట్లో లేకపోవడంతో ఎక్కడికెళ్లాడంటూ ఇంట్లోవాళ్లమీద ప్రశ్నల మీద ప్రశ్నలు వేసి వేధించారు. మీ ఆయన ఎక్కడ, ఫోన్లు ఎక్కడ పెట్టాడు.. అంటూ గుచ్చిగుచ్చి అడిగారు. ఇంతమంది రావడం ఏమిటి, అసలు ఏం జరిగిందని ఫొటోగ్రాఫర్ కుటుంబసభ్యులు అడిగినా పోలీసులు సమాధానం చెప్పలేదు. సాయంత్రం ఫొటోగ్రాఫర్ కుటుంబసభ్యులకు పోలీసులు నోటీసులు ఇచ్చి అతడిని విచారణకు హాజరుకావాలని చెప్పమని సూచించి వెళ్లిపోయారు. రోజంతా పోలీసులు ఇష్టారీతిన వ్యవహరించడంతో సాక్షి ఫొటోగ్రాఫర్ కుటుంబసభ్యులతో పాటు చుట్టుపక్కల వారు భయభ్రాంతులకు గురయ్యారు.

ఇదే వార్తను ఈనాడు, ఆంధ్రజ్యోతి సహా ఇతర పత్రికలు ప్రచురించినా, ఎల్రక్టానిక్ మీడియా చానళ్లు విస్తృతంగా ప్రసారం చేసినా.. ఒక్క సాక్షి రిపోర్టర్లు, ఫొటోగ్రాఫర్లను మాత్రమే పిలిపించి విచారించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కక్షపూరితంగా సాక్షి విలేకరులనే లక్ష్యంగా చేసుకుని విచారణ జరపడం మీడియా స్వేచ్ఛపై దాడేనని జర్నలిస్టు వర్గాలు మండిపడుతున్నాయి.

గంజాయి నియంత్రణలో బాబు ప్రభుత్వం విఫలం

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సావిత్రి

- గంజాయికి వ్యతిరేకంగా ఈ నెల 12 వరకు సంతకాల సేకరణ
- 12న ర్యాలీ.. 14న భోగి మంటల్లో గంజాయి దహనం
- ఐద్వా, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానం

సాక్షి, అమరావతి: గంజాయి నియంత్రణలో చంద్రబాబు ప్రభుత్వం ఘోర వైఫల్యం చెందిందని పలువురు వక్తలు ధ్వజమెత్తారు. 'గంజాయిని అరికట్టాలి–యువత భవితను కాపాడాలి' అనే అంశంపై విజయవాడ బాలోత్సవ భవన్‌లో మంగళవారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా), భారత విద్యార్థి సమాఖ్య(ఎస్ఎఫ్ఐ), భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డీవైఎఫ్ఐ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో వక్తలు మాట్లాడుతూ.. వంద రోజుల్లో గంజాయి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని చెప్పిన చంద్రబాబు ప్రభుత్వం అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవడంలో విఫలమైందన్నారు. అధికార పార్టీ నాయకుల అండదండలతో రాష్ట్రంలో గంజాయి సాగు, రవాణా, వ్యాపారం యథేచ్ఛగా సాగుతోందని మండిపడ్డారు. రాజకీయ అండతో గంజాయి గ్యాంగులు చెలరేగిపోతున్నాయని, ఇటీవల నెల్లూరు జిల్లాలో పెంచలయ్యను కిరాతకంగా హత్య చేసిన ఘటన సమాజాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేసిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని గంజాయి నిరోధానికి విద్యా సంస్థల పరిసరాల్లో నిఘా కమిటీలు, గంజాయికి బానిసలైన యువతకు డి–అడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేయాలని, గంజాయి నియంత్రణకు ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించాలని కోరారు. యువజన, మహిళా సంఘాలు గంజాయిపై సమరభేరికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ నెల 7 నుంచి 12 తేదీ వరకు గంజాయికి వ్యతిరేకంగా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టాలని తీర్మానించినట్లు పేర్కొన్నారు. ఈ నెల 12న గంజాయికి వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించాలని, అలాగే, 14న భోగి మంటల్లో గంజాయి దహనం చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీదేవి, వి.సావిత్రి, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్న కుమార్, ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్ తదితర ప్రజాసంఘాల మహిళా నేతలు మాట్లాడారు.

భోగాపురం ఎయిర్‌పోర్టుకు దారేదీ?

- విశాఖ నుంచి ప్రయాణికులు ఎలా వెళ్లాలి?
- కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు చెప్పాలి
- కనెక్టివిటీ రోడ్డుపై ఇప్పటివరకు డీపీఆర్ సిద్ధం కాలేదు
- రోడ్ అలైన్‌మెంట్‌కూ ఇంకా ఆమోదం రాలేదు
- ఎయిర్‌పోర్టుకు వైఎస్ జగన్ సమగ్ర మాస్టర్ ప్లాన్ రూపొందించారు
- విశాఖ నుంచి ఎయిర్‌పోర్టు వరకు 70 మీటర్ల వెడల్పు రోడ్డుకు ప్రణాళిక
- వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు

మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు చిత్రంలో నాయకులు మొల్లి అప్పారావు, బానాల

సాక్షి, విశాఖపట్నం: భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణంపై క్రెడిట్ చోరీకి పాల్పడుతున్న చంద్రబాబు ప్రభుత్వం.. మాస్టర్ ప్లాన్ ప్రకారం విశాఖ నుంచి ఎయిర్‌పోర్టు వరకు 70 మీటర్ల వెడల్పుతో మెయిన్ రోడ్డు నిర్మాణాన్ని పూర్తిగా గాలికొదిలేసిందని, ప్రయాణికులు విమానాశ్రయానికి ఎలా వెళ్లాలో కేంద్ర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు చెప్పాలని వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విశాఖ నుంచి ఎయిర్‌పోర్టు వరకు 70 మీటర్ల వెడల్పు రోడ్డు నిర్మాణానికి సమగ్ర మాస్టర్ ప్లాన్ రూపొందించారని గుర్తుచేశారు. మంగళవారం మద్దిలపాలెంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో రాజు మీడియాతో మాట్లాడారు. కూటమి సర్కారు నిర్లక్ష్యం వల్ల విశాఖ నుంచి ఎయిర్‌పోర్టుకు కనెక్టివిటీ లేకుండా పోయిందని విమర్శించారు. విమానాశ్రయ రోడ్డు నిర్మాణానికి ఇప్పటివరకు డీపీఆర్ సిద్ధం కాలేదని, రోడ్ అలైన్‌మెంట్‌కూ ఇంకా ఆమోదం రాలేదని, అయినా పచ్చి అబద్ధాలతో ప్రజలను చంద్రబాబు మభ్య పెడుతున్నారని దుయ్యబట్టారు.

చంద్రబాబు చేసింది శూన్యం

భోగాపురం విమానాశ్రయ నిర్మాణంలో చంద్రబాబు సర్కారు చేసింది శూన్యమని రాజు విమర్శించారు. 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కాగానే ఉత్తరాంధ్ర అభివృద్ధిపై స్పష్టమైన విజన్‌తో ప్రణాళిక రచించారని గుర్తుచేశారు. భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణ ఒప్పందాలు పూర్తిచేసి, భూసేకరణ, ఎన్‌వోసీలు పూర్తిచేసి 2023 మే 3న పనులు ప్రారంభించారని పేర్కొన్నారు. 2026 జూన్ నాటికి విమానాశ్రయం పూర్తవుతుందని అప్పుడే టైమ్ ఫ్రేమ్ ఇచ్చారని వివరించారు. అందువల్లే అనుకున్న సమయానికి విమానాశ్రయం పూర్తయిందని రాజు వెల్లడించారు. వైజాగ్ పోర్టు నుంచి భోగాపురం ఎయిర్‌పోర్టు వరకు 70 మీటర్ల వెడల్పుతో రోడ్డు నిర్మాణం, ఇతర వసతుల కల్పనకు అద్భుతమైన మాస్టర్ ప్లాన్‌ను జగన్ రూపొందించారని, అయితే 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు దీనిని పట్టించుకోలేదని రాజు మండిపడ్డారు.

ఏడాదిన్నరలోనే రూ.3 లక్షల కోట్ల అప్పు

సంపద సృష్టి అని ఎన్నికల ముందు గొప్పలు చెప్పుకున్న చంద్రబాబు ఏడాదిన్నర కాలంలోనే రూ.3లక్షల కోట్ల అప్పు చేసి రాష్ట్రాన్ని అధోగతిపాలు చేస్తున్నారని రాజు ధ్వజమెత్తారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మొత్తం ఐదేళ్లలో చేసిన అప్పును.. కూటమి ప్రభుత్వం ఏడాదిన్నరలోనే చేసిందని విమర్శించారు. గత ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిందని గుర్తుచేశారు. కూటమి సర్కారు ఇచ్చిన హామీలను గాలికొదిలేసిందని రాజు విమర్శించారు. వైఎస్ జగన్ సంక్షేమ పథకాలు అమలు చేస్తే రాష్ట్రం శ్రీలంక అవుతుందని తప్పుడు ప్రచారం చేసిన చంద్రబాబు తన ఏడాదిన్నర పాలనలోనే ఏపీని శ్రీలంక కంటే హీనంగా మారుస్తున్నారని రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో రాజుతోపాటు వైఎస్సార్‌సీపీ విశాఖ తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీమకు ద్రోహం చేసిన బాబుకు పాలించే అర్హత లేదు

స్వప్రయోజనాల కోసం సీమ రైతులనే చంద్రబాబు దగా చేశారు

మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

సాక్షి, అమరావతి: రాయలసీమకు ద్రోహం చేసిన చంద్రబాబుకు పాలించే అర్హత లేదని, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో కలిసి ఆయన రాయలసీమకు మరణ శాసనం రాశారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు ఆక్షేపించారు. మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. 'తెలంగాణ అసెంబ్లీలో రేవంత్‌రెడ్డి ప్రకటనతో రాయలసీమ లిఫ్ట్ స్కీమ్ పనులు ఆపేసిన చంద్రబాబు కుట్ర బట్టబయలైంది. అంతకుముందు కూడా పాలమూరు–రంగారెడ్డి, డిండి ప్రాజెక్టుల ద్వారా ఏపీకి దక్కాల్సిన నీటిని తెలంగాణకు అప్పటి సీఎం కేసీఆర్ తరలించుకుపోతున్నా చంద్రబాబు నోరెత్తలేదు. అందుకే అప్పటి పరిస్థితి గుర్తించి నాటి విపక్షనేత వైఎస్ జగన్ కర్నూలులో జలదీక్ష చేశారు. కృష్ణా నదికి వరద సమయంలో రోజుకు మూడు టీఎంసీలు తరలించేలా రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించి ఈ ప్రాంత నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా మాజీ సీఎం వైఎస్ జగన్ ముందడుగు వేశారు. రూ.7 వేల కోట్ల వ్యయంతో 2020లో రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌ని ప్రారంభించి 85 శాతం పనులు పూర్తి చేశారు. కానీ.. 2024 అధికారంలోకి వచ్చిన చంద్రబాబు పెండింగ్ పనులు పూర్తి చేయకుండా పక్కన పెట్టేశారు. రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్ట్ పూర్తిచేస్తే జగన్‌కి మంచి పేరొస్తుందనే కుట్రతో ఆనాడే ప్రాజెక్టును అడ్డుకున్నారు. ప్రాజెక్టుకు వ్యతిరేకంగా జాతీయ హరిత ట్రిబ్యునల్(ఎన్జీటీ)లో తన వారితో కేసులు వేయించారు. మరోసారి ఇప్పుడు తెలంగాణ అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటనతో చంద్రబాబు కుట్ర బట్టబయలైంది' అని కొరముట్ల చెప్పారు.

నాడు చంద్రబాబు నోరు మెదపలేదు

'చంద్రబాబు గతంలోనూ ఆల్మట్టి ప్రాజెక్టు ఎత్తు పెంచడానికి అంగీకరించి తెలుగు ప్రజలకు వెన్నుపోటు పొడిచారు.పోలవరం ప్రాజెక్టును కమీషన్ల కోసం స్వయంగా కడతామని చెప్పి ప్రశ్నార్థకం చేశారు. పోతిరెడ్డిపాడు ద్వారా వరద సమయంలో 101 టీఎంసీలు రాయలసీమకు తరలించేలా ప్రాజెక్టును డిజైన్ చేస్తే దాన్ని కూడా చంద్రబాబు అడ్డుకున్నారు. 2015లో తెలంగాణ సీఎం కేసీఆర్ పాలమూరు–రంగారెడ్డి, డిండి ప్రాజెక్టుల ద్వారా నీటిని తరలించుకుపోతున్నా ఏపీ సీఎం చంద్రబాబు కనీసం నోరెత్తలేదు. రాష్ట్ర ప్రయోజనాలను చంద్రబాబు తెలంగాణకు తాకట్టు పెట్టారు' అని కొరముట్ల దుయ్యబట్టారు.

శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవటం మన కర్తవ్యం. లేకుంటే మన మనస్సును దృఢంగా, స్పష్టంగా ఉంచుకోలేం.

– బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, 7 జనవరి 2026

అగ్నిజ్వాల... శబ్దఘోష!

కోనసీమ గడ్డపై మళ్లీ మంటలు ఎగసిపడుతున్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం ఇరుసుమండ గ్రామంలో సోమవారం ఉదయం మోరి–5వ నంబర్ బావి వద్ద బీభత్సమైన శబ్దంతో బ్లోఅవుట్ ఉబికి, గ్యాస్ ఎగదన్నుతూ భారీ ఎత్తున మంటలు వ్యాపించటంతో సమీప గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళనల్లో పడ్డారు. మంగళవారం మధ్యాహ్నానికి బ్లోఅవుట్ తీవ్రత తగ్గినా మరికొన్ని రోజులు ఇది కొనసాగుతుందని ఓఎన్‌జీసీ అధికారులు చెబుతున్న మాట. సహజ వాయువు వెలికితీత కోసం ఇనుప గొట్టాలతో డ్రిల్లింగ్ చేస్తున్నప్పుడు రాతిపొర తగిలితే ఆ గొట్టం ద్వారా బాంబింగ్ జరపడం అలవాటు. ఆ క్రమంలోనే ఒక్కసారిగా సహజ వాయువు పెల్లుబికి ప్రమాదానికి దారితీస్తుంది. ఇది మొదటిసారేమీ కాదు. చిన్నవో, పెద్దవో ఇలాంటి ఉదంతాలు అడపా దడపా చోటుచేసుకుంటూనే ఉన్నాయి. 1993లో కొమరాడలో తొలిసారి ప్రమాదం జరగ్గా 1995 జనవరిలో పాశర్లపూడి 19ఏ బావిలో డ్రిల్లింగ్ సమయంలో బ్లోఅవుట్ సంభవించి 65 రోజులపాటు కోనసీమను హడలెత్తించింది. 2014లో మామిడికుదురు మండలం నగరం గ్రామంలోని గెయిల్ కంపెనీ పైపులైన్ పగిలి గ్యాస్ విడుదలై 22 మంది ప్రాణాలు కోల్పోగా, 18 మంది తీవ్రంగా గాయపడ్డారు. చిన్నవే కావొచ్చుగానీ... అటుతర్వాత కూడా ప్రమాదాలు చోటుచేసుకున్నాయి.

అదృష్టవశాత్తూ ప్రస్తుత ఉదంతంతో సహా దాదాపు అన్నీ జనం అప్రమత్తంగా ఉన్న వేళ సంభవించినవే. కానీ ఆదమరిచి నిద్రిస్తున్నవేళ జరిగితే జనం ప్రాణాలు ఏం కావాలి? మంగళవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో డ్రిల్లింగ్ చేస్తుండగా ఒక్కసారిగా సహజ వాయువు ఎగదన్నిందనీ, ఆకాశాన్నంటేలా మంటలు వ్యాపించాయనీ మీడియా కథనం. క్షణాల్లో ఆ ప్రాంతంలో గ్యాస్ అలుముకోవటంతో చుట్టూ ఉన్న గ్రామాల్లోనివారు ఇళ్లకు తాళాలేసి ప్రాణభయంతో పిల్లాపాపల్ని తీసుకుని పరుగులు పెట్టారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో వెంటనే పోలీసులొచ్చినా ఓఎన్‌జీసీ సిబ్బంది మాత్రం గంటన్నర తర్వాతగానీ రాలేదని జనం చెబుతున్నారు.

తరచు సమస్యలెదురవుతున్నా, ప్రమాదం జరిగే ప్రాంతాలు జనావాసాలకు దగ్గరగా ఉంటున్నా ఏటా వేలకోట్ల రూపాయల విలువైన చమురు, సహజ వాయువులను తోడేస్తున్న సంస్థలు భద్రత విషయంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. సమస్య ఉత్పన్నమైనప్పుడు తక్షణం తీసుకోవాల్సిన వరస చర్యలేమిటో సిబ్బందికి కనీస అవగాహన ఉందా? అక్కడి నుంచి మాయంకావటం తప్ప ఇంకేమీ తెలియదా? వెంటనే ఎవరెవరికి సమాచారం అందించాలో, నిపుణులైనవారు అనుసరించాల్సిన విధివిధానాలేమిటో రూపొందాయా? అవసరమైన ఉపకరణాలేమైనా అక్కడ అందుబాటులో ఉన్నాయా? జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం(ఎన్‌డీఆర్‌ఎఫ్)ను ఈ కార్యకలాపాలు జరిగే ప్రాంతాలకు సమీపంగా ఉంచారా? స్థానికులకు ఎప్పటికప్పుడు తగిన సమాచారం ఇచ్చే వ్యవస్థలుండాలి. గోప్యత పాటిస్తే అనవసర వదంతులు వ్యాపిస్తాయి. ఒకప్పుడు ఓఎన్‌జీసీ ఆధ్వర్యంలోనే కార్యకలాపాలన్నీ సాగేవి. ఇప్పుడు ప్రైవేటు సంస్థల ప్రమేయం పెరిగింది. చేసేది ఎవరైనా నిర్లక్ష్యం సహించరానిది.

కోనసీమ గర్భంలో అపురూపమైన సహజ వనరులు నిక్షిప్తమై ఉన్నాయని తెలిశాక స్థానికులు సంతోషించారు. ఉద్యోగావకాశాలతోపాటు, అభివృద్ధి పనులు కూడా చకచకా మొదలవుతాయని ఆశించారు. కానీ జరిగిందంతా వేరు. అంతంతమాత్రంగా ఉన్న రహదారులు భారీ వాహనాల రాకతో దెబ్బతిన్నాయి. సున్నితమైన పర్యావరణం కొంచెం కొంచెంగా దెబ్బతింటూ కొబ్బరి, వరి దిగుబడి తగ్గిపోయిందని రైతులు చెబుతున్న మాట. చమురు, గ్యాస్ వెలికితీశాక ఆ ఖాళీలోకి సముద్ర జలాల ఊట చేరి బావుల్లో నీరు ఉప్పగా మారిందంటున్నారు. జల, వాయు కాలుష్యాలు ప్రజారోగ్యంపై కలగజేస్తున్న ప్రభావం ఏమిటో ప్రభుత్వాలు ఆరా తీసినట్టు లేదు. తెలంగాణలోని సింగరేణిలో తవ్వే బొగ్గుపై వచ్చే ఆదాయంలో 50 శాతం వాటా రాష్ట్ర ప్రభుత్వానికిస్తుండగా చమురు, సహజవాయువుల నుంచి లభించే ఆదాయంలో ఆంధ్రప్రదేశ్‌కి ఇస్తున్నదెంత? కోనసీమకు దక్కుతున్నదేమిటి? ఈ బ్లోఅవుట్ చల్లారిన తర్వాతైనా ప్రభుత్వమూ, ప్రజాప్రతినిధులూ దీనిపై దృష్టి పెట్టాలి. భవిష్యత్తులో ఇలాంటి ఉదంతాలు చోటుచేసుకోకుండా చూడాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, పుష్య మాసం, **తిథి:** బ.చవితి ఉ.10.44 వరకు తదుపరి పంచమి, **నక్షత్రం:** మఖ సా.4.05 వరకు తదుపరి పుబ్బ, **వర్జ్యం:** రా.12.12 నుండి 1.49 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.45 నుండి 12.29 వరకు, **అమృత ఘడియలు:** ప.1.40 నుండి 3.12 వరకు.

సూర్యోదయం : 6.36
సూర్యాస్తమయం: 5.36
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

సోషల్ టాక్

మార్పు

బలమైన అభిప్రాయాలు సమాజంలో మార్పును తెస్తాయి. మార్పు కోసం మీ వైఖరికి కట్టుబడి ఉండండి. అడ్డంకులతో రాజీ పడకండి. బాల కార్మిక వ్యవస్థను అంత మొందించటానికి బలమైన అభిప్రాయాలు, బలమైన ప్రయత్నాలు రెండూ అవసరం.

– శాంతా సిన్హా, సోషల్ యాక్టివిస్ట్

అందం

అందానికి ఆఖరి గడువు అంటూ ఉండదు. మీకు ఇరవై లేదా డెబ్బై ఏళ్లు వచ్చినా... అందంగా, నవ చేతనతో ఉండాలన్న కోరిక ఎప్పటికీ తగ్గదు. అందాన్ని దాని అన్ని రూపాల్లో, అన్ని భావాలలో అభినందించటం మానేస్తే మనం ఒక విధంగా జీవితాన్నే కోల్పోతాం.

– శోభా డే, రచయిత్రి–కాలమిస్టు

నాన్న

నేను ఆయనలా (ఎస్పీబీ) పాడటానికి ప్రయత్నించను. ఆ తండ్రికి తగిన కుమారుడిగా ఉండేందుకు కష్టపడతాను. మీ తల్లిదండ్రులకు మీరు ఇవ్వగలిగిన గొప్ప నివాళి ఏమిటంటే, ఎలాంటి సమయాలలోనైనా వారు మీకు నేర్పించిన విలువల ప్రకారం జీవించటం!

– ఎస్.పి. చరణ్, ప్లేబ్యాక్ సింగర్

ఆయుధం

ప్రపంచంలో ప్రతిదీ ఇప్పుడు ఆయుధమే! డబ్బు, వాణిజ్యం, టెక్నాలజీ... ఆయుధంగా మారినప్పుడు ఒక దేశం అభివృద్ధి చెందటానికి ఏకైక మార్గం 'ఆత్మనిర్భర్'. ఆత్మనిర్భర్ అంటే... మనం ఏం చేయాలో, ఏం చేయకూడదో ఎవరూ మనకు చెప్పలేని విధంగా ఉండటం.

– బాబా కల్యాణి, భారత్ ఫోర్జ్ చైర్మన్

గర్జన

ధైర్యం ఎప్పుడూ గర్జించదు. కొన్నిసార్లు అది జీవితపు మూలల్లో నిశ్శబ్దంగా సెగలు కక్కుతూ ఉంటుంది. కొత్తగా ఏదైనా ప్రారంభించవలసి వచ్చినప్పుడు, జీవిత గందరగోళంలో ఆత్మవిశ్వాసాన్ని కూడగట్టేందుకు ఏమాత్రం ఆలస్యం చేయకుండా బయటికి వచ్చేస్తుంది.

– సుప్రియా పాఠక్, నటి

మార్గం

సమస్యల గురించి చింతించకండి. పరిష్కారాలు కనిపెట్టండి. మీ దగ్గర ఉన్న సాధనాలతోనే మీరు మీ వ్యాపార మనుగడకు మార్గాలను అన్వేషించాలి. ఒక వైఫల్యం ఎదురైందంటే, ఆ వైపు మీకు మార్గం లేదని కాదు, ఇంకో మార్గం వైపు వెళ్లమని మీకు సూచన.

– అర్జున్ మల్హోత్రా, ఐటీ దిగ్గజం

చంద్రబాబు పీడిత రాయలసీమ!

అభిప్రాయం

భూమన కరుణాకర రెడ్డి

'ప్రాంతేతరుడు మోసం చేస్తే, ప్రాంతం పొలిమేరల వరకూ తరిమి కొడతాం. ప్రాంతం వాడే మోసం చేస్తే, ప్రాంతం లోపలే పాతిపెడతాం' అంటూ ఎలుగెత్తి చాటిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు గారి స్ఫూర్తిదాయకమైన మాటలు... రాయలసీమ సమాజం చెవుల్లో మార్మోగుతున్నాయి. అంతేకాదు, రాయలసీమ ప్రాంతంలో పుట్టి, పెరిగి, రాజకీయంగా అంచెలంచెలుగా ఎదిగి, పాలకుడిగా ఇప్పుడా ప్రాంతానికే ద్రోహం తలపెట్టిన చంద్రబాబును ఏం చేయాలో అనే అంతర్మథనంలోనూ రాయలసీమ ఉంది.

దశాబ్దాలుగా రాయలసీమ ప్రాంతాన్ని జలగలా పట్టి పీడిస్తున్న కరవు రక్కసిని పారదోలాలనే దివంగత ప్రియతమ నేత, తన తండ్రి వైఎస్సార్ ఆశయాన్ని, ఆకాంక్షను నెరవేర్చడానికి మా నాయకుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 'రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్'కు 2020 మే 5న శ్రీకారం చుట్టారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా చెన్నైకి 15 టీఎంసీల నీటితో పాటు కరవు ప్రాంతమైన రాయలసీమలో 9.6 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని లక్ష్యం నిర్దేశించుకోవడం వైఎస్ జగన్ గొప్ప ఆశయానికి నిదర్శనం.

అప్పుడే పూర్తయ్యేది!

శ్రీశైలం ప్రాజెక్ట్‌లో 800 అడుగుల నుంచి రోజుకు 3 టీఎంసీలు చొప్పున పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ దిగువన కుడి ప్రధాన కాలువలోకి నీటిని ఎత్తిపోసేలా రూ. 3,825 కోట్ల ఖర్చుతో ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. మొదటి దశలో పనులు చేపట్టాలని 2023 ఆగస్టు 11న అప్పటి వైసీపీ ప్రభుత్వం నిర్ణయించింది.

అయితే లోకం సుభిక్షంగా ఉండేందుకు దేవతలు యజ్ఞాలు చేస్తుంటే, రాక్షసులు విఘ్నాలు కలిగించిన చందంగా... రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ముందుకు వెళ్లకుండా నాడు ప్రతిపక్ష నాయకుడైన చంద్రబాబు నాయుడు తన మనుషుల ద్వారా ఎన్జీటీలో పిటిషన్ వేయించి, అడ్డు తగిలారు. అయితే మహాభారతంలో అర్జునుడి లక్ష్యం చెట్టుపై ఉన్న పక్షి కన్నుపై తప్ప, కొమ్మలపై కానట్టుగా... పార్థుడి లాంటి వైఎస్ జగన్ దృష్టి ప్రాజెక్ట్ పనులపై మాత్రమే ఉండింది. అందుకే చంద్రబాబు సృష్టించిన ఆటంకాలను లెక్క చేయకుండా, రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనుల్ని శరవేగంగా కొనసాగించేందుకు చర్యలు తీసుకున్నారు.

వైఎస్ జగన్ నేతృత్వంలోని వైసీపీ ప్రభుత్వం 2024 ఎన్నికల తర్వాత కొనసాగి ఉంటే, ఈ పాటికి రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పూర్తయి, రాయలసీమంతా సస్యశ్యామలం అయ్యేది. కరవు పీడిత ప్రాంత రైతాంగం జీవన రూపురేఖలే పూర్తిగా మారిపోయేవి.

◆ రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనుల్ని చంద్రబాబు అర్ధంతరంగా ఆపివేశారు. కరవు ప్రాంతంపై ఈ ప్రతాపం ఎందుకు? దేశ చరిత్రలో మరే నాయకుడూ తన మాతృ గడ్డకు చంద్రబాబు మాదిరిగా వెన్నుపోటు పొడిచి ఉండరంటే అతిశయోక్తి కాదు.

కానీ రాయలసీమతో పాటు ఆంధ్రప్రదేశ్ సమాజంలో వెలుగులు నింపే వైఎస్ జగన్ పరిపాలనా దీపాన్ని... అబద్ధాలు, విష ప్రచారం ద్వారా కూటమి కొండెక్కించేసింది. తద్వారా వైఎస్ జగన్ కంటే, ఎక్కువగా తామే నష్టపోవాల్సి వస్తోందని ఆంధ్రప్రదేశ్ సమాజం ఆవేదన చెందుతోందన్నది ముమ్మాటికీ నిజం.

మాతృగడ్డకే ద్రోహమా?

ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబునాయుడి నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడటం ద్వారా... మొదటి బాధిత ప్రాంతంగా రాయలసీమ రికార్డులకెక్కింది. రాయలసీమ వాసిగా, ఆ ప్రాంతానికి తీరని ద్రోహం చేసిన పాలకుడిగా సమాజం అతడిపై మండిపడుతోంది. రాజకీయ ప్రత్యర్థి అయిన మా నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు మాలాంటి నాయకులపై 'చంద్రబాబు అండ్ కో'కు కోపం ఉండొచ్చు. ఒకవేళ మాపై కోపాన్ని తీర్చుకోవాలంటే అధికారాన్ని యథేచ్ఛగా వాడుకోవచ్చు. ఎదుర్కొనే శక్తి సామర్థ్యాలు మాకున్నాయి.

కానీ కరవు ప్రాంతంపై చంద్రబాబు ప్రతాపం ఎందుకో అర్థం కావడం లేదు. అధికారాన్ని తాను పుట్టిన ప్రాంతానికి ద్రోహం తలపెట్టడానికి దుర్వినియోగం చేయడం ఎంత మాత్రం క్షమార్హం కాదు. బహుశా దేశ చరిత్రలో మరే నాయకుడూ తనకు రాజకీయ, అధికార భిక్షమేసిన మాతృగడ్డకు చంద్రబాబు మాదిరిగా వెన్నుపోటు పొడిచి ఉండరంటే అతిశయోక్తి కాదు. పిల్లనిచ్చిన మామకే చంద్రబాబు వెన్నుపోటు పొడిచారని ఇంతకాలం ఆయనపై మచ్చ ఉంది. ఇప్పుడు దానికంటే మించిన మచ్చ, అప్రతిష్ఠ చంద్రబాబుకు దక్కాయి.

నిత్యం కరవు కాటకాలతో అల్లాడుతున్న రైతాంగం జీవితాలను మార్చేందుకు, కృష్ణా నీళ్లతో బీడు భూముల్ని తడిపేందుకు భగీరథుడిలా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి యజ్ఞం తలపెట్టగా, రాక్షసుడి మాదిరిగా చంద్రబాబు ఆటంకాలు సృష్టించారు. తన రాజకీయ శిష్యుడైన తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కోరిన వెంటనే, తన అబ్బ సొత్తు అన్నట్టుగా రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనుల్ని అర్ధంతరంగా ఆపివేశారు.

ఆంధ్రప్రదేశ్ ప్రజలు మంచి పనులు చేయడానికి మాత్రమే చంద్రబాబు నాయకత్వంలోని కూటమికి అధికారం కట్టబెట్టారు. అంతే తప్ప, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కోరినట్టు నడుచుకోవడానికి కాదని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాం.

కాళోజీ చెప్పినట్టు...

రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనుల నిలిపివేతతో, ఇవాళ కరవు పీడిత ప్రాంతం తీవ్రంగా నష్టపోతోంది. మళ్లీ వలసలు తప్పడం లేదు. మరోవైపు ఉపాధి హామీ పథకానికి కూడా కోరలు కట్ చేసిన పరిస్థితి.

రాయలసీమ ప్రాంతంపై చంద్రబాబుకు ఎందుకంత కక్ష? గత ఎన్నికల్లో అత్యధిక ఎమ్మెల్యే స్థానాల్ని కూటమికే కట్టబెడితే, రిటర్న్ గిఫ్ట్‌గా రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ను లేకుండా చేస్తారా? ఇదెక్కడి అన్యాయం? ఈ దుర్మార్గానికి ఏం పేరు పెడితే సరిపోతుందో విజ్ఞులైన రాయలసీమ ప్రజలు ఆలోచించాలి.

రాయలసీమ ప్రాంతం నీళ్ల కోసం అలమటిస్తోంది. అందుకే దివంగత వైఎస్సార్ హయాంలో పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని 44 వేల క్యూసెక్కులకు అప్పట్లో పెంచిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 80 వేల క్యూసెక్కులకు పెంచి, రాయలసీమ ప్రాంత కరవు పారదోలడానికి పనుల్ని వేగవంతం చేశారు. ఇదీ రాయలసీమను కరవు రక్కసి నుంచి తరిమికొట్టడానికి జగన్ నిబద్ధత.

చంద్రబాబు మాత్రం... తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఏనాడూ రాయలసీమ కరవును పారదోలాలని ఆలోచించలేదు. కానీ వైఎస్ జగన్ తీర్చిదిద్దిన రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ను మాత్రం తన రాజకీయ శిష్యుడైన రేవంత్ రెడ్డి కోసం లిఫ్ట్ చేయడానికి అత్యుత్సాహం ప్రదర్శించారు. అందుకే చంద్రబాబును రాయలసీమ పాలిట పీడకుడని చెప్పడం! తమ ప్రాంతానికి మిత్రులెవరో, శత్రువులెవరో ప్రజలకు రేవంత్ రెడ్డి మాటలతో స్పష్టమైంది. సొంత ప్రాంతం వాడే ద్రోహం చేస్తే, ఏం చేయాలో మహాకవి కాళోజీ మాటల్ని స్ఫూర్తిగా తీసుకుని నిర్ణయించుకోవాల్సింది రాయలసీమ సమాజమే!

వ్యాసకర్త తిరుపతి మాజీ ఎమ్మెల్యే

దాడులను చూస్తూ ఊరుకుందామా?

విశ్లేషణ

బర్ఖా దత్

ఒక పక్క దేశం యావత్తు నూతన ఆంగ్ల సంవత్సర వేడుకల్లో మునిగి ఉంటే, మరో పక్క కొన్నిచోట్ల అల్లరి మూకలు దౌర్జన్యకాండకు దిగాయి. ఉత్తర ప్రదేశ్‌లోని ఘాజియాబాద్‌లో 'హిందూ రక్షా దళ్' (హెచ్‌ఆర్‌డీ)గా తమను తాము అభివర్ణించుకున్న కొందరు కత్తులు, కొడవళ్ళు చూపిస్తూ ఒక రెసిడెన్షియల్ కాలనీలో భయభ్రాంతులు సృష్టించారు. వారు చట్టం పట్ల ఏమాత్రం భయం లేనట్టుగా ఫొటోలు దిగారు, వీడియోలు తీయించుకున్నారు.

ఘాజియాబాద్ ఘటనలో 10 మందిని పోలీసులు అరెస్టు చేశారు. రక్షా దళ్ నేత పింకీ చౌధురీ మాత్రం పరారయ్యాడు. తమ గ్రూపు అనుకున్న లక్ష్యాన్ని సాధించిందని చౌధురీ ఆ తర్వాత ఒక వీడియో కూడా విడుదల చేయడం ఆయన తెంపరితనాన్ని సూచించింది. ఇదేదో చెదురుమదురుగా జరిగిన ఘటన కాదు. మూకుమ్మడి దాడులు ఇటీవల సర్వసాధారణంగా మారాయి.

మతపరమైన దాడులు

మితవాద రౌడీలు, మూకలకు క్రిస్మస్, నూతన వత్సర వేడుకలు నిర్దిష్ట లక్ష్యంగా మారాయి. రాయ్‌పూర్‌లో సుమారు 40–50 మంది కర్రలు పుచ్చుకుని ఒక మాల్‌లోకి ప్రవేశించి బెలూన్లు లాగేశారు; క్రిస్మస్ ట్రీ, శాంటాక్లాజ్ వంటి అలంకరణలను చిందరవందర చేశారు. ఈ దాడిలో కనీసం రూ. 15 లక్షల ఆస్తి నష్టం సంభవించిందని ఆ మాల్ వెల్లడించింది. క్రిస్మస్ సందర్భంగా 'సర్వ హిందూ సమాజ్', ఇతర హిందూ సంస్థలు ఛత్తీస్‌గఢ్ బంద్‌కు పిలుపునిచ్చిన రోజునే ఈ అవాంఛనీయ ఘటన చోటుచేసుకుంది. మతం మారిన కుటుంబంలోని ఓ వ్యక్తి చనిపోయినపుడు ఖననంపై రేగిన రెండు వర్గాల మధ్య ఘర్షణలు ఈ బంద్ పిలుపునకు కారణమయ్యాయని చెబుతున్నారు.

బంద్ కారణంగా ఆ రోజున రాయ్‌పూర్ మాల్‌ను కూడా ప్రజల ప్రవేశానికి వీలు లేకుండా మూసివేశారు. కానీ, అల్లరి మూక సెక్యూరిటీ గార్డులను తోసుకుని, బలవంతంగా లోపలకు ప్రవేశించిందని మాల్ ఉద్యోగుల వాఙ్మూలాలను బట్టి తెలుస్తోంది. ఐడీ కార్డులు చూపాలని కూడా వారు డిమాండ్ చేశారు. హిందువులో లేదా క్రైస్తవులో తేల్చి చెప్పాలని అరిచారు. ఈ ఘటనకు సంబంధించి 'బజరంగ్ దళ్'తో సంబంధం ఉందని భావిస్తున్న ఏడుగురిని అరెస్టు చేశారు. రాయ్‌పూర్ కోర్టు వారికి బెయిలు ఇచ్చేందుకు నిరాకరించింది. దాంతో 300 మంది పోలీసు స్టేషన్ ఎదుట కీలక రహదారిపై బైఠాయించి తొమ్మిది గంటలపాటు వాహనాల రాకపోకలు నిలిపి వేశారు.

సోషల్ మీడియా ఈ ఘటనలను మరీ ఎక్కువ చేసి చెబుతోందనీ, వంద కోట్లకు పైగా జనాభా కలిగిన దేశంలో అక్కడక్కడ జరిగిన వాటిని గోరంతలు కొండంతలు చేసి చెబుతున్నారనీ వాదించే వాళ్ళు ఉన్నారు. అదే నిజమైతే రెండింటి ద్వారా దాన్ని నిరూపించుకోవాలి. అలాంటి పనులకు మరి ఎవరూ దిగే దుస్సాహసం చేయకుండా, నేరస్థులకు కఠిన దండన విధించాలి. రాజకీయంగానూ, ఆధ్యాత్మికంగానూ అధికారం చలాయిస్తున్నవారు తీవ్ర పదజాలంతో వాటిని ఖండించాలి.

క్రిస్మస్ రోజున ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఢిల్లీలో చర్చి సర్వీసులో పాల్గొన్నారు. దేశవ్యాప్త ప్రార్థనలు, వేడుకల్లో పాల్గొనవలసిన స్ఫూర్తిని ప్రదర్శించారు. బీజేపీ అధ్యక్షుడు జె.పి. నడ్డా ఢిల్లీలో ఓ స్కూల్లో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. ఇవి చూసైనా అల్లరి మూకలు తమ వైఖరి మార్చుకోవాలి. కానీ, ప్రధాని బాటను అనుసరించేందుకు మితవాద వర్గం సిద్ధంగా ఉందా?

వివిధ మతాలు, సంస్కృతులు, జాతులు, భాషలు, అభిప్రాయాలు కలిగిన మనం ఒకే సమాజంగా జీవిస్తున్నాం. ఈ బహుళత్వం, వైవిధ్యమే మన బలమని భారతీయులలో అత్యధికులు గుర్తిస్తారని నేను ఎప్పటికీ నమ్ముతాను. మూక హింసతో వచ్చిన చిక్కేమిటంటే, దానికి న్యూసెన్స్ వాల్యూ ఉంది. దౌర్జన్యానికి దిగేవారి కళ్లలోకి నేరుగా చూస్తూ కళ్ళెం చేయగలగాలి. అప్పుడే వారి ఆగడాలకు అడ్డుకట్ట పడుతుంది. మనం అటువంటి చర్యలను గర్హించాలి. ముక్తకంఠంతో ఖండించాలి.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్
('ద హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

న్యాయం గెలుస్తుందా?

ఇన్ బాక్స్

ఉన్నావ్ అత్యాచార కేసు ప్రధాన ముద్దాయి, బీజేపీ మాజీ నాయకుడు కులదీప్ సింగ్ సెంగార్‌కు పడిన యావజ్జీవ శిక్షను ఢిల్లీ హైకోర్టు సస్పెండ్ చేస్తూ బెయిల్ మంజూరు చేయడం దేశ వ్యాప్తంగా చర్చకు దారితీసింది. అయితే, ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు కావడంతో, అత్యున్నత న్యాయస్థానం హైకోర్టు ఆదేశాల అమలును నిలిపివేస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. నేరస్థుడి శిక్షను ఏ సందర్భాల్లో సస్పెండ్ చేయవచ్చనే అంశాన్ని చట్టపరంగా విశ్లేషించాల్సి ఉంది.

2017లో ఉత్తరప్రదేశ్ ఉన్నావ్ ప్రాంతంలో మైనర్ బాలికను కిడ్నాప్ చేసి అనేకసార్లు అత్యాచారానికి ఒడిగట్టినట్లు సెంగార్‌పై కేసు నమోదైంది. బాధితురాలిని విక్రయించడానికి కూడా అతను యత్నించాడని ఆరోపణలు ఉన్నాయి. అంతటితో ఆగక, బాధితురాలి తండ్రిపై అక్రమ కేసులు పెట్టి, పోలీస్ కస్టడీలోనే దాడి చేయించి ప్రాణాలు తీయించాడు. ఈ క్రూర చర్యల వల్ల సెంగార్‌పై హత్య కేసు కూడా నమోదైంది. బాధితులను నిరంతరం బెదిరిస్తున్నారన్న ఆరోపణలతో సుప్రీంకోర్టు 2019లో ఈ కేసును ఢిల్లీ కోర్టుకు బదిలీ చేసింది. ఆ ఏడాది ఢిల్లీ ట్రయల్ కోర్టు సెంగార్‌కు చనిపోయే వరకు జైలులోనే ఉండేలా యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. బాధితురాలి తండ్రి మరణం కేసులో అతనికి పదేళ్ల శిక్ష పడింది. ప్రస్తుతం హైకోర్టు అత్యాచార కేసులో శిక్షను సస్పెండ్ చేసినా, హత్య కేసులో బెయిల్ రాకపోవడంతో అతను జైలులోనే ఉన్నాడు.

ప్రస్తుతం అమల్లో ఉన్న భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బిఎన్ఎస్ఎస్), సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం శిక్షాకాలం మూడేళ్ల కంటే తక్కువ ఉంటేనే బెయిల్, సస్పెన్షన్ సులభంగా లభిస్తాయి. కానీ సెంగార్‌ది యావజ్జీవ శిక్ష. 2019 నుండి ఇప్పటివరకు అతను అనుభవించిన శిక్ష కేవలం ఏడేళ్లు. కనీసం పదేళ్ల శిక్షాకాలం పూర్తి కాకుండానే ఇలాంటి వెసులుబాటు కల్పించడం నిబంధనలను ఉల్లంఘించడమే. ప్రాణాంతక వ్యాధులు లేదా జైలులో చికిత్స సాధ్యం కాని తీవ్ర అనారోగ్యం ఉన్నప్పుడు మాత్రమే మానవతా కోణంలో శిక్షను సస్పెండ్ చేసే వీలుంటుంది. సెంగార్ విషయంలో అటువంటి ఆరోగ్య సమస్యలేవీ లేవు. అత్యవసర సమయాల్లో 'పెరోల్' ఇచ్చే అవకాశం ఉన్నా, శిక్ష పడిన తర్వాత బెయిల్ ఇవ్వడం చట్టంలో ఎక్కడా లేదు.

బిఎన్ఎస్ఎస్ సెక్షన్ 473 ప్రకారం పండుగల సందర్భంగా ఖైదీలను విడుదల చేసే అవకాశం ఉన్నా, అది అత్యాచారం, ఉగ్రవాదం వంటి 'హీనమైన నేరాల'కు వర్తించదు. అయినప్పటికీ, అధికార పార్టీ నేతలను కాపాడేందుకు వ్యవస్థలు కృషి చేస్తున్నాయన్న విమర్శలు వస్తున్నాయి.

– బి. జ్యోతి | చైతన్య మహిళా సంఘం

కాటన్ క్యాపిటల్

డేటా పాయింట్

దేశంలో 2024–25లో ఉత్పత్తి అయిన మొత్తం పత్తి 297 లక్షల బేళ్లు (ఒక బేల్ = 170 కిలోలు). గత నాలుగేళ్లతో పోలిస్తే ఇది తక్కువే.



నాదయోగి



ప్రపంచ చరిత్రలో వేలాదిమంది మహామహులైన సంగీత విద్వాంసులు అవతరించారు గానీ, త్యాగరాజ స్వామి వంటివారు మరొకరు లేరు. ఆయన వర్ధంతి తిథి (పుష్య బహుళ పంచమి–ఈ రోజే!) వచ్చిందంటే, అంతో ఇంతో నామరూపాలున్న కర్ణాటక సంగీత విద్వాంసులందరూ తిరువయ్యారు గ్రామానికి చేరి, ఆ అయ్యవారి సమాధికి మ్రొక్కి, ఆయన విరచించిన కీర్తనలు భక్తితో వ్యష్టిగానూ, సమష్టిగానూ పాడి ఆయనను ఆరాధిస్తారు. 118 సంవత్సరాల నుండీ ఎన్నో తరాల విద్వాంసులు ఈ ఆరాధనను అవిచ్ఛిన్నంగా కొనసాగిస్తు న్నారు. అల ముత్తుస్వామి వారికి గానీ, శ్యామశాస్త్రుల వారికి గానీ, మరే ఇతరులకు గానీ లేదా వైభవము!

ఇందుకు కారణం త్యాగరాజ స్వామి జీవిత చరిత్రను సమీక్షిస్తే తెలుస్తుంది. ఆయన పరమభక్తి తత్పరుడు. 38 సంవత్సరాల వయస్సుకే, గురువు ఉపదేశించిన రామతారక మంత్రం 96 కోట్ల సార్లు జపించి, రామ సాక్షాత్కారం పొందిన భాగవతాగ్రేసరుడు. యావజ్జీవమూ నాదోపాసన చేసిన నాదయోగి. అహంకార లవలేశం కూడా ఎరగని నైచ్యానుసంధానంతో 'తవ దాసోహం, దాశరథే!' అంటూ, మనసా వాచా కర్మణా, తన ప్రభువుకు దాసత్వం నెరపిన ధన్యజీవి. తనకు రాముని సన్నిధిని మించిన నిధి మరొకటి లేదని చాటి, దానిని ఆచరణలో చూపిన తత్త్వజ్ఞాన నిధి. అపారమైన వైదుష్యాన్నీ, అవధులు లేని భక్తి ప్రతిపత్తులనూ, అతి నిరాడంబరమైన జీవిత విధానపు చట్రంలో అమర్చుకొని, ఆదర్శప్రాయుడైన విద్యా వినయ సంపన్నుడు. 24,000 కీర్తనలు! వాటిలో సంగీత కళాసాగరులు అని సమాజం గుర్తించిన గానవేత్తలను కూడా అబ్బురపరచే అనర్ఘ కళాకృతి రత్నాలు ఎన్నెన్నో!

'వ్యక్తి ఇలా జీవించాలి!' అని సనాతన సంప్రదాయం చూపిన బాటలో, అంగుళం అటూ ఇటూ అతిక్రమించకుండా జీవించి, జీవిత లక్ష్యాన్ని సాధించి, తరించిన సద్గుణ సంపన్నుడు సద్గురు శ్రీ త్యాగరాజు. అందుకే సామాన్యులే కాక, స్వయంగా లబ్ధప్రతిష్ఠులైన సంగీత విద్వన్మణులు యావన్మందీ ఆయనకు తమ మనో మందిరాలలో పూజాస్థానం ఏర్పరచి ఆరాధించిందీ, ఆరాధిస్తున్నదీ!

– ఎం. మారుతి శాస్త్రి

సందడిగా పుస్తక ప్రియుల పాదయాత్ర

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో జరుగుతున్న 36వ విజయవాడ పుస్తక మహోత్సవంలో భాగంగా నిర్వహించిన పుస్తక ప్రియుల పాదయాత్రను మంగళవారం ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా జెండా ఊపి ప్రారంభించారు. పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ కళాశాల నుంచి ప్రారంభమైన ఈ యాత్రకు మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ నాయకత్వం వహించారు. పాదయాత్రలో శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్, తానా సాహిత్య వేదిక అధ్యక్షుడు తోటకూర ప్రసాద్, వెబ్ జర్నలిస్ట్ కిరణ్ ప్రభ, తెలుగు ఎన్నారై డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రాజా, విజయవాడ పుస్తక మహోత్సవ సంఘ బాధ్యులు మనోహర్ నాయుడు, లక్ష్మయ్య, విజయకుమార్, హైదరాబాదు పుస్తక ప్రదర్శన కార్యవర్గ సభ్యులు, పుర ప్రముఖులు, రచయితలు, కవులు, కళాకారులు పాల్గొన్నారు. 'మాదక ద్రవ్యాలు వద్దు – పుస్తకాలే ముద్దు' అనే ప్లకార్డులను విద్యార్థులు ప్రదర్శించారు.

మోచేయి మార్పిడి ఆపరేషన్ విజయవంతం

ఏపీలోనే తొలిసారి సర్జరీ చేసిన వైద్యులు

మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ నరేంద్రరెడ్డి, పక్కన చాంద్‌బేగం

గుంటూరు మెడికల్: రుమటాయిడ్ ఆర్థరైటిస్ (కీళ్లవాతం)తో కుడిచేయి బిగుసుకుపోయి ఏ పనులు చేసుకోలేక, కనీసం భోజనం చేసేందుకు కూడా అవస్థలు పడుతున్న ఓ వృద్ధురాలికి గుంటూరు వైద్యులు విజయవంతంగా మోచేయి మార్పిడి ఆపరేషన్ చేశారు. రాష్ట్రంలోనే తొలిసారిగా మోచేయి మార్పిడి ఆపరేషన్ చేసినట్టు సీనియర్ రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, సాయిభాస్కర్ ఆస్పత్రి అధినేత డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి మీడియాకు మంగళవారం చెప్పారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరులోని పొట్టి శ్రీరాములు నగర్‌కు చెందిన 65 ఏళ్ల షేక్ చాంద్‌బేగం 6 నెలలుగా కుడి మోచేతి వాపు, నొప్పి సమస్యతో బాధపడుతోంది. మోచేయి సమస్య వల్ల అన్నం తినేందుకు ఇబ్బంది పడుతోంది. గత నెలలో మోచేతి నొప్పి, వాపు సమస్యతో తమను సంప్రదించగా మూడు వారాల క్రితం విజయవంతంగా ఆపరేషన్ చేశామని డాక్టర్ నరేంద్రరెడ్డి చెప్పారు. కీళ్లవాతం వల్ల కుడిచేయి బిగుసుకుపోయి, మోచేయి వంగక ఏ పనులు చేసుకోలేక తీవ్ర ఇబ్బంది పడుతున్నట్టు తెలిపారు. ఆపరేషన్ చేసిన మూడు వారాలకే చాంద్‌బేగం తన పనులు తాను చేసుకుంటున్నట్లు వెల్లడించారు.

రంగుల పైత్యంతో ప్రజాధనం దుబారా!

సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డ్ గేట్లకు పసుపు రంగులు

సత్తెనపల్లి: రాష్ట్రంలో పచ్చపార్టీ పైత్యం నానాటికీ మితిమీరుతోంది. రంగుల ప్రభుత్వమంటూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై విషం చిమ్మిన టీడీపీ.. ఇప్పుడు కనిపించిన ప్రతి ప్రభుత్వ ఆస్తికీ పచ్చ రంగులు పులుముతోంది. పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని ప్రధాన రహదారిలో గల వ్యవసాయ మార్కెట్ యార్డ్‌కు రెండు వైపులా ఆర్చ్ నిర్మాణం, గేట్లు, వాటి వద్ద నాలుగు ఎద్దుల విగ్రహాలను ఏర్పాటు చేశారు. మొదటి గేటు ముఖద్వారంపై ఎమ్మెల్యే, ఏఎంసీ చైర్‌పర్సన్ పేర్లు ముద్రించుకోగా.. ఎంపీ పేరు లేకపోతే ఎలా అని ప్రశ్నలు రేకెత్తడంతో రెండో గేట్‌కు ఎమ్మెల్యే, ఎంపీ, ఏఎంసీ చైర్‌పర్సన్ పేర్లు ఆర్చ్‌పై ముద్రించారు. వీటికి పసుపు రంగులు వేశారు. సోమవారం రాత్రి ఏపీ భట్రాజు కార్పొరేషన్ చైర్మన్‌గా సరికొండ వెంకటేశ్వరరాజు ప్రమాణ స్వీకార సభకు హాజరైన మంత్రులు గొట్టిపాటి రవికుమార్, వి.సవిత, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఆ గేట్లను దగ్గరుండి ప్రారంభించారు. రంగుల పైత్యంతో ప్రజాధనం దుర్వినియోగం చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆరని బ్లో అవుట్ చిచ్చు

తీవ్రత తగ్గినా.. ఉబికి వస్తున్న గ్యాస్

వెల్ క్యాప్‌కు ఓఎన్జీసీ సన్నాహాలు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఇరుసుమండలో కొనసాగుతున్న బ్లో అవుట్ మంటలు

సాక్షి, అమలాపురం/మలికిపురం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం ఇరుసుమండ ఓఎన్జీసీ మోరి బావి నంబరు ఐదులో సంభవించిన బ్లో అవుట్ కొనసాగుతోంది. భూగర్భం నుంచి వచ్చే గ్యాస్ ఒత్తిడి తగ్గడం వల్ల మంటల తీవ్రత మంగళవారం మధ్యాహ్నానికి చాలా వరకూ తగ్గింది. అయితే గ్యాస్ ఒత్తిడి పెరిగినప్పుడు మళ్లీ మంటలు ఎగసిపడుతున్నాయి. దీంతో ఈ బావికి పూర్తి స్థాయిలో వెల్ క్యాపింగ్ (మూసేయడం) చేయడంపై అధికారులు ఒక అంచనాకు రాలేకపోతున్నారు. పన్నెండేళ్ల క్రితం కూడా ఇలాగే డ్రిల్లింగ్ సమయంలో గ్యాస్ ఒత్తిడి నిలకడగా లేక ఇబ్బంది పడిన ఇంజినీర్లు ఈ బావిని అప్పట్లో మూసివేశారు. ఇప్పుడు కూడా నిలకడ లేకుండా గ్యాస్ ఉబికి వస్తుండటంతో వారు తలలు పట్టుకుంటున్నారు.రాజమహేంద్రవరం, నరసాపురం, తూర్పుపాలెం గ్యాస్ కలెక్షన్ స్టేషన్ల (జీసీఎస్) నుంచి విపత్తు నివారణ బృందాలు ఘటన ప్రాంతానికి చేరుకున్నాయి. గ్యాస్, చమురు కలిసి మండుతున్నందున మంటల తీవ్రత, చుట్టూ అలముకున్న వేడిని తగ్గించేందుకు ఫైర్ ఇంజిన్ల ద్వారా నీటిని జల్లుతున్నారు. మంటల తీవ్రతకు బావి వద్ద రిగ్ పడిపోవడంతో పాటు, పైపులూ కరిగిపోయాయి. మంటలు ఇంకా పూర్తిగా అదుపులోకి రాకపోవడంతో అధికారులు, ఇంజినీర్లు దూరం నుంచే పర్యవేక్షిస్తున్నారు. ఈ బావిలో సుమారు 40 వేల మిలియన్ క్యూబిక్ మీటర్ల గ్యాస్ ఉందని భావిస్తున్నారు. భూగర్భంలో పరిస్థితిని అంచనా వేయడంలో ఇంజినీరింగ్ నిపుణులు నిమగ్నమయ్యారు. ఎన్ని మీటర్ల లోతు నుంచి పైప్‌లైన్ దెబ్బ తిందనే దానిపై అంచనా వేస్తున్నారు. ఈలోపు ప్రత్యేక జాకెట్లతో నిపుణులు మంటల్లోనే బావి వద్దకు వెళ్లే అవకాశం ఉంది. బావి వద్ద కరిగిపోయిన ఐరన్ పైపులు, రిగ్ మెటీరియల్ తొలగించి, వెల్‌కు సరిపడే క్యాప్ డిజైన్ చేయాల్సి ఉంది. దీనికి అనుగుణంగా ఘటన స్థలానికి వెల్‌క్యాప్, భారీ క్రేన్‌లను తరలించారు.

ఒకేసారి అదుపు చేయడం వల్ల ఇబ్బందులు

ఒకేసారి మంటలు అదుపు చేయడం వల్ల శాస్త్రీయంగా, పర్యావరణపరంగా ఇబ్బందులు తలెత్తుతాయని, ఈ నేపథ్యంలో క్రమక్రమంగా నాలుగు రోజుల్లో మంటలను అదుపు చేయనున్నట్టు ఓఎన్జీసీ వర్గాలు చెబుతున్నాయి. బోరు బావికి వారం రోజుల్లో క్యాపింగు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్టు పేర్కొంటున్నాయి. మంటలను అదుపు చేసేందుకు ప్రత్యేక నిపుణులతో కూడిన గ్యాస్ లీకేజీ నియంత్రణ బృందాలు రెండు ముంబై నుంచి డ్రిల్లింగ్ ప్రాంతానికి చేరుకున్నాయి.

ప్రైవేట్ కంపెనీలతోనే ముప్పు

ఓఎన్జీసీ పరిధిలోని బావుల డ్రిల్లింగ్‌ను ప్రైవేటు కంపెనీలకు అప్పగించడం వల్లే తరచూ కోనసీమలో బ్లో అవుట్లు చోటుచేసుకుంటున్నాయన్న వాదన వినిపిస్తోంది. ఇరుసుమండ ఓఎన్జీసీ మోరి బావి–5లో జరిగిన ప్రమాదంతో ఈ వాదన తెర మీదకు వచ్చింది. ఇక్కడ డ్రిల్లింగ్ పనులను గుజరాత్‌కు చెందిన డీప్ ఇండస్ట్రీకి ఓఎన్జీసీ అప్పగించింది. ప్రమాదం జరిగే అవకాశముందని పన్నెండేళ్ల క్రితం మూసివేసిన ఈ బావిలో తిరిగి డ్రిల్లింగ్ చేస్తున్న సమయంలో భయపడినట్టుగానే మంటలు ఎగసిపడ్డాయి. గతంలో కాట్రేనికోన మండలం ఉప్పూడిలోనూ కోల్‌కతాకు చెందిన పీఎఫ్‌హెచ్ సంస్థ లీజుకు తీసుకుని డ్రిల్లింగ్ చేస్తున్న బావి వద్దనే బ్లో అవుట్ చెలరేగింది. 48 గంటల పాటు శ్రమిస్తేనే కానీ మంటలను అదుపు చేయలేకపోయారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఓఎన్జీసీ సంస్థ బావుల్లో సుమారు 2,600 మీటర్ల వరకూ డ్రిల్లింగ్ చేసి, ఆ పరిధిలో ఉన్న చమురు, సహజ వాయువులు వెలికితీస్తోంది. ఆ తరువాత వాటిని మూసివేస్తోంది. కొంత కాలం తరువాత వాటిని ప్రైవేట్ కంపెనీలకు లీజుకు ఇస్తోంది. పెద్దగా అనుభవం లేని ఆ సంస్థలు మరింత లోతుగా డ్రిల్లింగ్ చేపడుతున్న సమయంలో సాంకేతిక కారణాల వల్ల బ్లో అవుట్లతో మంటలు రేగుతున్నాయని నిపుణులు చెబుతున్నారు.

బ్లో అవుట్ అదుపు చేసేందుకు చేరుకున్న భారీ క్రేన్

పునరావాస కేంద్రాల్లోనే రెండు గ్రామాల ప్రజలు

మరోవైపు సమీపంలోని రెండు గ్రామాల ప్రజలు చాలా మంది ఇంకా పునరావాస కేంద్రాల్లోనే బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. ఇళ్లకు తాళాలు వేసుకుని వస్తే రాత్రి దొంగలు పడి దోచేశారని ఒకరు, తమ పెంపుడు మేకలను దొంగలు ఎత్తుకుపోయారని మరొకరు చెప్పారు. ప్రాణాలు అరచేతుల్లో పట్టుకుని కట్టుబట్టలతో వస్తే పునరావాస కేంద్రాల్లో అరకొర సౌకర్యాలు ఉన్నాయని ఆవేదన చెందుతున్నారు. బ్లో అవుట్ జరిగిన ప్రాంతాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలోని బృందం పరిశీలించింది. బ్లో అవుట్ జరిగిన తీరును అధికారులను అడిగి తెలుసుకుంది. పునరావాస కేంద్రాలకు వెళ్లి బాధితులను పరామర్శించారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జిన్నూరి రామారావు (బాబీ), పార్టీ నియోజకవర్గాల కో ఆర్డినేటర్లు పినిపే శ్రీకాంత్, గన్నవరపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

12 నుంచి శ్రీశైలంలో మకర సంక్రాంతి బ్రహ్మోత్సవాలు



శ్రీశైలం టెంపుల్: మకర సంక్రమణ పుణ్యకాలాన్ని పురస్కరించుకుని శ్రీశైలంలో ఈ నెల 12 నుంచి 18 వరకు సంక్రాంతి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. పంచాహ్నిక దీక్షతో 7 రోజుల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఈ నెల 12న ఉదయం 9.15గంటలకు స్వామివారి యాగశాల ప్రవేశం, లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు బ్రహ్మోత్సవ సంకల్పాన్ని పఠిస్తారు. చండీశ్వరునికి విశేష పూజలు జరిపిస్తారు. 13 నుంచి స్వామి అమ్మవార్లకు వాహన సేవలు నిర్వహిస్తారు. 15న మకర సంక్రాంతి రోజున బ్రహ్మోత్సవ కల్యాణం జరిపిస్తారు. 17న యాగ పూర్ణాహుతి, 18న పుష్పోత్సవం, శయనోత్సవం, ఏకాంత సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. సంక్రాంతి రోజైన 15న జరిగే బ్రహ్మోత్సవాల్లో కల్యాణానికి చెంచు గిరిజనులను ప్రత్యేకంగా ఆహ్వానించనున్నారు. ఉత్సవాల సందర్భంగా ఈ నెల 12నుంచి 18వరకు ఆర్జిత, ప్రత్యక్ష పరోక్ష సేవలను నిలుపుదల చేశారు.

పొగాకు ఉత్పత్తులపై జీఎస్టీని తగ్గించాలి

ఎఫ్ఏఐఎఫ్ఏ ప్రెసిడెంట్ పీఎస్ మురళీబాబు

కొరిటెపాడు(గుంటూరు): పొగాకు ఉత్పత్తులపై భారీగా పెంచిన జీఎస్టీ రైతులకు శాపంగా మారిందని.. కేంద్రం వెంటనే తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఫెడరేషన్ ఆఫ్ ఆలిండియా ఫార్మర్స్ అసోసియేషన్స్(ఎఫ్ఏఐఎఫ్ఏ) ప్రెసిడెంట్ పీఎస్ మురళీబాబు డిమాండ్ చేశారు. ఎఫ్ఏఐఎఫ్ఏ ఆధ్వర్యంలో ప్రకాశం, నెల్లూరు జిల్లాల రైతు నాయకులు మంగళవారం గుంటూరులో పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.విశ్వశ్రీలను కలిసి వినతిపత్రాలిచ్చారు. ఈ సందర్భంగా మురళీ మాట్లాడుతూ.. పొగాకు ఉత్పత్తులపై జీఎస్టీని భారీగా పెంచడం వల్ల మార్కెట్‌లో వినియోగం తగ్గి.. పరోక్షంగా రైతులకు గిట్టుబాటు ధర లభించదన్నారు. అక్రమంగా భారత్‌లోకి తెస్తున్న విదేశీ సిగరెట్ల వల్ల దేశీయ పొగాకు రంగానికి నష్టం వాటిల్లుతోందని తెలిపారు. వెంటనే వీటిని అరికట్టాలని కోరారు. సమావేశంలో రైతు నాయకులు భాస్కర్ చౌదరి, అబ్బూరి శేషగిరి, మస్తాన్‌రెడ్డిపాల్గొన్నారు.

కాలం చెల్లిన చిక్కీలు.. చాలీచాలని కూరలు

- మంత్రి డోలా వీరాంజనేయులు వద్ద వాపోయిన విద్యార్థినులు
- గుంటూరులోని బాలికల పరివర్తన భవన్‌లో మంత్రి ఆకస్మిక తనిఖీలు

విద్యార్థినులతో సమావేశమైన మంత్రి వీరాంజనేయులు

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్): కాలం చెల్లిన చిక్కీలు, చాలీచాలని కూరలు, సరైన భోజనం కూడా పెట్టడం లేదని గుంటూరు నగరం కలెక్టరేట్ ఎదుట ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ బాలికల(పోస్ట్ మెట్రిక్) హాస్టల్ (పరివర్తన భవన్) విద్యార్థినులు ఆ శాఖ మంత్రి డోలా వీరాంజనేయుకు చెప్పారు. ఇటీవల పరివర్తన భవన్‌లో ఓ విద్యార్థిని బ్యాగ్‌లో మంగళసూత్రం, ప్రెగ్నెన్సీ కిట్, మెట్టెలు దొరకడం.. గతంలో కూడా హాస్టల్‌లో జరిగిన పలు ఘటనల దృష్ట్యా మంత్రి మంగళవారం రాత్రి ఆకస్మిక తనిఖీలు చేశారు. సుమారు గంటన్నరకు పైగా హాస్టల్‌లోనే ఉండి విద్యార్థినులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలు తమకు సౌకర్యాలు సరిగా లేవని, బాత్‌రూంల నిర్వహణ సైతం అధ్వానంగా ఉందని మంత్రికి ఫిర్యాదు చేశారు. దీంతో బాత్‌రూంలు మరమ్మతులు చేయించాలని కలెక్టర్ తమీమ్ అన్సారీయాను మంత్రి ఆదేశించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 1,050 సంక్షేమ హాస్టల్స్‌లో సర్వైలెన్స్ నిమిత్తం సీసీ కెమెరాల ఏర్పాటుకు టెండర్లు పిలిచామని, అలాగే, సంక్షేమ హాస్టల్స్ మరమత్తులకు రూ.203 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. అన్ని హాస్టళ్లలో ఆర్వో ప్లాంట్ల ఏర్పాటుకు పరిపాలన అనుమతులు ఇచ్చామని, రూ.105 కోట్లతో 29 హాస్టల్స్ భవనాల నిర్మాణానికి కేటాయింపులు జరిగాయన్నారు. కాలం చెల్లిన చిక్కీలు సరఫరా చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాగా, విద్యార్థినులతో మంత్రి చర్చించిన అంశాలపై మీడియా ప్రతినిధులు అడిగే ప్రయత్నం చేస్తుండగా పొరుగు సేవల సిబ్బంది మీడియాతో మాట్లాడనీయకుండా అత్యుత్సాహం ప్రదర్శిస్తూ, విద్యార్థినులను డైనింగ్ రూమ్‌కి పంపేయడం గమనార్హం.

నేడు శ్రీవారిని దర్శించుకోనున్న మారిషస్ అధ్యక్షుడు

తిరుమలలో ధరమ్‌బీర్ గోకుల్‌కు స్వాగతం పలుకుతున్న ఏఈవో వెంకయ్యచౌదరి

చంద్రగిరి/గన్నవరం/రేణిగుంట/శ్రీకాళహస్తి: మారిషస్ అధ్యక్షుడు ధరమ్‌బీర్ గోకుల్ మంగళవారం రాత్రి తిరుమల చేరుకున్నారు. తిరుమలలో ఆయనకు టీటీడీ ఏఈవో వెంకయ్య చౌదరి స్వాగతం పలికారు. ధరమ్‌బీర్ బుధవారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు. అంతకుముందు తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయం వద్ద టీటీడీ జేఈవో వీరబ్రహ్మం స్వాగతం పలికారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద మొక్కుకున్న అనంతరం అమ్మవారి మూలమూర్తిని ధరంబీర్ దర్శించుకున్నారు. అలాగే,శ్రీకాళహస్తిలో కొలువై ఉన్న వాయులింగేశ్వరుడిని కూడా దర్శించుకున్నారు. 2 రోజుల తిరుపతి జిల్లా పర్యటనకు వచ్చిన ఆయనకు రేణిగుంట విమానాశ్రయంలో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తదితరులు స్వాగతం పలికారు.అలాగే, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో 3 రోజుల పర్యటనను పూర్తిచేసుకున్న ధరంబీర్‌కు గన్నవరం విమానాశ్రయంలో కృష్ణా జిల్లా అధికార యంత్రాంగం ఘనంగా వీడ్కోలు పలికింది. విమానాశ్రయ రిజర్వ్ లాంజ్‌లో విశ్రాంతి సమయంలో ధరంబీర్‌ను గోవా గవర్నర్ అశోక్‌గజపతిరాజు కలిశారు.

మహిళపై టీడీపీ నేత దుర్మార్గం

సాక్షి టాస్క్‌ఫోర్స్: ఓ కుటుంబ వివాదంలో తలదూర్చిన టీడీపీ నాయకుడు మహిళను కులం నుంచి వెలివేయడంతో పాటు ఆమెతో ఎవరైనా మాట్లాడినా.. నిత్యావసర సరుకుల్ని అమ్మినా రూ.10 వేలు జరిమానా చెల్లించాలని హుకుం జారీ చేసిన అమానవీయ ఘటన ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం వింజరం గ్రామంలో మంగళవారం వెలుగుచూసింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. వింజరం గ్రామానికి చెందిన చెమడబోయిన మంగమ్మ (55) గొర్రెల్ని మేపుకుంటూ జీవనం సాగిస్తోంది. గొర్రెల విషయంలో మంగమ్మకు, ఆమె తల్లిదండ్రులకు మధ్య వివాదం తలెత్తింది. అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కరేటి అప్పారావు జోక్యం చేసుకుని.. తానే గ్రామ పెద్దనని, తాను చెప్పినట్టు వినాలని ఆదేశించినట్టు తెలిపింది. తమ కుటుంబ గొడవ గురించి నీకెందుకని అతడిని అడిగినందుకు డిసెంబర్ 2న రోడ్డుపైనే తనను అసభ్య పదజాలంతో దూషించి దాడి చేశాడని ఆవేదన వ్యక్తం చేసింది. అంతేగాక అప్పారావు చెప్పినట్టు విననందుకు కులం నుంచి బహిష్కరిస్తున్నట్టు ప్రకటించి.. తనకు నిత్యావసర సరుకులు అమ్మకూడదని హుకుం జారీ చేశాడని వాపోయింది. ఎవరైనా ఈ ఆదేశాలను అతిక్రమిస్తే రూ.10 వేలు జరిమానా చెల్లించాల్సి ఉంటుందని బెదిరించినట్టు తెలిపింది. ఈ విషయమై అదేరోజు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే పోలీసులు విచారణ చేస్తున్నామంటూ కాలయాపన చేశారని.. చివరకు డిసెంబర్ 27న సివిల్ కేసు అంటూ రసీదు ఇచ్చారని కన్నీటి పర్యంతమైంది. తనకు మద్దతుగా మాట్లాడినందుకు తన కుమార్తె లావణ్య కుటుంబాన్ని కూడా వెలివేశారని ఆవేదన వెలిబుచ్చింది. ఈ విషయమై అధికారులు తనకు న్యాయం చేయాలని వేడుకుంటోంది.

మోడల్ స్కూల్‌లో కులవివక్ష!

దళిత విద్యార్థులతో కలిసి తమ పిల్లలు చదువుకునేందుకు కొందరు తల్లిదండ్రుల నిరాకరణ

- చిత్తూరు జిల్లా పనపాకంపేట మోడల్ స్కూల్ నుంచి 20 మందిని పాత పాఠశాలకు తీసుకెళ్లిన వైనం
- టీడీపీ నేతల ఒత్తిడితో ఆ పాఠశాలకు మోడల్ స్కూల్ నుంచి ఇద్దరు టీచర్లు..
- మూసివేసిన పాఠశాలలోనే అనధికారికంగా విద్యాబోధన
- మోడల్ స్కూల్‌లో మిగిలిన ఒకే ఉపాధ్యాయుడు
- తమ పిల్లలకు అన్యాయం జరుగుతోందని మోడల్ స్కూల్ వద్ద విద్యార్థుల తల్లిదండ్రుల నిరసన

పనపాకంపేట మోడల్ స్కూల్ వద్ద విద్యార్థులతో కలిసి ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు

చంద్రగిరి: సీఎం చంద్రబాబు సొంత జిల్లా అయిన చిత్తూరు జిల్లా చంద్రగిరి మండలం పనపాకంపేట మోడల్ స్కూల్‌లో కుల వివక్ష చోటుచేసుకుంది. తమ పిల్లలను దళిత విద్యార్థులతో కలిసి చదివించేందుకు తల్లిదండ్రులు నిరాకరించారు. టీడీపీ నాయకుల ద్వారా ఒత్తిడి తీసుకొచ్చి మోడల్ స్కూల్ నుంచి ఇద్దరు ఉపాధ్యాయులను కేటాయించి అనధికారికంగా పాత పాఠశాలలోనే తమ పిల్లలకు చదువు చెప్పిస్తున్నారు. అయితే, మోడల్ స్కూల్‌లో సరిపడా ఉపాధ్యాయులు లేకపోవడంతో తమ పిల్లలకు అన్యాయం జరుగుతోందని అక్కడ చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు మంగళవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా పలువురు తల్లిదండ్రులు మాట్లాడుతూ... చంద్రబాబు ప్రభుత్వం వచ్చిన తర్వాత చంద్రగిరి మండలంలోని పనపాకం పంచాయతీలో ఉన్న అరిగెలవారిపల్లి, ఇరివిశెట్టివారిపల్లి, తూర్పుపల్లి ప్రాథమిక పాఠశాలలను పనపాకంపేట ప్రాథమిక పాఠశాలలో విలీనం చేసి మోడల్ స్కూల్‌గా ఏర్పాటుచేశారని చెప్పారు. ఇక్కడ సుమారు 65 మంది విద్యార్థులకు నలుగురు ఉపాధ్యాయులను విద్యాశాఖ అధికారులు నియమించారని తెలిపారు. నెలరోజులపాటు పాఠశాల సవ్యంగా సాగిందన్నారు. ఆ తర్వాత పనపాకంపేట మోడల్ స్కూల్‌లో ఆ గ్రామ దళిత విద్యార్థులు ఉన్నారని, వారితో కలిసి చదువుకునేందుకు తమ పిల్లలను పంపించబోమని అరిగెలవారిపల్లికి చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు చెప్పారని పేర్కొన్నారు. వారి పిల్లలను మోడల్ స్కూల్‌కు పంపకుండా నిలిపేశారని వివరించారు. ఆపై టీడీపీ నాయకులు జోక్యం చేసుకుని అనధికారికంగా అరిగెలవారిపల్లిలోని పాత పాఠశాలలోనే వారి పిల్లలను తిరిగి చేర్పించారని తెలిపారు. అనధికారికంగా నిర్వహిస్తున్న అరిగెలవారిపల్లిలోని పాత పాఠశాలకు విద్యాశాఖ అధికారులు సైతం మోడల్ స్కూల్ నుంచి ఇద్దరు ఉపాధ్యాయులను కేటాయించారని పేర్కొన్నారు.

త్వరలో సమస్య పరిష్కరిస్తాం: ఎంఈవో

ఈ విషయంపై ఎంఈవో లలిత కుమారిని 'సాక్షి' వివరణ కోరగా... అరిగెలవారిపల్లి నుంచి విద్యార్థులు రావడానికి ఇబ్బందులు ఉన్నట్లు తెలిపారని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆ ఊరిలోనే పాఠశాల కొనసాగిస్తున్నట్లు చెప్పారు. తల్లిదండ్రుల ఆందోళనల గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని ఆమె వివరించారు.

మా పిల్లల చదువులు అటకెక్కాయి

పనపాకంపేట మోడల్ స్కూల్‌లో 45 మంది విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులు మిగిలారని తల్లిదండ్రులు తెలిపారు. వారిలో ఒక ఉపాధ్యాయుడు పది రోజుల కిందట డిప్యూటేషన్‌పై మరో పాఠశాలకు వెళ్లడంతో తమ పిల్లల చదువులు అటకెక్కాయని ఆవేదన వ్యక్తంచేశారు. నాలుగు తరగతులకు ఒకే ఉపాధ్యాయుడు ఉండటంతో పిల్లలు ఇబ్బందిపడుతున్నారని తెలిపారు. టీడీపీ నాయకులు చెప్పినట్లు విద్యాశాఖ అధికారులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అనధికారికంగా నిర్వహిస్తున్న అరిగెలవారిపల్లి పాఠశాలలో 20 మంది పిల్లలు ఉన్నారని, అక్కడ ఇద్దరు ఉపాధ్యాయులను నియమించి, ఇక్కడ మాత్రం 45 మంది విద్యార్థులకు ఒకే ఒక్కరిని నియమించడం ఏమిటని ప్రశ్నించారు. దళిత విద్యార్థులంటే అధికారులకు చిన్నచూపా... అంటూ మండిపడ్డారు. మూడు గ్రామాలకు చెందిన విద్యార్థుల భవిష్యత్తును విస్మరించి, అరిగెలవారిపల్లి టీడీపీ నాయకులు చెప్పినట్లు అధికారులు నడుచుకుంటున్నారంటూ మండిపడ్డారు. కేవలం దళితులు ఉన్న పాఠశాల కావడంవల్లే అధికార పార్టీ నేతలు వివక్షతోనే మోడల్ పాఠశాలలో ఉపాధ్యాయులు లేకుండా చేసి ఇబ్బంది పెడుతున్నారని ఆరోపిస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము జిల్లా కలెక్టర్ వారి కార్యాలయము

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

ఆర్.సి.జి 1/310/2022 తేది : 05.01.2026

ఫారం–VII

(2013 వ సంవత్సరము 30 వ చట్టం వలన భూసేకరణ పునరావాసము, పునస్థాపనలతో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టములో సెక్షన్ 19(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014 లో రూల్ 25 సబ్ రూలు (1) ననుసరించి)

రూఢీ ప్రకటన

ఈ క్రింది నిర్దిష్టపరచిన షెడ్యూల్ ధాఖలా భూములను విస్తీర్ణము ఎ.1.45 సెంట్లు ప్రజా ప్రయోజనమునకై అనగా శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, పొదలకూరు మండలం, విరువూరు గ్రామం నందు ప్రజారోగ్య సాంకేతిక శాఖ వారు మహమ్మదాపురం నుండి నెల్లూరు కు పోయే పైపు లైను కొరకు భూమి కావలెనని ప్రతిపాదించినందున మరియు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున, శ్రీయుత జిల్లా కలెక్టర్, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వారు భావించినందున, 2013వ సంవత్సరం 30 వ చట్టంలో 15వ విభాగంను అనుసరించి సంభంధిత వ్యక్తుల నుండి వచ్చిన అభ్యంతరముల విచారణ జరిపిన పిమ్మట శ్రీయుత జిల్లా కలెక్టర్, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వారు సంతృప్తి చెంది ఈ దిగువ షెడ్యూలు దాఖలా భూమి ప్రజా ప్రయోజనముల నిమిత్తం భూసేకరణ గావించుటకు నిర్ణయించినారు మరియు భూసేకరణ కోరిన సంస్థ వారు అవసరమగు బడ్జెట్ నిధులను సమకూర్చినారు. ఈ క్రింద రూఢీ ప్రకటన 2013వ సంవత్సరం 30 వ చట్టంలోని 19(1) విభాగంను అనుసరించి చేయబడినది.

రూఢీ ప్రకటన

శ్రీయుత జిల్లా కలెక్టరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వారు 2013 సంవత్సరం 30 వ చట్టంలోని 19(1) విభాగం ననుసరించి ఈ దిగువనుదహరించిన షెడ్యూల్ దాఖలు భూమి ఎ.1.45 సెంట్లు ప్రజాప్రయోజనములకై అనగా పైపు లైను కొరకు భూమి అవసరమైనదని ఇందుమూలముగా ప్రకటన చేసియున్నారు.

షెడ్యూల్

జిల్లా : శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా మండలము : పొదలకూరు గ్రామము : విరువూరు

క్రమ సంఖ్య	సర్వే నెం./సబ్ డివిజన్ నెం.	మొత్తం విస్తీర్ణం	భూమి రకం	సేకరించవలసిన విస్తీర్ణం (ఎకరాలు)	సంబంధిత ఆసామి పేరు మరియు పట్టదారు చిరునామా (పట్టాదారు/ అనుభవదారు)	సరిహద్దులు				చెట్లు, కట్టడాలు మరియు ఇతర వివరములు
						ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	
1	2	3	4	5	6	7	8	9	10	11
1.	30-1A	2.72	పట్టా (మాగాణి)	0.09	ఐచ్చల సురేశ్ కుమార్ రెడ్డి తండ్రి శ్రీనివాసులు రెడ్డి	ప్రభుత్వ భూమి	ఐచ్చల సురేశ్ కుమార్ రెడ్డి	శ్రీనివాసులు రెడ్డి	ప్రభుత్వ భూమి	వరి పైరు
2.	30-2B	0.50	పట్టా (మాగాణి)	0.03	పంచాయతీ స్థలం	ప్రభుత్వ భూమి	పంచాయతీ స్థలం	ఐచ్చల సురేశ్ కుమార్ రెడ్డి	ప్రభుత్వ భూమి	వరి పైరు
3.	31-1	1.87	పట్టా (మాగాణి)	0.13	శ్రీ రామమందిరం	ప్రభుత్వ భూమి	గౌరపు శ్రీనివాసులు	వయ్యల రావమ్మ	ఐచ్చల సురేశ్ కుమార్ రెడ్డి	వరి పైరు
4.	32-1A	0.73	పట్టా (మాగాణి)	0.05	వయ్యల రావమ్మ భర్త శేషయ్య	ప్రభుత్వ భూమి	వయ్యల రావమ్మ	వయ్యల రావమ్మ	గౌరపు శ్రీనివాసులు	వరి పైరు
5.	32-2A	0.75	పట్టా (మాగాణి)	0.04	వయ్యల రావమ్మ భర్త శేషయ్య	ప్రభుత్వ భూమి	వయ్యల రావమ్మ	వయ్యల రావమ్మ	వయ్యల రావమ్మ	వరి పైరు
6.	32-3A	0.39	పట్టా (మాగాణి)	0.02	వయ్యల రావమ్మ భర్త శేషయ్య	ప్రభుత్వ భూమి	వయ్యల రావమ్మ	వయ్యల రావమ్మ	వయ్యల రావమ్మ	వరి పైరు
7.	32-4A	0.64	పట్టా (మాగాణి)	0.04	వయ్యల రావమ్మ భర్త శేషయ్య	ప్రభుత్వ భూమి	వయ్యల రావమ్మ	వయ్యల రావమ్మ	వయ్యల రావమ్మ	వరి పైరు
8.	32-5A	0.60	పట్టా (మాగాణి)	0.04	నూతి శ్రీనివాసులు తండ్రి పెంచలయ్య	ప్రభుత్వ భూమి	నూతి పెంచలయ్య	నూతి శ్రీనివాసులు	వయ్యల రావమ్మ	వరి పైరు
9.	33-1A	2.87	పట్టా (మాగాణి)	0.09	నూతి శ్రీనివాసులు తండ్రి పెంచలయ్య	ప్రభుత్వ భూమి	నూతి శ్రీనివాసులు	ఐచ్చల సుమేధ	నూతి కృష్ణయ్య	వరి పైరు, బోరు-1, షెడు-1
10.	33-2A	1.05	పట్టా (మాగాణి)	0.11	నూతి చిన పెంచలయ్య తండ్రి పెంచలయ్య	ప్రభుత్వ భూమి	నూతి కృష్ణయ్య	నూతి శ్రీనివాసులు	నూతి చిన పెంచలయ్య	వరి పైరు
11.	33-2A		పట్టా (మాగాణి)	0.06	నూతి శ్రీనివాసులు తండ్రి పెంచలయ్య	ప్రభుత్వ భూమి	నూతి కృష్ణయ్య	నూతి శ్రీనివాసులు	నూతి చిన పెంచలయ్య	వరి పైరు
12.	34-1	1.46	పట్టా (మాగాణి)	0.14	ఐచ్చల సుమేధా భర్త సురేశ్ కుమార్ రెడ్డి	ప్రభుత్వ భూమి	ఐచ్చల సుమేధ	డొంక	నూతి శ్రీనివాసులు	వరి పైరు, బోరు-1, షెడు-1, టేకుచెట్లు-1
13.	36-2A	0.66	పట్టా (మాగాణి)	0.07	చిర్రా గీర్వాణి కుమారి అలియాస్ నిర్మలా భర్త రామచంద్రా రెడ్డి	డొంక	చిర్రా గీర్వాణి	చిర్రా గీర్వాణి	డొంక	వరి పైరు
14.	37-2	1.60	పట్టా (మాగాణి)	0.34	చిర్రా గీర్వాణి కుమారి అలియాస్ నిర్మలా భర్త రామచంద్రా రెడ్డి	ప్రభుత్వ భూమి	చిర్రా గీర్వాణి	చిర్రా పెంచల రెడ్డి	చిర్రా పెంచల రెడ్డి	వరి పైరు , బోరు-1, షెడు-1
15.	38-1	8.05	పట్టా (మాగాణి)	0.20	చిర్రా పెంచల రెడ్డి తండ్రి విజయ నరసింహా రెడ్డి	చిర్రా పెంచల రెడ్డి	రోడ్డు	కాలనీ	చిర్రా రామచంద్ర రెడ్డి	వరి పైరు
మొత్తము		23.89		1.45						

ఈ భూమి ప్లాను శ్రీ రెవిన్యూ డివిజనల్ అధికారి, నెల్లూరు వారి కార్యాలయంలో ఉంచుటమైనది. దానిని ఈ కార్యాలయపు పనివేళలలో ఏ సమయంలోనైనా తనఖీ చేసుకొనవచ్చును. బొగ్గుగనులు, ఇనుపరాయి, పలకరాయి లేదా ఇతర ఖనిజ సంపద సదరు భూమిలో గానీ లేదా ఒక ప్రత్యేక భాగములో గానీ ఉంటే అటువంటి భూములలో ప్రాజెక్టు నిర్మాణమునకు అవసరమైన భూభాగమును మాత్రమే త్రవ్వుట గానీ తొలగించుటగాని చేయవలెను.

సం/- హిమాన్షు శుక్లా, IAS., జిల్లా కలెక్టరు మరియు మేజిస్ట్రేట్, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు.

ట్రంప్ మలి గురి... గ్రీన్‌లాండ్?

ఆ దిశగా స్పష్టమైన సంకేతాలు

- '20 రోజుల్లో..'అంటూ వ్యాఖ్యలు
- భౌగోళికంగా, సైనికంగా కీలకం
- ఖనిజ, చమురు నిక్షేపాలు అపారం



నయా సామ్రాజ్యవాది అవతారమెత్తిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తదుపరి లక్ష్యం గ్రీన్‌లాండేనా? ఆయన వ్యాఖ్యలు, దూకుడు, సహచర గణం ప్రకటనలు చూస్తుంటే అవుననే అనిపిస్తోంది. వెనెజువెలా అధ్యక్షుడు నికొలస్ మదురోను అర్ధరాత్రి వేళ సొంత నివాసం నుంచి నిర్బంధించి తీసుకొచ్చిన ట్రంప్ తెంపరితనం ప్రపంచాన్ని విస్మయానికి లోనుచేయడం తెలిసిందే. తానక్కడితో ఆగేది లేదని, దారికి తేవాల్సిన దేశాలు ఇంకొన్ని ఉన్నాయని ఓ జాబితానే చదివారు ట్రంప్. వాటిలో కొలంబియా, క్యూబాతో పాటు మెక్సికో వంటివాటిని చేర్చడమే గాక, 'అవసరమైతే వాటిపై ఏ క్షణమైనా విరుచుకుపడతాం'అంటూ హెచ్చరికలు కూడా జారీ చేశారు. అయితే వీటన్నింటి కంటే ముందు ట్రంప్ తదుపరి లక్ష్యం డెన్మార్క్ అధీనంలోని గ్రీన్‌లాండ్ కానుందన్నది విశ్లేషకుల అంచనా. ఆదివారం మీడియాతో ట్రంప్ మాటతీరు కూడా దాన్ని బలపరిచేవిగానే ఉంది. ''ఒక 20 రోజులాగండి, గ్రీన్‌లాండ్ గురించి మనమంతా మాట్లాడుకుందాం''అంటూ నర్మగర్భ వ్యాఖ్యలు చేశారాయన. అంతేకాదు, ''గ్రీన్‌లాండ్ మాక్కావాల్సిందే. అమెరికా భద్రత దృష్ట్యా ఇది అత్యంత కీలకం. ఈ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదు. ఒకట్రెండు నెలల్లో దీనిపై గట్టిగానే దృష్టి సారిస్తాం''అంటూ కుండబద్దలు కొట్టారు కూడా. నిజానికి ట్రంప్ తొలిసారి అధ్యక్షుడిగా ఉండగానే 2019లోనే గ్రీన్‌లాండ్‌ను కొనుగోలు చేస్తామంటూ డెన్మార్క్‌కు ప్రతిపాదించారు. కానీ అక్కడి ప్రభుత్వం నిర్ద్వంద్వంగా తిరస్కరించింది. ఇక రెండోసారి అధ్యక్షుడు అయినప్పటినుంచీ గ్రీన్‌లాండ్ ఆక్రమణ కాంక్షను ఆయన ఎప్పుడూ దాచుకోలేదు. ఇటీవల పలుమార్లు మీడియాముఖంగానే తన మనోగతాన్ని స్పష్టం చేస్తూ వచ్చారు. గ్రీన్‌లాండ్ స్వాధీనానికి అవసరమైతే సైనిక చర్యకు కూడా వెనకాడబోమని కూడా ప్రకటించారు! అంతేకాదు, గ్రీన్‌లాండ్‌ను అమెరికాలో కలిపేసుకోవాలని తీవ్రంగా వాదించే లూసియానా గవర్నర్ జెఫ్ లాండ్రీని ఏరికోరి ఆ ప్రాంతానికి ప్రత్యేక రాయబారిగా పంపారు కూడా!

ఎందుకంత ఆసక్తి?

గ్రీన్‌లాండ్‌పై ట్రంప్ ఆసక్తి వెనక బోలెడన్ని కారణాలున్నాయి. యూరప్, ఉత్తర అమెరికా ఖండాలకు అది సరిగ్గా మధ్యలో ఉంటుంది. దాంతో అమెరికా సైన్యానికి వ్యూహాత్మకంగా ఈ ప్రాంతం చాలా కీలకం. అంతేగాక ఖండాంతర క్షిపణుల ముందస్తు హెచ్చరికల వ్యవస్థ ఏర్పాటుకు కూడా ఇది అత్యంత అనువైనది. వాయవ్య గ్రీన్‌లాండ్‌లోని పిటుఫిక్‌లో అమెరికాకు ఇప్పటికే సైనిక స్థావరముంది. ఇక్కడి నుంచి రష్యా నావికా దళ కదలికలపై అమెరికా అనునిత్యం స్పష్టంగా కన్నేసి ఉంచవచ్చు కూడా.

అపార ఖనిజ నిల్వలు

గ్రీన్‌లాండ్ అపారమైన ఖనిజ, చమురు, సహజవాయు నిల్వలకు ఆలవాలం. అత్యంత అరుదైనవిగా ప్రకటించిన 34 ఖనిజాల్లో గ్రాఫైట్, లిథియం వంటి ఏకంగా 25 ఖనిజాలు గ్రీన్‌లాండ్‌లో అపారంగా ఉన్నట్టు తేలింది. విద్యుత్ వాహనాల తయారీలో ఇవి చాలా కీలకమన్నది తెలిసిందే. అమెరికా ఈ ఖనిజాల కోసం చాలాకాలంగా చైనాపై ఆధారపడాల్సి వస్తోంది. చైనాపై విధించిన భారీ టారిఫ్‌లను కూడా అంతే వేగంగా ట్రంప్ వెనక్కు తీసుకోవడానికి ఈ ఖనిజాల ఎగుమతిపై డ్రాగన్ నిషేధం విధించడమే ప్రధాన కారణం. గ్రీన్‌లాండ్ తమకు చిక్కితే ఇకపై ఆ ఖనిజాల కోసం చైనాను బెదిరించే దురవస్థ ఉండదన్నది ట్రంప్ యోచన. ఇక గ్రీన్‌లాండ్‌లో చమురు, సహజ వాయు నిల్వలు కూడా అపారంగా ఉన్నా, పర్యావరణ కారణాల రీత్యా వాటి వెలికితీతపై నిషేధం కొనసాగుతోంది. ఆ ప్రాంతాన్ని ఆక్రమించి వాటిని కూడా సొంతం చేసుకోవాలన్నది ట్రంప్ వ్యూహం.

అతి పెద్ద ద్వీపం

గ్రీన్‌లాండ్. ప్రపంచంలోనే అతి పెద్ద దీవి. 1953లో డెన్మార్క్‌లో భాగంగా మారింది. అయితే 2009లో దానికి విస్తృత స్వయంపాలిత ప్రతిపత్తి దక్కింది. దాని ప్రకారం గ్రీన్‌లాండ్‌వాసులు రిఫరెండం ద్వారా పూర్తి స్వాతంత్ర్యం పొందవచ్చు కూడా. కాకపోతే అదిప్పటికీ డెన్మార్క్ నియంత్రణలోనే ఉంది. ఇంతా చేస్తే గ్రీన్‌లాండ్ జనాభా కేవలం 57 వేలు!

- సాక్షి, నేషనల్ డెస్క్

నాటో భవితవ్యమేమిటో?!

గ్రీన్‌లాండ్ విషయమై అమెరికా, డెన్మార్క్ మధ్య మొదలైన రగడ నాటో కూటమి అస్తిత్వంపైనే ప్రశ్నలు లేవనెత్తుతోంది. అత్యంత శక్తిమంతమైన నాటో కూటమిలో అవి రెండూ సభ్య దేశాలేనన్నది తెలిసిందే. కూటమిలోని ఏ దేశంపై దాడి జరిగినా అది అందులోని దేశాలన్నిటిపైనా దాడిగానే పరిగణించి అంతా కలసికట్టుగా ఎదుర్కోవాలన్నది నాటో ఒప్పందం. అలాంటప్పుడు అమెరికా ఏకంగా తోటి సభ్య దేశంపైనే దాడికి దిగితే అది కూటమి మూల, వ్యవస్థాపక సూత్రాలకే విరుద్ధమవుతుంది. అందుకే, అమెరికా దాడి నాటోకు అంతమేనన్న డెన్మార్క్ ప్రధాని హెచ్చరికల నేపథ్యంలో నాటోలోని యూరప్ దేశాలు వెంటనే స్పందించాయి. ''ఆర్కిటిక్ ప్రాంతమంతా యూరప్ ప్రయోజనాలకు అతి కీలకం. అందుకే అక్కడ మా దేశాల ఉనికి, కార్యకలాపాలతో పాటు పెట్టుబడులను కూడా నానాటికీ విస్తరిస్తూ వస్తున్నాం. దాన్ని సురక్షితంగా ఉంచడానికే మా ప్రాధాన్యం. డెన్మార్క్‌తో పాటు గ్రీన్‌లాండ్ కూడా నాటోలో భాగమే''అంటూ సంయుక్త ప్రకటన విడుదల చేశాయి.

అమెరికాయే కీలకం

నాటో కూటమిలో అమెరికాయే కీలకంగా వ్యవహరిస్తూ వస్తోంది. కూటమి రక్షణ బడ్జెట్లో 17 శాతం వాటా ఆ దేశానిదే. కనుకనే గ్రీన్‌లాండ్ రక్షణ, సంరక్షణ కూడా తమ బాధ్యతే కావాలన్నది ట్రంప్ సలహాదారు స్టీఫెన్ వాదన.

డెన్మార్క్ ప్రధాని మెటె ఫ్రెడెరిక్సన్

డొనాల్డ్ ట్రంప్

కలలు కనకండి!: డెన్మార్క్ ప్రధాని

ట్రంప్ వ్యాఖ్యలపై ఆగ్రహం ● ఆక్రమిస్తే నాటో విచ్ఛిన్నమేనని వ్యాఖ్య

గ్రీన్‌లాండ్ అమెరికాకు కావాలన్న ట్రంప్ వ్యాఖ్యలపై డెన్మార్క్ ప్రధాని మెటె ఫ్రెడెరిక్సన్ తీవ్రంగా స్పందించారు. గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకుంటామని కలలు కనొద్దని అమెరికాకు హితవు పలికారు. అమెరికాలో కలిసే సమస్యే లేదని గ్రీన్‌లాండ్‌వాసులు ఇప్పటికే పలుమార్లు స్పష్టం చేశారని ఆమె గుర్తు చేశారు. ''ట్రంప్ వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకోవాల్సి వస్తోంది. కానీ ఒక్క విషయం మాత్రం స్పష్టం చేస్తున్నా. ఈ విషయమై మాపై ఇంకెంతమాత్రమూ ఒత్తిడి తేవద్దు. కావాలంటే చర్చలకు సిద్ధం. కానీ అవి సరైన మార్గంలో, సజావుగా, అంతర్జాతీయ చట్టాలను గౌరవిస్తూ జరగాలి''అంటూ కుండబద్దలు కొట్టారు. ''సహచర నాటో దేశంపై దాడికి దిగుతారా? అలాగైతే తీవ్ర పరిణామాలుంటాయి. నాటో కూటమి విచ్ఛిన్నమవుతుంది''అంటూ తీవ్రంగా హెచ్చరించారు.

మీదేనని రుజువేది?

ట్రంప్ సలహాదారు సూటి ప్రశ్న

డెన్మార్క్ ప్రధాని వ్యాఖ్యలపై అమెరికా వెంటనే స్పందించింది. అసలు గ్రీన్‌లాండ్ డెన్మార్క్‌దే అనేందుకు ఆధారాలు ఏమున్నాయంటూ ట్రంప్ సలహాదారు స్టీఫెన్ మిల్లర్ కీలక ప్రశ్న లేవనెత్తారు. గ్రీన్‌లాండ్‌ను అమెరికా స్వాధీనం చేసుకుంటే నాటో కూటమితో పాటు మొత్తం ఆర్కిటిక్ ప్రయోజనాలన్నింటినీ కాపాడేందుకు వీలవుతుందని చెప్పుకున్నారు! మిల్లర్ భార్య ఇటీవల అమెరికా పతాకం రంగుల్లో ఉన్న గ్రీన్‌లాండ్ ఫొటోను సోషల్ మీడియాలో పోస్టు చేసి కలకలం రేపారు. అంతేగాక, 'త్వరలో...'అంటూ నర్మగర్భ వ్యాఖ్యను కూడా జోడించారు!

ట్రంప్ 'హిట్ లిస్ట్'

కొలంబియా

ట్రంప్ తరచూ పేర్కొనే 'డ్రగ్స్ ధూర్త'దేశాల్లో ఇదొకటి. వెనెజువెలా రాజధాని కరాకాస్‌పై అమెరికా దాడి చేసిన కొద్ది గంటల్లోనే కొలంబియాకు కూడా ఆయన అల్టిమేటం జారీ చేశారు. ఈ బెదిరింపుల వెనక ఉన్నది కూడా 'చమురు'ఆకాంక్షలేనన్నది పరిశీలకుల అంచనా. ఎందుకంటే వెనెజువెలాకు పశ్చిమాన ఉండే కొలంబియా కూడా భారీ చమురు నిక్షేపాలకు ఆలవాలమే. పైగా వెనెజువెలా మాదిరిగానే అది కూడా నిత్యం కల్లోలంగా ఉండే దేశమే. ట్రంప్ నిజంగా దాడికే నిర్ణయించుకుంటే ఇది ఆయన పనిని సులభతరం చేసే అంశమే. ట్రంప్ పదేపదే మొత్తుకుంటున్న డ్రగ్స్ భూతం నిజంగానే కొలంబియాలో విశ్వరూపం దాల్చింది. మొత్తం లాటిన్ అమెరికాలోనే డ్రగ్స్ వ్యాపారానికి కేంద్రబిందువు ఆ దేశమే! ముఖ్యంగా కొకైన్ అక్కడ ఏరులా పారుతుంటుంది. ఈ డ్రగ్స్‌ను కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో విచ్చలవిడిగా అమెరికాలోకి గుమ్మరిస్తున్నారన్నది ట్రంప్ ప్రధాన అభియోగం. ఈ కారణంగానే ఆయనపై గత అక్టోబర్లో ట్రంప్ భారీ ఆంక్షలు కూడా విధించారు. ''కొలంబియాను ఓ శాడిస్టు పాలిస్తున్నాడు. అతని హయాం ఇంకెంత కాలమో సాగబోదు''అని ఆదివారం ఆయన మీడియా సాక్షిగా ప్రకటించారు. దీన్నిబట్టి చూస్తుంటే కొలంబియాలో ఉన్నట్టుండి అమెరికా బలగాలో, ప్రత్యేక దళాలో దిగినా ఆశ్చర్యం లేదన్నది పరిశీలకుల అంచనా!

ఇరాన్

ప్రస్తుతం భారీ ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలతో అట్టుడుకుతున్న దేశమిది. ఇటీవల ఇజ్రాయెల్‌తో ఇరాన్ '12 రోజుల'ఘర్షణల సందర్భంగా అమెరికా కూడా ఆ దేశంపై క్షిపణుల వర్షం కురిపించడం తెలిసిందే. ముఖ్యంగా అక్కడి అణు స్థావరాలు, మౌలిక సదుపాయాలను తుత్తునియలు చేసింది. తాజా ఆందోళనలను కూడా మరోసారి తనకు అనువుగా ఉపయోగించుకునే దిశగా ట్రంప్ పావులు కదుపుతున్నారు. ఆందోళనకారులను పొట్టన పెట్టుకుంటే సహించేది లేదని, భారీ స్థాయిలో దాడులు చేస్తామని ఇరాన్‌ను బెదిరించారాయన. ''ఇరాన్ గతంలోలా తన సొంత ప్రజలను పొట్టన పెట్టుకుంటామంటే ఊరుకోబోం. పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నాం''అని కూడా చెప్పుకొచ్చారు. గత వారం ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో ఫ్లోరిడాలో ట్రంప్ జరిపిన సుదీర్ఘ భేటీలో ప్రధాన చర్చనీయాంశం ఇరానే అని కూడా చెబుతున్నారు! త్వరలో ఇరాన్‌పై ఇజ్రాయెల్ భారీ ఎత్తున దాడులకు దిగేలా ఆ భేటీలో పథక రచన కూడా జరిగిందని అంటున్నారు! అదే నిజమైతే సందట్లో సడేమియా మాదిరిగా ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతుండగానే అమెరికా కూడా మరోసారి ఇరాన్‌పై పెద్దపెట్టున విరుచుకుపడే అవకాశాలు లేకపోలేదు.

మెక్సికో

ట్రంప్ తొలినుంచీ ద్వేషిస్తూ వస్తున్న దేశం. 2016లో తొలిసారి అధ్యక్ష బరిలో దిగినప్పుడు ఆయన ప్రధాన నినాదం, ఎజెండా కూడా దక్షిణాన మెక్సికోతో సరిహద్దు పొడవునా గోడ కడతాననే! గతేడాది రెండోసారి అధికార పగ్గాలు చేపట్టగానే ట్రంప్ చేసిన తొలి సంతకం గల్ఫ్ ఆఫ్ మెక్సికో పేరును గల్ఫ్ ఆఫ్ అమెరికాగా మార్చిన ఫైలు మీదే! ఆ దేశమంటే ఆయనకు ఆ స్థాయిలో విద్వేషం!! డ్రగ్స్‌తో పాటు అక్రమ వలసదారులు కూడా మెక్సికో నుంచి అమెరికాలోకి విచ్చలవిడిగా పోటెత్తుతున్నారన్నది ట్రంప్ ప్రధాన అభియోగం. దీని కట్టడికి ఆ దేశం ఉద్దేశపూర్వకంగానే గట్టి చర్యలు తీసుకోవడం లేదని ఆయన ఆరోపిస్తూ వస్తున్నారు. ''మెక్సికోలోని డ్రగ్ కార్టెల్స్ చాలా శక్తిమంతమైనవి. వాటి కట్టడికి ఇక అమెరికానే ఏదో ఒకటి చేయాలి''అని ఆదివారం మీడియా భేటీలోనే ట్రంప్ కుండబద్దలు కొట్టారు. 'వాటిపై పోరుకు అమెరికా సైన్యాన్ని పంపుతానంటే మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షేన్‌బామ్ తిరస్కరించారు'అంటూ అసహనం కూడా వెలిబుచ్చారు.

క్యూబా

అమెరికాకు కూతవేటు దూరంలో ఉండే ఈ బుల్లి కమ్యూనిస్టు దేశం దశాబ్దాలుగా దానికి కంట్లో నలుసుగా మారింది. ఫలితంగా 1960ల నుంచీ అమెరికా నుంచి భారీ ఆంక్షలను ఎదుర్కొంటోంది. వెనెజువెలాతో క్యూబాకు అత్యంత సన్నిహిత బంధముంది. వెనెజువెలా ఇప్పుడు అమెరికా చేతుల్లోకి వెళ్లిన నేపథ్యంలో అక్కడి నుంచి క్యూబాకు చమురు సరఫరా నిలిచిపోయినట్టే. ఇది ఆ బుల్లి దేశపు ఆర్థిక పరిస్థితిని అతలాకుతలం చేసేలా కన్పిస్తోంది. బహుశా అందుకేనేమో, ''క్యూబా ఆదాయమంతటికీ వెనెజువెలా నుంచి వస్తున్న చమురే ఆధారం. ఆ మార్గం మూసుకున్న కారణంగా అదిప్పటికే కుప్పకూలుతున్న దేశం. కనుక దానిపై సైనిక చర్య కూడా అనవసరమేమో''అంటూ ట్రంప్ తాజాగా కామెంట్ చేశారు. క్యూబాలో అధికార మార్పిడి అత్యవసరమని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో పదేపదే చెబుతుండటం తెలిసిందే. గత శనివారం వెనెజువెలాపై అమెరికా దాడి చేసి మదురో దంపతులను బందీలుగా పట్టుకున్న అనంతరం రూబియో మీడియాతో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'నేను గనక ఇప్పుడు (క్యూబా రాజధాని) హవానాలో ఉంటే, అక్కడి ప్రభుత్వంలో భాగస్వామిని అయ్యుంటే కాస్త ఆందోళనలోనే పడి ఉండేవాన్ని'అన్నారు. తద్వారా, క్యూబాపై అమెరికా ఇప్పటికే గురి పెట్టిందని చెప్పకనే చెప్పారు. ఇంతా చేస్తే, రూబియోది క్యూబా నుంచి అమెరికాకు వలస వచ్చిన కుటుంబం కావడం విశేషం!

- సాక్షి, నేషనల్ డెస్క్

హెడ్‌ఆఫీస్‌కు వచ్చి కలవండి

కరూర్ తొక్కిసలాట ఉదంతంలో టీవీకే విజయ్‌కు సీబీఐ సమన్లు

సాక్షి, చెన్నై: తమిళగ వెట్రి కళగం(టీవీకే) పార్టీ గత ఏడాది సెప్టెంబర్‌లో కరూర్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో తొక్కిసలాట జరిగి పలువురు మరణించిన కేసులో సీబీఐ దర్యాప్తును వేగవంతం చేసింది. టీవీకే చీఫ్, ప్రముఖ నటుడు విజయ్‌కు తాజాగా సీబీఐ సమన్లు జారీచేసింది. కేసు విచారణలో భాగంగా ఢిల్లీలోని తమ ప్రధాన కార్యాలయానికి జనవరి 12వ తేదీన రావాలని విజయ్‌కు ఆ సమన్లలో సీబీఐ ఆదేశించింది. విజయ్‌ను విచారించిన తర్వాతే ఈ కేసులో చార్జ్‌షీట్‌ను దాఖలుచేయాలని సీబీఐ భావిస్తోందని అధికారులు వెల్లడించారు. 41 మంది మరణానికి, 60 మంది గాయపడటానికి కారణమైన కరూర్ సభ తొక్కిసలాట ఉదంతంలో నిజానిజాలను నిగ్గుతేల్చేందుకు తొలుత తమిళనాడులోని డీఎంకే సర్కార్ ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)ను ఏర్పాటుచేసింది. అయితే దర్యాప్తు అత్యంత పారదర్శకంగా, స్వతంత్రంగా జరగాలన్న టీవీకే అభ్యర్థన, తర్వాత సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కేసును సీబీఐకి బదిలీచేశారు.

ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేయండి

ఐసిస్ సంబంధ కేసులపై సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: అంతర్జాతీయ ఉగ్ర సంస్థ ఐఎస్ఐఎస్‌తో సంబంధమున్న నిందితులపై నమోదైన కేసులను విచారించేందుకు ప్రత్యేక కోర్టు ఏర్పాటుపై యోచించాలని ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వంతోపాటు కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు మంగళవారం సూచించింది. భారత్‌లో ఐసిస్ భావజాలాన్ని వ్యాప్తిచేయడంతోపాటు ఐసిస్‌లో చేర్చుకునేందుకు సభ్యుల కోసం వెతుకుతున్న మొహమ్మద్ హిదాయతుల్లాహ్ అనే వ్యక్తి పెట్టుకున్న బెయిల్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీల ధర్మాసనం మంగళవారం విచారించింది. ''కేసుల విచారణలో అసాధారణ జాప్యం కారణంగా సుదీర్ఘకాలంపాటు విచారణఖైదీగా జైల్లో మగ్గిపోవడం సబబుకాదు. ఈ కేసులో ఏకంగా 125 మంది సాక్షులను విచారించాల్సి ఉంది. అందుకే ఈ కేసు విచారణ కోసం ఢిల్లీ రాష్ట్ర సర్కార్, కేంద్ర ప్రభుత్వాలు ప్రత్యేక కోర్ట్ ఏర్పాటుకు ఆలోచించండి''అని ప్రభుత్వం, జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్యభాటీకి సీజేఐ సూచించారు.

ఎస్ఆర్ ఏకపక్షంగా ఉంది

సుప్రీంకోర్టును ఆశ్రయించిన టీఎంసీ

న్యూఢిల్లీ: పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)లో అవకతవకలు జరుగుతున్నాయంటూ తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ డెరెక్ ఓబ్రియన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పశ్చిమబెంగాల్‌తో సహా వివిధ రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియ తీరును ఆయన సవాల్ చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభమైన నాటి నుంచి అధికారుల మార్గదర్శకాలను లిఖితపూర్వకంగా జారీ జేయకుండా, చట్టబద్ధం కాని వాట్సాప్ సందేశాలు, వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా తెలియజేస్తున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఇలా ఏకపక్షంగా, అనధికారిక యంత్రాంగంతో చేయడం, మోసపూరితంగా వ్యవహరించడం చట్టాన్ని ధిక్కరించడమేనని తెలిపారు. అనధికారిక మార్గాల్లో సూచనలు జారీ చేయడం వెంటన ఆపాలని ఎన్నికల సంఘానికి దిశానిర్దేశం చేయాలని, ఇప్పటివరకు జారీ చేసిన సూచనలన్నింటినీ చట్టవిరుద్ధమైనవిగా ప్రకటించాలని కోరారు.

బీజేపీ చేసిన యాప్స్‌నే ఈసీ ఉపయోగిస్తోంది

పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆరోపణ

గంగాసాగర్: పశ్చిమ బెంగాల్‌లో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మరోసారి విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో ఓటర్ల జాబితా సవరణ ఎస్ఐఆర్ నిర్వహణకోసం బీజేపీ ఐటీ సెల్ అభివృద్ధి చేసిన మొబైల్ అప్లికేషన్(యాప్)లను ఎన్నికల కమిషన్ ఉపయోగిస్తోందని ఆమె ఆరోపించారు. చట్ట విరుద్ధమైన తప్పుడు విధానాలను ఈసీ ఉపయోగిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం గంగాసాగర్ వార్షిక మేళా ఏర్పాట్లను సమీక్షించేందుకు దక్షిణ 24 పరగణాల జిల్లాలోని సాగర్‌కు వచ్చిన ఆమె మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు సవరణ పేరుతో ఈసీ తప్పుడు పద్ధతులను అవలంభిస్తోందని ఆమె ఆరోపించారు. జీవించే ఉన్న ఓటర్లను చనిపోయినట్లుగా, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు, వికలాంగులను విచారణకు హాజరు కావాలంటూ ఇబ్బంది పెడుతోందన్నారు.

ఎరక్కపోయి.. ఇరుక్కుపోయాడు!

ఎగ్జాస్ట్ ఫ్యాన్ రంధ్రంలో ఇరుక్కున్న దొంగ

కోటా (రాజస్థాన్): అది ఆదివారం రాత్రి.. రాజస్థాన్‌లోని కోటా నగరంలో సుభాష్ కుమార్ రావత్ తన భార్యతో కలిసి ఆలయానికి వెళ్లి ప్రశాంతంగా ఇంటికి తిరిగి వచ్చారు. తాళం తీసి లోపలికి వెళ్లిన ఆ దంపతులకు గుండె ఆగినంత పనైంది. గాలి కోసం పెట్టిన ఎగ్జాస్ట్ ఫ్యాన్ రంధ్రంలో ఒక వింత ఆకారం వేలాడుతూ కనిపించింది.

సగం లోపల.. సగం బయట!

నేలకి పది అడుగుల ఎత్తులో.. తల, చేతులు ఇంట్లోకి వచ్చి ఉన్నాయి.. కాళ్లు మాత్రం బయట గాలిలో ఊగుతున్నాయి. సరిగ్గా గమనిస్తే అర్థమైంది.. ఆ ఆకారం ఒక 'దొంగ' ప్రబుద్ధుడిదని.. ఎగ్జాస్ట్ ఫ్యాన్ రంధ్రం గుండా దూరి లోపలికి రావాలని ప్రణాళిక వేసి, నడుము భాగం దగ్గర గట్టిగా ఇరుక్కుపోయాడు. పాపం, అటు లోపలికి రాలేక, ఇటు బయటకి వెళ్లలేక బావురుమన్నాడు.

ఇరుక్కుపోయినా తగ్గని 'ఈగో'!

రావత్ దంపతులు తేరుకుని, 'ఎవరు నువ్వు? ఇక్కడ ఏం చేస్తున్నావు?'.. అని గట్టిగా అరిచారు. సాధారణంగా దొంగలు దొరికిపోతే కాళ్లావేళ్లా పడతారు. కానీ మన దొంగ రూటే వేరు! ఇరుక్కుపోయినా కూడా, ఇంటి యజమానులనే బెదిరించడం మొదలుపెట్టాడు. 'నన్ను ఇప్పుడే వదిలేయండి. నా మనుషులు బయటే ఉన్నారు.. నన్నేమైనా చేస్తే మిమ్మల్ని వదిలిపెట్టరు!'.. అంటూ బడాయిలు పోయాడు. కానీ, అసలు విషయం ఏంటంటే.. అసలు దొంగ ఇరుక్కుపోవడం చూసి, బయట కాపలా ఉన్న కొసరు దొంగలంతా తమ కారు వదిలేసి మరీ పరారయ్యారు.

ఏడుపులంకించుకున్న దొంగోడు

వెంటనే పోలీసులు రంగ ప్రవేశం చేశారు. అతన్ని బయటకి తీయడం పెద్ద సాహసమే అయిపోయింది. బయట ఒక కానిస్టేబుల్ నెట్టడం, లోపల ఇద్దరు పోలీసులు లాగడం.. ఈ క్రమంలో మన దొంగ గారు నొప్పితో విలవిల్లాడుతూ, ఏడుస్తూ పెట్టిన కేకలు చుట్టుపక్కల వారికి మాత్రం వినోదాన్ని పంచాయి. ఎట్టకేలకు అతన్ని బయటకు తీసి, సంకెళ్లు వేసి స్టేషన్‌కు తరలించారు. దొంగలు వచ్చిన కారు మీద 'పోలీస్' అని స్టిక్కర్ ఉండటం విశేషం. ఇప్పుడు పోలీసులు.. ఆ కారు ఎక్కడిది? ఆ దొంగ వెనుక ఉన్న ముఠా ఎక్కడ? అనే కోణంలో విచారణ జరుపుతున్నారు.

కార్తీక దీపానికి అనుమతి సబబే

మద్రాస్ హైకోర్టు స్పష్టీకరణ

మదురై: తమిళనాడులోని ప్రఖ్యాత తిరుప్పరన్ కుండ్రం కొండపై కార్తీక దీపం వెలిగించేందుకు అనుమతి సబబేనని మద్రాస్ హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు సింగిల్ ఇటీవల ఇచ్చిన ఉత్తర్వులను మదురై బెంచ్ మంగళవారం సమర్థించింది. దీపానికి అనుమతిస్తే శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందన్న డీఎంకే సర్కారు వాదనను తప్పుబట్టింది. ''అవన్నీ లేనిపోని ఊహాపోహలే. వారి వాదనకు అనువుగా సృష్టించుకున్న ఊహాభూతాలే'' అంటూ జస్టిస్ జి.జయచంద్రన్, జస్టిస్ కె.కె.రామకృష్ణన్‌ల ధర్మాసనం మండిపడింది. తిరుప్పరన్‌కుండ్రం కొండపై రాతిస్తంభం ఉన్న చోటు శబరిమల దేవస్థానానిదేనని, వక్ఫ్ బోర్డుది కాదని స్పష్టం చేసింది. ''ఇంతటి బలం, బలగం ఉన్న ప్రభుత్వమే ఏడాదిలో కేవలం ఒక్క రోజు జరిగే దీపోత్సవాన్ని అనుమతిస్తే సమస్య తలెత్తుతుందని చెప్పడం హాస్యాస్పదం''అంటూ నలుగుపెట్టింది. కార్తీక మాసంలో పురాతన తిరుప్పన్‌కుండ్రం కొండపై కార్తీక దీపోత్సవానికి అనుమతించాలంటూ హైకోర్టులో గత నవంబర్లో పిటిషన్లు దాఖలయ్యాయి. అందుకు అనుమతిస్తూ జస్టిస్ స్వామినాథన్ డిసెంబర్ 1న ఉత్తర్వులిచ్చారు. దాన్ని సవాలు చేస్తూ స్థానిక హజరత్‌సుల్తాన్‌సికందర్ బహదూషా ఔలియా దర్గాతో పాటు స్టాలిన్ సర్కారు అపీళ్లు దాఖలు చేసింది. దర్గాకు సమీపంలో ఉన్న కొండపై దీపం వెలిగిస్తే మత ఘర్షణలకు దారి తీయవచ్చని ప్రభుత్వం వాదించింది. దీనిపై ధర్మాసనం తాజాగా తీవ్ర ఆగ్రహం వెలిబుచ్చింది. ఇది భిన్న సామాజిక వర్గాలను పరస్పరం ఎగదోసే ప్రయత్నమే తప్ప మరొకటి కాదని అభిప్రాయపడింది. ''దేవస్థానానికి చెందిన కొద్దిమంది మాత్రం కొండపైకి వెళ్లి దీపం వెలిగించేలా, భక్తులంతా కిందే ఉండి పూజలు చేసుకునేలా చూడటం అంత అసాధ్యమైన విషయమేమీ కాదే! ఆ జన సమూహాన్ని కూడా నిలువరించలేమని చెప్పడం శాంతిభద్రతలను కాపాడలేని చేతగానితనమైనా కావాలి. భిన్న సామాజిక వర్గాల మధ్య సామరస్యం ఉండటాన్ని హర్షించని నైజమన్నా అయ్యుండాలి'' అంటూ న్యాయమూర్తులు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కోర్టు తీర్పు, ధర్మాసనం వ్యాఖ్యలపై స్టాలిన్ సర్కారు తీవ్రంగా స్పందించింది. దీన్ని సుప్రీంకోర్టులో సవాలు చేస్తామని సంకేతాలిచ్చింది.

నాతో మోదీ హ్యాపీగా లేరు

ట్రంప్ తాజా స్టేట్ మెంట్

వాషింగ్టన్: ''నేను కోపంగా ఉన్నానని ప్రధాని మోదీకి తెలుసు'' అంటూ స్టేట్‌మెంట్ ఇచ్చిన ఒక్క రోజుకే, ''నా తీరుతో మోదీ హ్యాపీగా లేరు'' అంటూ మరో ట్విస్ట్ ఇచ్చారు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు భారత్‌పై తాము విధించిన టారిఫ్‌లే ఆయన అసహనానికి కారణమని చెప్పుకొచ్చారు. మంగళవారం హౌస్ జీఓపీ మెంబర్ రిట్రీట్ కార్యక్రమంలో ట్రంప్ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. ''సర్! నేను మిమ్మల్ని కలవొచ్చా?'' అంటూ మోదీ తన వద్దకు వచ్చారని కూడా చెప్పుకున్నారు. ''రష్యా చమురు కొనుగోళ్ల కారణంగా భారత్ ఇప్పుడు భారీ టారిఫ్‌లు చెల్లించాల్సి వస్తోంది. అందుకే ఆ కొనుగోళ్లను ఇప్పుడు బాగా తగ్గించింది'' అని అన్నారు. అపాచీ హెలికాప్టర్ల సరఫరా కోసం భారత్ ఐదేళ్లుగా ఎదురు చూస్తున్నట్టు మోదీ తనతో అన్నారని ట్రంప్ చెప్పుకొచ్చారు. ''భారత్ 68 అపాచీ హెలికాప్టర్ల కోసం ఆర్డర్ ఇచ్చింది. దాన్ని మేం మారుస్తున్నాం'' అని అన్నారు. భారత్‌పై ట్రంప్ 50 శాతం టారిఫ్‌లు విధించడం తెలిసిందే. అందులో ఏకంగా 25 శాతం టారిఫ్‌లు రష్యా చమురు దిగుమతుల కారణంగా వేసినవే.

ఉత్తరప్రదేశ్‌లో 2.89 కోట్ల ఓట్ల తొలగింపు

లఖ్‌నవూ: ఉత్తరప్రదేశ్‌లో కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) సర్వే కసరత్తు కొలిక్కి వచ్చింది. రివిజన్ అనంతరం ఏకంగా 2.89 కోట్ల ఓట్లు తొలగింపుకు గురయ్యాయి. రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి నవ్‌దీప్ రిన్వా మంగళవారం ఈ మేరకు వెల్లడించారు. వీరిలో ఏకంగా 2.57 కోట్ల మంది శాశ్వత వలస వెళ్లిపోయినట్టు తెలిపారు. మరణాలు, బహుళ నమోదుల వంటి కారణంగా మిగతా ఓట్లను తొలగించినట్టు పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్‌లో ఓటర్ల సంఖ్యను 12.55 కోట్లుగా ముసాయిదా ఎన్నికల జాబితా పేర్కొంది. ఎస్ఐఆర్‌కు ముందు యూపీలో ఓటర్ల సంఖ్య 15.44 కోట్లుగా ఉండేది. తుది ఓటర్ల జాబితాను మార్చి 6న ప్రచురిస్తామని రిన్వా ప్రకటించారు. ముసాయిదా జాబితాపై యూపీలో విపక్షాలన్నీ తీవ్రంగా మండిపడ్డాయి. ఈసీ అసలు రివిజన్ కసరత్తుకు సరిపడా సమయమే ఇవ్వలేదని యూపీ కాంగ్రెస్ చీఫ్ అజయ్ రాయ్ ఆరోపించారు.

తీవ్ర బాధ్యతారాహిత్యం

- ఢిల్లీలో వాయుకాలుష్యాన్ని తగ్గించడంతో సీఏక్యూఎం పూర్తిగా విఫలమవుతోంది
- నిపుణులతో చర్చించి పరిష్కారాలతో నివేదికను 2 వారాల్లోగా సమర్పించండి
- వాయునాణ్యతా నిర్వహణ కమిషన్‌కు సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: వాయుకాలుష్యంలోనూ దేశరాజధానిగా పనికిరాని పేరు తెచ్చుకుని గ్యాస్‌ఛాంబర్‌గా తయారైన ఢిల్లీని కాలుష్యం బారి నుంచి తప్పించడంలో కమిషన్ ఆఫ్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్(సీఏక్యూఎం) విభాగం ఘోరంగా విఫలమవుతోందని సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర అసహనం వ్యక్తంచేసింది. ఢిల్లీని చుట్టేస్తున్న వాయుకాలుష్యానికి ప్రధాన హేతువులను గుర్తించి, పరిష్కారాలను సూచిస్తూ రెండు వారాల్లోగా తగు నివేదికను సమర్పించాలని సీఏక్యూఎంకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీల ధర్మాసనం మంగళవారం సూచించింది. పొరుగురాష్ట్రాల గుండా ఢిల్లీలోకి వచ్చే వాహనాలు గంటలతరబడి వేచి ఉండటంతో సరిహద్దుల వెంబడి ఉన్న ప్రధాన టోల్‌ప్లాజాలు కాలుష్యకేంద్రాలుగా తయారయ్యాయని, వెంటనే వాటిని వేరే ప్రాంతాలకు తరలించాలని ఆదేశించింది. దీంతో వాటిని తాత్కాలికంగా మూసేయడం లేదంటే వేరే చోటుకు మార్చడంపై తుది నిర్ణయం తీసుకునేందుకు రెండు నెలల సమయం కావాలని సీఏక్యూఎం కోరడంతో ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. రెండు నెలల గడువు ఇవ్వడం కుదరదు. కేవలం రెండు వారాల సమయం ఇస్తున్నాం. ఈలోపు నివేదిక ఇవ్వండి''అని ధర్మాసనం ఆదేశించింది.

సమస్య వదిలేసి ఆదాయంపై యావ?

''పరిష్కారం చూపండయ్యా అంటే అది వదిలేసి ఆయా టోల్‌ప్లాజాలే మాకు ఆదాయ వనరులు అంటూ ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ అఫిడవిట్ సమర్పించింది. వీళ్లను చూసి గురుగ్రామ్ మెట్రోపొలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ సైతం ఇదే పాట పాడుతోంది. గురుగ్రామ్‌లో పర్యావరణ నష్టపరిహార రుసుముల్లో సగభాగం తమకు ఇప్పించాలని కోరుతోంది. ఇదేం వైఖరి?. దీర్ఘకాలిక పరిష్కారాలతో లేదా నిర్మాణాత్మకమైన ప్రతిపాదనలతో ముందుకు రావాల్సిన సంస్థలు ఇలా సమస్య తీవ్రత తెలీకుండా వ్యవహరిస్తున్నాయి. గతంలో మేం లేవనెత్తిన అంశాలపై వివరణ ఇవ్వకుండా మౌనం దాల్చడం కూడా ఏమాత్రం సబబుగా లేదు''అని కోర్టు వ్యాఖ్యానించింది.

కారు ఇప్పుడు స్టేటస్ సింబల్

''ఢిల్లీలో కాలుష్యం తగ్గాలంటే కార్ల సంఖ్యను కుదించాలి. కొన్ని కుటుంబాలకు ఒకటి కంటే ఎక్కువ కార్లు ఉన్నాయి. కుటుంబానికి లేదా ఒక వ్యక్తికి ఒక్కటే కారు అనే నిబంధన అమలుచేస్తే వాహనకాలుష్యం కాస్తం తగ్గొచ్చు''అని సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేది వాదించారు. దీనిపై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ స్పందించారు. ''ఇప్పుడు జనాల్లో కారు అనేది స్టేటస్ సింబల్‌గా తయారైంది. జనం సైకిళ్లు ఉపయోగించడం మానేశారు. సరిపడా డబ్బులు కూడబెట్టి నేరుగా కారు కొనేస్తున్నారు''అని అన్నారు. ఆటోమొబైల్ పరిశ్రమ అత్యంత శక్తివంతంగా తయారైందని లాయర్ వ్యాఖ్యానించారు. దీనిపై సీజేఐ స్పందించారు. ''ధనవంతులు ఒక రకమైన త్యాగం చేస్తే బాగుంటుంది. అత్యంత ఖరీదైన కార్లు కొనేబదులు విద్యుత్‌తో నడిచే కార్లు కొంటే ఉత్తమం''అని అన్నారు.

సాక్షి
గుంటూరు
బుధవారం । 7 । జనవరి । 2026

డీ-అడిక్షన్ సెంటర్ ప్రారంభం

చేబ్రోలు: నారాకోడూరులోని గాయత్రీ శక్తిపీఠం ఆధ్వర్యంలో నిర్మించిన డీ-అడిక్షన్ సెంటర్‌ను హరియాణ మాజీ గవర్నర్, బీజేపీ సీనియర్ నేత బండారు దత్తాత్రేయ మంగళవారం ప్రారంభించారు.



నిమ్మకాయల ధరలు

తెనాలి: తెనాలి మార్కెట్ యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.1000, గరిష్ట ధర రూ.3000, మోడల్ ధర రూ.1600 వరకు పలికింది.

వైభవంగా ధనుర్మాస పూజలు



బెల్లంకొండ: పులిచింతల ముంపు గ్రామం కేతవరంలోని శ్రీ వజ్రలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో మంగళవారం ధనుర్మాస పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. నక్షత్ర హారతితో పూజలు చేశారు.

న్యూస్‌రీల్

సాయుధ బలగాల సంక్షేమ నిధికి విరాళం

నరసరావుపేట: సాయుధ బలగాల సంక్షేమ నిధికి దాతలు ఇచ్చిన చెక్కులను జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా సైనిక్ వెల్ఫేర్ అధికారి గుణశీలకు అందజేశారు. నరసరావుపేట ఇంజినీరింగ్ కాలేజీ(ఎన్ఈసీ) చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు రూ.30 వేలు, వాసవీ క్లబ్ సభ్యులు రూ.25 వేలు విరాళంగా ఇచ్చారు. దేశ రక్షణలో భాగస్వాములయ్యే సైనికుల సంక్షేమం కోసం ముందుకు వచ్చిన క్యాడెట్లు, వాసవి క్లబ్ సభ్యులను కలెక్టర్ అభినందించారు.

యూరియా అధిక ధరకు విక్రయిస్తే చర్యలు

నరసరావుపేట రూరల్: యూరియా అధిక ధరలకు విక్రయిస్తే డీలర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి ఎం.జగ్గారావు హెచ్చరించారు. సబ్ డివిజన్ పరిధిలోని ఎరువుల డీలర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. జగ్గారావు మాట్లాడుతూ చట్టప్రకారం ఎప్పటికప్పుడు స్టాక్ రిజిస్టర్, బిల్లు బుక్ అప్డేట్ చేసుకోవాలని తెలిపారు. ఐఎఫ్ఎంఎస్ స్టాక్ గోడౌన్ స్టాక్ సరిపోవాలని పేర్కొన్నారు. ఎరువుల గోడౌన్‌ల వద్ద స్టాక్ బోర్డు ఏర్పాటు చేయాలని, స్టాక్ వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలని తెలిపారు. సమావేశంలో సహాయ వ్యవసాయ సంచాలకులు కేవీ శ్రీనివాసరావు, వి.హనుమంతరావు, జిల్లా ఎరువుల డీలర్ల అసోసియేషన్ అధ్యక్షుడు నాగిరెడ్డి, పట్టణ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఏవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

తులసి అలంకరణలో శ్రీవారు



సత్తెనపల్లి: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని సత్తెనపల్లి పట్టణం వడ్డవల్లిలోని శ్రీ రామాలయం శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామికి మంగళవారం తులసితో అలంకారం చేశారు. కోదండ రామచంద్ర ప్రభువైన శ్రీరాముడు, సీతాదేవి, లక్ష్మణుడు, ఆంజనేయ స్వామిలను విశేష అలంకరణ చేసి కనుల పండువగా పూజలు, గోత్ర నామాలతో అభిషేకాలు చేశారు. మహిళలు పాశురాలను పఠించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అఖిల భారత డ్వాక్రా బజార్ ఏర్పాట్ల పరిశీలన

గుంటూరు రూరల్: అఖిల భారత డ్వాక్రా బజార్ ప్రారంభోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రానున్న సందర్భంగా ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్‌అన్సారియా, జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్‌లు మంగళవారం పరిశీలించారు. స్థానిక రెడ్డి కళాశాల ఎదుట ఏర్పాటు చేసిన సరస్ అఖిల భారత డ్వాక్రా బజారును ఈ నెల 8వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి సందర్శించి పలు స్టాళ్లను ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా చేపట్టాల్సిన భద్రతా, బందోబస్తు ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు. మంగళవారం నుంచి 18వ తేదీ వరకు అఖిల భారత డ్వాక్రా బజార్ ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. సరస్‌లో ప్రతి రోజు సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ నెల 8వ తేదీన ప్రారంభిస్తారని చెప్పారు.

పత్తి రైతుకు పాలకులు కన్నీరే మిగుల్చుతున్నారు. తేమ పేరుతో అడ్డగోలుగా ధర తగ్గించడంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. సీసీఐకి తీసుకెళితే సాకులు చెబుతున్నారని వాపోతున్నారు. దిక్కు లేక దళారులకు తక్కువ ధరకే విక్రయిస్తున్నామని.. మళ్లీ దళారులు అదే పత్తి తీసుకెళితే మద్దతు ధరకు సీసీఐ కొనుగోలు చేస్తున్నట్లు పేర్కొంటున్నారు. చంద్రబాబు సర్కారు నిర్వాకంతో అధికారులు, సిబ్బంది, దళారులు కలిసి రైతులను పట్టపగలే దోచుకుంటున్నారు.

నల్లపాడు రోడ్‌లో ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రం ఎదుట వేచి ఉన్న పత్తి వాహనాలు

సాకుగా తేమ..
కొనుగోళ్లు మమ

- పత్తి రైతులకు నిండా ముంచుతున్న పాలకులు
- తేమ పేరుతో క్వింటా రూ.6,500కే కొనుగోలు
- దళారులు తీసుకెళితే మాత్రం రూ.8,110
- సీసీఐ తీరుతో తీవ్రంగా నష్టపోతున్న కర్షకులు
- దిగుబడి ఉన్నా కొనుగోళ్లు అంతంతే
- రైతుల వద్ద ఇంకా సుమారు 3.50 లక్షల క్వింటాళ్లు
- విక్రయించిన రైతుల ఖాతాలకూ జమ కాని నగదు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: మద్దతు ధరతో పత్తి కొనుగోలు చేయడంలో సీసీఐ నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. గుంటూరు జిల్లాలో 66,130 ఎకరాల్లో పత్తి సాగయింది. గుంటూరు, ఫిరంగిపురం, తాడికొండ, ప్రత్తిపాడులలో 14 పత్తి జిన్నింగ్ మిల్లుల్లో మద్దతు ధరతో సీసీఐ పత్తి కొనుగోలు చేస్తోంది. జిల్లాలో సుమారు 6 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. దిగుబడులు భారీగా ఉన్నప్పటికీ సీసీఐ కొనుగోళ్లలో వేగం పెంచకపోవడం గమనార్హం. ఇప్పటి వరకు 2,32,338.19 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేసింది. రైతుల వద్ద ఇంకా సుమారు 3.50 లక్షల క్వింటాళ్ల పత్తి నిల్వలు పేరుకుపోయాయి. సీసీఐ మద్దతు ధర రూ.8,110 ఉండగా.. మార్కెట్‌లో రూ.6 వేల నుంచి రూ.6,500 మాత్రమే ఉంటోంది.

ఖాతాలకు జమకాని నగదు..

సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరతో పత్తి అమ్ముకున్న రైతులకు సకాలంలో నగదు జమ కావడం లేదు. వ్యవసాయ ఉత్పత్తులు చేతికి రావడంతో బ్యాంకర్లతోపాటు ప్రైవేట్ వడ్డీ వ్యాపారులు, ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల వ్యాపారులు రైతులపై రుణాల వసూలుకు ఒత్తిడి చేస్తున్నారు. పత్తి విక్రయించిన రైతులు మాత్రం సీసీఐ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

దళారులకే లాభం

పత్తి విక్రయాల్లో అక్రమాలు జరగకుండా ప్రభుత్వం సాంకేతికతను ఉపయోగిస్తున్నా.. దళారులు ఎత్తుకు పైఎత్తు వేస్తున్నారు. గ్రామాల్లో తక్కువ ధరతో కొనుగోలు చేసిన పత్తిని స్థానిక రైతుల పేరున సీసీఐకి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. సీసీఐ, మార్కెటింగ్ శాఖల అధికారుల అండదండలతో దళారుల దందా జోరుగా సాగుతోంది. ఇప్పటి వరకు ప్రైవేట్‌లో సుమారు 30 వేల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేస్తే, సీసీఐ సుమారు 2.32 లక్షల క్వింటాళ్లు కొనుగోలు చేసింది. జిల్లాలో ప్రైవేట్‌లో పత్తికి ధర లేదు. సీసీఐకి విక్రయించాలంటే తేమ పేరిట నిరాకరిస్తోంది. విధిలేని పరిస్థితుల్లో తక్కువ ధరైనా రైతులు మాత్రం వ్యాపారులనే ఆశ్రయిస్తున్నారు. ఇదే పత్తిని దళారులు తీసుకొస్తే.. 8 శాతం తేమతో సీసీఐ కొనుగోలు చేస్తోంది. రైతుల నుంచి క్వింటాళ్లకు రూ.6 వేల నుంచి రూ.6,500 లోపు ధర ఇచ్చి కొనుగోలు చేస్తున్న దళారులు.. తమకు తెలిసిన రైతుల పేరున సీసీఐ కేంద్రాల్లో క్వింటా రూ.8,110 చొప్పున విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ లెక్కన క్వింటాలు పత్తికి సుమారు రూ.1,500 పైగా లాభం పొందితే అందులో పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్ ఇచ్చిన రైతుతో పాటు సీసీఐ, మార్కెటింగ్ శాఖల సిబ్బందికి వాటాలు ఉంటాయనే ఆరోపణలు ఉన్నాయి. వివరాలపై అక్రమాలు బయటపడే వీల్లేదు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు

తేమ, రంగు విషయంలో కాస్త ఉదారంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా కూడా సీసీఐ అధికారులను ఆదేశించారు. కానీ సీసీఐ అధికారులు ఇవేమీ పట్టించుకోని పరిస్థితి నెలకొంది. 12 శాతం కంటే ఎక్కువ తేమ ఉంటే నిర్దాక్షిణ్యంగా వెనక్కు పంపుతున్నట్లు గమనార్హం. తిరస్కరించిన పత్తిని దళారులు కొని అదే పత్తిని మద్దతు ధరతో అమ్ముతున్నారు. సీసీఐ అధికారులే ముడుపుల కోసం దళారులను ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అక్రమాలు జరగకుండా చర్యలు

పత్తి కొనుగోళ్లలో అక్రమాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఆన్‌లైన్‌లో వివరాలు ఉన్న రైతుల నుంచి మాత్రమే పత్తి కొనుగోలు చేస్తున్నారు. సీసీఐ కేంద్రాల్లో అక్రమాలు జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాం. సీసీఐ కేంద్రాల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తాం.

– పి.సత్యనారాయణ చౌదరి, సహాయ సంచాలకులు, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ

వసతి గృహాలపై దృష్టి

జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా

గుంటూరు వెస్ట్: జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ వసతి గృహాలతోపాటు గురుకులాల్లోనూ మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పీ4 కార్యక్రమంలో భాగంగా 'స్వీకారం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ప్రతి వసతి గృహం సంపూర్ణ ప్రగతికి చిహ్నంగా, చిన్నారుల మానసిక వికాసానికి ప్రేరణగా ఉండాలనే తలంపుతో దీనిని చేపట్టినట్లు పేర్కొన్నారు. హాస్టళ్లను ఆధునికీకరించేందుకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ కంపెనీలు, బ్యాంకులు సహకరించాలన్నారు.

ఏడో తరగతి విద్యార్థినికి అభినందన

కలెక్టర్ పంపిన గ్రీటింగ్‌తో జాస్మిన్

తెనాలి: స్థానిక మారీసుపేటలోని ఎన్‌సీఆర్ మున్సిపల్ హైస్కూలులో ఏడో తరగతి చదువుతున్న షేక్ జాస్మిన్‌కు మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి స్పీడ్‌పోస్ట్ వచ్చింది. జిల్లా కలెక్టర్ నుంచి శుభాకాంక్షలు తెలుపుతూ వచ్చిన పోస్ట్ అది. అందులో 'డియర్ జాస్మిన్... ఎక్సలెంట్ పెయింటింగ్, క్రియేటివిటీ, ఇమాజినేషన్, హార్డ్‌వర్క్' అన్న ప్రశంసలతో గ్రీటింగ్ కార్డు, చిన్న లెటర్, డైరీ మిల్క్ చాక్లెట్ ఉన్నాయి. స్పీడ్‌పోస్ట్ అందుకున్న ప్రధానోపాధ్యాయుడు పఠాన్ కరిముల్లా సదరు విద్యార్థిని జాస్మిన్‌కు అందజేసి అభినందించారు. విషయమేమంటే, నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని హైస్కూలు విద్యార్థులు, చిత్రలేఖన ఉపాధ్యాయుడు బెల్లంకొండ వెంకట్ పర్యవేక్షణలో చిన్న కార్డులపై బొమ్మలను స్వయంగా చిత్రించి గ్రీటింగ్ కార్డులుగా తయారుచేశారు. వాటిని అధికారులు, ఉపాధ్యాయులు, బంధువులకు పోస్ట్ చేశారు. జిల్లా కలెక్టర్ స్పీడ్‌పోస్టు పంపటంతో ఆమె సంతోషంతో పొంగిపోయింది.

అడ్డగోలుగా అక్రమ మట్టి తవ్వకాలు

- వాహనాలను అడ్డుకున్న రాజధాని రైతులు
- పోలీసులకు సమాచారమిచ్చినా స్పందన శూన్యం

రోడ్డుపై ఆపి ఉంచిన మట్టి వాహనాలు

తాడేపల్లి రూరల్: రాజధాని గ్రామాల్లో మట్టి అక్రమంగా తరలించే లారీలు అర్ధరాత్రి సమయంలో పెద్దగా శబ్దాలు చేస్తూ రాకపోకలు సాగిస్తుండడంతో స్థానికులు ఆగ్రహించారు. రాజధాని రైతులు సోమవారం అర్ధరాత్రి పెనుమాక గ్రామంలో అక్రమంగా మట్టి తరలిస్తున్న లారీలను నిలిపివేశారు. ఆ సమయంలో డ్రైవర్లు పెద్దగా హారన్లు కొట్టడం, వాహనాలకు ఉన్న లైట్లను తీయకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.కోట్ల విలువ చేసే పంటపొలాలను రాజధాని నిర్మాణానికి ఇస్తే కొంతమంది అక్రమంగా మట్టి తవ్వుతున్నారని వారు వాపోయారు. కనీసం పోలీసులుగానీ, ప్రభుత్వంగానీ, సీఆర్‌డీఏ అధికారులుగానీ అడ్డుకోవడంలో విఫలమయ్యారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గంటకుపైగా లారీలను ఆపి తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చినా ఎవరూ స్పందించలేదని తెలిపారు. రాజధానికి భూములు ఇచ్చి త్యాగం చేసిన రైతులకు ఇచ్చే గౌరవం ఇదేనా అంటూ ప్రశ్నిస్తున్నారు.

ఒక్క రాత్రికే రూ.లక్షలు

భూములు ఇచ్చిన రైతులకు ప్రభుత్వం సంవత్సరానికి కౌలు కింద రూ. 30వేలు ఇస్తున్నారు. రాజధానిలోని తమ భూముల్లో అక్రమంగా మట్టి తవ్వే వారు ఒక్క రాత్రికి రూ.లక్షలు సంపాదిస్తున్నారని వారు తెలిపారు. ఇంత దోపిడీ జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని, రేపు మాకు ప్లాట్లు కేటాయిస్తే ఆ ప్లాట్లలో మట్టి తవ్వకాల వల్ల గుంతలు ఏర్పడి మళ్లీ రూ. లక్షలతో మట్టి తోలించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వారు చెప్పారు. రాజధానిలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి, ఏ లారీలు ఎటు వెళుతున్నాయో అర్థం కావడం లేదని నాయకులు అంటున్నారు. ప్రతిచోట పనిచేసే వాహనాలకు జీపీఎస్ ఏర్పాటు చేసి ఆ పని వద్ద భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేస్తే అక్రమ తవ్వకాలు నివారించే అవకాశం ఉంది. ఇంత చిన్న విషయాన్ని కూడా అధికారులు విస్మరిస్తున్నారంటే మట్టి మాఫియాతో వారికి సంబంధం ఉందని రైతులు వ్యాఖ్యానిస్తున్నారు.

ప్రాణ భయం...

రాత్రి సమయంలో అమరావతి, కృష్ణాయపాలెం, యర్రబాలెం రోడ్లలో భారీ శబ్దాలు చేసుకుంటూ లారీలు తిరుగుతుంటే చిన్నపిల్లలు, వృద్ధులు ఉలిక్కిపడి నిద్ర లేస్తున్నారు. ఈ లారీల వల్ల తమకు ప్రాణ భయం ఉంది. కనీసం గ్రామాల్లో వేగ నియంత్రణ లేకపోవడం వల్ల డ్రైవర్లు కొంతమంది మద్యం మత్తులో ఇష్టారాజ్యంగా తోలుతున్నారని చెప్పారు. మలుపు వచ్చినా, గొయ్యి ఉన్నా, స్పీడ్ బ్రేకర్ కనబడినా ఆపకుండా హారన్‌పై చేయి వేసి నడపడంతో ఆ శబ్దాలకు గుండెలు అదురుతున్నాయని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బీపీ'ఎస్'.. అంతంతే!

- తలెత్తుతున్న ఆన్‌లైన్ సమస్యలు
- తెనాలిలో 900 వరకు అనధికారిక కట్టడాలు
- ముందుకు రాని ఎక్కువ మంది యజమానులు

అనధికారిక శ్లాబ్‌లకు రంధ్రాలు పెడుతున్న సిబ్బంది (ఫైల్)

తెనాలి అర్బన్: బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్ (బీపీఎస్)కు అనేక అవరోధాలు ఏర్పడుతున్నాయి. అప్పుడప్పుడు సాంకేతిక సమస్యలు తలెత్తుతుండటంతో బిల్డర్‌లు, భవన యజమానులు ఇబ్బందులు పడుతున్నారు. తెనాలి పట్టణంలో ఇటీవల 200కుపైగా అనధికార, ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మించిన భవనాలు ఉన్నాయి. తెనాలి పట్టణం నానాటికీ విస్తరిస్తోంది. రాజధాని అమరావతికి అతి దగ్గరగా గుంటూరు, విజయవాడకు మధ్యలో ఉండటంతో గ్రామీణ ప్రాంతాల వారు కూడా తెనాలిలో ఉండాలని భావిస్తున్నారు. పట్టణంలో మూడు కాల్వలు ఉండటం వల్ల నీటి కొరత ఉండదు. ప్రశాంతతకు మారుపేరుగా ఉండటంతో పలువురికి ఆసక్తి పెరుగుతోంది. పట్టణ పరిధి విస్తరిస్తోంది. ప్రస్తుతం 40 వేల గృహాల్లో 1.70 లక్షల మంది జనాభా ఉన్నారు.

అన్ని కట్టడాలు లెక్కలోనికి వచ్చేనా?

టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు తెనాలి పట్టణంలో అక్టోబర్ 21న 47 బృందాలు నిర్మాణంలో ఉన్న భవనాల వివరాలను సేకరించాయి. సర్వేలో సుమారు 200కుపైగా అనధికార, ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మించిన భవనాలు ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. వీటిన్నింటిపై చర్యలు తీసుకోనున్నట్లు ఆ సమయంలో మున్సిపల్ కమిషనర్, అసిస్టెంట్ సిటీ ప్లానర్‌లు ప్రకటించారు. కానీ చర్యలు కన్పించలేదు. ఇంతలో బీపీఎస్ పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. వీటిలో కొన్ని ఆగస్టు 31వ తేదీ తర్వాత నిర్మించారు. వీటిని పరిగణలోకి తీసుకుంటారా లేదా అనే మీమాంస యజమానుల్లో నెలకొంది. తమనూ పరిగణనలోకి తీసుకోవాలని వారు కోరుతున్నారు.

కొనసాగుతున్న అనధికార కట్టడాలు

మరోవైపు పట్టణంలో అనధికార కట్టడాల నిర్మాణం కొనసాగుతోంది. సుమారు ఏడాది నుంచి ప్రారంభమైన నిర్మాణాలకు నేటికీ తెరపడలేదు. పట్టణంలోని ముత్తింశెట్టిపాలెం, గంగానమ్మపేట, కొత్తపేట, రైల్వేస్టేషన్ రోడ్డు వంటి ప్రాంతాలలో యజమానులు అర్ధరాత్రి, తెల్లవారుజాము సమయంలోనూ నిర్మాణ పనులు చేయిస్తున్నారు. అధికారులు తలలు పట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కరువైన స్పందన

పట్టణంలో 1985 నుంచి ఈ ఏడాది వరకు అనధికార, ప్లానుకు విరుద్ధంగా నిర్మించిన కట్టడాలు 900 వరకు ఉండవచ్చనే అంచనాకు మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు వచ్చారు. పథకాన్ని నవంబర్ 12న ప్రభుత్వం ప్రవేశపెట్టింది.

నిబంధనలు ఇవీ..

అక్రమ భవనాల క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం బీపీఎస్ పథకాన్ని ప్రవేశపెట్టింది. 1985 జనవరి 1 నుంచి 2025 అగస్ట్ 31వ తేదీలోపు అనధికారికంగా, ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మించిన భవనాలను క్రమబద్ధీకరించుకునే వెసులుబాటు కల్పించింది. 2026 మార్చి 11వ తేదీలోపు యజమానులు క్రమబద్ధీకరించుకోవాలనే నిబంధన విధించింది. మొదట ఆన్‌లైన్‌లో రూ.10 వేలు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. టౌన్ ప్లానింగ్ అధికారుల తనిఖీల తర్వాత స్థలం విలువ, విస్తీర్ణం ఆధారంగా అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంటుంది.

సద్వినియోగం చేసుకోండి

ప్రభుత్వం బీపీఎస్ పథకాన్ని నవంబర్ నెలలో ప్రవేశపెట్టింది. పట్టణంలో సుమారు 900 భవనాలు బీపీఎస్ పరిధిలోకి రానున్నట్లు ప్రాథమికంగా అంచనాకు వచ్చాం. యజమానులకు అవగాహన కల్పించేందుకు ప్రధాన కూడలిల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశాం. మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తాం. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– వాణి, అసిస్టెంట్ సిటీ ప్లానర్, తెనాలి పురపాలక సంఘం

ఎమ్మెల్యే నసీర్ వ్యాఖ్యలపై ముస్లింల అభ్యంతరం

ఎమ్మెల్యే నసీర్‌ను నిలదీస్తున్న ముస్లిం మత పెద్దలు, ముస్లిం సంఘాల నాయకులు

లక్ష్మీపురం(గుంటూరు ఈస్ట్): అంజుమన్, వక్ఫ్ ఆస్తుల పరిరక్షణపై గుంటూరు నగరంలోని తూర్పు నియోజక వర్గంలోని మజ్లిస్ ఉల్ ఉలెమా ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ముస్లిం సంఘాల వారు, మత పెద్దలు, నాయకులు, అంజుమన్ సుదీర్ఘ కాల కమిటీ సభ్యులు హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ తరపున మాజీ ఎమ్మెల్యే మస్తాన్‌వలి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి గులాం రసూల్, తెలుగు దేశం పార్టీ నుంచి ప్రస్తుత తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహమ్మద్, జమియతుల ఉలెమా పెద్దలు ముఫ్తి బాసీత్, మాజీ డిప్యూటీ మేయర్ గౌస్, తెలుగు దేశం పార్టీ నాయకుడు షౌకత్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ అహమ్మద్ మాట్లాడుతూ ముస్లిం మత పెద్దలు ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి జన సమీకరణ లేకపోవడం చాలా బాధగా ఉందన్నారు. ముస్లిం మత పెద్దల కమిటీ సభ్యులు కూడా సమావేశంలో లేకపోవడం, నగరంలో ఉన్న మసీదుల్లో ఉన్న మౌలానాలు, మౌజన్‌లను పిలిచినా జనం భారీ సంఖ్యలో వచ్చే వారని తెలిపారు. పార్టీ సమావేశాలకు రెండు వందల మంది తగ్గకుండా వస్తున్నారని, ఇప్పుడు పట్టుమని 50 మంది కూడా లేకపోవడం బాధగా ఉందని పేర్కొన్నారు. ఇదిలా ఉంటే అంజుమన్-ఏ-ఇస్లామియా సంస్థకు సంబంధించిన చినకాకానిలోని 71.57 ఎకరాల భూమిపై ప్రభుత్వం తరపున జిల్లా కలెక్టర్ ఇచ్చిన నోటిఫికేషన్ గురించి ప్రస్తావించలేదు. పైగా ఎమ్మెల్యే అయిన తనకు ఎలాంటి సమాచారం లేదని చెప్పారు. ముస్లిం సంఘాలు, పెద్దలు, ఆయా పార్టీల నాయకులు తమవంతుగా కార్యాచరణకు దిగాలన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నందున ప్రభుత్వ పెద్దలతో మాట్లాడతానని చెప్పారు.

ఖండించిన మత పెద్దలు

ఎమ్మెల్యే నసీర్ అహమ్మద్ సంభాషణ పూర్తి అయిన తరువాత ముస్లిం మత పెద్దలు ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. సంఘం గురించి కించపరిచేలా మాట్లాడటం సబబు కాదని, ఈ సమావేశం ఏర్పాటు చేయడం ప్రధాన ఉద్దేశం జన సమీకరణ కాదన్నారు. జన సమీకరణ ఎలా ఉంటుందో తమ సంఘం అనేక మార్లు చూపించడం జరిగిందని ఎమ్మెల్యే నసీర్‌ను నిలదీశారు. కించపరిచేలా మాట్లాడటం తన ఉద్దేశం కాదని, జన సమీకరణ ఉంటే బాగుంటుందని చెప్పడం మాత్రమే తన ఉద్దేశం అని సమర్థించుకునే యత్నం చేశారు.

- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గులాం రసూల్ మాట్లాడుతూ.. అంజుమన్-ఏ-ఇస్లామియా సంస్థకు సంబంధించిన ఆస్తి వక్ఫ్‌లోకి ఎలా చేరిందో ప్రభుత్వ పెద్దలు, ప్రస్తుత నియోజక వర్గ ఎమ్మెల్యే, అంజుమన్ సంస్థ అధ్యక్షుడు, వక్ఫ్‌బోర్డు సభ్యుడు నసీర్ అహమ్మద్ గుంటూరు నగర ముస్లింలకు తెలియజేయాలని కోరారు.
- జమియతుల్ ఉలేమా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముఫ్తి బాసీత్ మాట్లాడుతూ.... అంజుమన్ ఆస్తులను, వక్ఫ్ ఆస్తులను ప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే యోచనలో భాగంగా చినకాకానిలోని 71.57 ఎకరాల అంజుమన్ భూమి తీసుకుంటోందన్నారు. ఇప్పటికైనా ముస్లిం సమాజం మేలుకోని హక్కుల కోసం జమియతుల్ ఉలేమా, మజ్లిస్ ఉల్ ఉలెమా తదితర సంఘాల నాయకులు ఏకం కావాలని పిలుపు ఇచ్చారు.

గుంటూరు కొరిటెపాడులోని సాకేతపురం రోడ్డు జెండా సెంటర్ వద్ద జరిగిన ముగ్గుల పోటీల అనంతరం భోగి మంట వద్ద వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

తండ్రీకొడుకుల అరాచకాలు ఎంతోకాలం సాగవు

- పిన్నెల్లి సోదరులపై 16 నెలల్లో 16 అక్రమ కేసులు
- మాజీ మంత్రి ఆర్కే రోజా ధ్వజం

వెంకటాచలం (పొదలకూరు): అధికారం తమదనే అహంకారంతో తండ్రీ కొడుకులు బరితెగించి రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ అరాచకాలు సాగిస్తున్నారని, ఇవి ఎంతో కాలం సాగవని మాజీ మంత్రి ఆర్కే రోజా హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ నేతలను ఏ రకంగా ఇబ్బంది పెడుతున్నారో.. రేపటి రోజున వీరికి అదే గతి పడుతుందని స్పష్టం చేశారు. టీడీపీ ప్రభుత్వం 16 నెలల పాలనలో పిన్నెల్లి సోదరులపై 16 అక్రమ కేసులను నమోదు చేయించి జైలు పాలు చేసిందని ధ్వజమెత్తారు. నెల్లూరు కేంద్ర కారాగారంలో రిమాండ్‌లో ఉన్న వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆయన సోదరుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిలను మంగళవారం రోజా, తెనాలి మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణతో కలిసి ములాఖత్ అయ్యారు. అనంతరం జైలు వెలుపల రోజా మీడియాతో మాట్లాడుతూ టీడీపీ నాయకుల ఆధిపత్య పోరులో భాగంగా హత్యలు జరిగితే పిన్నెల్లి సోదరులపై హత్య కేసు నమోదు చేయడం దారుణమన్నారు. ఎన్నికల్లో టీడీపీ నాయకులు రిగ్గింగ్ చేస్తే అడ్డుకున్న పిన్నెల్లిపై కేసులు నమోదు చేసి జైలు పాలు చేశారని విమర్శించారు. జైల్లో సౌకర్యాలు కల్పించాలని కోర్టు ఆదేశించినా అమలు చేయించకుండా కక్ష సాధింపునకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆర్కే రోజా, తెనాలి మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

ప్రజల మన్ననలు పొందిన కుటుంబం : అంబటి మురళీకృష్ణ

మాచర్లలో ప్రజల మన్ననలు పొందిన కుటుంబం పిన్నెల్లి కుటుంబమని పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ పేర్కొన్నారు. పిన్నెల్లి సుందర రామిరెడ్డి, లక్ష్మారెడ్డి, రామకృష్ణారెడ్డిలు వరుసగా మాచర్లలో పోటీ చేసి గెలుపొందారన్నారు. టీడీపీ అక్కడ బలహీనంగా ఉండడంతో ప్రతి ఎన్నికల్లో అభ్యర్థిని మార్చేవారన్నారు. మాచర్లలో ఎలాగైనా పట్టుసాధించాలని పిన్నెల్లి సోదరులపై అక్రమ కేసులు బనాయించారన్నారు. ఈవీఎంల మాయాజాలం, పోలీసుల దమనకాండతో మాచర్లలో టీడీపీ విజయం సాధించినట్టు ఆరోపించారు. కోర్టు పిన్నెల్లి సోదరులకు ప్రత్యేక వసతులు కల్పించాలని ఆదేశించినా 27 రోజులుగా వారికి ఎలాంటి సౌకర్యాలు కల్పించలేదన్నారు.

తెనాలిలో టీడీపీని అంతం చేసే కుట్ర

- ఫ్లెక్సీలను తొలగించేందుకు వచ్చిన అధికారులను అడ్డుకున్న టీడీపీ కౌన్సిలర్లు, నేతలు
- నల్ల రిబ్బన్లు ధరించి బైఠాయింపు
- అధికారులు, టీడీపీ కార్యకర్తల నడుమ తోపులాట

మంత్రి నాదెండ్ల మనోహర్‌పై టీడీపీ శ్రేణుల ఆగ్రహం

నల్లరిబ్బన్లు ధరించి టీడీపీ నేతల బైఠాయింపు

తెనాలి టౌన్: మున్సిపల్ అధికారులు పోలీసుల సాయంతో పట్టణ వహాబ్‌చౌక్‌లో ఫ్లెక్సీల తొలగింపులో హైడ్రామా నెలకొంది. తొలగించిన ఫ్లెక్సీని టీడీపీ నాయకులు తిరిగి నిలబెట్టటమే కాకుండా మరో ఫ్లెక్సీని తీయకుండా అడ్డుకుని, అధికారులపై మండిపడ్డారు. నల్లబ్యాడ్జిలతో ఫ్లెక్సీ ఎదుట కూర్చొని నిరసన తెలియజేశారు. కూటమి ధర్మం వీడి మంత్రి మనోహర్ తమ పార్టీని టార్గెట్ చేశారంటూ టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తెనాలిలో టీడీపీని చంపే ప్రయత్నం చేస్తున్నారంటూ మండిపడ్డారు. చేసేదిలేక అధికారులు, పోలీసులు వెనుదిరిగారు. వివరాల్లోకి వెళితే.. గుంటూరు జిల్లా తెనాలి వహాబ్‌చౌక్‌లోని డివైడర్‌కు రెండు వైపులా టీడీపీ నాయకులు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీల తొలగింపునకు మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అసిస్టెంట్ సిటీప్లానర్ వాణి, తన సిబ్బందితో ఉదయం 11 గంటలకు అక్కడకు చేరుకున్నారు. వహాబ్ చౌక్‌లో డివైడర్‌కు పడమర వైపున్న ఫ్లెక్సీని పొక్లెయిన్‌తో తొలగించారు. డివైడర్‌కు మరోవైపు మున్సిపల్ కౌన్సిలర్, టీడీపీ ఫ్లోర్‌లీడర్ పసుపులేటి త్రిమూర్తి కార్యాలయం ఎదుటగల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఫ్లెక్సీని తొలగించే ప్రయత్నంలో ఉండగా, కౌన్సిలర్ పసుపులేటి త్రిమూర్తి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ ఖుద్దూస్ టౌన్ ప్లానింగ్ అధికారులను అడ్డుకున్నారు. నల్లరిబ్బన్లు ధరించి ఫ్లెక్సీ ఎదుట కూర్చుని నిరసన తెలిపారు.

టీడీపీ శ్రేణులకు అధికారుల మధ్య తోపులాట

జనం రద్దీగా ఉండే సమయంలో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు పోలీసులతో వచ్చి ఫ్లెక్సీల తొలగింపుకు పూనుకోవటం ఏమిటని ప్రశ్నించారు. ఎవరి ప్రోద్బలం లేకుండానే అధికార పార్టీ నేత ఆలపాటి రాజా ఫ్లెక్సీని తొలగించేందుకు అధికారులు అత్యుత్సాహం చూపించడం ఏంటని మండిపడ్డారు. తెనాలిలో టీడీపీని చంపేయడమే లక్ష్యంగా మున్సిపల్ కమిషనర్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ వ్యవహరిస్తున్నారని టీడీపీ పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ ఖుద్దూస్ ఆరోపించారు. డివైడర్ కు ఒకవైపు ఇదంతా జరుగుతుండగా మరోవైపు తొలగించిన ఫ్లెక్సీని కొందరు యువకులు తిరిగి ఏర్పాటుకు ప్రయత్నించారు. దీనిని నిరోధించటానికి పోలీసులు పూనుకోవటంతో తోపులాట జరిగింది. అయినప్పటికీ తొలగించిన ఫ్లెక్సీని టీడీపీ నాయకులు తిరిగి ఏర్పాటుచేశారు. రెండోవైపు తొలగించటానికి సాధ్యంకాక పోలీసులు, మున్సిపల్ సిబ్బంది మౌనంగా ఉండిపోయారు.

■ రెండున్నర గంటల హై డ్రామా తర్వాత టౌన్ ప్లానింగ్ సిబ్బంది అక్కడినుంచి వెళ్లిపోయారు. దీంతో పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి టీడీపీ శ్రేణులను అక్కడి నుంచి పంపించివేశారు. టీడీపీ నాయకులు రావి కృష్ణమోహన్ (చిన్ని), కొల్లూరు శ్రీధర్, తాతా శ్రీను, కె.హరికిషోర్, డాక్టర్ వేమూరి శేషగిరిరావు, అత్తోట శరత్, దుప్పలపూడి శ్యామ్, మల్లవరపు విజయ్ కుమార్, మునగాల నరసింహ, తోట లక్ష్మయ్య, అన్నం పిన్నారావు, పరుచూరి రమ్య, కొండ రమాదేవి, భావన సహా పలువురు టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ టార్గెట్‌గా మంత్రి మనోహర్ పనిచేస్తున్నారు..

ఈ సమయంలోనే టీడీపీ నాయకులు స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌పై ఆరోపణలను గుప్పించారు. తెనాలిలో టీడీపీ ఉనికిని ప్రశ్నార్థకం చేయడమే లక్ష్యంగా మంత్రి మనోహర్ వ్యవహరిస్తున్నారని మహమ్మద్ ఖుద్దూస్ ఆరోపించారు. కూటమి పార్టీ నిబంధనలకు విరుద్ధంగా తెనాలిలో పరిపాలన జరుగుతుందని అన్నారు. ఎన్నికలవేళ జనసేన, టీడీపీ నాయకులను రెండు కళ్లుగా చూస్తానని చెప్పి గెలిచిన తర్వాత టీడీపీ నేతల ముఖం చూడడానికి కూడా మంత్రి మనోహర్ ఇష్టపడడం లేదని వారు దుయ్యబట్టారు. టీడీపీని అభాసుపాలు చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ఒక్క టీడీపీ కౌన్సిలర్ కూడా ఉండకూడదని మంత్రి నిర్దేశించుకున్నాడని, అందుకే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని కౌన్సిలర్ త్రిమూర్తి ఆరోపించారు. ఇటువంటి చర్యలు పునరావృతం అయితే సహించేది లేదని టీడీపీ నాయకులు హెచ్చరించారు.

గుంటూరు చేరుకున్న 'జన చైతన్య యాత్ర '

కొరిటెపాడు(గుంటూరు): ఏపీ – తెలంగాణ బ్యాంక్ ఉద్యోగుల సమాఖ్య (ఏపీ అండ్‌టీబీఈఎఫ్) ఆధ్వర్యంలో ప్రజా రంగ బ్యాంకుల పరిరక్షణ, సామాన్య ప్రజల ప్రయోజనాల పరిరక్షణ లక్ష్యంగా చేపట్టిన 'జన చైతన్య యాత్ర – సైకిల్ రైడ్' విజయవంతంగా కొనసాగుతోంది. విశాఖపట్నం నుంచి తిరుపతి వరకు సుమారు 850 కిలోమీటర్లు, జిల్లా నుంచి జిల్లా, ప్రజల మధ్యకు వెళ్లేలా రామరాజు నిర్వహిస్తున్న సైకిల్ రైడ్ యాత్ర గుంటూరు చేరుకుంది. మంగళవారం మధ్యాహ్నం 12.30 గంటలకు గుంటూరు ఏటుకూరు రోడ్డు వద్ద ఆంజనేయస్వామి విగ్రహం వద్దకు యాత్ర చేరుకుంది. అక్కడ నుంచి గుంటూరులో అన్ని బ్యాంకుల ఉద్యోగులు ప్రధానవీధుల గుండా ర్యాలీ నిర్వహించి జీటీ రోడ్‌లోని యూనియన్‌బ్యాంకు రీజినల్ ఆఫీసు వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా బ్యాంక్ ఎంప్లాయిస్ కో–ఆర్డినేషన్ కమిటీ నాయకులు రామకృష్ణ, వేణుబాబు, రవిచంద్రారెడ్డి, పృథ్వీ, మురళీ షరీఫ్, పావని క్రాంతి, అఖిల, పి.కిషోర్ కుమార్ తదితర నాయకులు మాట్లాడుతూ ప్రజారంగ బ్యాంకులను బలహీనపరచే విధానాలకు వ్యతిరేకంగా, బ్యాంకింగ్ సేవలు సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండేలా ఈ ఉద్యమం కొనసాగుతుందని తెలిపారు. ఈ యాత్రకు ప్రజలు, ఉద్యోగుల నుంచి లభిస్తున్న విశేష స్పందన ఉద్యమానికి మరింత బలం చేకూరుస్తోందని పేర్కొన్నారు. బ్యాంకులు ప్రభుత్వ రంగంలోనే ఉండాలని, ప్రజలను చైతన్యపరుస్తూ బ్యాంకులను కాపాడు కోవాలని తెలిపారు. ఈ సైకిల్ యాత్రను కొనసాగిస్తూ రామరాజు చిలకలూరిపేట మీదుగా ఒంగోలు వెళ్లారు.

సచివాలయాల్లో ఈ-గవర్నెన్స్ అమలు

జడ్పీ చైర్‌పర్సన్ హెనీక్రిస్టినా

నగరంపాలెం (గుంటూరు వెస్ట్): గ్రామీణ ప్రాంతాల్లోని సచివాలయాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఈ – గవర్నెన్స్ అప్లికేషన్స్ అమలు చేయాలని గుంటూరు జడ్పీ చైర్‌పర్సన్ హెనీక్రిస్టినా అన్నారు. జిల్లాపరిషత్ (జడ్పీ) ఆవరణలోని హాల్‌లో మంగళవారం పంచాయతీరాజ్ డిప్యూటీ ఎంపీడీఓలు, పరిపాలనాధి కారులు (ఏఓ), సీనియర్/ జూనియర్ సహాయకులు (ఎస్ఏ/జేఏ), పంచాయతీ అభివృద్ధి అధికారుల (పీడీఓ)కు ఈ-గవర్నెన్స్‌పై ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఈ–ఆఫీస్, పీఆర్–ఒన్, ఈ–క్రాఫ్, వాట్సాప్ యాప్ గవర్నర్స్ తదితర అంశాలపై పూర్తిస్థాయిలో శిక్షణ పొందాలని అన్నారు. గ్రామీణ ప్రాంతం నుంచి జిల్లా స్థాయిలోని ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఈనెల ఒకట్నుంచి ఈ–ఆఫీస్ ద్వారా ఫైల్స్‌ను నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ క్రమంలో దీనిపై తర్ఫీదు పొందేందుకు శిక్షణ నిర్వహించినట్లు తెలిపారు. డీపీఆర్‌సీ ఏఓ ప్రతాప్‌కుమార్, జడ్పీపీ ఏఓ శామ్యూల్, డీటీఎం కె.నాగేశ్వరరావు, రిసోర్స్ పర్సన్స్ కె.శ్రీనివాసరావు, కె.అనురాధ, డి.రవీంద్రబాబు పాల్గొన్నారు.

శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంచుకోవాలి

ప్రసంగిస్తున్న ఐఎఫ్ఎస్ అధికారిణి భరణి

తాడేపల్లి రూరల్: క్రీడల ద్వారా యువత శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని ఐఎఫ్ఎస్ అధికారిణి భరణి వ్యాఖ్యానించారు. మంగళవారం తాడేపల్లి రూరల్, వడ్డేశ్వరంలో మూడు రోజులుగా జరుగుతున్న సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్శిటీ టోర్నమెంట్–2026 ముగింపు వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా భరణి ప్రసంగిస్తూ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో కూడా సత్తా చాటాలని కోరారు. రానున్న కాలంలో కేఎల్‌యూ వేదికగా జాతీయ అంతర్జాతీయ క్రీడలు జరుగుతాయని తెలిపారు. కేఎల్‌యూ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ జి.పార్థసారధి వర్మ మాట్లాడుతూ కర్నాటకకు చెందిన జైన్ యూనివర్శిటీ ప్రథమ స్థానంలో, కేఎల్‌యూ ద్వితీయ స్థానం, చెన్నై ఎస్ఆర్ఎం యూనివర్శిటీ జట్టు తృతీయ, కేరళ కాలికట్ యూనివర్శిటీ నాల్గవ స్థానంలో నిలిచాయని పేర్కొన్నారు. అనంతరం పరిశ్రమల అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ శివజ్యోతి, ఐఎఫ్ఎస్ అధికారిణి భరణి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఆలిండియా యూనివర్శిటీల పరిశీలకులు మనోజ్‌కుమార్, వర్శిటీ ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్‌రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, క్రీడల డైరెక్టర్ డాక్టర్ కె.హరికిషోర్, విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్‌చార్జి డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, సలహాదారు డాక్టర్ హబీబుల్లా ఖాన్, వ్యాయామ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

కాకుమాను పోలీసుల తీరుపై ఆగ్రహం

- స్తంభం పీకేశారంటూ నలుగురు విద్యార్థులను స్టేషన్‌కు పిలిపించిన పోలీసులు
- మా పిల్లలను ఎందుకు కొట్టారంటూ స్టేషనుకు వెళ్లి పోలీసులను ప్రశ్నించిన తల్లిదండ్రులు

గుంటూరు: పోలీసులు దాష్టీకానికి పాల్పడ్డారని ఆరోపిస్తూ మంగళవారం రాత్రి అప్పాపురం దళితవాడవాసులు కాకుమాను పోలీస్ స్టేషను వద్ద ఆందోళన వ్యక్తం చేసిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం .. కాకుమాను మండలం అప్పాపురం గ్రామానికి చెందిన కొందరు సోమవారం వాలీబాల్ ఆడుకునే నెట్ కట్టుకునేందుకు ఓ వీధిలో ఉన్న టెలిఫోన్ స్తంభం పీకారు. ఆ సమయంలో స్తంభానికి చుట్టి ఉన్న విద్యుత్ వైర్లు కదిలి ఇళ్లలోని విద్యుత్ పరికరాలు దెబ్బతిన్నాయంటూ గ్రామానికి చెందిన ఓ మహిళ కాకుమాను పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు సంబంధిత గ్రామానికి వెళ్లి ప్రాథమికంగా విచారించి, ఘటనకు పాల్పడిన విద్యార్థులను స్టేషనుకు రావాలని సూచించారు. ఈ నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం నలుగురు, సాయంత్రం మరో ముగ్గురు విద్యార్థులు స్టేషనుకు వెళ్లారు. వారిలో నలుగురిని పోలీసులు తమదైన శైలిలో విచారించి కొట్టారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ మంగళవారం రాత్రి అప్పాపురం దళితవాడ వాసులు, యువకుల తల్లిదండ్రులు, కాలనీవాసులు స్టేషను వద్దకు చేరుకుని పోలీసులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ కాలనీకి చెందిన దళితులనే స్టేషనుకు పిలిపించి, వారిని కొట్టడం ఏమిటని ప్రశ్నించారు. దీనిపై ఎస్ఐ ఏక్‌నాథ్‌ను వివరణ కోరగా యువకులను స్టేషనుకు రమ్మని కౌన్సెలింగ్ ఇచ్చి పంపామని ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని తెలిపారు.

కెనరా బ్యాంక్ Canara Bank

ప్రాంతీయ కార్యాలయం : గుంటూరు
రికవరీ సెక్షన్, జె.కె.సి. కాలేజ్ రోడ్డు, 5వ లైను, విజయపురి, గుంటూరు-6. ఫోన్: 9492758257, 8019308696

స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూలు 8(6) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన.

సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన కెనరా బ్యాంక్ వారికి దిగువ తెలిపిన ఋణగ్రహీత(లు)/హామీదారు(లు) చెల్లించవలసిన బకాయి మొత్తంను రాబట్టుకొనుటకు కెనరా బ్యాంక్ అధీకృత అధికారిచే నిర్మాణాత్మక/భౌతికంగా స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టిన/ఛార్జి చేసిన దిగువ వివరించిన స్థిరాస్తులను తేది 28.01.2026 న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయించబడునని యావన్మంది ప్రజానీకానికి మరియు ముఖ్యంగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు & హామీదారులకు తెలియజేయడమైనది.

ఇ-వేలం తేది: 28.01.2026, మ॥ 02.00 గం.ల నుండి సా॥ 04.00 గం.ల వరకు
(అమ్మకం ముగిసేవరకు ప్రతి 5 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో)

రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును M/s. పిఎస్‌బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (baanknet) పోర్టల్ యొక్క ఇ-వ్యాలెట్‌లో నేరుగా గాని లేదా ఆ పోర్టల్‌లో చలానా జెనరేట్ చేసుకొని చలాన్‌లోని ఖాతా వివరములకు ధరావత్తును RTGS/NEFT ద్వారా తేది: 27.01.2026, మ॥ 12.00 గం.ల లోపుగా పొందుపరిచి జమచేయాలి.

కెనరా బ్యాంక్, గుంటూరు గోరంట్ల బ్రాంచ్ (6078), ఫోన్: 83338 13834

1. ఋణగ్రహీత: శ్రీ బండి వెంకటేష్, తండ్రి: శ్రీనివాసరావు
తేది 31.12.2025 నాటికి బకాయి మొత్తం: రూ. 32,27,240.24/- + తదుపరి వడ్డీ, వ్యయాలు & ఇతర ఛార్జీలు.
బ్యాంకుకు తెలిసిన సమాచారం ప్రకారం ఎటువంటి ఎన్‌కంబ్రెన్స్‌లు లేని స్థిరాస్తి వివరములు:
ఎ-షెడ్యూల్: గుంటూరు జిల్లా, కొరిటెపాడు సబ్-జిల్లా, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, గోరంట్ల గ్రామం, డి.నెం.471 మొత్తం ఎ.11-33 సెంట్లలో ఎ.2-00 సెంట్లలో ప్లాట్ నెం.24 విస్తీర్ణం 619-233చ॥గ॥ స్థలం. ప్లాన్ ప్రకారం దక్షిణంవైపు 501 చ॥గ॥ల స్థలంలోని "పవన్ రెసిడెన్సీ" అపార్ట్‌మెంట్ నిర్మించబడినది 6వ బ్లాక్. హద్దులు: తూర్పు: 62.9 అ॥ - ఇతరుల ప్లాట్లు స్థలం, దక్షిణం: 33 అ॥ వెడల్పు రోడ్డు - 71.9 అ॥, పడమర: 33 అ॥ల వెడల్పు రోడ్డు - 62.9 అ॥లు, ఉత్తరం: 72.0 అ॥ - లేతంశెట్టి వెంకటేశ్వర్లు యొక్క స్థలం. ఈ హద్దులలో 418.88 చ॥మీ॥ లేదా 501 చ॥గ॥ విస్తీర్ణంలోని నివాస స్థలం.
బి-షెడ్యూల్: అవిభాజ్యపు మరియు అనిర్దేశపు 40 చ॥గ॥ లేదా 33.44 చ॥మీ॥ వాటాతో "పవన్ రెసిడెన్సీ" అపార్ట్‌మెంట్ రెండవ అంతస్తులోని ఫ్లాట్ నెం.203. హద్దులు: తూర్పు: శూన్యాకాశం, దక్షిణం: శూన్యాకాశం, పడమర: కామన్ కారిడార్ మరియు మెట్లు, ఉత్తరం: శూన్యాకాశం. "పవన్ రెసిడెన్సీ" అపార్ట్‌మెంట్ రెండవ అంతస్తులో 1250 చ॥అ॥ (సాధారణ ప్రాంతం మరియు కార్ పార్కింగ్ కలుపుకొని) ఫ్లాట్ నెం.203, అన్ని ఫిక్చర్‌లు మరియు ఫిట్టింగ్‌లతో నిర్మించబడింది.
రిజర్వుధర రూ. 29,00,000/- | ధరావత్తు సొమ్ము రూ. 2,90,000/-

కెనరా బ్యాంక్, బృందావన్ గార్డెన్స్ బ్రాంచ్ (13276), ఫోన్: 9440905117

2. ఋణగ్రహీత(లు): శ్రీ షేక్ మొయినుద్దీన్ మరియు శ్రీమతి షేక్ నసీమ్ అరా .
తేది 31-12-2025 నాటికి బకాయి: రూ. 33,11,649.96/- + తదుపరి వడ్డీ, వ్యయాలు & ఛార్జీలు.
బ్యాంకుకు తెలిసిన సమాచారం ప్రకారం ఎటువంటి ఎన్‌కంబ్రెన్స్‌లు లేని స్థిరాస్తి వివరములు :
ఎ షెడ్యూల్: గుంటూరు జిల్లా, గుంటూరు సబ్-జిల్లా, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, కంకరగుంట ఏరియా, మున్సిపల్ పాత వార్డ్ నెం. 17, బ్లాక్ నెం. 4, డోర్ నెం. 28-1-79, టి.యస్.నెం. 67, సబ్ డివిజన్ సర్వే నెం. 67/1 మరియు 67/2 లో 541-5 చ॥గ॥ల స్థలం మరియు MID సిటీ అపార్ట్‌మెంట్ హద్దులు: తూర్పు: ప్రభుత్వ డొంకా - 63-9 అ॥లు, దక్షిణం: 15 అ॥లు గల్లీ బజార్ - 93-6 అ॥లు, పడమర: పాదిపులును సుబ్రహ్మణ్యం యొక్క ఆస్తి - 35-6 అ॥లు, ఉత్తరం: పుదోట సుబ్బయ్య యొక్క ఆస్తి - 103-0 అ॥లు.
బి షెడ్యూల్: అవిభాజ్యపు మరియు అనిర్దేశపు స్థలం 67.6875 చ॥గ॥ లేదా 56.59 చ॥మీ॥ వాటాతో "మిడ్ సిటీ హోమ్స్", 2వ అంతస్తు నందు ఫ్లాట్ నెం. 301, హద్దులు: తూర్పు: గ్రౌండ్‌లో ఓపెన్ ఏరియా, దక్షిణం: మున్సిపల్ రోడ్డు ఆనుకొని గ్రౌండ్‌లో ఓపెన్ ఏరియా, పడమర: ఉమ్మడి మెట్లు ఉమ్మడి వరండా మరియు ఉమ్మడి లిఫ్ట్, ఉత్తరం: గ్రౌండ్‌లో ఓపెన్ ఏరియా. ఈ హద్దులలో నిర్మించిన అపార్ట్‌మెంట్ "మిడ్ సిటీ హోమ్స్", 2వ అంతస్తు, ప్లింత్ ఏరియా 1500 చ॥అ॥ (ఉమ్మడి ఏరియాలు కలుపుకొని) ఫ్లాట్ నెం. 301 ఉమ్మడి సౌకర్యాలతో మరియు ఉమ్మడి దారి హక్కులతో, స్టిల్ట్ ఫ్లోర్‌లో ఒక కారు పార్కింగ్ మరియు ఉమ్మడి పార్కింగ్ సౌకర్యాలతో సహా యావత్తు.
రిజర్వుధర: రూ. 46,60,000/- | ధరావత్తు సొమ్ము: రూ. 4,66,000/-

కెనరా బ్యాంక్, తెనాలి-2 బ్రాంచ్ (13272), ఫోన్: 94409 05143

3. ఋణగ్రహీత: శ్రీ తాళ్లూరి వర కుమారి (లేటు శ్రీ తాళ్లూరి ఆచారయ్య యొక్క చట్టపరమైన వారసురాలు).
తేది 31.12.2025 నాటికి బకాయి మొత్తం: రూ. 16,52,031.41/- + తదుపరి వడ్డీ, వ్యయాలు & ఇతర ఛార్జీలు.
బ్యాంకుకు తెలిసిన సమాచారం ప్రకారం ఎటువంటి ఎన్‌కంబ్రెన్స్‌లు లేని స్థిరాస్తి వివరములు:
గుంటూరు జిల్లా, తెనాలి రెవెన్యూ జిల్లా, తెనాలి మున్సిపల్, 7వ వార్డు, 13వ బ్లాక్, టి.యస్.నెం. 504, డోర్ నెం. 20-36-21/1 కలిగిన 103.20 చ॥గ॥ లేదా 86.31 చ॥మీ॥ విస్తీర్ణంలోని రెసిడెన్షియల్ ఆర్‌సిసి రూఫ్ క్రింది & మొదటి అంతస్తు గల బిల్డింగ్ యావత్తు. హద్దులు: తూర్పు: మున్సిపల్ రోడ్డు - 30-00 అ॥లు, దక్షిణం: కంచెర్ల ఆశీర్వాదం & ఇతరుల యొక్క ఆస్తి - 32-00 అ॥లు, పడమర: మెరుగు సుదర్శనం యొక్క ఆస్తి - 29-00 అ॥లు, ఉత్తరం: ఉమ్మడి గల్లీ - 31-00 అ॥లు.
రిజర్వుధర రూ. 33,00,000/- | ధరావత్తు సొమ్ము రూ. 3,30,000/-

అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ www.canarabank.com లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్‌ను రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్ సంబంధిత బ్రాంచ్ మేనేజర్ గారిని లేదా కెనరా బ్యాంక్, గుంటూరు ప్రాంతీయ కార్యాలయం, అధీకృత అధికారి గారిని బ్యాంకు పనివేళలలో సంప్రదించగలరు.
ఇ-వేలం విధానం, నియమ నిబంధనల కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి: మెస్సర్స్ పిఎస్‌బి అలయన్స్ (baanknet), వెబ్‌పోర్టల్ http://baanknet.com హెల్ప్‌డెస్క్: 8291220220, ఇ-మెయిల్: support.baanknet@psballiance.com

తేది: 05.01.2026, ప్రదేశం: గుంటూరు | సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

కెనరా బ్యాంక్ Canara Bank

ఎ ఆర్ ఎమ్ బ్రాంచ్, సర్కిల్ ఆఫీస్, డి.నెం.54-15-4బి, క్రింది అంతస్తు, లక్ష్మీ అవెన్యూ, శ్రీనివాస నగర్ బ్యాంక్ కాలనీ, రింగ్ రోడ్డు, విజయవాడ - 520008, ఆంధ్రప్రదేశ్. ఫోన్: 8331011695. ఇ-మెయిల్ :armvij@canarabank.com

స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని 9(6) నిబంధనలతో చదువబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన

[illegible] తేది.27.01.2026న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయించబడునని [illegible]

ఇ-వేలం తేది & సమయం : తేది.27.01.2026, మ॥ 2.00 గం.ల నుండి సా॥ 4.00 గం.ల వరకు (అమ్మకం ముగిసే వరకు ప్రతి 5 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో) ధరావత్తు సమర్పించుటకు ఆఖరి తేది : 27.01.2026, మ॥ 12.00 గం॥ల లోపు

రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును మెస్సర్స్ పిఎస్‌బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (baanknet) పోర్టల్ యొక్క ఇ-వ్యాలెట్‌లో నేరుగా గాని లేదా ఆ పోర్టల్‌లో చలానా జెనరేట్ చేసుకొని చలాన్‌లోని ఖాతా వివరములకు ధరావత్తును RTGS/ NEFT ద్వారా తేది: 27.01.2026, మ॥ 12.00 గం.ల లోగా పొందుపరచి జమ చేయాలి.

ఋణగ్రహీత / హామీదారులు & బ్రాంచ్ వివరములు (అన్నీ ఖాతాలు ఎ.ఆర్.ఎమ్ బ్రాంచ్, విజయవాడకు బదిలీ చేయబడినవి)	ఆస్తి వివరములు	రిజర్వు ధర (రూ.లలో)	ఇ.ఎం.డి (రిజర్వు ధరలో 10%)
ఎఆర్‌ఎమ్ బ్రాంచ్, విజయవాడ. మెస్సర్స్ లక్ష్మీ వినాయక ట్రేడర్స్, ప్రొప్రైయిటర్ : శ్రీ సాసం కోటేశ్వరరావు, తండ్రి : [illegible] బకాయి మొత్తం : రూ.5,11,57,980.85 పై + వడ్డీ + ఇతర ఖర్చులు	రిజిస్టర్డు సెటిల్‌మెంట్ డీడ్ తేది.11.12.2008 నాటి డాక్యుమెంట్ నెం.11709/2008 ప్రకారం [illegible] 1000 చ॥గ॥లు లేదా 836.13 చ॥మీ॥ విస్తీర్ణం గల స్థలం.హద్దులు: డీడ్ ప్రకారం. పైన తెలిపిన స్థలం విస్తీర్ణం 1000 చ॥గ॥లు లేదా 836.13 చ॥మీ॥లు.,	రూ. 424.65 లక్షలు	రూ. 42.46 లక్షలు
రిజిస్టర్డు సెటిల్‌మెంట్ డీడ్ తేది. 09.08.2004 నాటి డాక్యుమెంట్ నెం. 10009/2004 ప్రకారం: గుంటూరు జిల్లా, గుంటూరు సబ్ - డిస్ట్రిక్ట్, [illegible] 25 చ॥గ॥లు లేదా 20.90 చ॥మీ॥లు విస్తీర్ణం గల స్థలం హద్దులు: డీడ్ ప్రకారం. పైన తెలిపిన స్థలం విస్తీర్ణం 25 చ॥గ॥లు లేదా 20.90 చ॥మీ॥లు., పైన తెలిపిన ఆస్తి యొక్క CERSAI Id : 400093329797			

ఋణగ్రహీత / హామీదారులు & బ్రాంచ్ వివరములు (అన్నీ ఖాతాలు ఎ.ఆర్.ఎమ్ బ్రాంచ్, విజయవాడకు బదిలీ చేయబడినవి)	ఆస్తి వివరములు	రిజర్వు ధర (రూ.లలో)	ఇ.ఎం.డి (రిజర్వు ధరలో 10%)
ఏఆర్ఎమ్ బ్రాంచ్, విజయవాడ. [illegible] బకాయి మొత్తం : రూ.83,22,546.87 పై + వడ్డీ + ఇతర ఖర్చులు	డాక్యుమెంట్ నెం.2612/1985 ప్రకారం శ్రీ ఇందుర్తి రామారావు, తండ్రి : [illegible] తెనాలి మున్సిపల్ ఏరియా, డోర్ నెం. 32-6-8 [illegible] ఎస్.నెం. 119/2 లోని ఎ.0.91 సెంట్లు మొత్తం విస్తీర్ణంలో 174.6 చ॥గ॥లు లేదా 144.36 చ॥మీ॥ల విస్తీర్ణం గల స్థలం యావత్తు ఆస్తి. హద్దులు: డీడ్ ప్రకారం. పైన తెలిపిన ఆస్తి యొక్క CERSAI Id : 200032445490 1	రూ. 28.00 లక్షలు	రూ. 2.80 లక్షలు

ఋణగ్రహీత / హామీదారులు & బ్రాంచ్ వివరములు (అన్నీ ఖాతాలు ఎ.ఆర్.ఎమ్ బ్రాంచ్, విజయవాడకు బదిలీ చేయబడినవి)	ఆస్తి వివరములు	రిజర్వు ధర (రూ.లలో)	ఇ.ఎం.డి (రిజర్వు ధరలో 10%)
[illegible] బ్రాంచ్, గుంటూరు. [illegible] బకాయి మొత్తం : రూ.47,09,308.85 పై + వడ్డీ + ఇతర ఖర్చులు	(డాక్యుమెంట్ నెం.1093/1994 ప్రకారం) [illegible] బ్లాక్ నెం.7, [illegible] డోర్ నెం. 7-262 లోని 101 చ॥గ॥లు [illegible] హద్దులు: డీడ్ ప్రకారం. పైన తెలిపిన ఆస్తి CERSAI Id : 400056582359	రూ. 36.81 లక్షలు	రూ. 3.68 లక్షలు

ఆస్తి తనిఖీ తేది & సమయం : తేది.23.01.2026, ఉ॥ 11.00 గం.ల నుండి సా॥ 4.00 గం.ల వరకు

అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ (www.canarabank.com) లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్‌ను రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్, ఎ.ఆర్.ఎం బ్రాంచ్, విజయవాడ అధీకృత అధికారి గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్ : 8331011695.

బ్యాంకుకు తెలిసిన / తెలియని బకాయిలు / ట్యాక్స్‌లు ఏవైనా ఉన్నచో ఇ-వేలం కొనుగోలుదారే భరించాలి మరియు తుది బిడ్ మొత్తంతో పాటు అవి కూడా చెల్లించవలసి ఉంటుంది. బిడ్డర్లు తమ ఆఫర్‌లను, ఆస్తి రిజర్వు ధర 25 లక్షల నుండి 50 లక్షల వరకు ఉన్న వాటికి రూ. 25,000/- గుణింపులో హెచ్చించవలెను, ఆస్తి రిజర్వు ధర 100 లక్షల నుండి 500 లక్షల వరకు ఉన్నట్లయితే రూ.1,00,000/- మరియు 500 లక్షలు కన్నా ఎక్కువ ఉన్నట్లయితే రూ.5,00,000/- గుణింపులో హెచ్చించవలెను. 'ఆన్‌లైన్' వేలం ముగిసే లోపు అత్యధిక బిడ్ (రిజర్వు ధర కన్నా ఎక్కువ) సమర్పించిన బిడ్డర్ విజయవంతమైన బిడ్డర్‌గా ప్రకటించబడతారు.

ఇ-వేలం విధానం, నియమ నిబంధనల కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి : మెస్సర్స్ పిఎస్‌బి అలియన్స్ (baanknet). వెబ్‌పోర్టల్: "https://baanknet.com/eauction-psb". హెల్ప్‌డెస్క్:7046612345/6354910172/8291220220/9892219848/8160205051, ఇ-మెయిల్:support.baanknet@psballiance.com

తేది : 02-01-2026, ప్రదేశం : విజయవాడ | సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■6 నెలల్లో any డిగ్రీ, PG, డిప్లొమా, B.tech, BAMS, BHMS, D. ఫార్మసీ, B. ఫార్మసీ, LLB, U.G.C యూనివర్శిటీస్ నుండి పూర్తిచేయండి. ✆ 99895 30727

REAL ESTATE

PLOT FOR SALE

■అతి తక్కువ ధరకే గుంటూరు జిల్లా అంగలకుదురులో నాలుగు సెంట్లు స్థలం అమ్మకానికి కలదు. ఒక సెంట్ 5లక్షలు సంప్ర॥ 9515520741

SERVICES

GOLD FINANCE

■బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071

■బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. ✆ 8333833368

■Best Money Gold బ్యాంకులలో ఇతర ప్రవేట్ సంస్థల్లో తాకట్టులో ఉన్న మీ బంగారాన్ని విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును. Nr Dt. 9150011538, 9750497504

WANTED

■Reuirements as Graphic Designer Sales, Teachers, Hardware Networking, Site Engineers, Telecallers. Q: Any Graduate. loc: AP & TG 7799261057

■MNC, LTD కంపెనీల్లో కం॥ఆపరేటర్స్, రిసెప్షనిస్ట్, టెలికాలర్స్, సూ॥వైజర్స్, అకౌంటెంట్స్, ఆఫీస్ ఎగ్జిక్యూటివ్స్, హెల్పర్స్, జీ: 10-25వేలు. ఫోన్ 78939 76590

■ఫ్రీ కంప్యూటర్ స్పోకెన్ ఇంగ్లీష్, MS ఆఫీస్ కోర్సు 3నెలల శిక్షణఇచ్చి జాబ్ చూపబడును. ఫ్రీ భోజనం & హాస్టల్, 10th, ఇంటర్, డిగ్రీ, వ:18-28 సం॥లోపు ✆ 9133444985 / 89

■Montessori School, Gnt. Wanted Qualified Primary Teachers, P.E.T, Receptionist మరియు వాచ్ మాన్ ఫ్యామిలీ కావలెను. 8121400100

■Wanted B or D Pharmacy Candidates to work in a pharmacy Guntur City, pci registration mandatory. 6300975241

■శ్రీ శాంతి హోమ్‌కేర్ తెనాలి, గుంటూరు, రేపల్లె, నందు పనిచేయుటకు ఆయాలు కేర్ టేకర్స్, నర్సులు(M/F) కావలెను. 7995123705, 7893145549

■గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజ్ నందు వార్డెన్స్ మరియు హాస్టల్ ఇన్‌ఛార్జ్‌గా పని చేయుటకు స్త్రీలు కావలెను. జీతము: 10,000/- నుండి 13000/- వరకు ఇవ్వబడును. (ఉచిత భోజనము వసతి కల్పించబడును) విద్యా అర్హతలు : ఇంటర్ మరియు డిగ్రీ, వయస్సు: 22సంవత్సరములపైన ఉండవలెను. వివరముల కొరకు సంప్రదించగలరు. ఫోన్ నెంబర్ : 9100024059

■గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజ్ నందు క్లాసు ఇన్‌ఛార్జ్ మరియు క్యాంపస్ ఇన్‌ఛార్జ్‌గా పని చేయుటకు పురుషులు కావలెను. జీతము: 14,000/- నుండి 21000/- వరకు ఇవ్వబడును. అర్హతలు: ఇంటర్ నుండి పి.జి వరకు వయస్సు: 22 సంవత్సరాలు నుండి 45సంవత్సరాలు వరకు ఉండవలెను. గుంటూరు లోకల్ వ్యక్తి అయ్యి ఉండాలి. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 9100069089

■నరసరావుపేట హాస్పిటల్లో పనిచేయుటకు లేడీస్ సెక్యూరిటీ కావలెను. డ్యూటీ 8 గం, జీతం 12K, ESI, PF, Qul: ఇంటర్ P/F. ✆ 73866 88787

■ప్రముఖ బ్యాంకింగ్ రికవరీ ఏజెన్సీ గుంటూరులో Experience Field Executives కావలెను. Salary: 15-20K + Incentive. ✆ 72079 42933

■త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం జీ: 18K-20K.Ph: 9640400073, 9160900024

■ప్రముఖ హోంకేర్ సంస్థ Hydలో వృద్ధులకు, పేషెంట్లకు సేవ చేయుటకు బేబీకేర్, ఇంటి/వంట పనికి స్త్రీ/పు. కావలెను. జీ : 18,000 to 24,000. రూం+మీల్స్ ఫ్రీ. Ph: 9347148051

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ఎడిషన్
రూ.475/- మాత్రమే
ప్రతి అదనపు లైను రూ.100 మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
గుంటూరు
7075167663
7075167541

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గుర్తించగలరు.

క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

మంగళగిరి టౌన్: మంగళగిరి పట్టణ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.సురేష్‌బాబు మంగళవారం తెలిపారు. నగర పరిధిలోని కొప్పురావు కాలనీ, భార్గవపేట, దేవుడి మాన్యం, బాప్టిస్ట్‌పేట, ఎన్‌సీసీ రోడ్ ప్రాంతాల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని అన్నారు. ఆయా ప్రాంత విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన పేర్కొన్నారు.

బావపై కొడవలితో బావమరిది దాడి

ఫిరంగిపురం: మద్యం మత్తులో వరసకు బావ అయిన వ్యక్తి తలపై బావమరిది కొడవలితో దాడి చేశాడు. ఈ సంఘటన మండలంలోని వేములూరిపాడు గ్రామంలో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కె.రాజు వరసకు బావ అయిన వేణుతో మద్యం మత్తులో వాగ్వాదానికి దిగాడు. మాటామాటా పెరగడంతో ఆగ్రహించిన రాజు పక్కనే ఉన్న కొడవలితో బావ వేణుపై దాడి చేశాడు. దీంతో వేణు తలపై తీవ్రంగా గాయాలయ్యాయి. అనంతరం రాజు ఫిరంగిపురం వచ్చి పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. తీవ్రగాయాలైన వేణును స్థానికులు గుంటూరు జీజీహెచ్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బడ్డీకొట్టు అందజేత

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధి గుండిమెడ గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి తాడేపల్లి టీడీపీ నాయకులు బడ్డీకొట్టును మంగళవారం ప్రారంభించి అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు కొమ్మారెడ్డి కిరణ్ మాట్లాడుతూ.. గుండిమెడ గ్రామానికి చెందిన గుండిమెడ జోజి, సుధా దంపతులు జీవనోపాధి కోసం రూ.28 వేల వ్యయంతో బడ్డీకొట్టును అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చిగురుపాటి సుబ్బారావు, వీరాంజనేయ ప్రసాద్, మందపాటి బాబూరావు, కుమార్, గుండిమెడ చిన్నబాబు, ఎం.సురేష్, ఎస్.అరుణ్‌కుమార్, కంచర్ల కల్యాణ్, తేజ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలో నివాసం ఉంటూ అనారోగ్యానికి గురైన వారికి మంగళవారం తాడేపల్లి టీడీపీ నాయకులు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా తాడేపల్లి పట్టణ టీడీపీ అధ్యక్షులు వల్లభనేని వెంకటరావు మాట్లాడుతూ.. తాడేపల్లి పట్టణ పరిధిలోని 13వ వార్డుకి చెందిన చంద్రమౌళి సుప్రజకు రూ.40,350లు, 19వ వార్డుకి చెందిన తుపాకుల వెంకటేశ్వర్లుకి రూ.41,360ల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశామని తెలిపారు. చెక్కులను మంజూరు చేయించిన మంత్రి నారా లోకేష్‌కు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు చల్లా రంగయ్య, సైతం సాంబయ్య, గోలి శౌరి, శ్రీను, కాటాబత్తుని నిర్మల, షేక్ సైదా, జోజమ్మ, గుడివాడ రాజేష్, పద్మ పాల్గొన్నారు.

మంగళగిరి టౌన్: మంగళగిరి పట్టణ, మండల పరిధిలోని పలువురు లబ్ధిదారులకు స్థానిక టీడీపీ నాయకులు మంగళవారం సీఎంఆర్ఎఫ్, ఎల్‌వోసీ పత్రాలను అందజేశారు. మంగళగిరి పట్టణం 27వ వార్డుకు చెందిన నూతలపాటి వెంకటేశ్వరరావుకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి విడుదలైన రూ.2,51,000ల విలువ గల చెక్కును నాయకులు అందజేశారు. మంగళగిరి మండలం పెదవడ్లపూడికి చెందిన సుంకర ఉమామహేశ్వరరావుకు రూ.10 లక్షల ఎల్‌వోసీను స్థానిక నాయకులు అందజేశారు.

పెనుమాక ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవం నేడు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధి పెనుమాకలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల 42వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నామని కళాశాల ప్రిన్సిపల్ ఎం.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. వార్షికోత్సవ వేడుకలు ఉదయం 9.30 గంటలకు జాతీయ పతాకావిష్కరణతో ప్రారంభమవుతాయని వివరించారు. వార్షికోత్సవ వేడుకలకు పలువురు అధికారులు, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు హాజరు కానున్నారని అన్నారు. పూర్వ విద్యార్థులు ఈ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

9న ఉరుసు మహోత్సవం

మంగళగిరి టౌన్: మంగళగిరిలోని శ్రీ హజరత్ సయ్యద్ మాలక్ హుస్సేన్ ఆవులియా 58వ ఉరుసు గంధ మహోత్సవాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 200 ఏళ్ల చరిత్ర కలిగిన పుణ్యక్షేత్రమైన శ్రీ హజరత్ సయ్యద్ మాలక్ హుస్సేన్ ఆవులియా ఉరుసు మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఉదయం 8 గంటలకు ఫాతెహ ప్రసాదం పంపిణీ, ఊరేగింపు, రాత్రి గంధము జెండా మహోత్సవం, 10వ తేదీ సాయంత్రం 6 గంటలకు దీపారాధన, 7 గంటలకు అన్నదానం, గంధ ప్రసాదము పంపిణీ, 10 గంటలకు భావలి కార్యక్రమాలు నిర్వహించనున్నామని వివరించారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు.

గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలి

ఫిరంగిపురం మండల గ్రామపార్టీ అధ్యక్షుల సమావేశంలో వజ్రబాబు

మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబు

తాడికొండ: సమష్టి సహకారంతో అందరినీ కలుపుకొని వెళుతూ గ్రామస్థాయి నుంచే వైఎస్సార్ సీపీని మరింతగా బలోపేతం చేయాలని పార్టీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు తెలిపారు. మంగళవారం గుంటూరు మల్లికార్జున పేటలోని తాడికొండ నియోజకవర్గ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్టీకి ప్రతి కార్యకర్త సేవలు అవసరమేనని.. అందరినీ కలుపుకొని వెళుతూ ప్రతి ఒక్కరికీ ప్రాధాన్యతనిచ్చి ముందుకు నడిపించాల్సిన బాధ్యత గ్రామపార్టీ అధ్యక్షులపై ఉందని వనమా అన్నారు.

అంకిత భావంతో పనిచేయాలి..

రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ కమిటీల నియామకంలో పార్టీకి అంకిత భావంతో పనిచేసిన వారికి పదవులు కేటాయించి సముచిత స్థానం కల్పించామని.. వీరందరూ ప్రస్తుతం ఉత్సాహంగా పనిచేస్తున్నారని వనమా పేర్కొన్నారు. తాడికొండ నియోజకవర్గంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా ఉన్నారనేందుకు ఇటీవల నిర్వహిస్తున్న కార్యక్రమాలకు కార్యకర్తలు ప్రజల నుంచి వస్తున్న ఆదరణే నిదర్శనమన్నారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రజలకు అందరూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ అందరికీ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందేలా కలిసికట్టుగా పనిచేయాలన్నారు. ఫిరంగిపురం మండల నాయకులు, కార్యకర్తల పనితీరు బాగుందని.. మరింతగా పార్టీని బలోపేతం చేసేందుకు అందరూ కలిసికట్టుగా ముందుకు నడవాలని వనమా సూచించారు.

అందరికీ అందుబాటులో ఉంటా..

చిన్నపాటి సమస్యలు ఉంటే నేరుగా ప్రతి కార్యకర్త, నాయకుడు తమ దృష్టికి తీసుకురావాలని, ఉదయం నుంచి సాయంత్రం వరకు పార్టీ కార్యాలయంలో అందరికీ అందుబాటులో ఉంటానని, 24 గంటలు తన ఫోన్ అందుబాటులో ఉంటుందని వనమా తెలిపారు. కార్యక్రమంలో ఫిరంగిపురం మండల పార్టీ అధ్యక్షులు మార్పుల శివరామిరెడ్డి, మండల బూత్ కమిటీ అధ్యక్షులు కొమ్మారెడ్డి ప్రవీణ్ రెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షుడు చేవూరి రామ్మోహన్ రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు దొడ్డా పిచ్చిరెడ్డి, మండవ శ్రీనివాసరెడ్డి, ఒంటేరు వెంకట్రావు, కందుల బ్రహ్మారెడ్డి, మేళం జోజిబాబు, తుపాకుల పుల్లారావు, పాకనాటి శ్రీనివాసరెడ్డి, షేక్ ఇస్మాయిల్, జొన్నలగడ్డ ఆనంద్ పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబు మంగళవారం తాడేపల్లిలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

క్రైస్తవులపై దాడులు ఆపాలి

అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న క్రైస్తవ ఐక్యవేదిక ప్రతినిధులు

మంగళగిరి టౌన్: క్రైస్తవులపై దాడులు ఆపాలని క్రైస్తవ ఐక్యవేదిక ప్రతినిధులు డిమాండ్ చేశారు. క్రైస్తవులపై దాడులకు నిరసనగా మంగళగిరి పట్టణం అంబేడ్కర్ సెంటర్‌లో క్రైస్తవ ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. పలువురు ఐక్యవేదిక ప్రతినిధులు మాట్లాడుతూ.. అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గ కోడేరు మండలం కొర్రకోడు గ్రామంలో ఫుల్ గాస్పెల్ చర్చెస్ ఆఫ్ ఇండియా సంస్థ ప్రార్థనలు చేయడానికి వెళితే అక్కడ కొందరు వ్యాన్‌పై దాడిచేసి క్రైస్తవులను కొట్టి బీభత్సం సృష్టించారని పేర్కొన్నారు. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఘటనపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దైవ సేవకులు రవిప్రకాష్, సహదేవ్, బాలస్వామి, సాల్మన్‌రాజు, ఇశ్రాయేలు తదితర క్రైస్తవులు పాల్గొన్నారు.

కార్మికులకు బకాయిలను వెంటనే చెల్లించాలి

దీక్షా శిబిరం వద్ద మాట్లాడుతున్న నాయకులు

తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు బకాయిలను యాజమాన్యం వెంటనే చెల్లించాలని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ అన్నారు. మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధి బ్రహ్మానందపురంలో సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలను నాయకులు టి.నాగేశ్వరరావు, డి.నాగేశ్వరరావు, సుభాని, యహెషువాలతో కలిసి స్టీవెన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కార్మికులు ఒక్కొక్కరుగా మృతి చెందుతున్నా పాలకవర్గ పార్టీలు స్పందించడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా కార్మికులకు రావాల్సిన బకాయిలను యాజమాన్యం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. దీక్షల్లో లక్ష్మమ్మ, రమణమ్మ, రిబ్కా, అన్నమ్మ, కాసమ్మ కూర్చొన్నారు. కార్యక్రమంలో రమాదేవి, శారమ్మ, విజయశ్రీ, ఇస్మాయిల్, సుబ్బారావు, నాగేశ్వరరావు, హగ్గయ్య, దేవ, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే రెచ్చిపోతున్న దొంగలు

ఘటనా స్థలంలో చోరీ చేసిన మహిళలను విచారిస్తున్న పోలీసులు

తాడికొండ: రాజధానిలో పట్టపగలే దొంగలు రెచ్చిపోయారు. తుళ్లూరులో ఆలయ పూజారి ఇంటిలో చోరీ చేసి పాత గోనె సంచులలో సర్దిన సామాగ్రిని ఆటోలో వేస్తుండగా గమనించిన గృహస్తులు, స్థానికులు దొంగలను పట్టుకొని దేహశుద్ధి చేశారు. సేకరించిన వివరాల ప్రకారం.. తుళ్లూరు రామాలయం పూజారి గోపి నివాసంలో పట్టపగలే కిటికీ అద్దం పగులగొట్టిన దుండుగలు కిటికీ నుంచి లోపల గడి తీసి లోపలకు చొరబడి ఇత్తడి సామాగ్రిని గోనె సంచిలో వేసుకుని ఆటోలో లోడ్ చేసే పనిలో పడ్డారు. ఈ తంతు మొత్తం బయట కార్‌లో ఉండి చూసిన పూజారి కొడుకు మూర్తి స్థానికుల సాయంతో దొంగలను పట్టుకొని పోలీసులకు సమాచారం అందించారు. ఈ ఘటనలో ముగ్గురు మహిళలతో పాటు, ఒక యువకుడు ఉన్నాడు. మూర్తి కేకలు వేయడంతో ఆటో డ్రైవర్ పారిపోయాడు. ముగ్గురు మహిళా దొంగలను పట్టుకున్న స్థానికులు తుళ్లూరు పోలీసులకు సమాచారమిచ్చి అప్పగించగా పోలీసులు విచారిస్తున్నారు. ఆటోలో గోనె సంచుల నిండా ఇత్తడి సామాగ్రీ ఉన్నట్లు గుర్తించారు. గతంలో బాపట్ల జిల్లా వేటపాలెం పోలీస్‌స్టేషన్‌లో కూడా వీరిపై దొంగతనం కేసులు ఉన్నాయని సమాచారం.

తాళాలు వేసిన ఇంట్లో చోరీ

వివరాలు సేకరిస్తున్న క్లూస్ టీం సభ్యులు

తాడికొండ: తాడికొండలో తాళాలు వేసిన ఇంట్లో చోరీ ఘటన చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. తాడికొండ ప్రధాన రహదారి వద్ద పుల్లయ్య కొట్టు సమీపంలోని ఓ ఇంట్లో దొంగలు చొరబడి రూ.5 వేల నగదు, రూ.60 వేలు విలువ చేసే బంగారు గొలుసు, వెండి సామాగ్రీ చోరీ చేశారు. కాగా ఉద్యోగ విధుల నిమిత్తం హైదరాబాద్‌లో ఉన్న గృహ యజమాని వాసవి సోమవారం రాత్రి ఇంటికి వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉంది. తలుపు తెరిచి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మంగళవారం క్లూస్ టీం సభ్యులు వివరాలు సేకరించారు.

విద్యార్థులు స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అమరనాథ్ పొట్లూరి

తెనాలి: విద్యార్థులు స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని తగిన ప్రణాళిక, నిబద్ధతతో ముందుకు వెళ్లాలనీ లేకుంటే ఎన్ని తెలివితేటలున్నా ప్రయోజనం లేదని తెనాలికి చెందిన ప్రవాస భారతీయుడు, డెన్మార్క్ తెలుగు సంఘం, మన సంస్కృతి వ్యవస్థాపకులు అమరనాథ్ పొట్లూరి చెప్పారు. స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని శ్రీవివేకానంద సెంట్రల్ స్కూలు ఆడిటోరియంలో మంగళవారం వివేక విద్యాసంస్థల పూర్వవిద్యార్థి అమరనాథ్ పొట్లూరి, శిరీష దంపతులను సత్కరించారు. ప్రముఖ చరిత్ర పరిశోధకులు, రచయిత సయ్యద్ నశీర్ అహమ్మద్‌పై 'సాక్షి' తెనాలి విలేకరి బీఎల్ నారాయణ రూపొందించిన 'టార్చ్‌బేరర్ సయ్యద్ నశీర్ అహమ్మద్' పుస్తకాన్ని అమరనాథ్ పొట్లూరి ఆవిష్కరించారు. సభకు వివేక విద్యాసంస్థల డైరెక్టర్ రావిపాటి వీరనారాయణరావు అధ్యక్షత వహించారు. అమరనాథ్ మాట్లాడుతూ వివేక విద్యాసంస్థలతో తనకు గల అనుబంధాన్ని విద్యార్థులతో పంచుకున్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, సమయపాలనను కలిగి ఉండాలన్నారు. ఉన్నత అవకాశాల కోసం ఇంగ్లిష్ భాషలో నైపుణ్యం పెంచుకోవాలని చెబుతూ మన జీవన విధానం కోసం మాతృభాష తెలుగును కొనసాగించాలని స్పష్టం చేశారు. తగిన భావప్రకటన నైపుణ్యం అవసరమన్నారు. తల్లిదండ్రులు, విద్యనేర్పిన గురువులను గౌరవించాలని సూచించారు. చరిత్రకారుడు సయ్యద్ నశీర్ అహమ్మద్ మాట్లాడుతూ తెలుగు గడ్డపై జీవించే అందరూ తెలుగు ప్రజలేనని కులమతాల కతీతంగా కలసికట్టుగా జీవించాలని చెప్పారు. సుభాష్‌చంద్రబోస్ పేరుకుముందు నేతాజీ చేర్చిందీ, జైహింద్ పదాన్ని దేశానికి అందించిందీ తెలుగుబిడ్డయిన అబిద్ హసన్ సఫ్రానిగా గుర్తు చేశారు. ఆధునిక జాతీయ జెండాలో అశోకుని ధర్మచక్రం చేర్చిన సురయ్యా బద్రుద్దీన్ తయ్యబ్‌జీగా తెలుగువాడని చెప్పారు. సభాధ్యక్షుడు రావిపాటి వీరనారాయణ మాట్లాడుతూ అమరనాథ్ స్ఫూర్తితో విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. రుషీకేశ్‌లోని దయానంద ఆశ్రమం స్వామి భాస్కరానంద సరస్వతి ఆశీస్సులు అందజేశారు. వివేక ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ కె.రామరాజు, శివకుమార్, మురళి, ఠాగూర్, రాంబాబు పర్యవేక్షించారు.

ఎంఈవో-2గా బాధ్యతల స్వీకరణ

దుగ్గిరాల: దుగ్గిరాల మండల విద్యాశాఖ అధికారి-2(ఎఫ్‌సీఏ)గా బి.వి.కృష్ణారావు పదవీ బాధ్యతలు చేపట్టారు. మంగళవారం మండల కేంద్రంలోని దుగ్గిరాల విద్యావనరుల కేంద్రంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కృష్ణారావును ఎంఈవో కాజా శ్రీనివాసరావు సన్మానించి అభినందించారు. కృష్ణారావు రేవేంద్రపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పని చేశారు. ఇటీవల కాజా లక్ష్మీ నారాయణ పదవీ విరమణ చేయగా ఆ స్థానంలో కృష్ణారావు బాధ్యతలు స్వీకరించారు. దీంతో సీఆర్‌పీలు, ఆఫీస్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు కృష్ణారావును అభినందించారు.

రిపబ్లిక్ డే వేడుకల ఏర్పాట్లు పరిశీలన

తాడికొండ: రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈనెల 26న అమరావతి రాజధానిలో జరగనున్న రిపబ్లిక్ డే వేడుకల ఏర్పాట్లను మంగళవారం గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పరిశీలించారు. రాయపూడి గ్రామ పంచాయతీ పరిధిలో సిద్ధం చేస్తున్న వేడుకల నిర్వహణ ప్రదేశాన్ని ఆయన పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. బందోబస్తు ఏర్పాట్లపై చర్చించిన ఎస్పీ ప్రణాళికా బద్ధంగా పనిచేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట సీఆర్డీయే ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ విద్యాసాగర్‌రావు, తుళ్లూరు డీఎస్పీ మురళీ కృష్ణ, ఎస్బీ డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్బీ సీఐ అలహరి శ్రీనివాస్, తుళ్లూరు పోలీస్ స్టేషన్ సీఐలు ఒ.శ్రీనివాసరావు, ఎం.శ్రీనివాసరావు, ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు తదితరులు పాల్గొని భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

తాడికొండలో సైబర్ క్రైమ్ నేరస్తుల సంచారం

తాడికొండ: తాడికొండ మండలంలో సైబర్ క్రైమ్ నేరస్తులు తమదైన శైలిలో జనాలను మోసం చేస్తున్నారు. 'ఫోన్ పే లో మీకు నగదు బదిలీ చేస్తాం.. కొంచెం డబ్బు ఉంటే ఇవ్వండి' అంటూ అడిగి యాప్‌లో నగదు బదిలీ అయినట్లు చూపించి తదనంతరం పలాయానం చిత్తగిస్తున్నారు. తీరా ఖాతా తనిఖీ చేస్తే ఒక్క రూపాయి కూడా పడకపోవడంతో చిరు వ్యాపారులు లబోదిబోమంటున్నారు. ఇటీవల కాలంలో మటన్, చికెన్ దుకాణాలతో పాటు చిల్లర దుకాణం, మరో ఇద్దరి వద్ద నగదు ట్రాన్స్‌ఫర్ చేస్తున్నానని చూపించి డబ్బు తీసుకొని పరారీ అయ్యారు. కాగా పొన్నెకల్లు గ్రామంలోని ఓ దుకాణంలో సీసీ టీవీ ఫుటేజ్‌కు నిందితుడు దొరకడంతో ఎవరనే దానిపై చర్చ నడుస్తుంది. ఇదే వ్యక్తి ముగ్గురు వ్యక్తుల వద్ద నుంచి నగదు కొట్టేశారని చెబుతున్నారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులపై అవగాహన

ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు గ్రామంలో షెడ్యూల్ కులాల రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో సమగ్ర యాజమాన్య పద్ధతులపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయ సంచాలకులు మోహనరావులు పలు అంశాలపై రైతులకు వివరించారు. మిరప పంటలో కుళ్లు తెగులు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ మనోజ్, డయానా, గంగాభవాని, గోపాలస్వామి, ఏవో వాసంతి, రైతులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

మాట్లాడుతున్న సీఐ నాగూర్ మీరా సాహెబ్

పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు

మేడికొండూరు: క్రీడలు యువతకు ఉజ్వల భవిష్యత్తును అందిస్తాయని మేడికొండూరు సీఐ ఎస్కే నాగూర్ మీరా సాహెబ్ అన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలై తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, 'డ్రగ్స్ వద్దు-ఆరోగ్యం ముద్దు' అనే నినాదాలతో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. స్థానిక మేడికొండూరు ఎన్ఆర్ఐ ఐటీ కళాశాలలో భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు క్రీడా మంత్రిత్వ శాఖ, మై భారత్ కేంద్రం -గుంటూరు, పేస్ సొసైటీ ఆధ్వర్యంలో యువతకు జిల్లాస్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వాలీబాల్, కబడ్డీ, షటిల్, 100 మీటర్ల పరుగు, షాట్‌పుట్ ఈవెంట్లు నిర్వహించారు. కార్యక్రమాన్ని మేడికొండూరు సీఐ ఎస్కే నాగూర్ మీరా సాహెబ్ ప్రారంభించగా అర్బన్ సబ్ ఇన్‌స్పెక్టర్ జె.శ్రీనివాసరావు, ఎన్ఆర్ఐ ఐటీ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ డోలా సంజయ్, డిప్లొమా ప్రిన్సిపల్ పి.రవికుమార్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ డోలా సంజయ్ మాట్లాడుతూ.. చదువుతో పాటు క్రీడలు యువతకు ఎంతో అవసరమని తెలిపారు. ప్రిన్సిపల్ పి.రవికుమార్ మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపు-ఓటములు సహజమని అన్నారు. క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొనగా వాలీబాల్ కబడ్డీ పోటీలు హోరాహోరీగా జరిగాయి. కార్యక్రమంలో పేస్ సొసైటీ సెక్రటరీ పారుపల్లి రమేష్‌తో పాటు యువజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.తిలక్ బాబు క్రీడల్లో విజయం సాధించిన విద్యార్థులను అభినందించారు. జిల్లాస్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించడంపై కళాశాల సెక్రటరీ, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు.

నిషేధిత బ్రిడ్జిపై భారీ వాహనాలు

పశువుల హాస్పిటల్ వద్ద బ్రిడ్జిపై నుంచి వస్తున్న భారీ వాహనం

తాడేపల్లి రూరల్: భారీ వాహనాలు తిరగడానికి వీలులేదంటూ కార్పొరేషన్ అధికారులు బ్రిడ్జికి ఇరువైపులా బోర్డులు ఏర్పాటు చేసినా కొందరు భారీ వాహన యజమానులు వాటిని పెడచెవిన పెడుతున్నారు. శిథిలావస్థలో ఉన్న బ్రిడ్జిపై యథేచ్ఛగా భారీ వాహనాల రాకపోకలు సాగిస్తున్నారు. మంగళవారం ఆ బ్రిడ్జిపై పదుల సంఖ్యలో వాహనాలు ప్రయాణించడం గమనార్హం. తాడేపల్లి కొత్తూరు, ప్రాతూరు, వైఎస్సార్ సెంటర్‌లలో నివసించే ప్రజలు.. ఉండవల్లి సెంటర్ తదితర ప్రాంతాల ప్రజలు బైపాస్ రోడ్డుకు వెళ్లడానికి ఇదే బ్రిడ్జిని ఉపయోగిస్తున్నారు. బ్రిడ్జి సైతం శిథిలావస్థకు చేరడంతో అధికారులు బ్రిడ్జికి ఇరువైపులా భారీ వాహనాల రాకపోకలను నిషేధిస్తూ బోర్డులు ఏర్పాటు చేశారు. రైల్వే గోడౌన్, రైల్వే ట్రాక్ పనుల నిమిత్తం వస్తున్న లారీలతో పాటు ఎఫ్‌సీఐ గోడౌన్‌కు వచ్చే వాహనాలు ఇదే బ్రిడ్జిపై ప్రయాణిస్తున్నాయి. అధికారులు వెంటనే స్పందించి బ్రిడ్జిపై భారీ వాహనాల రాకపోకలు నిలిపివేయాలని స్థానికులు కోరుతున్నారు.

మహిళల భద్రతకు 'శక్తి' యాప్

యాప్‌పై అవగాహన కల్పిస్తున్న మహిళా కానిస్టేబుళ్లు

మంగళగిరి టౌన్: మహిళలు, విద్యార్థినులకు భద్రతకు శక్తి యాప్ ఉపయోగపడుతుందని శక్తి టీమ్ పేర్కొన్నారు. మంగళగిరి పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యార్థినులకు మంగళవారం శక్తి టీమ్ శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు. శక్తి టీమ్ మహిళా కానిస్టేబుళ్లు నాగలక్ష్మి, లలిత మాట్లాడుతూ.. మహిళలు, విద్యార్థినుల మొబైల్ ఫోన్‌లో శక్తి యాప్ ఉంటే ఆపద సమయాల్లో రక్షణగా ఉంటుందన్నారు. ఆపద సమయాల్లో శక్తి యాప్‌లోని ఎస్‌వోఎస్ బటన్ నొక్కగానే క్షణాల్లో పోలీస్ బృందం మీరు ఉన్న ప్రాంతానికి చేరుకుని రక్షణ కల్పిస్తారని వివరించారు. చదువుకునే సమయంలో విద్యార్థినులు అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఆపద సమయంలో విద్యార్థినులు ప్రత్యర్థులను ఆత్మస్థైర్యంతో ఎదుర్కొనే అంశంపై చైతన్యం కల్పించారు. యాప్ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించి శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేయించారు. వాటిని వినియోగించే విధానంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు.

అండర్ గ్రౌండ్ డ్రైయిన్ నిర్మాణానికి రూ.1,673 కోట్లు

మంగళగిరి టౌన్: ఎంటీఎంసీ పరిధిలోని మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దీనిలో భాగంగా అండర్ గ్రౌండ్ డ్రైయిన్ నిర్మాణం కోసం రూ.1,673.51 కోట్లను మంజూరు చేసినట్లు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసింది. రెండు దశలుగా చేపట్టనున్న భూగర్భ డ్రైయిన్ నిర్మాణ పనులలో ఎంటీఎంసీ పరిధిలో వివిధ ప్రాంతాల్లో 20 మురుగు నీటి శుద్ధి కేంద్రాలు, 18 పంపింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయనున్నారు. పైపులైన్ల ద్వారా మురుగు సమీప కాలువలు, చెరువుల్లోకి మళ్లించనున్నారు. ఈ మేరకు భూగర్భ డ్రైయిన్ నిర్మాణ పనులు ప్రారంభించేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. వ్యర్థాలను మురుగు నీటిలోకి పంపి దుర్గంధం వ్యాపించకుండా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడడమే ఈ అండర్ గ్రౌండ్ డ్రైయిన్ ఉద్దేశ్యమని అధికారులు పేర్కొన్నారు.

డ్రైయిన్‌లో పడి యువకుడి మృతి

ఫిరంగిపురం: ప్రమాదవశాత్తు డ్రైయిన్‌లో పడి ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన ఫిరంగిపురంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని శాంతిపేటకు చెందిన పి.చింటు ప్రసాద్(26) ఇంట్లోకి అవసరమైన వస్తువులు కొనుగోలు చేసేందుకు సోమవారం రాత్రి బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో సమీపంలోని డ్రైయిన్‌లో ప్రమాదవశాత్తు పడిమృతిచెందాడు. తెల్లవారుజామున స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.


అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com

> విజయం అనేది గమ్యం కాదు,
> అది ఒక ప్రయాణం మాత్రమే!
>
> -జెఫ్ బెజోస్, అమెజాన్

ఏఐ అండ్ ఎంఎల్.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్... ఇప్పుడు దీని గురించి తెలియని వారు లేరంటే అతిశయోక్తి కాదు. యూట్యూబ్ రీల్స్ నుంచి అంతరిక్ష రంగంలో ప్రయోగాల వరకూ.. అన్ని చోట్లా ఏఐ టూల్స్ ప్రమేయం, వినియోగం పెరుగుతోంది. అదే విధంగా సర్వీస్ సెక్టార్ నుంచి సాఫ్ట్‌వేర్ వరకు.. జనరల్ అడ్మినిస్ట్రేషన్ నుంచి ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ దాకా.. అన్ని విభాగాల్లో ఏఐ,ఎంఎల్ విస్తరిస్తోంది. దీంతో ఏఐ ఎంఎల్ నిపుణులకు డిమాండ్ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో.. ఏఐఎంఎల్‌కు డిమాండ్‌కు కారణాలు, జాబ్ మార్కెట్ ట్రెండ్స్, అవసరమైన నైపుణ్యాలు, అందుకునేందుకు మార్గాలపై ప్రత్యేక కథనం..

టెక్ స్కిల్స్

ఏఐ ఎంఎల్.. అవకాశాలకు రూట్

- ఏఐ ఎంఎల్‌కు పెరుగుతున్న డిమాండ్
- నిపుణుల కోసం సంస్థల అన్వేషణ
- నైపుణ్యాలు పెంచుకునేందుకు మార్గాలెన్నో



- గత ఏడాది నియామకాల్లో అత్యంత వేగంగా వృద్ధి చెందే ఉద్యోగంగా మెషిన్ లెర్నింగ్ ఇంజనీర్ ప్రొఫైల్ గుర్తింపు పొందింది.
- ఫ్యూచర్ ఆఫ్ జాబ్స్ రిపోర్ట్ ప్రకారం-2027 నాటికి ఏఐ ఎంఎల్ స్పెషలిస్ట్‌ల సంఖ్య ఏకంగా 40 శాతం పెరగనుంది.
- ప్రముఖ కన్సల్టింగ్ సంస్థ మెకిన్సే అంచనాల ప్రకారం- 2030 నాటికి 12 మిలియన్ల మేరకు ఉద్యోగాలు ఏఐ విభాగంలోకి మారనున్నాయి.
- ఈ అంచనాలను పరిగణనలోకి తీసుకుంటే.. ఏఐ ఎంఎల్‌కు పెరుగుతున్న డిమాండ్ స్పష్టమవుతోంది. అందుకే ఏఐ ఎంఎల్ నైపుణ్యాలు పెంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

అన్నింటా ఏఐ-ఎంఎల్

ప్రస్తుతం అన్ని రంగాల్లోనూ డిజిటల్ టెక్నాలజీస్ ఆధారిత కార్యకలాపాలు ఊపందుకుంటున్నాయి. ఇందుకోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ టెక్నాలజీస్ వినియోగం పెరుగుతోంది. చిన్న తరహా సంస్థలు మొదలు బహుళ జాతి కంపెనీల వరకు.. అదే విధంగా కోర్ ఐటీ నుంచి బ్యాంకింగ్ రంగం దాకా.. ఈ-కామర్స్ మొదలు ఎడ్యుకేషన్ సెక్టార్ వరకు.. ఏఐ ఎంఎల్ టెక్నాలజీస్ కీలకంగా మారుతున్నాయి. ఎడ్‌టెక్ సెక్టార్‌నే పరిగణనలోకి తీసుకుంటే.. వర్చువల్ లేబొరేటరీస్‌ను దీనికి ప్రత్యక్ష నిదర్శనంగా పేర్కొనొచ్చు. ఇలాంటి ధోరణే డైరెక్ట్ కస్టమర్, క్లయింట్ ఇంటరాక్షన్ ఉన్న సెక్టార్ల(బీఎఫ్ఎస్ఐ, హెల్త్‌కేర్ తదితర)లోనూ కనిపిస్తోంది. దీంతో ఏఐ ఎంఎల్ నిపుణులకు డిమాండ్ పెరుగుతోంది.

డీప్ లెర్నింగ్

ఏఐ-ఎంఎల్ సంబంధించి ప్రస్తుతం డీప్ లెర్నింగ్ విధానం కూడా విస్తృతంగా వినియోగంలో ఉంది. మానవ మేధస్సుకు అనుగుణంగా కంప్యూటర్స్‌లో నిర్దిష్టంగా ఒక డేటా ప్రక్రియను పూర్తి చేసే విధానమే డీప్ లెర్నింగ్. దీని ద్వారా చిత్రాలు, టెక్స్ట్, సౌండ్స్, ఇతర డేటాలను గుర్తించి కచ్చితమైన అంచనాలు రూపొందించే అవకాశం లభిస్తుంది. హ్యూమన్ ఇంటెలిజెన్స్ అవసరమైన విభాగాల్లో సైతం డీప్ లెర్నింగ్ ద్వారా ఆయా పనులు ఆటోమేటిక్ టాస్క్ రూపంలో పూర్తి చేయొచ్చు. డిజిటల్ అసిస్టెన్స్, ఫ్రాడ్ డిటెక్షన్, ఆటోమేటిక్ ఫేషియల్ రికగ్నిషన్ వంటి కార్యకలాపాలలో డీప్ లెర్నింగ్ మెథడ్స్ వినియోగిస్తున్నారు. స్థూలంగా చెప్పాలంటే.. డీప్ లెర్నింగ్ మోడల్స్ అనేవి డేటా సైంటిస్ట్‌లు ఒక అల్గారిథమ్, లేదా అప్పటికే నిర్దేశించిన నమూనాలో ఆయా టాస్క్‌లను పూర్తి చేయడానికి ఉపయోగించే కంప్యూటర్స్ ఫైల్స్‌గానూ వర్ణించొచ్చు.

ఎన్ఎల్‌పీ.. ఎమర్జింగ్ స్కిల్‌గా

ఏఐ ఎంఎల్‌లో అత్యంత డిమాండింగ్ స్కిల్‌గా.. నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ (ఎన్ఎల్‌పీ) నిలుస్తోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అంటేనే కృత్రిమ మేధస్సు ఆధారంగా మానవ ప్రమేయం లేకుండా మెషీన్లే స్వయంగా పనిచేసేలా చేయడం. అయితే ఈ మెషీన్లు పనిచేయాలంటే.. అందుకు సంబంధించిన నిపుణులు ఇచ్చే కమాండ్స్‌ను అర్థం చేసుకునేలా చేయాలి. అందుకే కంప్యూటర్స్, సాంకేతిక సిబ్బంది మధ్య ఇంటరాక్టివ్ టూల్‌గా ఉండే ఎన్ఎల్‌పీకి ప్రాధాన్యం పెరుగుతోంది. ఉదాహరణకు గూగుల్ ట్రాన్స్‌లేట్, ఓకే గూగుల్, ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ విధానంలో ఆన్‌లైన్ ద్వారానే మనకు సమాచారం లభిస్తోంది. అంతేకాకుండా మైక్రోసాఫ్ట్ వర్డ్ ప్రాసెసర్‌లో ఒక డాక్యుమెంట్‌కు సంబంధించి ఏదైనా ఒక వాక్యాన్ని రూపొందిస్తున్నప్పుడు.. మనం స్పెల్లింగ్ తప్పుగా టైప్ చేసినా లేదా ఒక వాక్యంలో గ్రామర్ తప్పులున్నా.. వాటంతటవే సరైనవిగా మారేలా వర్డ్ ప్రాసెసర్ ఉపయోగపడుతోంది. ఇది కూడా నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్‌గానే నిలుస్తోంది. దీంతో సంస్థలు ఈ ఎన్ఎల్‌పీ వినియోగంపై ఆసక్తి చూపుతున్నాయి. దాన్ని తమ కార్యకలాపాల్లో వినియోగిస్తున్నారు.

మెషీన్ లెర్నింగ్

వాస్తవానికి మెషీన్ లెర్నింగ్ అనేది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు అనుసంధాన విభాగం. డేటాను విశ్లేషించడం, దాని ఆటోమేషన్ ఆధారిత సేవలందించే విధంగా కంప్యూటర్స్‌లో ముందస్తు ప్రోగ్రామింగ్‌లు రూపొందించడం మెషీన్ లెర్నింగ్ ప్రత్యేకతగా పేర్కొనొచ్చు. మెషీన్ లెర్నింగ్‌లో మరో విశేషం.. ప్రోగ్రామ్‌లను కంప్యూటర్లే స్వయంగా రాసుకునే సామర్థ్యం ఉండటం. అయితే దీనికి ఆరంభ దశలో మానవ ప్రమేయం అవసరం. మెషీన్ లెర్నింగ్‌కు అవసరమైన ప్రత్యేక అల్గారిథమ్స్‌ను రూపొందించి సిస్టమ్స్‌లో నిక్షిప్తం చేయడం జరుగుతుంది. అదే విధంగా డేటా సైన్స్, డేటా మేనేజ్‌మెంట్, డేటా అనలిటిక్స్‌ల సమ్మిళితంగా మెషిన్ లెర్నింగ్ కార్యకలాపాలు ఉంటాయి. ఈ కార్యకలాపాలను నిర్వహించే నిపుణులకు డిమాండ్ నెలకొంది.

ఈ నైపుణ్యాలతో మెరుగ్గా..

మెషిన్ లెర్నింగ్ అభ్యర్థులు కంప్యూటర్ బేసిక్స్, ప్రోగ్రామింగ్ స్కిల్స్, కంప్యూటర్ హార్డ్‌వేర్ నైపుణ్యాలను పెంచుకోవాలి. వీటికి అవసరమైన మ్యాథమెటికల్ స్కిల్స్, కంప్యుటేషనల్ స్కిల్స్, డేటా మోడలింగ్, సాఫ్ట్‌వేర్ డిజైన్, డెవలప్‌మెంట్ వంటి అంశాల్లో బేసిక్స్‌పై పట్టు సాధించాలి. ఫలితంగా మెషిన్ లెర్నింగ్ అల్గారిథమ్స్, కోడింగ్, ప్రోగ్రామింగ్ పరంగా మరింత మెరుగ్గా రాణించే అవకాశం ఉంటుంది.

జావా..పైథాన్

- ఏఐలో కీలకంగా నిలుస్తోంది జావా లాంగ్వేజ్. దీని ద్వారా న్యూరల్ నెట్‌వర్క్స్, ఎన్ఎల్‌పీ డెవలప్‌మెంట్ సొల్యూషన్స్‌ను సమర్థవంతంగా పూర్తి చేయొచ్చు. ముఖ్యంగా ఏఐ అల్గారిథమ్‌కు అనుగుణంగా కోడ్స్ రాయడానికి జావా ఉపయోగపడుతుంది ప్రస్తుతం ఏఐలో డేటా ప్రాసెస్, డెసిషన్ మేకింగ్, ఇంటెలిజెంట్ చాట్‌బోట్స్ రూపకల్పనలో జావా లాంగ్వేజ్‌పైనే ఆధారపడుతున్నారు. దీంతో.. ఈ లాంగ్వేజ్ నైపుణ్యాలున్న వారు ఏఐ-ఎంఎల్ విభాగంలో కొలువులు సొంతం చేసుకోవచ్చు.
- జనరల్ పర్పస్ కోడింగ్ లాంగ్వేజ్‌గా పేర్కొనే పైథాన్ లాంగ్వేజ్ నిపుణులకు ఇటీవల డిమాండ్ పెరుగుతోంది. దీనికి ప్రధాన కారణం కోడింగ్‌తోపాటు ఇతర ప్రోగ్రామింగ్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ కోణంలో ఇది సులభంగా ఉండడమే. ముఖ్యంగా బ్యాక్ ఎండ్ డెవలప్‌మెంట్, డేటా సైన్స్, సిస్టమ్ స్క్రిప్ట్ రైటింగ్ విషయాల్లో పైథాన్ ఉపయోగపడుతున్న నేపథ్యంలో దీనికి డిమాండ్ నెలకొంది.

టెన్సార్స్ ఫ్లో

ఏఐ టూల్స్‌లో భాగంగా కంపెనీలు వినియోగిస్తున్న మరో టూల్.. టెన్సార్స్ ఫ్లో. పైథాన్ కోడింగ్ ద్వారా రూపొందించిన ప్రోగామ్స్, సాఫ్ట్‌వేర్స్‌కు సంబంధించి న్యూమరికల్ కంప్యూటేషన్‌ను సులభంగా పూర్తి చేసి, మెషిన్ లెర్నింగ్ ప్రక్రియను పైథాన్-ఫ్రెండ్లీగా ఉంచేందుకు గూగుల్ రూపొందించిన టెన్సార్స్‌ఫ్లో వైపు కూడా కంపెనీలు దృష్టి సారిస్తున్నాయి.

డేటా సైన్స్.. భారీ డిమాండ్

ఏఐ-ఎంఎల్‌లో మరో డిమాండింగ్ స్కిల్‌గా నిలుస్తోంది.. డేటా సైన్స్. కారణం.. అన్ని రంగాల్లోని సంస్థలు మార్కెట్ ట్రెండ్స్ విశ్లేషణకు, దానికి అనుగుణంగా నిర్ణయాలు తీసుకునేందుకు, కస్టమర్లకు వారికి నచ్చే విధంగా సేవలు, ఉత్పత్తులు అందించేందుకు డేటా సైన్స్‌పైనే ఆధారపడుతున్నాయి. దీని ద్వారా కస్టమర్లకు చేరువవ్వడమే కాకుండా.. తక్కువ ఖర్చుతో కార్యకలాపాలు సాగించే వీలు సంస్థలకు లభిస్తోంది. దీంతో సంస్థలన్నీ డేటా సైన్స్‌కు అత్యంత ప్రాధాన్యమిస్తున్నాయి. డేటా సైన్స్ విభాగంలో విధులు నిర్వహించే వారు స్టాటిస్టిక్స్, అల్గారిథమ్స్, డేటా అనాలిసిస్, మెషీన్ లెర్నింగ్, కోడింగ్, ప్రోగ్రామింగ్ విభాగాలతో కలిసి పని చేయాల్సి ఉంటుంది.

నైపుణ్యార్జనకు మార్గాలు

- ఏఐ ఎంఎల్ విభాగంలో కెరీర్‌కు కంప్యూటింగ్ స్కిల్స్, స్టాటిస్టికల్ స్కిల్స్, డేటా సైన్స్ స్కిల్స్ ప్రధానంగా నిలుస్తున్నాయి. ప్రోగ్రామింగ్, కంప్యూటింగ్, కోడింగ్ స్కిల్స్‌తో సులువుగా ఏఐ నైపుణ్యాలు సొంతం చేసుకునే అవకాశం ఉంది.
- ఐఐటీలు, ఇతర ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌లు బీటెక్ స్థాయిలోనే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్‌తో పూర్తి స్థాయి కోర్సును అందిస్తున్నాయి. దీంతోపాటు పీజీ స్థాయిలో కూడా ఏఐ స్పెషలైజేషన్‌తో ఎంటెక్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వీటితోపాటు ఐబీఎం, ఇంటెల్, గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి సంస్థలు ఏఐలో ఆన్‌లైన్ కోర్సులను అందిస్తున్నాయి. వీటి కాల వ్యవధి నెల రోజుల నుంచి నాలుగు నెలల వరకు ఉంటోంది. వీటిని పూర్తి చేసుకుని సంబంధిత పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తే ఇండస్ట్రీ వర్గాల్లోనూ గుర్తింపు లభిస్తోంది. మన దేశంలోనూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో స్వల్ప కాలిక కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

వేతనాలు

ఏఐ ఎంఎల్‌లో సంబంధిత నైపుణ్యాలు పొందిన వారికి ఏఐ/ఎంఎల్ ఇంజనీర్,ఏఐ అసోసియేట్, ప్రాజెక్ట్ మేనేజర్ వంటి జాబ్ ప్రొఫైల్స్ లభిస్తున్నాయి. వీరికి ప్రారంభంలోనే సగటు వార్షిక వేతనం రూ.6 లక్షలుగా నమోదవుతోంది. అనుభవం, నైపుణ్యాల ఆధారంగా వేతనం, హోదాలు పెరుగుతాయి.



సాంకేతిక విద్యలో.. సమూలాల మార్పులు అవసరం

'ప్రొఫెషనల్ ఎడ్యుకేషన్‌లో ఎన్నో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉంది. నేటి డీప్ టెక్నాలజీస్‌కు అనుగుణంగా నైపుణ్యాలు నేర్పించే విధంగా కరిక్యులంలో మార్పులు తేవాలి. అప్పుడే సాంకేతిక విద్యలో ముఖ్యంగా ఇంజనీరింగ్, సైన్స్ విభాగాల్లో నేటి అవసరాలకు తగిన టాలెంట్ బయటికొస్తుంది' అంటున్నారు ఐఐటీ-చెన్నై డైరెక్టర్.. ప్రొఫెసర్ వి.కామకోటి. ప్రస్తుతం దేశంలో వృత్తి విద్యా విధానం, జాబ్ మార్కెట్‌కు అవసరమైన నైపుణ్యాలు, విద్యార్థులు అనుసరించాల్సిన విధానాలపై ప్రొఫెసర్ వి.కామకోటితో ఈ వారం ఇంటర్వ్యూ..

- 'డీప్ టెక్' బోధించేలా కరిక్యులం రూపొందించాలి
- ఐఐటీలు ఇప్పటికే ఆ దిశగా అడుగులు వేస్తున్నాయి

ఐఐటీ-చెన్నై డైరెక్టర్ ప్రొఫెసర్ వి.కామకోటి

ప్రస్తుత టెక్నాలజీ మార్పులకు అనుగుణంగా విద్యార్థులు సన్నద్ధం కావడానికి ఎలాంటి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది?

ముందుగా కరిక్యులంలో సమూల మార్పులు చేయాలి. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటమ్ కంప్యూటింగ్ తదితర డీప్ టెక్నాలజీస్‌కు సంబంధించి సాంకేతిక విద్యా విధానంలో సమూల మార్పులు తేవాల్సిన అవసరం ఉంది. ఐఐటీల నుంచి సాధారణ ఇంజనీరింగ్ కళాశాలల వరకూ.. ఈ దిశగా గట్టిగా కృషి చేయాలి. ఐఐటీలు ఇప్పటికే ఈ దిశగా అడుగులు వేస్తున్నాయి. ఇతర ఇన్‌స్టిట్యూట్‌లు కూడా చర్యలు చేపట్టాలి. ఇందుకు సంబంధించి ఏఐసీటీఈ స్థాయిలో కరిక్యులంలో మార్పులతో చర్యలు మొదలవ్వాలి. ఇక్కడ ఇంకో విషయం గుర్తించాలి. కేవలం పుస్తకాల్లోని అంశాల్లో కొత్తదనం తీసుకురావడమే మార్పు అనుకోవడం సరికాదు. ఆ మార్పుకు తగిన విధంగా అర్హులైన బోధన సిబ్బందిని నియమించడం ఎంతో ముఖ్యం. వాస్తవానికి కరిక్యులం అంటే బోధన విధానానికి సంబంధించి మార్గనిర్దేశాలు చేసే సాధనం. కరిక్యులంలో మార్పులు తెచ్చేటప్పుడు విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచేందుకు అవసరమైన ఇతర అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి.

ఫ్యాకల్టీని కొత్త టెక్నాలజీ బోధనకు సన్నద్ధం చేసేందుకు ఉన్న మార్గాలు?

ఫ్యాకల్టీకి కొత్త నైపుణ్యాలు అందించాలి. వారికి ఓరియెంటేషన్ ప్రోగ్రామ్‌లు నిర్వహించడం, నూతన బోధన పద్ధతులపై అవగాహన కల్పించడం వంటి చర్యలు తీసుకోవాలి. దీనివల్ల వారు గతంలో చదువుకున్న కోర్ అంశాలను లేటెస్ట్ టెక్నాలజీతో కలిపి బోధించే నైపుణ్యం లభిస్తుంది.

బీటెక్ తర్వాత ఉద్యోగం, ఉన్నత విద్య.. ఈ రెండింటిలో దేనికి ప్రాధాన్యం ఇవ్వాలి?

ఇది వ్యక్తిగత పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. నా ఉద్దేశం ప్రకారం ప్రొఫెషనల్ కోర్సుల విద్యార్థులు.. క్యాంపస్ రిక్రూట్‌మెంట్స్‌లో విజయం సాధించడమే లక్ష్యంగా కాకుండా.. తమ దృక్పథాన్ని కొంత మార్చుకుంటే సమున్నత భవిష్యత్తు అవకాశాలు లభిస్తాయి. ఉన్నత విద్య, పరిశోధనల దిశగా దృష్టి పెడితే భవిష్యత్తు మరింత ఉజ్వలంగా ఉంటుందని నా అభిప్రాయం. ఉద్యోగంలో చేరిన తర్వాత ఉన్నత విద్య అభ్యసించడం కొంత కష్టమైన వ్యవహారమని గుర్తించాలి. ఆర్థిక అంశాల కోణంలోనూ ఎంటెక్, ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ విద్యార్థులకు పలు స్కాలర్‌షిప్స్ లభిస్తున్నాయి. కాబట్టి ఉన్నత విద్యకు ప్రాధాన్యం ఇవ్వడం మేలు చేస్తుంది.

విద్యార్థులకు రియల్ టైం నైపుణ్యాలు అందించే మార్గాలు?

విద్యార్థులకు ప్రాక్టికల్ నైపుణ్యాలు, వాస్తవ పరిస్థితులపై అవగాహన కల్పించేందుకు ఉపకరించే విధానం.. ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్స్. ఇవి రెండు రకాలు.. ఒకటి, ఇండస్ట్రీ ఎక్స్ఛేంజ్.. రెండోది, అకడమిక్ ఎక్స్ఛేంజ్. ఇండస్ట్రీ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్స్‌తో ఆయా రంగంలోని పరిశ్రమలు.. ఇన్‌స్టిట్యూట్‌లతో కలిసి సంయుక్తంగా రీసెర్చ్ కార్యకలాపాలు నిర్వహించడం చేస్తాయి. దీనివల్ల విద్యార్థులకు రియల్‌టైం ఎక్స్‌పోజర్ లభిస్తుంది. ఇక.. అకడమిక్ ఎక్స్ఛేంజ్ అంటే.. ఇన్‌స్టిట్యూట్‌లు, ప్రధానంగా సదరు రంగంలో పేరు గడించిన విదేశీ ఇన్‌స్టిట్యూట్‌లతో ఒప్పందాలు చేసుకోవడం. దీనివల్ల విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో పరిణామాలపై అవగాహన లభిస్తుంది. ఇప్పటికే ఐఐటీల స్థాయిలో ఈ విధానాలు అమలవుతున్నాయి. అయితే ఇవి ఆయా రాష్ట్రాల్లోని యూనివర్సిటీల్లో సైతం అమలు కావాలి. అప్పుడే ఇన్‌స్టిట్యూట్‌తో సంబంధం లేకుండా విద్యార్థులందరికీ నైపుణ్యాలు లభిస్తాయి. మనం చెప్పుకునే డెమోగ్రాఫిక్ డివిడెండ్ సద్వినియోగం చేసుకోవడానికి వీలవుతుంది.

కెరీర్‌లో సుదీర్ఘ కాలం మనుగడ సాగించేందుకు అనుసరించాల్సిన వ్యూహాలు?



ఇది ఎంతో ముఖ్యమైన అంశం. ఇంజనీరింగ్, సైన్స్ విభాగాల్లో విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకునే విషయంలో అప్‌డేటెడ్‌గా వ్యవహరించాలి. నిరంతరం తాము చేరిన కోర్సు, అందుకు సంబంధించిన రంగంలోని తాజా మార్పులు తెలుసుకుంటూ.. వాటికి అకడమిక్ మూలాలు అన్వేషించి, ప్రాక్టికల్‌గా అన్వయిస్తూ సాధన చేయాలి. అప్పుడే నైపుణ్యాలు లభిస్తాయి. అంతేకాకుండా కేవలం తాము చేరిన కోర్సుకే పరిమితం కాకుండా.. అనుబంధంగా ఉన్న ఇతర అంశాలు నేర్చుకునే ప్రయత్నం చేయాలి. ఇందుకోసం ఇటీవల కాలంలో అమలవుతున్న ఇంటర్ డిసిప్లినరీ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఫలితంగా ఒకే సమయంలో రెండు, మూడు అంశాల్లో నైపుణ్యం పొందే అవకాశం లభిస్తుంది. ఇలా.. వీలైనంత మేరకు అన్ని కోణాల్లో స్కిల్ డెవలప్ చేసుకుంటేనే పోటీ ప్రపంచంలో ముందంజలో నిలవగలుగుతారు.

విద్యార్థులకు, జాబ్ సీకర్స్‌కు మీరిచ్చే సలహా?

ముందుగా సానుకూల దృక్పథం అలవర్చుకోవాలి. పోటీతత్వం పెంచుకోవాలి. ఈ రెండు లక్షణాలతో పోటీలో ముందుండాలనే తపన పెరుగుతుంది. అపజయం ఎదురైనా నిరాశ చెందకుండా మళ్లీ పోటీ పడే తత్వం అలవడుతుంది. కానీ నేటి తరం విద్యార్థుల్లో సానుకూల దృక్పథం కొంత తక్కువగా ఉంటోంది. దీనివల్ల వారు ఒత్తిడికి గురై అవకాశాలను చేజార్చుకుంటున్నారు. అందుకే విద్యార్థులు సానుకూల దృక్పథం పెంపొందించుకోవాలని నా సలహా.

ఉద్యోగ సమాచారం

పీజీఐఎంఈఆర్, చండీగఢ్‌లో 59 పోస్టులు

చండీగఢ్‌లోని పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(పీజీఐఎంఈఆర్) ఒప్పంద ప్రాతిపదికన గ్రూప్-ఏ, బీ, సీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం పోస్టుల సంఖ్య: 59.
- అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, ఎంబీఏ, బీటెక్, బీఫార్మసీ, పీజీలో ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు పని అనుభవం ఉండాలి.
- వయసు: 18 నుంచి 35 ఏళ్లు ఉండాలి.
- వేతనం: పోస్టును అనుసరించి నెలకు రూ.18,000 నుంచి రూ.2,08,700.
- ఎంపిక విధానం: కంప్యూటర్ ఆధారిత పరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 01.01.2026.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 16.02.2026.
- వెబ్‌సైట్: https://pgimer.edu.in/

ఐఐటీ గువాహటిలో 26 ఫ్యాకల్టీ పోస్టులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) గువాహటి.. ఒప్పంద ప్రాతిపదికన అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం పోస్టుల సంఖ్య: 26.
- పోస్టుల వివరాలు: అసోసియేట్ ప్రొఫెసర్-13, ప్రొఫెసర్-13.
- విభాగాలు: బయో సైన్సెస్ అండ్ బయో ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర సైన్స్ అండ్ ఇంజనీరింగ్, డిజైన్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, మ్యాథ్‌మేటిక్స్, ఫిజిక్స్, స్కూల్ ఆఫ్ ఆగ్రో అండ్ రూరల్ టెక్నాలజీ, స్కూల్ ఆఫ్ ఎనర్జీ సైన్స్ అండ్ ఇంజనీరింగ్.
- అర్హత: సంబంధిత విభాగంలో పీహెచ్‌డీ ఉత్తీర్ణులవ్వాలి. దీనితోపాటు ఉద్యోగానుభవం ఉండాలి.
- ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 31.01.2026.
- వెబ్‌సైట్: https://iitg.ac.in/

ముంబై పోర్టు అథారిటీలో 10 ఇంటర్న్ పోస్టులు

ముంబై పోర్టు అథారిటీ ఒప్పంద ప్రాతిపదికన జూనియర్ ప్రొఫెషనల్ ఇంటర్న్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం పోస్టుల సంఖ్య: 10.
- పోస్టుల వివరాలు: జూనియర్ ప్రొఫెషనల్ ఇంటర్న్-05, జూనియర్ ప్రొఫెషనల్ ఇంటర్న్(హెచ్ఆర్ అసోసియేట్)-05.
- అర్హత: సంబంధిత విభాగంలో గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి డిగ్రీ/ఎంబీఏ ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
- వయసు: 35 ఏళ్లు మించకూడదు.
- ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- దరఖాస్తులకు చివరితేది: 30.01.2026.
- వెబ్‌సైట్: https://mumbaiport.gov.in/

ఎస్‌కేఎల్‌టీజీహెచ్‌యూలో 61 ఫ్యాకల్టీ పోస్టులు

తెలంగాణ రాష్ట్రం సిద్దిపేట జిల్లా ములుగులో శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ హార్టికల్చరల్ యూనివర్శిటీ(ఎస్‌కేఎల్‌టీజీహెచ్‌యూ).. అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం పోస్టుల సంఖ్య: 61.
- పోస్టుల వివరాలు: అసోసియేట్ ప్రొఫెసర్-44, ప్రొఫెసర్-17.
- విభాగాలు: అగ్రికల్చరల్ ఎకనామిక్స్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్, అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్, అగ్రోనమీ, బయోకెమిస్ట్రీ, క్రాప్ ఫిజియాలజీ, ఎంటమాలజీ, ఫ్లోరికల్చర్, ఫ్రూట్ సైన్స్, జెనెటిక్స్-ప్లాంట్ బ్రీడింగ్, మైక్రోబయాలజీ, ప్లాంట్ పాథాలజీ, పీఎస్ఎంఏ, సాయిల్ సైన్స్-అగ్రికల్చరల్ కెమిస్ట్రీ, స్టాటిస్టిక్స్, వెజిటబుల్ సైన్స్.
- అర్హత: హార్టికల్చర్/అగ్రికల్చర్/అగ్రికల్చర్ ఇంజనీరింగ్‌లో నాలుగేళ్ల బ్యాచిలర్ డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. ఉద్యోగానుభవం ఉండాలి. నెట్ అర్హత తప్పనిసరి. పీహెచ్‌డీ ఉన్న వారికి నెట్ మినహాయింపు ఉంటుంది.
- వేతనం: నెలకు అసోసియేట్ ప్రొఫెసర్‌కు రూ.1,31,400 నుంచి రూ.2,17,100, ప్రొఫెసర్‌కు రూ.1,44,200 నుంచి రూ.2,18,200.
- ఎంపిక విధానం: సెల్ఫ్ అసెస్‌మెంట్ స్కోర్ కార్డ్ ఆధారంగా షార్ట్‌లిస్ట్, బోధానానుభవం, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా. దరఖాస్తును ది రిజిస్ట్రార్, ఎస్‌కేఎల్‌టీజీహెచ్‌యూ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, ములుగు(వీ-ఎం), సిద్ధిపేట జిల్లా-502 279 చిరునామకు పంపించాలి.
- దరఖాస్తులకు చివరితేది: 31.01.2026.
- వెబ్‌సైట్: https://skltghu.ac.in/

ఎన్ఐవో, ముంబైలో 14 అప్రెంటిస్‌లు

ముంబైలోని సీఎస్ఐఆర్-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ(ఎన్ఐవో).. ఒప్పంద ప్రాతిపదికన టెక్నీషియన్, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం ఖాళీల సంఖ్య: టెక్నీషియన్ అప్రెంటిస్‌షిప్(డిప్లొమా)-04, గ్రాడ్యుయేట్(నాన్-ఇంజనీరింగ్) అప్రెంటిస్‌షిప్-10.
- విభాగాలు: సివిల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్, రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్ ఇంజనీరింగ్, ఓషనోగ్రఫీ, జనరల్ అడ్మినిస్ట్రేషన్.
- శిక్షణా వ్యవధి: ఏడాది.
- అర్హత: సంబంధిత విభాగంలో డిప్లొమా, బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు సంబంధిత పని అనుభవం ఉండాలి.
- వయసు: డిప్లొమా టెక్నీషియన్స్‌కు 18 నుంచి 24 ఏళ్లు, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు 21 నుంచి 26 ఏళ్లు మించకూడదు.
- ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ద్వారా..
- ఇంటర్వ్యూ తేది: 08.01.2026.
- ఇంటర్వ్యూ వేదిక: సీఎస్ఐఆర్-ఎన్ఐవో, రీజనల్ సెంటర్, లోఖండవాల రోడ్, 4 బంగ్లాస్, అంధేరి వెస్ట్, ముంబై, మహారాష్ట్ర-400053.
- వెబ్‌సైట్: https://www.nio.res.in

How are lungs designed in humans for exchange of gases

In the X-Class Biological Sciences exam, the 8-mark questions are the structural pillars of your marksheet, designed to evaluate your ability to synthesize complex life processes into a coherent narrative. These questions are high-stakes because they allow for step-wise marking, meaning you can secure significant credit through a combination of labeled diagrams, flowcharts, and technical keywords even if your prose is brief. To an examiner, a well-structured 8-marker demonstrates that a student has moved beyond simple memorization to a conceptual mastery of subjects like the experiments questions in Nutrition, respiration making these sections the most efficient way to boost your overall percentage.

Avoid writing long, "wall-of-text" paragraphs. Use a structured approach:

- **Introduction:** A 2-line definition of the concept.
- **Sub-headings:** Break the process into stages (e.g., for Photosynthesis: Light reaction, Dark reaction).
- **Bullet Points:** List functions or characteristics in clear, numbered points.
- **Conclusion:** A brief summary of the importance of that process. By treating these questions as a mini-presentation rather than an essay, you ensure clarity and precision, allowing you to secure the full 8 marks within the allotted 15-minute window per question.

1. Write about an experiment to prove that carbon dioxide is essential for photosynthesis?

Aim: To prove that carbon dioxide is necessary for photosynthesis. **8 M**

Materials required:

Potted plants, Bell jar, Potassium hydroxide, Vaseline, Glass plates

Procedure:

1. Take two healthy potted plants which are nearly the same size.
2. Keep them in a dark room for three days so all the starch gets used up.
3. Now place each plant on separate glass plates. Place a watch-glass containing potassium hydroxide by the side of one of the plants.
4. The potassium hydroxide is used to absorb carbon dioxide.
5. Cover both plants with separate bell jars.
6. Keep the plants in sunlight for about two hours.

Observation:

Pluck a leaf from each plant and check for the presence of starch.

Leaf Inside the Bottle: (no CO_2 is Present) No blue-black color appears (no starch formed).

Leaf Outside the Bottle (CO_2 Present): Turns blue-black, indicating starch formation.

Result:

This experiment proves that carbon dioxide is necessary for photosynthesis.



2. Write about an experiment to prove action of saliva on starch? 8M

Aim: To demonstrate action of saliva on starch.

Materials required: Test tubes, starch solution, iodine solution, saliva.

Procedure:

1. Take 1 ml starch solution in two test tubes (A,B).
2. Add 1 ml saliva to test tube A and leave both test tubes undisturbed for 20-30minutes.
3. Now add a few drops of dilute iodine solution to the test tubes.

Observation

1. Test tube B Contains starch we will observe the colour change in test tube B.
2. Test tube A does not contain starch.

Result: By adding saliva to test tube A, starch in starch solution gets converted into maltose sugars. so, we didn't observe the colour change proves the action of saliva on starch.



3. How can you prove that exhaled air contains more CO_2 than atmospheric air? 8M

Aim: To prove that exhaled air contains more carbon dioxide than atmospheric air.

Materials required: Test tubes, Lime water, Pichkari.

Procedure: Take some freshly prepared lime water in a test tube. Blow air through this lime water. Use a syringe or pichkari to pass air through some fresh lime water taken in another test tube.

Observation:

1. If we blow air into the lime water it immediately turns into Milky White.
2. Blowing through Pichkari will take much time to turn the lime water milky.

Result: Exhaled air contains more carbon dioxide (4.4%) than atmospheric air(0.4%)



4. How do you prove that chlorophyll is necessary for Photo Synthesis?

Aim: To prove the need of chlorophyll in photosynthesis.

Materials required: Money plant leaves, beakers, alcohol, water, iodine solution and a paper.

Procedure:

1. Taken a potted money plant with variegated leaves and kept it in dark room for three days that all the starch gets used up.
2. Then kept the plant in under sunlight for about six hours.
3. Plucked a variegated leaf from the plant and traced it on a white paper.
4. First dipped the leaf in boiling water for few minutes and later immersed it in a beaker of alcohol.
5. Placed this beaker carefully in a water bath and heated it until the alcohol began to boil.
6. Noted the change in colour and dipped this leaf in iodine solution for few minutes.
7. Taken out the leaf and rinsed off the iodine from the leaf.

Observation:

1. When the leaf is boiled in alcohol it lost the green colour pigment called chlorophyll and the alcohol becomes green colour.
2. When this leaf is dipped in iodine solution it is observed that the patches of green colour in the leaf turned blue black and the rest remained the same colour.

Inference: Iodine turns into blue black in colour with starch. The leaf turned into blue black colour at green patches and this infers that the green colour pigment.



Variegated leaf (a) before starch test
Variegated leaf (b) after starch test

5. Conduct an experiment that light is necessary for photosynthesis?

Aim: To show that only the parts of a leaf that get light can make starch.

Apparatus: Potted plant, Black paper / foil, tape, Water, Alcohol, Burner, Iodine solution.

Procedure:

1. Keep the plant in darkness for one day to remove starch.
2. Cover one part of a leaf with black paper so that light cannot reach it.
3. Keep the plant in sunlight for a few hours.
4. Pluck the leaf and boil it in water.
5. Then boil it in alcohol to remove green colour.
6. Wash it and add iodine solution.

Observation

1. The part of the leaf exposed to light turns blue-black.
2. The covered part does not turn blue-black.

Result:

1. Only the part that got light made starch.
2. Therefore, light is necessary for photosynthesis.



Fig. Experimental set-up to show light is necessary for photosynthesis

6. **Discuss the major steps involved in the process of nutrition in human beings.**
Major steps involved in human nutrition are -
Ingestion: Food is taken in through the mouth. Humans have a holozoic feeding mode. Solid particles are swallowed by them.
Digestion: In the alimentary canal, mechanical and chemical processes are used to break down complex dietary materials into simpler ones.
Absorption: The little finger-like projections, or villi, of the small intestine absorb digested food.
Assimilation: Food is absorbed and transported to all cells via blood, where it is used for energy, growth, and development.
Excretion: Food from the small intestine passes through to the big intestine, where it is ejected out by Anus.

7. **How are the alveoli designed to maximize the exchange of gases?** 8M
a. The nostril, larynx, nasal chamber, pharynx, trachea, epiglottis, alveoli, bronchioles, bronchi, and lungs make up the human respiratory tract.
b. Through millions of small sacs known as alveoli, oxygen is exchanged for carbon dioxide waste within the lungs.
c. Inhaled oxygen diffuses into the lungs' capillaries, binds to hemoglobin, and is pumped into the bloodstream.
d. Exhalation allows the carbon dioxide from the blood to diffuse through the alveoli and be evacuated.
e. To promote the exchange of gases between blood and the air-filled alveoli, the alveoli have thin walls and are richly supplied with a network of blood veins.
f. They have a balloon-like shape to maximize gas exchange surface area.
g. The alveolar walls are folded and have a significant surface area.
h. It has a large network of blood arteries that serve as a surface for gas exchange.



4 MARKS QUESTIONS

8. **Differentiate between aerobic and anaerobic respiration.**
The differences between aerobic and anaerobic respiration are:

Aerobic Respiration	Anaerobic Respiration
1. In the presence of oxygen, it occurs.	1. It happens when oxygen isn't present.
2. It can be found in the cytoplasm and mitochondria	2. It's found in the cytoplasm
3. Complete break down of glucose.	3. Incomplete break down of glucose.
4. End products are CO_2 and H_2O.	4. End products are CO_2 and ethyl alcohol or lactic acid.

9. **Differentiate inhalation and exhalation.** 4M

Inhalation	Exhalation
1. It is taking in of air from the atmosphere.	1. It is expelling out of the air from the lungs.
2. Diaphragm contract & flattens.	2. Diaphragm relaxes and becomes dome shaped.
3. Ribs movement is forward & outward.	3. Ribs movement is downward & inward
4. Volume of thoracic cavity decreases.	4. Volume of thoracic cavity increases.
5. Pressure of thoracic cavity decreases	5. Pressure of thoracic cavity increases

10. **Observe the table and answer the following questions.** 4 M

S.No	Digestive glands	Digestive juice	Enzymes
1	Salivary glands	Saliva	Salivaryamylase
2	Gastric glands	Gastric Juice	Pepsin
3	Liver	Bile juice	No enzymes
4	Pancreas	Pancreatic juice	Trypsin

i) Name the enzyme secreted from gastric glands.
Pepsin
ii) What enzyme is secreted by the pancreas?
Trypsin
iii) Name the gland that releases digestive juice with no enzyme?
Liver
iv) What are the secretions of salivary glands?
Saliva, mucus

11. **Read the paragraph and answer the questions.** 4M
Dental cariesortoothdecay causes gradual softening of enamel and dentine. It begins when bacteria acting on sugars produce acids that softens or de-mineralizes the enamel. Masses of bacterial cells together with food particles stick to the teeth to form dental plaque. Saliva cannot reach the tooth surface to neutralize the acids plaque covers the teeth. If Brushing is untreated, microorganisms may invade the pulp, causing inflammation and infection.
1. What substance softens the enamel? Acids
2. What precautions should be taken to avoid dental caries?
Brushing the teeth after eating.
3. What can happen if brushing is not done after eating?
If Brushing is not done it leads to teeth decay.
4. How does dental plaque form?
Masses of bacterial cells together with food particles stick to the teeth to form dental plaque

12. **Explain the different steps involved in nutrition in Amoeba?**
The mode of nutrition in Amoeba is holozoic. The process of obtaining food by Amoeba is called phagocytosis.
- Amoeba ingests food by using its finger-like projections called pseudopodia.
- The food is engulfed with a little surrounding water to form a food vacuole inside the Amoeba. The food is digested inside food vacuole by digestive enzymes.
- Food is absorbed directly into the cytoplasm of Amoeba by diffusion.
- Food is used to obtain energy and growth of Amoeba.
- When considerable amount of undigested food collects inside Amoeba then its cell membrane ruptures at any place to throw out this undigested food.



13. **Draw a neat labelled diagram showing cross section of leaf.**



14. **Observe the given diagram and answer the following questions?**



a) **What does this picture indicate?**
Stomata
b) **Identify the parts A and B,**
A- guard cells, B- Stomatapore, C- Chloroplast
c) **What happens if this organ is not present in the leaf?**
If stomata are absent, CO_2 cannot enter, O_2 cannot exit, and photosynthesis and transpiration are greatly reduced.

15. **How are lungs designed in humans for exchange of gases**
- Lungs contain millions of tiny air sacs called **alveoli**, which increase the surface area for gas exchange.
- The walls of alveoli are **very thin (one cell thick)**, allowing easy diffusion of oxygen and carbon dioxide.
- Alveoli are surrounded by a **dense network of capillaries**, ensuring quick transport of gases.
- The alveolar surface is **moist**, which helps oxygen to dissolve and diffuse efficiently.
- Lungs are **spongy and elastic**, allowing them to expand and contract during breathing.
- Continuous breathing maintains a **concentration gradient** of gases between alveoli and blood.
- Red blood cells contain **haemoglobin**, which readily binds with oxygen, increasing transport efficiency.

16. **How is small intestine designed to absorb digested food?**
- The inner lining of the small intestine has numerous **finger-like projections called villi**, which greatly increase the surface area for absorption.
- Each villus contains **blood capillaries** to absorb glucose, amino acids, vitamins, and minerals.
- Villi also have lymph vessels for absorption of fatty acids and glycerol.
- The intestinal wall is **thin and moist,** allowing easy and rapid absorption of nutrients.
- The long and coiled structure of the small intestine provides **sufficient time** for complete absorption.

P. Neelakantaiah
ZPHS Karakambadi,
Tirupati Dist.

Daily Quiz 7

1. **Vocal cords vibrate during** ( )
A. Inhalation B) Exhalation
C) In inhalation and exhalation
D) They don't vibrate
2. **______ is called energy currency of the cell.** ( )
A) Oxygen B) Mitochondria
C) ATP D) Glucose
3. **Identify the correct sentence about exhalation.** ( )
A) Diaphragm flattens and moves downward by the contraction of muscles in it.
B) When Chest walls move upward, and diaphragm moves downward, then chest cavity size increases.
C) When chest walls move inward and diaphragm gets dome shaped then chest cavity size decreases.
D) When diaphragm moves downward, and chest wall moves inward then the chest cavity increases.
4. **Identify the Common passage for food and air in humans** ( )
A) Epiglottis B) Glottis
C) Pharynx D) Larynx.
5. **The real exchange of gases takes in** ( )
A) Alveoli B) Nasal cavity
C) Trachea D) Pharynx

సమాధానాలు రాయడానికి ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

సంక్రాంతి
సినిమాల
స్పెషల్

ప్రత్యేక కథనం నేడు
'సాక్షి' సినిమా ప్లస్ ఈపేపర్‌లో....

విధానం

దేశంలోని స్కూళ్లలో పాఠ్యేతర పుస్తకాలు చదివించడం ఒక విధానంగా ఉంది. కాని 'స్క్రీన్ టైమ్' విపరీతంగా పెరిగిపోయిన ఈ కాలంలో బడిలో తప్పనిసరిగా రోజూ న్యూస్‌పేపర్లు చదివించాలని ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ ప్రభుత్వాలు ఆదేశాలిచ్చాయి. కేరళలో ఈ ప్రయత్నం గతేడాదే మొదలైంది. పిల్లలు రోజూ స్కూల్ అవర్‌లో న్యూస్‌పేపర్ చదివితే కలిగే ప్రయోజనాలేమిటో నిపుణులు చెప్తున్నారు. ఫీల్డ్ రిపోర్ట్‌ను బట్టి కొన్ని గమనింపులు కూడా వస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో ఈ విధానం కోసం తల్లిదండ్రుల ఒత్తిడి మొదలవ్వాల్సి ఉంది.

ఫోన్ వదలాలంటే పేపర్ చదవాలి

పిల్లలు స్మార్ట్ ఫోన్‌లకు మనం ఊహిస్తున్న దాని కంటే ఎక్కువే అలవాటు పడ్డారు. ఏ చిన్న సమాచారం కావాలన్నా గూగుల్‌లో వెతికేందుకు ఫోన్ వంక చూస్తున్నారు. అయితే కావాల్సిన సమాచారానికి మించి అనేక విషయాలు అందులో ఉండటంతో గంటలకొద్దీ అక్కడే గడుపుతున్నారు. ఇది క్రమంగా వ్యసనంగా మారుతోంది. దీన్ని నిరోధించేందుకు ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ ప్రభుత్వాలు కీలక నిర్ణయం తీసుకున్నాయి.

పాఠశాలలో రోజూ 45 నిమిషాల పాటు దినపత్రికలు చదివే విధానాన్ని ప్రవేశపెట్టాయి. దీనివల్ల పిల్లలు ఫోన్ చూసే సమయం తగ్గుతుందని, చుట్టూ జరిగే విషయాల పట్ల అవగాహన పెరుగుతుందని భావిస్తున్నాయి. ఢిల్లీ కూడా ఈ విధానంలోని సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తోంది. కేరళ ప్రభుత్వం ఈ విధానాన్ని గత సంవత్సరమే ప్రవేశపెట్టింది.

సమాధానం చెబితే బహుమతి

గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు నిత్యం దినపత్రికలు చదివే విధానం అమలులో ఉండేది. కొన్ని స్కూల్ లైబ్రరీలకు దినపత్రికలు, మాసపత్రికలు వచ్చేవి. అయితే కాలక్రమంలో నిధుల కొరత, నిర్వహణా లోపాల కారణంగా ఆ విధానానికి స్వస్తి పలికారు. కొన్నిచోట్ల మినహా చాలా ప్రాంతాల్లో ఆ విధానాన్ని పాటించడం లేదు. ప్రస్తుతం ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ చూపటంతో తిరిగి ఆ విధానం అమల్లోకి వచ్చింది. రోజూ 45 నిమిషాల పాటు దినపత్రిక చదివేందుకు కేటాయిస్తారు. ఒక్కో విద్యార్థికి ఒక దినపత్రిక కేటాయిస్తారు. వారు శ్రద్ధగా చదువుతున్నారా, లేదా అని పరిశీలించేందుకు ఆ రోజు వార్తల్లోని ఒక అంశంపై టీచర్ ప్రశ్న వేస్తారు. సరైన సమాధానం చెప్పిన విద్యార్థికి చాక్లెట్ బహుమతిగా అందిస్తారు.

ఫోన్ చూడటం మానేస్తారా?

దినపత్రికలు చదివించడం వల్ల పిల్లలు ఫోన్ చూడటం మానేస్తారా? అనేకమందిలో కలుగుతున్న సందేహం ఇది. పేపర్లు చదివించడానికీ, ఫోన్ చూడటానికీ మధ్య సంబంధం ఏమిటనేది కొందరి ప్రశ్న. దినపత్రికలు చదవడం వల్ల ఫోన్ చూడటం మానేస్తారని కచ్చితంగా చెప్పలేమని విద్యావేత్తలు అంటున్నారు. ఇదొక ప్రయత్నమని, ప్రతి విషయానికీ ఇంటర్‌నెట్ మీద ఆధారపడటం మానేందుకు ఇది ఉపకరిస్తుందని అంటున్నారు. ఈ విధానం వల్ల పఠనం పట్ల ఆసక్తి పెరిగి, ఫోన్ అలవాటు కు దూరమయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో దినపత్రికలు చదవడాన్ని కచ్చితంగా అమలు చేస్తుండగా, మరికొన్ని చోట్ల మాత్రం దీన్ని ఐచ్ఛికం చేశారు. పిల్లల చేత బలవంతంగా దినపత్రికలు చదివించలేమని, అలా చదివించినా వారికి అందులోని విషయాలేమీ ఎక్కవని కొందరు అభిప్రాయపడుతున్నారు.

సామాజిక అంశాల పట్ల అవగాహన

ప్రభుత్వాలు పిల్లల చేత వార్తాపత్రికలు చదివించాలని శ్రద్ధ చూపడాన్ని విద్యావేత్తలు అభినందిస్తున్నారు. పిల్లలు పేపర్లు

చదవడం వల్ల సామాజిక అంశాల పట్ల అవగాహన పెరుగుతుందని, వారిలో ఆత్మ స్థైర్యం, వివేకం పెరుగుతాయని అంటున్నారు. నిత్యం పుస్తకాలతో కుస్తీ పట్టే వారికి ఇదొక ఆటవిడుపుగానూ ఉంటుందని, లోకంలో ఎక్కడేం జరుగుతుందో తెలుసుకునే అవకాశం చిక్కుతుందని అంటున్నారు. దినపత్రికల్లో ప్రాంతీయ భాషకే ప్రాధాన్యం. రెండవ స్థానంలో ఇంగ్లిష్ న్యూస్‌పేపర్‌ను అందుబాటులో ఉంచుతున్నారు. దీనివల్ల ఇరుభాషల్లో నైపుణ్యాలు పెరుగుతాయని అంటున్నారు.

పిల్లల అంతరంగంలో ఏముంది?

పాఠశాలలో దినపత్రికలు చదివించే అంశం పట్ల విద్యార్థుల నుంచి సానుకూలత వస్తోంది. దీనివల్ల రోజూ కొత్త విషయాలు తెలుసుకుంటున్నామని, తమ భాష కూడా మెరుగుపడిందని అంటున్నారు. తాము తెలుసుకున్న విషయాలు ఇంటికెళ్లి తల్లిదండ్రులతో చెప్తున్నామని, వారంతా ఆనందపడుతున్నారని అంటున్నారు. విద్యార్థులు ఎక్కువగా క్రీడావార్తల పట్ల ఆసక్తి చూపుతుండగా, పెద్ద తరగతుల్లోని వారు రాజకీయ వార్తలను ఇష్టంగా చదువుతున్నారు. దీర్ఘకాలంలో ఈ దినపత్రిక పఠనం విద్యార్థుల్లో గణనీయమైన అభివృద్ధికి కారణమవుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇలాంటి ప్రయత్నం జరగడం గురించి తల్లిదండ్రులు చర్చ లేవనెత్తాలి.

కళాత్మకమైన ఉపాధి

ఒకప్పుడు ఇంటి పనులకే పరిమితమై నేడు వ్యాపారులుగా మారిన శీలా దేవి, నీలమ్ సారంగి మహిళలకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ప్రయాగ్‌రాజ్ సంగం జిల్లాలో 80 వేల రూపాయలతో టెంట్ హౌజ్ వ్యాపారాన్ని మొదలుపెట్టి, ఏడాదికి 15 లక్షలు సంపాదిస్తూ గ్రామీణ మహిళలకు అండగా నిలుస్తోంది శీలా దేవి. బేకర్ కో ఆకర్ ద్వారా వ్యర్థాల నుంచి అర్థవంతమైన వస్తువులను రూపకల్పన చేస్తూ వందకు పైగా మహిళలకు ఉపాధి కల్పిస్తోంది నీలం సారంగి. మహిళాభివృద్ధిలో వీరు చూపిస్తున్న కృషి ఎంతోమందిలో స్ఫూర్తిని నింపుతుంది.

ట్రాన్స్ యమునా పాకెట్‌లోని తిక్రి కంజాసా గ్రామానికి చెందిన శీలాదేవి టెంట్ హౌజ్ కంపెనీని స్థాపించి, మహిళల అభ్యున్నతికి పాటు పడుతున్నారు. ఆమె తీసుకున్న ఈ చొరవ అక్కడ ఇతర గ్రామీణ మహిళలను ప్రోత్సహిస్తుంది. వ్యవసాయం, వ్యాపారం ఈ రెండింటి ద్వారా వారి జీవితాలను మారుస్తోంది.

ఆర్థిక పురోగతి : శీలాదేవి

ఇంటి పరిస్థితుల కారణంగా చదువు కలగా మారింది. అంతేకాకుండా ఆమె భర్త అనూజ్ కూడా ఉద్యోగంలో రాణించడం లేదు. ఈ స్థితిలో కుటుంబ జీవనం ఎలా సాగించాలో అర్థం కాలేదు. అసలు ఏమాత్రం అనుకూలంగా లేని పరిస్థితులు. అయినా, ఆమె ఆశను కోల్పోలేదు. నాలుగేళ్ల క్రితం రాష్ట్ర గ్రామీణ జీవనోపాధి మిషన్‌లో చేరి ఉజాలా మహిళా స్వయం సహాయక బృందాన్ని ప్రారంభించింది. ప్రభుత్వం నుండి అందిన రుణం, తన దగ్గర ఉన్న కొద్దిపాటి పొదుపు మొత్తం జోడించి రూ.80,000 లతో టెంట్ వ్యాపారం మొదలు పెట్టింది. మెల్ల మెల్లగా పరిస్థితులు మెరుగవుతూ వచ్చాయి. ఏడాదిలోపే బ్యాంకు రుణం తిరిగి చెల్లించింది. భర్తకు వ్యాపార బాధ్యతలు అప్పగించి, విద్యుత్ ఫెసిలిటేటర్‌గా పనిచేయడం ప్రారంభించింది. దీనిద్వారా లభించిన కమిషన్‌ను ఆమె తన టెంట్ వ్యాపారంలో పెట్టుబడి పెట్టింది. నేడు ఆమె ఏడాదికి రూ.12 నుండి 15 లక్షల రూపాయలు సంపాదిస్తోంది. చుట్టుపక్కల గ్రామాల నుండి చదువుకున్న ఇతర మహిళలను కూడా తన గ్రూపులో చేర్చుకోవడం, వారి కుటుంబ సభ్యులకు ఉపాధి కల్పించడం మొదలుపెట్టింది. టెంట్ అద్దెకిచ్చే వ్యాపారంలో పాతికమందికి పైగా స్థానికులు ఉపాధి పొందుతున్నారు.

సమస్యలు వచ్చాయని కుంగిపోకుండా చేసే చిన్న ప్రయత్నంతోనైనా జీవితాన్ని నిలబెట్టుకోవచ్చని నిరూపిస్తోంది శీలాదేవి. ఇప్పుడు ఆమె బాటలో మిగతా మహిళలు కదులుతున్నారు.

వ్యర్థాలతో గుర్తింపు: నీలం సారంగి

పర్యావరణ సవాళ్లు

ప్రతిరోజూ తీవ్రమవుతున్న ప్రపంచంలో ఎవరో ఒకరు సమస్యను అవకాశంగా మార్చుకుంటారు. నీలం సారంగి స్థాపించిన డీపీఐఐటి గుర్తింపు పొందిన సామాజిక సంస్థ బేకర్ కో ఆకర్ ఓ శక్తిమంతమైన ఉదాహరణ. వ్యర్థాలను సంపదగా ఎలా మార్చవచ్చు... అనే ఓ చిన్న ఆలోచన ఇప్పుడు ఉత్తరప్రదేశ్ అంతటా వినిపిస్తోంది. మహిళా సాధికారత, సమాజ అభివృద్ధిని సమర్థించే ఉద్యమంగా ఎదిగింది. వ్యర్థాల నుంచి సృజనాత్మకత, ఆవిష్కరణ, సామాజిక ప్రయోజనం, పచ్చని భవిష్యత్తును నిర్మించగలవని కూడా నిరూపిస్తున్నారు. నీలం సారంగి వ్యర్థాలలో దాగి ఉన్న సామర్థ్యాన్ని చూసింది. పాత బూట్లు, టైర్లు, పాత్రలు, సీసాలు, ఇనుప స్క్రాప్, కొయ్యదుంగలు, పారిశ్రామిక వ్యర్థాలతో రీ డిజైన్‌లో శ్రద్ధ, అంకిత భావంతో వివిధ రకాల ప్రయోగాలు చేయడం ప్రారంభించింది. ఈ ఆలోచనే బేకర్ కో ఆకర్‌కు పునాదిగా మారింది. పర్యావరణంపై వ్యర్థాల భారాన్ని తగ్గించడం, గ్రామీణ నిరుపేద మహిళలకు జీవనోపాధిని కల్పించడంపై దృష్టి పెట్టింది.

అద్భుతాల సృష్టి

నీలం సారంగి బృందం గృహ, పారిశ్రామిక వ్యర్థాలైన పాత టైర్లు, స్క్రాప్ మెటల్‌ను సేకరించి, శిక్షణ పొందిన మహిళా కళాకారులు నిర్వహించే కమ్యూనిటీ ఆధారిత సంస్థ అయిన బేకర్ కో ఆకర్‌కు చేరుస్తుంటుంది. ఇక్కడ అవి గృహాలకంరణ వస్తువులుగా, కొయ్యదుంగలు హస్తకళాకృతులుగా, పాత బూట్లు, పాత్రలు, ఇతర చెత్త కొత్త రూపాన్ని పొందుతాయి. ఇక్కడ ప్రతి ఉత్పత్తి చేతితో తయారు చేసినదే. పర్యావరణ అనుకూలమైనదే. ఆధునిక గృహాలంకరణ నుండి కార్పొరేట్ బహుమతుల వరకు మంచి మార్కెట్‌ను ఏర్పరుచుకుంది బేకర్ కో ఆకర్ సంస్థ. ఈ సంస్థ వందకు పైగా మహిళలకు శిక్షణ ఇచ్చింది. నూట ఇరవై మందికి పైగా ఉద్యోగావకాశాలను కల్పించింది. నీలం దృష్టిలో సాధికారత కేవలం ఆర్థికపరమైనది కాదు, భావోద్వేగపరమైనది, సామాజికమైనది. మహిళలు తమలో దాగి ఉన్న సామర్థ్యాన్ని తెలుసుకొని, తమ సమాజాలలో మంచి మార్పుకు కారకులుగా మారడానికి ఇది సహాయపడుతుంది. బేకర్ కో ఆకర్ ద్వారా పట్టణ అభివృద్ధికి మహిళలు చురుకుగా సహకరిస్తున్నారు. ఝూన్సీ నగర్ నిగమ్, ప్రయాగ్‌రాజ్ నగర్ నిగమ్‌లతో కలిపి నీలం ఆమె బృందం పెద్ద ఎత్తున పట్టణ సుందరీకరణ ప్రాజెక్టులను అమలు చేశారు. ఒకప్పుడు చెత్త డంపింగ్ ప్రదేశాలుగా ఉన్న ప్రాంతాలను కళాత్మకంగా తిరిగి రూపొందించారు. దీంతో ఆ ప్రాంతాలు సెల్ఫీ పాయింట్లు, పబ్లిక్ ఆర్ట్ ఇన్‌స్టాలేషన్లు, మినీ పార్కులతో అందంగా మారిపోయాయి. మున్సిపల్ వ్యర్థాల నుండి సేకరించిన పదార్థాలను ఉపయోగించి నగరాన్ని అందంగా తీర్చిదిద్దవచ్చని ఇది రుజువు చేస్తుంది. మొత్తం 29 నగర సుందరీకరణ ప్రాజెక్టులు చేశారు.

● లీగల్

లింగమార్పిడి చేయించుకున్నా... మీ ఆస్తి హక్కు రద్దు కాదు!

నేను లింగమార్పిడి ద్వారా స్త్రీగా మారాను. దానికి అంగీకరించని మా కుటుంబం నన్ను వదిలేసింది. మాకు పూర్వీకుల ఆస్తి ఉంది. ఇటీవలే మా అమ్మానాన్నా ఇద్దరూ చనిపోయారు. ఇప్పుడు మా అన్నయ్య ''నువ్వు మగాడిగా పుట్టి ఆడదానిగా మారిపోయావు అంటే నువ్వు చచ్చిపోయినట్టే. మా నాన్నకి పుట్టింది కొడుకు. కూతురు కాదు.'' అంటున్నాడు. అది నిజమేనా?

– మాళవిక, సూర్యాపేట

మీ పరిస్థితి బాధాకరం. చట్టాలలో ఎన్ని మార్పులు వచ్చినప్పటికీ సమాజంలో ఇంకా మార్పు రాలేదు. బహుశా ఆ మార్పు రావడానికి ఇంకాస్త సమయం పట్టేలా కనిపిస్తుంది. లింగ మార్పిడి చేసుకున్న స్త్రీలైనా పురుషులైనా ముందుగా వారు మనుషులు! మనిషిని మనిషిగా చూడడం కనీస మానవత్వం. అదే చట్టం – రాజ్యాంగం కూడా. అందుకనే సుప్రీంకోర్టు సైతం స్వలింగ సంపర్కులకు, లింగ మార్పిడి చేయించుకున్న వారికి, LGBTQగా గుర్తింపబడే ఇతర లైంగిక వర్గాలను వివక్షించే వీలు లేదు అంటూ అనేక తీర్పులు ఇచ్చింది. ట్రాన్స్‌జెండర్ల రక్షణ చట్టం, 2019లో సైతం లింగమార్పిడి చేయించుకున్న వారిపై వివక్షను రద్దు చేయడమే కాకుండా వివక్ష చూపిన వారిపై శిక్షలు కూడా విధించింది. ఉత్తరప్రదేశ్ లాంటి కొన్ని రాష్ట్రాలు లింగ మార్పిడి చేయించుకున్నవారికి పూర్వీకుల వ్యవసాయ భూమిలో హక్కు ఉంటుంది అని చట్టాలు చేశాయి. అయితే మిగతా రాష్ట్రాలలో లింగమార్పిడి చేయించుకున్న వారికి వారసత్వం ద్వారా ఆస్తి పొందే విషయంలో చట్టంలో కొంత స్తబ్దత ఉన్న మాట నిజమే అయినప్పటికీ, మీ కేసులో మీ అన్నగారు మీకు ఆస్తి ఇవ్వను అనడం కుదరదు. లింగమార్పిడి చేయించుకున్నంత మాత్రాన మీరు మనుగడలో లేకుండా పోయినట్లు కాదు. అందువల్ల మీరు మీపై వివక్ష చూపుతున్న మీ అన్నయ్యపై నిరభ్యంతరంగా పార్టిషన్ సూటు వేయచ్చు.

హిందూ వారసత్వ చట్టంలో కూడా బైనరీ జెండర్ ఆధారంగానే అంటే వారసులుగా కేవలం ఆడ/మగ లను మాత్రమే గుర్తిస్తుంది. అయితే అదే చట్టంలోని సెక్షన్ 28 ప్రకారం, ఏదైనా వ్యాధి ఉందని గానీ, లోపం ఉంది అనిగానీ, మరే ''ఇతర కారణాలు'' చూపి అయినా గాని వివక్ష చూపడానికి వీలు లేదు – ఆస్తి ఇవ్వను అనడానికి వీల్లేదు. మీ అన్నగారు మీకు లోపం ఉంది అనే వాదన చేస్తే చేసుకోనివ్వండి. మీరేం ఆందోళన పడనక్కరలేదు. చట్టం మీ ఆస్తి మీకు వచ్చేలా చేస్తుంది.

– శ్రీకాంత్ చింతల,
హైకోర్టు న్యాయవాది

మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాల కోసం sakshifamily3@gmail.comకు మెయిల్ చేయవచ్చు.

ఇన్నోవేషన్

ఎడా పెడా డ్రైవింగ్ చేస్తున్నారా? ఈ ఏఐ హెల్మెట్ పట్టిస్తుంది!

ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తూ రోడ్డు మీద దూసుకుపోతున్న వాహనదారులను చూసి బెంగళూరుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ పంకజ్ తన్వర్‌కి బాగా కోపం వచ్చేది. వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలనిపించేది. ఒకరోజా... రెండు రోజులా..., రోజూ ఇదే గొడవ!

'ఈ సమస్యకు ఏదో ఒక పరిష్కారం కనుక్కోవాలి' అని గట్టిగా అనుకున్నాడు పంకజ్.

ఎన్నో రోజులు కష్టపడి 'ఏఐ హెల్మెట్' స్వయంగా తయారు చేశాడు.

ఈ ఏఐ హెల్మెట్ ప్రత్యేకత ఏమిటి? అనే విషయానికి వస్తే... ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారి ఫోటోలను తీయడమే కాదు, వాటిని పోలీసులకు పంపుతుంది.

'అరాచకంగా డ్రైవింగ్ చేసేవారితో విసిగిపోయాను. అందుకే ఈ ఏఐ హెల్మెట్ తయారుచేశాను. నేను రైడ్ చేస్తున్నప్పుడు ఏఐ ఏజెంట్ నాతోపాటే పరుగులు తీస్తుంది. రోడ్డు నిబంధనలను ఉల్లంఘించిన వారిని ట్రాఫిక్ పోలీసుకు పట్టిస్తుంది. ఏ లొకేషన్‌లో ఉల్లంఘన జరిగిందీ అనే దానికి సంబంధించి ఆధారాలు కూడా పంపిస్తుంది. ఖరీదైన సీసీ కెమెరాలు ఇన్‌స్టాల్ చేసుకోవాల్సిన అవసరం లేకుండానే తక్కువ ఖర్చుతోనే నిఘా పరికరం ఎందుకు తయారు చేయకూడదు– అనే ఆలోచన నుంచే ఈ ఏఐ హెల్మెట్ రూపుదిద్దుకుంది' అంటున్నాడు 27 సంవత్సరాల పంకజ్.

ఈ ఏఐ హెల్మెట్ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఇరవై లక్షలకు పైగా వ్యూస్ వచ్చాయి.

'ఇది అద్భుతమైన ఆలోచన..' అంటూ ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు నెటిజనులు.

వైరల్ అయిన ఈ వీడియోను చూసిన బెంగళూరు పోలీసులు పంకజ్‌ను కలుసుకొని అభినందించడం మరో విశేషం.

సమ్‌థింగ్ స్పెషల్

ఫ్యామిలీ బుక్

వన్స్ అపాన్ ఏ టైమ్ నుంచి ఇప్పటి వరకు మన ఫ్యామిలీ ఫొటోలను 'పర్సనలైజ్‌డ్ కలరింగ్ బుక్'గా మార్చి పిల్లలకు చూపిస్తే వారి ఆనందం అంతా ఇంతా కాదు.

ఫ్యామిలీ ఫొటోలను, ఫొటోలాగే కాకుండా బ్లాక్ అండ్ వైట్ డ్రాయింగ్స్‌గా చూపించి రంగులు వేయమంటే ఎగిరి గంతేస్తారు కదా!

దీనికి మార్గం... ఏఐ-పవర్డ్ యాప్ స్ప్లాట్. 'రెట్రో' అనే టెక్ స్టార్టప్ ఈ యాప్‌ను అభివృద్ధి చేసింది. స్నేహితులు, సన్నిహితులు, కుటుంబ సభ్యుల కోసం రూపొందించిన ఫొటో–షేరింగ్ యాప్ ఇది.

జంతువుల చిత్రాలు, అందమైన స్థలాలు, రోబోలు, కార్లు... మొదలైన వాటితో పిల్లలు ఇష్టపడే సరదా కంటెంట్ మాత్రమే కాకుండా చదువుకు సంబంధించిన కంటెంట్ కూడా కలర్‌ఫుల్‌గా రూపొందించవచ్చు. వారపు సబ్‌స్క్రిప్షన్ యూజర్‌లను ప్రతి వారం 25 పేజీలను రూపొందించడానికి, ప్రింట్ చేయడానికి అనుమతిస్తుంది. వార్షిక ప్లాన్ యూజర్‌లను సంవత్సరానికి 500 పేజీలను ప్రింట్ చేయడానికి అనుమతిస్తుంది. ఈ యాప్ ఐవోఎస్, ఆండ్రాయిడ్ యూజర్‌లకు అందుబాటు ఉంది.

ఇలా ఉపయోగించాలి...

● 'స్ప్లాట్' యాప్ ఓపెన్ చేసి ఎంచుకున్న ఫొటోను అప్‌లోడ్ చేయాలి ● ఫొటో కలరింగ్ పేజీగా మార్చడానికి సంబంధించిన స్టైల్‌ను ఎంపిక చేసుకోవాలి. **ఉదా:** యామినీ, 3డీ మూవీస్, కార్టూన్, కామిక్

● ఈ యాప్ ఏఐని ఉపయోగించి అప్‌లోడ్ చేసిన ఫొటోను పిల్లలు రంగులు వేయడానికి ఆన్-స్క్రీన్ లేదా ప్రింటబుల్ పేజీగా మారుస్తుంది ● యాప్‌లోకి సైన్ ఇన్ అయిన తరువాత యూజర్‌లు పిల్లలకు నచ్చే వివిధ విభాగాలను ఎంపిక చేసుకోవచ్చు.

● బ్యూటిప్స్

● టీ స్పూన్ బటర్‌లో టీ స్పూన్ నీరు కలిపి ముఖానికి మాస్క్‌లా వేయాలి. పదిహేను నిమిషాల తర్వాత చల్లటి నీటితో శుభ్రపరుచుకోవాలి. పొడి చర్మాన్ని ఈ మాస్క్ మృదువుగా మారుస్తుంది.

● అప్రికాట్స్, పెరుగు కలిపి పేస్ట్‌చేయాలి. పొడి చర్మం గలవారు ఈ మిశ్రమంలో తేనె కలుపుకోవచ్చు. ఈ పేస్ట్‌ను ముఖానికి రాసుకొని, ఆరిన తర్వాత శుభ్రపరచుకోవాలి. ఇలా చేయడం వల్ల చర్మం కాంతివంతమవుతుంది.

● గుడ్డు సొన, ఆలివ్ ఆయిల్, కీర గుజ్జు సమభాగంలో తీసుకొని కలపాలి. ఈ మిశ్రమాన్ని తలకు పట్టించాలి. పది నిమిషాల తర్వాత కడిగేయాలి. జుట్టుకు పట్టులాంటి మృదుత్వం లభిస్తుంది. కేశాల ఎదుగుదల మెరుగవుతుంది.

● ఇంటిప్స్

లెదర్ షూస్ బాగా మెరవాలంటే అరటి తొక్కలతో రుద్దాలి. ముఖ్యంగా

బ్రౌన్‌కలర్ షూస్‌కి ఇది చక్కని చిట్కా.

ఫ్రిజ్ మీద మరకలుంటే వాటి మీద ముందుగా టూత్‌పేస్టు రాయాలి. కొద్దిసేపటి తరు

వాత క్లాత్‌తో తుడిచి చివరగా సబ్బు నీటితో శుభ్రం చేయాలి.

బాత్‌రూం టైల్స్ తళతళ మెరవాలంటే, ఒక బకెట్ నీటిలో అరటి తొక్కలను వేసి రాత్రంతా ఉంచి ఉదయం తొక్కలను తీసి పారేసి ఆ నీటితో శుభ్రం చేయాలి.

● ముగ్గు ముచ్చట

21 చుక్కలు, 11 వచ్చేవరకు మధ్య చుక్క

మద్దిగట్ల సుమలత
మహబూబ్‌నగర్

18 చుక్కలు, 2 వరుసలు, 2 వచ్చేవరకు

నల్లబెల్లి మనోజ్ఞ
మంచిర్యాల

బులియన్
(బంగారం 10 గ్రా.: వెండి కిలో)
జనవరి 7న ముగింపు రూ.లలో

హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	1,41,910
బంగారం (22 క్యారెట్లు)	1,30,110
వెండి	2,52,000

విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	1,41,370
బంగారం (22 క్యారెట్లు)	1,27,250
వెండి	2,52,400

విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	1,38,820
బంగారం (22 క్యారెట్లు)	1,27,250
వెండి	2,71,000

రాజమండ్రి	
బంగారం (24 క్యారెట్లు)	1,41,370
బంగారం (22 క్యారెట్లు)	1,31,070
వెండి	2,52,400

ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	1,41,600
బంగారం (22 క్యారెట్లు)	1,30,270
వెండి	2,52,000

చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	1,39,960
బంగారం (22 క్యారెట్లు)	1,28,300
వెండి	2,71,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

బ్రిటిష్ జూనియర్ ఓపెన్ స్క్వాష్ టోర్నీ రన్నరప్ అనాహత్ సింగ్

భారత రైజింగ్ స్టార్ అనాహత్ సింగ్... ప్రతిష్టాత్మక బ్రిటిష్ జూనియర్ ఓపెన్ స్క్వాష్ టోర్నమెంట్‌లో రన్నరప్‌గా నిలిచింది. బర్మింగ్‌హామ్ వేదికగా మంగళవారం జరిగిన ఫైనల్లో టాప్ సీడ్ అనాహత్ సింగ్ 9–11, 11–7, 3–11, 9–11తో రెండో సీడ్ యూరోపియన్ జూనియర్ చాంపియన్ లారెన్ బల్టాయన్ చేతిలో పోరాడి ఓడింది. 46 నిమిషాల పాటు సాగిన అండర్–19 తుది పోరులో అనాహత్ తొలి గేమ్ కోల్పోయింది... ఆ తర్వాత రెండో గేమ్ గెలిచి పోటీలోకి వచ్చింది. అయితే మూడో గేమ్‌లో ఆకట్టుకోలేకపోయిన అనాహత్... నాలుగో గేమ్‌లోనూ అదే ఆటతీరుతో రెండో స్థానానికి పరిమితమైంది. అంతకుముందు జరిగిన సెమీఫైనల్లో అనాహత్ 11–8, 11–7, 11–9తో మలిక ఎల్ కరాక్సీ (ఈజిప్ట్)పై గెలిచింది. ఈ టోర్నమెంట్‌లో భారత్ నుంచి జోష్న చినప్ప 2005లో టైటిల్ గెలిచింది. అంతర్జాతీయ స్థాయిలో నిలకడగా రాణిస్తున్న 17 ఏళ్ల అనాహత్ సింగ్... ఇప్పటి వరకు 12 పీఎస్ఏ టూర్ టైటిల్స్ గెలిచింది. మరోవైపు బాలుర అండర్–17 విభాగంలో భారత ప్లేయర్ ఆర్యవీర్ సెమీఫైనల్లో పరాజయం పాలయ్యాడు.

లక్ష్యసేన్ శుభారంభం

- ఆయుశ్ షెట్టి ముందంజ
- తొలి రౌండ్‌లోనే మాళవిక ఓటమి
- మలేసియా ఓపెన్ సూపర్–1000

కౌలాలంపూర్: కొత్త సీజన్‌లో భారత బ్యాడ్మింటన్ స్టార్ షట్లర్ లక్ష్యసేన్ శుభారంభం చేశాడు. బీడబ్ల్యూఎఫ్ మలేసియా ఓపెన్ సూపర్–1000 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో అతను తొలి రౌండ్‌లో విజయం సాధించాడు. సేన్‌తో పాటు పురుషుల సింగిల్స్‌లో ఆయుశ్ షెట్టి కూడా విజయంతో సీజన్‌ను మొదలుపెట్టగా, మహిళల సింగిల్స్‌లో మాళవిక బన్సోద్‌కు పరాజయం ఎదురైంది. ఆమెకు తొలి రౌండ్లోనే చుక్కెదురైంది. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో లక్ష్యసేన్ 21–16, 15–21, 21–14తో సింగపూర్‌కు చెందిన జియా హెంగ్ జాసన్‌పై విజయం సాధించాడు. ఒక గంటా 10 నిమిషాల పాటు సాగిన ఈ పోరులో తొలి గేమ్‌ను సులువుగానే చేజిక్కించుకున్న భారత షట్లర్‌కు రెండో గేమ్‌లో అనూహ్య పోటీ ఎదురైంది. దీంతో కాస్త తడబడిన లక్ష్యసేన్ ఈ గేమ్‌ను కోల్పోయాడు. కానీ నిర్ణాయక మూడో గేమ్‌లో ఆరంభం నుంచే పుంజుకొని ఆడాడు. ప్రత్యర్థికి అవకాశమివ్వకుండా చెలరేగాడు. 14–10తో ఆధిక్యంలో నిలిచాక వరుసగా పాయింట్లు సాధిస్తూ 18–13కి చేరాడు. ప్రత్యర్థి ఒక పాయింట్ సాధించే లోపే వరుసగా మూడు పాయింట్లు సాధించి మ్యాచ్‌ను గెలిచాడు. మరో మ్యాచ్‌లో ఆయుశ్ షెట్టి 21–12, 21–17తో వరుస గేముల్లో స్థానిక ఆటగాడు లీ జి జియాపై అలవోక విజయం సాధించాడు. గతేడాది యూఎస్ ఓపెన్ సూపర్–300 టైటిల్ నెగ్గిన యువ షట్లర్ ఆయుశ్ ఈ మ్యాచ్‌ను కేవలం 39 నిమిషాల్లోనే ముగించాడు. మహిళల సింగిల్స్‌లో మాళవిక బన్సోద్ వరుస గేముల్లో ప్రత్యర్థికి తలవంచింది. తొలి రౌండ్లో భారత షట్లర్ 11–21, 11–21తో ఏడో సీడ్ రత్చనొక్ ఇంతనొన్ (థాయ్‌లాండ్) చేతిలో చేతులెత్తేసింది. థాయ్‌కి చెందిన మాజీ ప్రపంచ నంబర్‌వన్ షట్లర్ రత్చనొక్ కేవలం 35 నిమిషాల్లోనే భారత అమ్మాయి ఆట కట్టించింది. పురుషుల డబుల్స్‌లో ఎం.ఆర్.అర్జున్–హరిహరన్ జోడీకి తొలి రౌండ్లోనే నిరాశ ఎదురైంది. భారత ద్వయం 10–21, 20–22తో జపాన్‌కు చెందిన హిరొకి మిదొరికవ– క్యోహె యమషిత జంట చేతిలో పోరాడి ఓడింది.

నేడు సింధు పోరు

గత ఏడాదంతా వరుస వైఫల్యాలు, గాయాలతో చాలా కాలం ఆటకు దూరంగా ఉన్న సింధు నేడు జరిగే తొలి మ్యాచ్‌లో చైనీస్ తైపీకి చెందిన సంగ్ షువొ యున్‌తో తలపడుతుంది. మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి గోపీచంద్–ట్రెసా జాలీ, రుతపర్ణ–శ్వేతపర్ణ జోడీలు కూడా బుధవారం బరిలోకి దిగనున్నాయి. పురుషుల డబుల్స్‌లో అగ్రశ్రేణి షట్లర్లు సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ షెట్టి జోడీ మూడో సీడ్‌గా బరిలోకి దిగుతోంది. తొలి మ్యాచ్‌లో వీరికి చైనీస్ తైపీకి చెందిన లీ జి హ్యుయ్–యంగ్ పొ హ్యున్ జంటతో తలపడుతుంది. తైపీ ద్వయంపై భారత జంటకు 5–0తో తిరుగులేని ఆధిక్యం ఉంది. ఇప్పటివరకు ఈ రెండు జోడీలు ఐదుసార్లు తలపడితే అన్నిసార్లు భారత జంటే గెలుపొందింది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

అమన్‌రావు డబుల్ సెంచరీ

154 బంతుల్లో 12 ఫోర్లు, 13 సిక్స్‌లతో 200 నాటౌట్ ● విజయ్ హజారే వన్డే టోర్నమెంట్

రాజ్‌కోట్: దేశవాళీ వన్డే టోర్నమెంట్ విజయ్ హజారే ట్రోఫీలో హైదరాబాద్ ఓపెనర్ పేరాల అమన్‌రావు (154 బంతుల్లో 200 నాటౌట్; 12 ఫోర్లు, 13 సిక్స్‌లు) డబుల్ సెంచరీతో కదం తొక్కాడు. ఫలితంగా ఎలైట్ గ్రూప్ 'బి'లో భాగంగా మంగళవారం జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు 107 పరుగుల తేడాతో బెంగాల్ జట్టుపై విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 352 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అమన్‌రావు ద్విశతకంతో అలరించగా... రాహుల్ సింగ్ (54 బంతుల్లో 65; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ శతకం సాధించాడు. కెప్టెన్ తిలక్ వర్మ (34) ఫర్వాలేదనిపించాడు. బెంగాల్ జట్టులో టీమిండియాకు ప్రాతినిధ్యం వహించిన మొహమ్మద్ షమీ, ఆకాశ్ దీప్, ముకేశ్ కుమార్, షాబాజ్ అహ్మద్ వంటి బౌలర్లుండగా... అమన్ వారి బంతులను అలవోకగా ఎదుర్కొన్నాడు. ఆకాశ్ దీప్, ముకేశ్ బౌలింగ్‌లో భారీగా పరుగులు రాబట్టాడు. లిస్ట్ 'ఎ' క్రికెట్‌లో ఆడుతున్న మూడో మ్యాచ్‌లోనే అమన్ చక్కటి క్లాస్ ఇన్నింగ్స్‌తో బెంగాల్ క్వార్టర్ ఫైనల్ అవకాశాలకు గండికొట్టాడు. ఇటీవల ఐపీఎల్ వేలంలో రాజస్తాన్ రాయల్స్ జట్టు 21 ఏళ్ల అమన్‌ను కొనుగోలు చేసుకుంది. మరో ఎండ్‌లో వికెట్లు పడుతున్నా ఏమాత్రం వెరవకుండా క్రీజులో నిలిచిన అతడు... జట్టుకు భారీ స్కోరు అందించాడు. ఇన్నింగ్స్ చివరి బంతికి సిక్స్ ద్వారా అమన్ డబుల్ సెంచరీ పూర్తి చేసుకోవడం విశేషం. బెంగాల్ బౌలర్లలో షమీకి మూడు వికెట్లు దక్కాయి. అనంతరం భారీ లక్ష్యఛేదనలో బెంగాల్... 44.4 ఓవర్లలో 245 పరుగులకు ఆలౌటైంది. షాబాజ్ అహ్మద్ (113 బంతుల్లో 108 నాటౌట్; 9 ఫోర్లు, 4 సిక్స్‌లు) శతకం సాధించగా... అనుస్టుప్ మజుందార్ (59) హాఫ్ సెంచరీ నమోదు చేశాడు. కెప్టెన్ అభిమన్యు (15) సహా తక్కినవాళ్లంతా విఫలమయ్యారు. హైదరాబాద్ బౌలర్లలో టీమిండియా పేసర్ మొహమ్మద్ సిరాజ్ 4 వికెట్లు పడగొట్టాడు. నితీశ్ రెడ్డి 2 వికెట్లు తీశాడు. ఇప్పటికే నాకౌట్ అవకాశాలు కోల్పోయిన హైదరాబాద్‌కు గ్రూప్ దశలో ఇది రెండో విజయం కాగా... ఆఖరి మ్యాచ్‌లో గురువారం జమ్మూ కశ్మీర్‌తో ఆడనుంది.

హర్మన్ ర్యాంక్ మెరుగు

దుబాయ్: భారత మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (634 పాయింట్లు) అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) మహిళల టి20 ర్యాంకింగ్స్‌లో రెండు స్థానాలు ఎగబాకి 13వ ర్యాంక్‌కు చేరింది. ఇటీవల శ్రీలంకతో జరిగిన ఆఖరి టి20లో ధనాధన్ అర్ధ శతకంతో మెరిసిన హర్మన్... ర్యాంకింగ్స్‌లో మెరుగైంది. ఈ జాబితాలో భారత్ నుంచి అత్యుత్తమంగా వైస్ కెప్టెన్ స్మృతి మంధాన (759 పాయింట్లు) మూడో ర్యాంక్‌లో ఉండగా... షఫాలీ వర్మ (732 పాయింట్లు) ఆరో స్థానంలో కొనసాగుతోంది. ఆ్రస్టేలియా ప్లేయర్ బెత్ మూనీ (794 పాయింట్లు) 'టాప్'లో ఉంది. బౌలింగ్‌లో ఇప్పటి వరకు అగ్ర స్థానంలో ఉన్న టీమిండియా స్పిన్నర్ దీప్తి శర్మ... ఒక స్థానం కోల్పోయి రెండో స్థానానికి చేరింది.

సురేశ్ కల్మాడీ కన్నుమూత

పుణే: భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) మాజీ అధ్యక్షుడు, కేంద్ర మాజీ మంత్రి సురేశ్ కల్మాడీ తుది శ్వాస విడిచారు. ఆయన వయసు 81 సంవత్సరాలు. కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. రాజకీయ నాయకుడిగాకంటే క్రీడా పరిపాలకుడిగానే కల్మాడీ ఎక్కువ గుర్తింపు తెచ్చుకున్నారు. 1996 నుంచి 2011 వరకు పదిహేనేళ్ల పాటు ఐఓఏ అధ్యక్షుడిగా పని చేసిన ఆయన భారత క్రీడా రంగాన్ని శాసించారు. ఎయిర్‌ఫోర్స్ ఫైటర్ పైలట్‌గా కెరీర్ ప్రారంభించి 1965, 1971 యుద్ధాల్లో పాల్గొన్న కల్మాడీ... అనంతరం రాజకీయాల వైపు, ఆపై క్రీడా పరిపాలన వైపు మళ్లారు. అంతర్జాతీయ వేదికపై భారత క్రీడా రంగం ఎదుగుతున్న దశలో క్రీడాభివృద్ధిపై తనదైన ముద్ర వేశారు. ఆసియా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కూడా కల్మాడీ వ్యవహరించారు. అయితే రెండు పెద్ద ఈవెంట్ల నిర్వహణ కల్మాడీకి చెడ్డ పేరు తెచ్చి పెట్టాయి. భారత్‌లో తొలిసారి 2010లో నిర్వహించిన కామన్వెల్త్ క్రీడలకు కల్మాడీ ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్‌గా వ్యవహరించారు. ఈ క్రీడల్లో తీవ్రమైన అవినీతికి పాల్పడ్డారంటూ విమర్శలు వచ్చాయి. 2014లో ఈ కేసులో ఆయన అరెస్ట్ కూడా అయ్యారు. 2011లో భారత్‌లో ఫార్ములా వన్ నిర్వహణ విషయంలో కూడా కల్మాడీ ఇవే తరహా ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఐఓఏ కల్మాడీ తమ 'జీవితకాలపు ప్యాట్రన్'గా ప్రకటించినా... తాను నిర్దోషిగా వచ్చే వరకు పదవి చేపట్టనని స్పష్టం చేశారు.

బంగ్లా బోర్డుతో ఐసీసీ భేటీ ఆలస్యం!

దుబాయ్: టి20 వరల్డ్ కప్‌లో భాగంగా భారత్‌లో జరిగే తమ మ్యాచ్‌లను శ్రీలంకకు తరలించాలంటూ బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) చేసిన అభ్యర్థనపై స్పందిస్తూ అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ప్రత్యేక భేటీకి సిద్ధమైంది. అయితే ఈ సమస్యను పరిష్కరించే విషయంలో బీసీబీ అధికారులతో మంగళవారం సమావేశం కావాల్సి ఉండగా, ఇది సాధ్యం కాలేదు. భేటీ వాయిదా పడినట్లు సమాచారం. భారత్‌లో బంగ్లా మ్యాచ్‌లు ఆడటంపై ఉన్న భద్రతాపరమైన ఆందోళన, వాటిని లంకకు తరలిస్తే వచ్చే సమస్యలపై బీసీబీకి ఐసీసీ వివరించనుంది. టోర్నీకి నెల రోజుల వ్యవధి మాత్రమే ఉన్నందున ఇప్పటికే ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం భారత్‌లో ఆడాలని వారికి విజ్ఞప్తి చేయాలని ఐసీసీ భావిస్తోంది.

'టై'గా ముగించిన ఆంధ్ర

హరియాణాతో మ్యాచ్

జ్ఞానేశ్వర్

ఆలూరు: విజయ్ హజారే వన్డే టోర్నమెంట్ ఎలైట్ గ్రూప్ 'డి'లో భాగంగా హరియాణా, ఆంధ్ర జట్ల మధ్య జరిగిన మ్యాచ్ వెలుతురులేమి కారణంగా 'టై'గా ముగిసింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన హరియాణా 49.5 ఓవర్లలో 324 పరుగులకు ఆలౌటైంది. హిమాన్షు రాణా (91 బంతుల్లో 112; 11 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీ సాధించాడు. ఆంధ్ర బౌలర్లలో సత్యనారాయణ రాజు 5 వికెట్లు పడగొట్టాడు. అనంతరం లక్ష్యఛేదనలో ఆంధ్ర జట్టు 48 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 307 పరుగులు చేసింది. ఓపెనర్ సీఆర్ జ్ఞానేశ్వర్ (141 బంతుల్లో 142 నాటౌట్; 15 ఫోర్లు, 2 సిక్స్‌లు) అజేయ సెంచరీతో అదరగొట్టాడు. శ్రీకర్ భరత్ (70; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు) హాఫ్ సెంచరీ నమోదు చేసుకున్నాడు. మ్యాచ్ ముగియడానికి మరో రెండు ఓవర్లు ఉన్న సమయంలో... వెలుతురు లేమి కారణంగా అంపైర్లు ఆటను నిలిపివేశారు. ఈ దశలో ఇరు జట్లు సమంగా ఉండటంతో మ్యాచ్‌ను 'టై'గా ప్రకటించారు. జ్ఞానేశ్వర్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. గ్రూప్ దశలో ఆడిన ఆరు మ్యాచ్‌ల్లో ఒక విజయం, 4 పరాజయాలు, ఒక 'టై'తో 6 పాయింట్లు ఖాతాలో వేసుకున్న ఆంధ్ర జట్టు పట్టికలో ఆరో స్థానంలో నిలిచి ఇప్పటికే క్వార్టర్ ఫైనల్‌కు దూరమైంది.

సాక్షి సినిమా

తానున్న చోటే వేడుక...

● శర్వానంద్, సాక్షి వైద్య

''అమ్మాయి అచ్చ తెలుగు సాంప్రదాయ సుందరి... సౌభాగ్య లక్ష్మి పోలిక.., అబ్బాయి మాటకారి... మోహనాంగుడే మరి... తానున్న చోటే వేడుక'' అంటూ సాగుతుంది 'భల్లే భల్లే' పాట. శర్వానంద్ హీరోగా రామ్ అబ్బరాజు దర్శకత్వంలో రూపొందిన 'నారీ నారీ నడుమ మురారి' చిత్రంలోని పాట ఇది. ఈ సినిమాలో సంయుక్త, సాక్షీ వైద్య కథానాయికలుగా నటించారు. అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14 సాయంత్రం నుంచి ప్రేక్షకుల ముందుకు రానుంది. మంగళవారం ఈ సినిమాలోని 'భల్లే భల్లే' పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. 'భల్లే భల్లే భల్లే భల్లే బాగుందిలే ఈ రెండు మనసుల కూడిక... మాయే చేసిందిలే... మంత్రం వేసిందిలే' అంటూ సాగే ఈ పాటకు రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించగా, హరిచరణ్ పాడారు. విశాల్ చంద్రశేఖర్ ఈ సినిమాకు సంగీత దర్శకుడు. ''కేరళలోని పచ్చని ప్రకృతి సౌందర్యం నేపథ్యంలో చిత్రీకరించిన పాట ఇది. ఈ పాటలో శర్వా, సాక్షిల మధ్య కెమిస్ట్రీ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది'' అని మేకర్స్ పేర్కొన్నారు. హీరో శ్రీవిష్ణు ప్రత్యేక పాత్రలో నటించిన ఈ సినిమాలో సత్య, సునీల్, సుదర్శన్ ఇతర కీలక పాత్రల్లో నటించారు.

శ్రీరామ నవమికి వారణాసి?

● మహేశ్ బాబు

శ్రీరామ నవమి పండగ సందర్భంగా 'వారణాసి' సినిమా థియేటర్స్‌లోకి రానుందట. మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న ఫారెస్ట్ అడ్వెంచరస్ అండ్ మైథాలజీ యాక్షన్ సినిమా 'వారణాసి'. ఈ చిత్రంలో ప్రియాంకా చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్, ప్రకాశ్ రాజ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కాగా, ఈ చిత్రాన్ని 2027 వేసవిలో రిలీజ్ చేయనున్నట్లు సంగీతదర్శకుడు ఎమ్ఎమ్ కీరవాణి ఇటీవల జరిగిన 'వారణాసి గ్లోబ్ ట్రోటర్' ఈవెంట్‌లో పేర్కొన్నారు. కానీ విడుదల తేదీపై మాత్రం సరైన స్పష్టత రాలేదు. అయితే ఉగాది, శ్రీరామ నవమి పండగల సందర్భంగా ఈ చిత్రాన్ని 2027 ఏప్రిల్ 9న రిలీజ్ చేసే ఆలోచనలో ఉన్నారట. 'వారణాసి' మూవీలో మహేశ్‌బాబు కొన్ని సన్నివేశాల్లో రాముడు పాత్రలో కనిపించనున్నారు. దీంతో శ్రీరామ నవమి సందర్భంగా ఈ చిత్రాన్ని విడుదల చేస్తే బాగుంటుందని మేకర్స్ భావిస్తున్నారట. కేఎల్ నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సంగతి ఇలా ఉంచితే... 'వారణాసి' టైటిల్ టీజర్‌ను ప్యారిస్‌లోని ప్రముఖ రే గ్రాండ్ రెక్స్ థియేటర్‌లో ప్రదర్శించారు. ఈ థియేటర్‌లో రజనీ కాంత్ 'కబాలి', ప్రభాస్ 'బాహుబలి: ది కన్‌క్లూజన్', 'సాహో' వంటి చిత్రాలను ప్రదర్శించారు. అయితే విడుదలకు ముందే ఓ సినిమా గ్లింప్స్ తరహా టీజర్‌ను ఈ థియేటర్‌లో ప్రదర్శించడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఆ రికార్డ్‌ను 'వారణాసి' దక్కించుకుంది.

● విశాల్ జైత్య, ఇషాన్ కట్టర్, జాన్వీ కపూర్

మరో ముందడుగు

ఆస్కార్ రేసులో 'హోమ్ బౌండ్' చిత్రం మరో ముందడుగు వేసింది. ఇషాన్ కట్టర్, విశాల్ జైత్య, జాన్వీ కపూర్ ముఖ్య తారలుగా రూపొందిన హిందీ చిత్రం 'హోమ్ బౌండ్'. హైదరాబాద్‌కి చెందిన ఫిల్మ్‌మేకర్ నీరజ్ ఘైవాన్ ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. కరణ్ జోహార్, అదార్ పూనావాలా, అపూర్వా మెహతా, సోమెన్ మిశ్రా నిర్మించిన ఈ చిత్రం గత ఏడాది సెప్టెంబరు 25న విడుదలైంది. కాగా, ఈ ఏడాది మార్చిలో అమెరికాలో జరగనున్న 98వ ఆస్కార్ అవార్డ్స్‌లోని ఉత్తమ విదేశీ చిత్రం విభాగంలో నామినేషన్ కోసం 'హోమ్ బౌండ్' చిత్రం పోటీ పడుతున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు మరో ముందడుగు వేసింది. ఈ విభాగంలో నామినేషన్ కోసం దాదాపు వంద చిత్రాలు పోటీలో నిలిచాయి. అయితే నెక్ట్స్ రౌండ్ ఓటింగ్‌కు అర్హత సాధించిన పదిహేను సినిమాల జాబితాను అకాడమీ ప్రతినిధులు వెల్లడించగా, ఈ జాబితాలో 'హోమ్ బౌండ్' చిత్రానికి చోటు దక్కింది. నెక్ట్స్ రౌండ్ ఓటింగ్‌లో ఈ పదిహేను చిత్రాల్లో ఐదు చిత్రాలను నామినేట్ చేస్తారు. మరి... ఫైనల్‌గా 'హోమ్ బౌండ్' చిత్రానికి ఆస్కార్ నామినేషన్ దక్కుతుందా? లేదా అనేది ఈ నెల 22న తెలుస్తుంది. ఎందుకంటే నామినేట్ అయిన చిత్రాల జాబితాను ఆ రోజే ప్రకటించనున్నారు. ఇక ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవం మార్చి 15 (భారతీయ కాలమానం ప్రకారం మార్చి 16)న లాస్ ఏంజిల్స్‌లోని డాల్బీ థియేటర్లో జరగనున్న విషయం తెలిసిందే.

మునుపటి చిరంజీవిని చూస్తారు

– సాహు గారపాటి, సుష్మిత కొణిదెల

''మన శంకర వరప్రసాద్‌గారు' సినిమాలో కామెడీ, యాక్షన్, ఎమోషన్... ఇలా అన్ని అంశాలుంటాయి. చిరంజీవిగారి నుంచి ఈ మధ్య కాలంలో మనం ఏవైతే మిస్ అయ్యామో అవన్నీ ఈ చిత్రంలో ఉంటాయి. మనమంతా ఆయన సినిమాలు చూస్తూ పెరిగాం. అలాంటి మునుపటి చిరుగారిని ఈ మూవీలో చూస్తారు. చిరంజీవిగారు, అనిల్ రావిపూడిగారు కలిస్తే ఎంత వినోదం ఉంటుందో ఈ చిత్రంలో చూస్తారు'' అని నిర్మాతలు సాహు గారపాటి, సుష్మిత కొణిదెల తెలిపారు. చిరంజీవి హీరోగా నటించిన చిత్రం 'మన శంకర వరప్రసాద్‌గారు'. అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో నయనతార హీరోయిన్‌గా, వెంకటేశ్ ముఖ్య పాత్ర పోషించారు. అర్చన సమర్పణలో షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్‌పై సుష్మిత కొణిదెల నిర్మించిన ఈ చిత్రం నెల 12న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సాహు గారపాటి, సుష్మిత కొణిదెల విలేకరులతో మాట్లాడుతూ– ''మన శంకరవరప్రసాద్‌గారు' క్లీన్ ఫిల్మ్. పిల్లలు, ఫ్యామిలీతో కలిసి అందరూ చూసేలా ఉంటుంది. మా మూవీ ట్రైలర్ రిలీజ్ తర్వాత చిరంజీవి, వెంకటేశ్‌గార్ల అభిమానులు ఎంజాయ్ చేస్తున్నారు. వారిద్దరూ చాలా హ్యాపీగా కలిసి, పని చేశారు. ఈ ప్రాజెక్ట్ చేయడం గౌరవంగా భావిస్తున్నాం. మా కాంబినేషన్ మళ్లీ కంటిన్యూ కావాలని కోరుకుంటున్నాం. 'రౌడీ అల్లుడు' సినిమాలో చిరంజీవిని చూసినట్లుగా ఉందని ఫ్యాన్స్ అంటున్నారు. వింటేజ్ ఛార్మ్‌ని గుర్తు చేస్తూనే ఆయన నటన చాలా ఫ్రెష్‌గా ఉంటుంది. ఈ మూవీ కోసం చిరంజీవిగారు బరువు తగ్గడంతో పాటు ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టారు. ఈ సినిమాకి భీమ్స్ మంచి మ్యూజిక్ ఇచ్చారు. సమీర్ రెడ్డిగారి విజువల్స్ అదిరిపోతాయి. సంక్రాంతిలో రేసులో ముందు నుంచీ మా సినిమా ఉంది. అయితే ఇన్ని సినిమాలు వస్తున్నప్పుడు థియేటర్స్ తగ్గడం సహజమే. కాకపోతే మా సినిమా వరకూ ఈ సమస్య పెద్దగా లేదు'' అని పేర్కొన్నారు.

ఆదికి శంబాల మంచి బ్రేక్ ఇచ్చింది

– నిర్మాత 'దిల్' రాజు

''ఒకప్పుడు 'బొమ్మరిల్లు' సినిమా సినీ ఇండస్ట్రీలో చాలా మార్పు తీసుకొచ్చింది. నిజంగా 'బొమ్మరిల్లు 2' తీయాలంటే మాత్రం ఆది, వాళ్ల నాన్న సాయి కుమార్‌లతో తీయాలి. కొడుకు సక్సెస్ కోసం తండ్రి పడే తపనను మాటల్లో చెప్పలేం. అలా సాయి కుమార్‌గారు తన కొడుకుతో పాటు 'శంబాల' టీమ్ మొత్తానికి బ్యాక్‌బోన్‌లా నిలిచి, ఈ సినిమా విజయంలో భాగమయ్యారు. 'శంబాల' ప్రోమో చూసినప్పుడే ఈ చిత్రం సక్సెస్ అవుతుందని చెప్పాను. అది నిజమైంది'' అని పేర్కొన్నారు నిర్మాత 'దిల్' రాజు. ఆది సాయికుమార్, అర్చన అయ్యర్ హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'శంబాల'. యుగంధర్ ముని దర్శకత్వంలో మహిధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభీమోజు నిర్మించిన ఈ చిత్రం డిసెంబరు 25న విడుదలైంది. తమ సినిమా మంచి విజయం సాధించిందని యూనిట్ పేర్కొంది.

● యుగంధర్, సాయికుమార్, 'దిల్' రాజు, ఆది

ఈ సందర్భంగా నిర్వహించిన ఈ సినిమా థ్యాంక్స్ మీట్‌లో 'దిల్' రాజు మాట్లాడుతూ– ''శంబాల' సినిమాకు పబ్లిక్‌లో మంచి టాక్ వచ్చి, సక్సెస్ కావడంతో పాటు నిర్మాతలకు లాభాలు తెచ్చిపెట్టి, క్రిస్మస్ విన్నర్‌గా నిలిచింది. ఆది కెరీర్‌లో 'శంబాల' 25వ చిత్రం. ఈ మూవీతో తనకి మంచి బ్రేక్ వచ్చిందనే చెప్పుకోవాలి. అలాగే మొత్తం యూనిట్‌కి శుభాకాంక్షలు'' అని అన్నారు. ''మంచి కంటెంట్ ఎప్పుడూ గెలుస్తుందని 'శంబాల' చిత్రం నిరూపించింది. సపోర్ట్ చేసిన ప్రేక్షకులందరికీ ధన్యవాదాలు. జనవరి 9న ఈ సినిమా హిందీలో రిలీజ్ అవుతోంది. అక్కడ కూడా సక్సెస్ అవుతుందనే భావిస్తున్నాను'' అని చెప్పారు సాయి కుమార్. ''ఇకపై కెరీర్‌ను బాగా ప్లాన్ చేసుకుని, ఇంకా మంచి మంచి సినిమాలు చేస్తాను'' అని తెలిపారు ఆది సాయికుమార్. ''ఆదిగారు లేకుండా ఈ సినిమా లేదు. కొన్ని థియేటర్స్‌లో మా 'శంబాల' సినిమా కంటిన్యూస్‌గా 11 రోజులు హౌస్‌ఫుల్‌తో ప్రదర్శితమైంది'' అని అన్నారు యుగంధర్ ముని. ''మా సినిమాను సపోర్ట్ చేసిన ప్రేక్షకులకు థ్యాంక్స్'' అని చెప్పారు మహిధర్ రెడ్డి, రాజశేఖర్. అనంతరం 'శంబాల' సినిమా సక్సెస్‌లో భాగమైన ప్రతి ఒక్కరికీ మెమొంటోలను అందజేశారు 'దిల్' రాజు.

మిస్ మెల్లిసా

● రుక్మిణీ వసంత్

'టాక్సిక్: ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్' చిత్రంలో మెల్లిసా అనే పాత్రలో నటిస్తున్నారు రుక్మిణీ వసంత్. 'కేజీఎఫ్' ఫేమ్ యశ్ హీరోగా నటిస్తున్న ఈ ద్విభాషా (కన్నడం, ఇంగ్లిష్) చిత్రానికి గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో రుక్మిణీ వసంత్, నయనతార, కియారా అద్వానీ, తారా సుతారియా, హ్యూమా ఖురేషీ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. గంగ పాత్రలో నయనతార, రెబెకాగా తారా సుతారియా, ఎలిజబెత్‌గా హ్యూమా ఖురేషీ, నాడియాగా కియారా అద్వానీ నటిస్తున్నారు. రుక్మిణీ వసంత్ పోషిస్తున్న మెల్లిసా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మంగళవారం విడుదల చేశారు. యశ్, వెంకట్ కె. నారాయణ నిర్మిస్తున్న ఈ చిత్రం మార్చి 19న విడుదల కానుంది. కన్నడ, ఇంగ్లిష్‌తో పాటు తెలుగు, మలయాళం వంటి ఇతర భారతీయ భాషల్లో, విదేశీ భాషల్లోనూ ఈ చిత్రం విడుదల కానుంది.

పక్కా ప్లాన్‌తో...

● వరలక్ష్మీ శరత్‌కుమార్, పూజా శరత్‌కుమార్

సినిమా ఆరంభించిన రోజే ముగింపు రోజుని కూడా ముందే ఫిక్స్ చేసేస్తుంటారు కొందరు. అలా వరలక్ష్మీ శరత్‌కుమార్ 'సరస్వతి' సినిమాని ప్లాన్ చేసుకున్నారు. ఆమె లీడ్ రోల్‌లో నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'సరస్వతి'. ఈ చిత్రానికి వరలక్ష్మి సోదరి పూజా శరత్‌కుమార్ నిర్మాత. దోస డైరీస్‌పై ప్రొడక్షన్ నంబర్ 1గా 'సరస్వతి'ని పక్కా ప్లాన్‌తో ఆరంభించారు. అనుకున్న సమయానికి సినిమాని పూర్తి చేశారు. ఈ సందర్భంగా వరలక్ష్మీ శరత్ కుమార్ మాట్లాడుతూ– ''పర్ఫెక్ట్ ప్లానింగ్, క్లియర్ విజన్‌తో అనుకున్న సమయానికి మా 'సరస్వతి' సినిమా షూటింగ్‌ను విజయవంతంగా పూర్తి చేశాం. ఈ ప్రయాణంలో నాకు సహకరించిన నటీనటులకు, సాంకేతిక నిపుణులకు ధన్యవాదాలు. హై–కాన్సెప్ట్ థ్రిల్లర్‌గా రూపొందించిన ఈ సినిమా చాలా ప్రత్యేకమైనది'' అని చెప్పారు. జీవా, ప్రకాశ్‌రాజ్, నాజర్, ప్రియమణి, రాధిక కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి సంగీతం: తమన్, కెమెరా: ఎ.ఎం. ఎడ్విన్ సకాయ్.

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	378	85,063
నిఫ్టీ ▽	72	26,178

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	23,508	△	112
డోజోన్స్	49,368	△	391
ఎఫ్‌టీఎస్‌ఈ 100	10,133	△	128
డాక్స్	24,974	△	105
షాంఘై	4,084	△	60
నికాయ్	51,518	△	685

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో..
అదానీ ఎంటర్‌ప్రైజెస్ బాండ్ల విక్రయం
రియల్టీకి సంస్థాగత పెట్టుబడుల బూస్ట్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	89.82	90.84
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	119.46	123.85
€	యూరో	ఎస్‌బీఐ	104.60	107.42
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	57.06	58.46
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	58.24	62.14
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	68.15	71.87
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	23.15	24.66
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.66	24.92
¥	చైనా యువాన్	థామస్‌కుక్	12.03	13.86

మహీంద్రా ఎక్స్‌యూవీ 3ఎక్స్‌వో

ధర రూ. 13.89 లక్షల నుంచి ప్రారంభం

జైసల్మేర్: ఆటోమొబైల్ దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా తాజాగా ఎక్స్‌యూవీ 3ఎక్స్‌వో ఈవీని (ఎలక్ట్రికల్) ప్రవేశపెట్టింది. దీని ధర రూ. 13.89 లక్షల నుంచి ప్రారంభమవుతుంది. ఇందులో ఐసీఈ వెర్షన్‌ని 2024 ఏప్రిల్‌లో ప్రవేశపెట్టింది. ఎలక్ట్రిక్ వెర్షన్ 285 కి.మీ. రేంజినిస్తుంది. మరోవైపు, సెవెన్ సీటర్ ఎక్స్‌యూవీ 7ఎక్స్‌వోని కూడా ఆవిష్కరించింది. దీని ధర రూ. 13.66 లక్షల నుంచి రూ. 24.11 లక్షల వరకు (ఎక్స్‌షోరూం) ఉంటుంది. ఇది ఎక్స్‌యూవీ 700కి కొత్త వెర్షన్. ఎక్స్‌యూవీ 700 అమ్మకాలు ప్రతి నెలా సుమారు 7,000 యూనిట్లుగా ఉండగా, 7ఎక్స్‌వో రాకతో విక్రయాలు దాదాపు 30 శాతం పెరగొచ్చని అంచనా వేస్తున్నట్లు మహీంద్రా అండ్ మహీంద్రా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజేశ్ జెజూరికర్ తెలిపారు. కొత్త ఉత్పత్తులు, వేరియంట్లతో ఈ ఏడాది అమ్మకాలు మరింతగా వృద్ధి చెందుతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గతేడాది బొలెరో, బొలెరో నియో కొత్త వెర్షన్లను ప్రవేశపెట్టగా, ఈసారి ఎక్స్‌యూవీ 7ఎక్స్‌వో, ఎలక్ట్రిక్ ఎక్స్‌ఈవీ 9ఎస్ దన్నుతో విక్రయాలు మరింత పెరుగుతాయని చెప్పారు. జీఎస్‌టీ తగ్గింపు ప్రభావం కార్లతో పాటు చిన్న కమర్షియల్ వాహనాలపైనా సానుకూల ప్రభావం చూపినట్లు రాజేశ్ తెలిపారు.

పరిశీలనలో రేట్ల పెంపు

కమోడిటీల రేట్లు పెరగడం, డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ క్షీణించడం తదితర పరిణామాల నేపథ్యంలో వాహనాల రేట్ల పెంపు అవకాశాలను పరిశీలిస్తున్నట్లు రాజేశ్ తెలిపారు. పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నామని, వచ్చే కొద్ది వారాల్లో దీనిపై నిర్ణయం తీసుకోవచ్చని వివరించారు. ఇప్పటికే హ్యుందాయ్, బీవైడీ, జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటర్స్ మొదలైనవి జనవరి నుంచి రేట్ల పెంపు ప్రకటించాయి. అటు మెర్సిడెస్ బెంజ్ ఇండియా, బీఎండబ్ల్యూ ఇండియా తదితర దిగ్గజాలు కూడా రేట్ల పెంపును పరిశీలిస్తున్నాయి.

సేవల రంగంలో తగ్గిన జోరు

11 నెలల కనిష్టానికి వృద్ధి

న్యూఢిల్లీ: సేవల రంగం పనితీరు డిసెంబర్‌లో మోస్తరు స్థాయికి పరిమితమైంది. ఈ రంగంలో కార్యకలాపాల పనితీరును సూచించే హెచ్‌ఎస్‌బీసీ ఇండియా సర్వీసెస్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) నవంబర్‌లో ఉన్న 59.8 నుంచి డిసెంబర్‌లో 58 పాయింట్లకు పరిమితమైంది. 2025 జనవరి తర్వాత ఇంత తక్కువ వృద్ధి రేటు ఇదే కావడం గమనార్హం. సాధారణంగా 50 పాయింట్లకు పైన విస్తరణగా, అంతకు దిగువన నమోదైతే తగ్గుదలగా చూస్తుంటారు. సంస్థలు వృద్ధి అవకాశాల పట్ల ఆశాజనకంగా ఉన్నప్పటికీ.. మొత్తం మీద సానుకూల సెంటిమెంట్ మూడున్నరేళ్ల కనిష్టానికి తగ్గింది. ''డిసెంబర్‌లో సేవల రంగం మెరుగైన పనితీరును కొనసాగించింది. 2025 చివర్లో సర్వే సూచికలు కొన్నింటిలో క్షీణత కనిపించడంతో కొత్త సంవత్సంలో వృద్ధి మందగించొచ్చని సూచిస్తోంది''అని ఎస్అండ్‌పీ గ్లోబల్ మార్కెట్ ఇంటెలిజెన్స్ ఎకనమిక్స్ అసోసియేట్ డైరెక్టర్ పాలియానా డీలిమా తెలిపారు.

ఐపీవో బాటలో టర్టిల్‌మింట్

రూ. 2,000 కోట్ల సమీకరణ

న్యూఢిల్లీ: ఇన్సూర్‌టెక్ సంస్థ టర్టిల్‌మింట్ పబ్లిక్ ఇష్యూ చేపట్టేందుకు తుది సన్నాహాలు ప్రారంభించింది. దీనిలో భాగంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి అప్‌డేటెడ్ ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేయనుంది. రానున్న మార్చి–ఏప్రిల్‌లోగా ఐపీవో చేపట్టేందుకు వీలుగా రెండు వారాల్లోపు దరఖాస్తు చేయనుంది. పబ్లిక్ ఇష్యూ ద్వారా కంపెనీ రూ. 2,000 కోట్లు సమీకరించాలని భావిస్తున్నట్లు వెల్లడించాయి. 2015లో ఏర్పాటైన కంపెనీ సులువుగా బీమా పాలసీ కొనుగోళ్లు, నిర్వహణకు వీలుగా సర్వీసులు అందిస్తోంది.

చిన్న బ్యాంకులు... పెద్ద అడుగులు

- ఐదేళ్లలో హైరింగ్ 13% అప్
- డిపాజిట్లు 33 శాతం జంప్
- రుణాలు 24 శాతం వృద్ధి

న్యూఢిల్లీ: పేరుకు చిన్నవే అయినా స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు (ఎస్‌ఎఫ్‌బీ) వేగంగా వృద్ధి చెందుతున్నాయి. గత అయిదేళ్లలో నియామకాలు, డిపాజిట్లు, రుణాల కార్యకలాపాల్లో ముందుకెళ్తున్నాయి. రిజర్వ్ బ్యాంక్ డేటా ప్రకారం 2020 ఆర్థిక సంవత్సరంలో ఎస్‌ఎఫ్‌బీల్లో 95,249గా ఉన్న సిబ్బంది సంఖ్య వార్షికంగా 13.3 శాతం వృద్ధితో 2025 ఆర్థిక సంవత్సరంలో 1.8 లక్షలకు పెరిగింది. ఇదే వ్యవధిలో బ్యాంకింగ్ వ్యవస్థలో మొత్తం ఉద్యోగుల సంఖ్య 4.3 శాతం వార్షిక వృద్ధితో 18.1 లక్షలకు చేరింది. 2026 ఆర్థిక సంవత్సరంలోనూ ఎస్ఎఫ్‌బీల్లో నియామకాల జోరు కొనసాగింది. 11 ఎస్ఎఫ్‌బీలకు గాను ఎనిమిది లిస్టెడ్ బ్యాంకులు ప్రథమార్ధంలో దాదాపు 9,000 మందిని తీసుకున్నాయి. 2020–25 మధ్య కాలంలో ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో (పీఎస్‌బీ) సిబ్బంది సంఖ్య 0.8 శాతం తగ్గగా, ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో 8.6 శాతం పెరిగింది. మరోవైపు, 2020–25 ఆర్థిక సంవత్సరాల మధ్య కాలంలో ఎస్‌ఎఫ్‌బీల రుణాలు రూ. 94,441 కోట్ల నుంచి 24.2 శాతం పెరిగి రూ. 2,78,564 కోట్లకు ఎగిశాయి. అటు బ్యాంక్ డిపాజిట్లు కూడా రూ. 62,667 కోట్ల నుంచి 33.5 శాతం పెరిగి రూ. 2,65,586 కోట్లకు చేరాయి.

చిన్న సంస్థలకు పీఎస్‌బీ రుణాల దన్ను

మరోవైపు, పీఎస్‌బీల దన్నుతో 2025 జనవరి నుంచి అక్టోబర్ మధ్య కాలంలో చిన్న, మధ్య తరహా సంస్థలకు (ఎంఎస్‌ఎంఈ) గణనీయంగా కొత్త రుణాలు లభించినట్లు క్రిసిల్ ఇంటెలిజెన్స్ ఒక నివేదికలో పేర్కొంది. దీని ప్రకారం, ఎంఎస్‌ఎంఈలకు అదనంగా ఇచ్చిన రుణాలు గతేడాది ఇదే వ్యవధిలో నమోదైన 17.7 శాతంతో పోలిస్తే 32.5 శాతానికి పెరిగినట్లు వివరించింది. మొత్తం రుణాల్లో ఎంఎస్‌ఎంఈల వాటా 1.72 శాతం మేర పెరిగింది. సురక్షితమైన సెక్యూర్డ్ క్రెడిట్ వైపు మొగ్గు చూపుతూ పీఎస్‌బీలు గణనీయంగా రుణాలివ్వడం ఇందుకు తోడ్పడింది. అలాగే ఎంఎస్‌ఎంఈల నిర్వచనంలో మార్పులు కూడా అధిక రుణ వితరణకు కారణంగా నిల్చినట్లు నివేదిక పేర్కొంది. అన్‌సెక్యూర్డ్ వ్యాపార రుణాల్లో అసెట్ నాణ్యత కాస్త క్షీణించినప్పటికీ మొత్తం ఎంఎస్‌ఎంఈ రుణాల పోర్ట్‌ఫోలియో పరిస్థితి సంతృప్తికరంగానే ఉన్నట్లు వివరించింది.

యూనివర్సల్ లైసెన్సుపై దృష్టి..

ఎస్‌ఎఫ్‌బీలు భారీ స్థాయిలో కార్యకలాపాలు విస్తరిస్తూ, యూనివర్సల్ లైసెన్సుపై దృష్టి పెట్టాయని పరిశ్రమ వర్గాలు వెల్లడించాయి. లైసెన్సు రావడానికి ముందుగానే సర్వసన్నద్ధంగా ఉండేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలిపాయి. సెమీ అర్బన్, గ్రామీణ మార్కెట్లలోను శాఖలను చురుగ్గా విస్తరిస్తున్నాయని పేర్కొన్నాయి. ఇలాంటి మార్కెట్లలో టెక్నాలజీ వినియోగం పరిమితంగా ఉంటుంది కాబట్టి సిబ్బంది సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలోనే దానికి అనుగుణంగా హైరింగ్‌ని కూడా పెంచుకుంటున్నాయి. ఇటీవలే ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌కి యూనివర్సల్ బ్యాంక్‌గా లైసెన్సు వచ్చింది. ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, జన స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ గతేడాది లైసెన్సు కోసం దరఖాస్తు చేసుకున్నాయి. ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకూ లైసెన్సుపై ఆసక్తిగా ఉంది.

రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీలు పడేశాయ్..!

- కొనసాగిన ట్రంప్ టారిఫ్ హెచ్చరికల భయం
- మార్కెట్లు రెండో రోజూ డీలా

ముంబై: రిలయన్స్ ఇండస్ట్రీస్(–4.42%), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు(–1.56%) పతనంతో దేశీయ స్టాక్ సూచీలు రెండోరోజూ డీలా పడ్డాయి. భారత్‌పై మరిన్ని సుంకాలు విధిస్తామంటూ ట్రంప్ తాజా హెచ్చరికలు సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఫలితంగా సెన్సెక్స్ 378 పాయింట్లు నష్టపోయి 85,063 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 72 పాయింట్లు కోల్పోయి 26,178 వద్ద నిలిచింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 540 పాయింట్లు క్షీణించి 84,900 వద్ద, నిఫ్టీ 126 పాయింట్లు కోల్పోయి 26,125 వద్ద కనిష్టాలు తాకాయి. మరోవైపు ఫార్మా, ప్రభుత్వ రంగ బ్యాంకులు, కన్జూమర్ డ్యూరబుల్స్, ఐటీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది.

– ప్రైవేటు రంగ దిగ్గజం రిలయన్స్ షేరు 4.42% పతనమై రూ.1507 వద్ద స్థిరపడింది. గతేడాది ఏకంగా 29% ర్యాలీ చేసిన నేపథ్యంలో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు పూనుకొని ఉండొచ్చని మార్కెట్ వర్గాల అంచనా. ఇంట్రాడేలో షేరు 5% క్షీణించి రూ.1,497 వద్ద కనిష్టాన్ని తాకింది. గడిచిన 19 నెలల్లో ఇంట్రాడే ట్రేడింగ్‌లో ఈ స్థాయి పతనం ఇదే తొలిసారి. షేరు భారీ పతనంతో కంపెనీకి ఒక్కరోజులో రూ.94,389 కోట్ల నష్టం వాటిల్లింది. మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.20.40 లక్షల కోట్ల వద్ద స్థిరపడింది.

బంగారం,వెండి బుల్ రన్

- పసిడి రూ.1,100 అప్
- రూ.7,000 పెరిగిన వెండి

న్యూఢిల్లీ: బంగారం, వెండి ధరల ర్యాలీ కొనసాగుతోంది. ఢిల్లీ మార్కెట్లో పసిడి వరుసగా నాలుగోరోజు లాభపడింది. 10 గ్రాములకు రూ.1,100 పెరిగి రూ.1,41,500కు చేరింది. వెండి వరుసగా మూడో రోజు అప్ ట్రెండ్‌లో కొనసాగింది. కిలోకి రూ.7,000 పెరిగి రూ.2,51,000 స్థాయిని నమోదు చేసింది. అంతర్జాతీయ మార్కెట్లో బంగారం స్పాట్ ధర ఔన్స్‌కు 11.45 డాలర్లు ఎగసి 4,460 డాలర్లకు చేరగా, వెండి ఔన్స్‌కు 1.75 డాలర్లు బలపడి 78.36 డాలర్ల స్థాయిని నమోదు చేసింది. ''యూఎస్ డాలర్ బలహీనపడడం, యూఎస్ ఫెడ్ నుంచి సానుకూల వ్యాఖ్యలు రావడంతో రానున్న నెలల్లో రేట్ల కోతపై మార్కెట్లో అంచనాలు ఏర్పడ్డాయి''అని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ కమోడిటీస్ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు.

భక్తులను అమానవీయ రీతిలో తనిఖీలు చేయడం ఆపాల్సిందే

టీటీడీ ప్లాన్‌–ఏపై హైకోర్టు తీవ్ర అసంతృప్తి

- భక్తులను తనిఖీ చేయడం అభ్యంతరకరం
- ఇది గౌరవంగా, హుందాగా జీవించే హక్కును హరించడమే
- మీరు ఆపకపోతే భక్తులను పరకామణి సేవకు వాడొద్దని ఆదేశాలిస్తాం
- కానుకల లెక్కింపు కోసం టేబుళ్లు వాడాలన్న ఆదేశాలపై స్పష్టత లేదు
- ఈ రెండు వ్యవహారాల్లో స్పష్టత ఇవ్వండి
- విచారణ గురువారానికి వాయిదా

సాక్షి, అమరావతి: శ్రీవారి పరకామణిలో చేపట్టే సంస్కరణలపై టీటీడీ సమర్పించిన ప్లాన్‌–ఏపై హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. గత ఉత్తర్వుల్లో తాము పలు అంశాల్లో సంస్కరణలు అవసరమని చెబుతూ సలహాలు, సూచనలు కోరితే.. టీటీడీ మాత్రం ఎలాంటి సలహాలను తెలియజేయలేదని హైకోర్టు ఆక్షేపించింది. తాము లేవనెత్తిన ఏ అంశానికీ సమాధానం ఇవ్వలేదని తప్పు పట్టింది. శ్రీవారి పరకామణిలో కానుకల లెక్కింపును సేవగా భావించి వచ్చే భక్తులను అమానవీయ రీతిలో తనిఖీలు చేయడంపై హైకోర్టు మరోసారి అభ్యంతరం తెలిపింది. తనిఖీలపై భక్తిరీత్యా భక్తులు అభ్యంతరం చెప్పకపోవచ్చని, కానీ.. ఇది రాజ్యాంగం కల్పించిన 'గౌరవంగా, హుందాగా జీవించే హక్కు'ను కాలరాయడమేనని స్పష్టం చేసింది. ఈ హక్కును ఎవరూ కాలరాయలేరని తేల్చి చెప్పింది. ఒకవేళ తనిఖీల్ని ఆపకుంటే.. పరకామణిలో భక్తుల చేత కానుకల లెక్కింపును ఆపేస్తూ ఉత్తర్వులిస్తామని స్పష్టం చేసింది. కానుకలు లెక్కించే చోట టేబుళ్ల ఏర్పాటు చేయాలన్న ఆదేశాలపైనా టీటీడీ తన నివేదికలో ఎలాంటి స్పష్టత ఇవ్వలేదంది. అందువల్ల భక్తులను అమానవీయ రీతిలో తనిఖీ చేయడం, లెక్కింపు కోసం టేబుళ్ల ఏర్పాటుపై స్పష్టత తీసుకుని పూర్తి వివరాలను తమ ముందుంచాలని టీటీడీ న్యాయవాదిని ఆదేశించింది. తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఆ అధికారులపై క్రమశిక్షణ చర్యలు అవసరం

పరకామణిలో రూ.72 వేల విలువైన 900 డాలర్ల చోరీ నేపథ్యంలో హైకోర్టు ఇటీవల పలు సంస్కరణలను ప్రతిపాదించింది. ఈ దిశగా తీసుకోవాల్సిన చర్యలపై టీటీడీకి ఆదేశాలిచ్చింది. పరకామణిలో తక్షణ సంస్కరణల నిమిత్తం ప్లాన్‌–ఏ సమర్పించాలని టీటీడీని ఆదేశించిన విషయం తెలిసిందే. తాజాగా మంగళవారం ఈ వ్యవహారంపై జస్టిస్ రామకృష్ణ ప్రసాద్ మరోసారి విచారణ జరిపారు. టీటీడీ సమర్పించిన ప్లాన్‌–ఏను పరిశీలించానని, గత విచారణ సమయంలో తాను లేవనెత్తిన అంశాలు, ఆదేశాల గురించి అందులో ఎలాంటి ప్రస్తావన లేదన్నారు. ఇది తమను అసంతృప్తికి గురి చేసిందన్నారు. పరకామణిలో చోరీ కేసును నీరుగార్చేందుకు ప్రయత్నించిన అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు. నిందితుడు రవికుమార్‌తో కొందరు పోలీసులు కుమ్మక్కైనట్టు సీఐడీ నివేదికను పరిశీలిస్తే తెలిసిందన్నారు. చోరీ కేసు లోక్ అదాలత్‌లో రాజీ చేసుకున్న వ్యవహారంపై తప్ప మిగిలిన అన్ని అంశాల్లో దర్యాప్తు కొనసాగించుకోవచ్చని, చట్ట ప్రకారం ముందుకెళ్లొచ్చని సీఐడీ, ఏసీబీ అదనపు డీజీలకు న్యాయమూర్తి స్పష్టం చేశారు.

ఏపీఎన్జీవో క్యాపిటల్ సిటీ యూనిట్ కార్యవర్గ ఎన్నిక

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తామని ఏపీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ అన్నారు. విజయవాడలోని ఏపీ ఎన్జీవో హోంలో మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యాలయాల(హెచ్‌వోడీ)ఉద్యోగులతో కూడిన క్యాపిటల్ సిటీయూనిట్ కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు.

నూతన కార్యవర్గం ఇదే.. : క్యాపిటల్ సిటీ యూనిట్‌కు జరిగిన ఎన్నికల్లో 19 పోస్టులకు గాను 18 పోస్టులకు ఒక్కో నామినేషన్ దాఖలు కావడంతో ఏకగ్రీవం అయ్యాయి. అధ్యక్షుడిగా సీహెచ్ నాగభూషణం (పరిశ్రమల శాఖ), సహాధ్యక్షుడిగా వై.మురళీమోహన్(ఆర్ డబ్ల్యూఎస్), కార్యదర్శిగా జి.కిశోర్‌బాబు (ఎక్సైజ్), కోశాధికారిగా టి.మహేష్ కుమార్ (పాఠశాల విద్యాశాఖ), ఆర్గనైజింగ్ సెక్రటరీగా సీహెచ్ సుధీర్ (స్టేట్ ఆడిట్), ఉపాధ్యక్షులుగా బి.అశోక్‌బాబు (వర్క్స్ అండ్ అకౌంట్స్), ఎం.సరస్వతి (ఇరిగేషన్), ఆర్.శివారెడ్డి (అగ్రికల్చర్), టి.మునికేశవులు (ఆర్అండ్ బీ), ఎల్.రజనీష్‌బాబు (స్టాటిస్టిక్స్), మహిళా ఉపాధ్యక్షురాలిగా వీవీ లలితాంబ (సర్వే అండ్ సెటిల్‌మెంట్), సంయుక్త కార్యదర్శులుగా ఆర్.శ్రీనివాసరావు (సీటీవో), టి.రామకృష్ణ (ట్రెజరీ), డి.దాసు (ఇరిగేషన్), అర్జా నాగరాజు (ఏహెచ్ అకౌంట్స్), ఎం.మాధవీ లత (ఏపీపీఎస్సీ), కె.శ్రీనివాసు (లేబర్ డిపార్టుమెంట్), మహిళా సంయుక్త కార్యదర్శులుగా వై.సులోచన (ఎస్ఎస్‌సీ బోర్డు) ఎన్నికయ్యారు.

కరెంట్ కోత.. అన్నదాతల వెత

కళ్ల ముందే ఎండిపోతున్న పంట
తల్లడిల్లిన రైతు ఆత్మహత్యాయత్నం

ఆత్మహత్యాయత్నం చేస్తున్న రైతు

సోమందేపల్లి: విద్యుత్ కోతలతో కళ్లముందే పంట ఎండుతుండడంతో తట్టుకోలేని అన్నదాత పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటన మంగళవారం శ్రీసత్యసాయి జిల్లా చాలకూరులో చోటుచేసుకుంది. చాలకూరులో 15 రోజులుగా త్రీఫేజ్ విద్యుత్ సరఫరా అస్తవ్యస్తంగా మారడంతో బోర్లు పనిచేయక పంటలు ఎండిపోతున్నాయి. అధికారులను సంప్రదించినా సరైన సమాధానం ఇవ్వడం లేదు. దీంతో మంగళవారం రైతులు గుడ్డంపల్లి సబ్ స్టేషన్ వద్ద ధర్నా చేపట్టారు. అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో నవీన్ అనే రైతు పురుగుల మందు తాగడానికి సిద్ధపడడంతో పక్కనే ఉన్న రైతులు అడ్డుకున్నారు. ఏఈ పరమేశ్వరరెడ్డి రైతులతో మాట్లాడి విద్యుత్ సక్రమంగా సరఫరా చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు.

ఆఫ్కాఫ్ చేప చిక్కేదెవరికి?

- హైకోర్టు ఆదేశాలతో నేడు ఆఫ్కాఫ్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు
- ఆఫ్కాఫ్ చేపకు వలవేసిన ఇద్దరు మంత్రులు
- తాడోపేడో తేల్చుకునేందుకు మంత్రులు అచ్చెన్న–కొల్లు సై
- ఓటర్లకు రూ.10 లక్షల వరకు ఎరవేసేందుకు ప్రయత్నాలు

సాక్షి, అమరావతి: హైకోర్టు ఆదేశాలతో బుధవారం నిర్వహించనున్న ఆంధ్రప్రదేశ్ మత్స్య సహకార సంఘాల సమాఖ్య (ఆఫ్కాఫ్) చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు రసవత్తరంగా మారాయి. ఈ పదవుల్ని తమ వర్గీయులకే దక్కించుకోవాలని మంత్రులు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర తమ బలగాలతో మోహరించారు. ఎవరి శక్తిమేర వారు ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర సిఫార్సుతో వైఎస్సార్ కడప జిల్లా మత్స్య సహకార సంఘాల సమాఖ్య చైర్మన్ యాతగిరి రాంప్రసాద్ పేరును టీడీపీ అధిష్టానం ప్రకటించగా, చివర్లో చక్రం తిప్పిన మత్స్యశాఖ మంత్రి అచ్చెన్నాయుడు సీఎం చంద్రబాబు వద్ద తనకున్న పలుకుబడితో కర్నూలు జిల్లా మత్స్య సహకార సంఘాల సమాఖ్య చైర్మన్ బి.శివనవీన్ కుమార్ పేరిట జీవో వచ్చేలా చేశారు. ఈ జీవోను సవాల్ చేస్తూ మంత్రి కొల్లు వర్గీయులైన జిల్లా సమాఖ్య చైర్మన్లు కోర్టును ఆశ్రయించగా, ఎన్నికల ద్వారా ఆఫ్కాఫ్ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను భర్తీచేయాలని హైకోర్టు ఆదేశించింది. దీంతో బుధవారం ఈ ఎన్నికలు నిర్వహించేందుకు సహకార సంఘాల డిప్యూటీ రిజిస్ట్రార్ (విజయవాడ) పి.కిరణ్‌కుమార్‌ను ఎన్నికల అధికారిగా నియమించారు. మంత్రుల అండతో చైర్మన్ పదవిని దక్కించుకునేందుకు రాంప్రసాద్, నవీన్‌కుమార్ ప్రయత్నిస్తున్నారు.

ఒకరికి చైర్మన్.. మరొకరికి వైస్ చైర్మన్..

ఉమ్మడి 13 జిల్లాల ప్రాతిపదికన కాకుండా కొత్త జిల్లాల ప్రాతిపదికన 28 జిల్లా సమాఖ్యలుగా విభజించి వాటికి ఎన్నికలు నిర్వహించిన తరువాతే ఆఫ్కాఫ్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు నిర్వహించాలని నవీన్‌కుమార్ ఎన్నికల అధికారిని కోరారు. ఓటు హక్కున్న 13 మందిలో ఎనిమిదిమంది తమవైపే ఉన్నారంటున్న ఆయన ఎన్నికల విషయంలో తగ్గేది లేదని అంటున్నారు. రాంప్రసాద్, నవీన్‌కుమార్ ఇద్దరూ రాయలసీమకు చెందినవారు కావడం, ఆఫ్కాఫ్ కార్యకలాపాలన్నీ తీరప్రాంత జిల్లాల్లోనే ఉండడంతో వారిద్దరిని కాదని ఉత్తరాంధ్ర లేదా కోస్తాంధ్రకు చెందిన వారికి ఈ పదవులు కట్టబెట్టాలనే ప్రతిపాదన కూడా తెరపైకి వస్తోంది. రాంప్రసాద్‌కు ప్రత్యామ్నాయంగా కృష్ణాజిల్లా సమాఖ్య చైర్మన్ కొక్కిలగడ్డ నాగరమేష్ పేరును మంత్రి కొల్లు వర్గీయులు ప్రతిపాదించగా అచ్చెన్నాయుడి వర్గీయులు వ్యతిరేకించినట్లు తెలిసింది. చైర్మన్, వైస్ చైర్మన్ పదవులకు రాంప్రసాద్, నాగరమేష్‌లను మంత్రి కొల్లు బలపరుస్తుండగా.. నవీనకుమార్, శ్రీకాకుళం జిల్లా సమాఖ్య చైర్మన్ చీకటి శ్రీరాములును మంత్రి అచ్చెన్నాయుడు ప్రతిపాదిస్తున్నట్టు చెబుతున్నారు. మధ్యేమార్గంగా రాంప్రసాద్–నవీన్‌కుమార్‌లలో ఒకరికి చైర్మన్, మరొకరికి వైస్ చైర్మన్ పదవి కట్టబెట్టాలన్న ప్రతిపాదన తెరపైకి తీసుకొచ్చారు. కానీ రెండు పదవులు తమకే దక్కాలని కొల్లు వర్గీయులు పట్టుబడుతున్నట్టు చెబుతున్నారు. ఒకరు తమ శాఖ మంత్రి, మరొకరు తమ సామాజికవర్గానికి చెందిన మంత్రి కావడంతో ఎవరి వైపు ఉండాలో తెలియక జిల్లా సమాఖ్యల చైర్మన్లు మల్లగుల్లాలు పడుతున్నారు. ఒకరు సీఎంవో నుంచి, మరొకరు మంత్రి లోకేశ్ పేషీ నుంచి ఫోన్ చేస్తుండడంతో వారు తలలు పట్టుకుంటున్నారు. ఓటర్లయిన జిల్లా సమాఖ్యల చైర్మన్లకు రూ.10 లక్షల వరకు తాయిలాలు ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నారంటూ ప్రచారం సాగుతోంది.

నేటి ఎన్నికల షెడ్యూల్ ఇలా..

- ఉదయం 9 గంటలకు ఎన్నికల ప్రకటన
- ఉదయం 9 నుంచి 11 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ
- ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నామినేషన్ల పరిశీలన
- మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు
- మధ్యాహ్నం 2.30 గంటలకు పోటీలో ఉన్న అభ్యర్థుల పేర్ల ప్రకటన, చిహ్నాల కేటాయింపు
- ఎన్నికలు ఏకగ్రీవమైతే 2.30 గంటలకు ఫలితాల ప్రకటన
- అవసరమైతే మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓటింగ్
- సాయంత్రం 5 గంటల నుంచి ఓట్ల లెక్కింపు. అనంతరం ఫలితాల ప్రకటన

అక్రమ ఇసుక ర్యాంపును అడ్డుకున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

పలాయనం చిత్తగించిన టీడీపీ నేతలు

గోదావరిలో ఇసుక ర్యాంపునకు బాటల నిర్మాణాన్ని అడ్డుకొన్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

పెనుగొండ: పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలం కోడేరులో ఇసుక అక్రమ తవ్వకాల కోసం టీడీపీ నాయకులు చేస్తున్న యత్నాలను వైఎస్సార్ సీపీ శ్రేణులు అడ్డుకున్నాయి. గోదావరిలో నీటి నిల్వలు తగ్గడంతో బాట వేసి మంగళవారం ఇసుక అక్రమ తవ్వకాలు ప్రారంభించారు. దీంతో మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీ స్థాయిలో ర్యాంపు వద్దకు చేరుకొని అడ్డుకొన్నాయి. దీంతో పొక్లెయిన్లతో బాట పనులు చేస్తున్న టీడీపీ నాయకులు పలాయనం చిత్తగించారు. ఆచంట నియోజకవర్గంలో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరిపితే అడ్డుకుంటామని వైఎస్సార్‌సీపీ శ్రేణులు స్పష్టం చేశాయి. వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీగా చేరుకొని ర్యాంపు నిర్మాణాన్ని అడ్డుకోవడంతో ఆ ప్రాంతాన్ని ఆచంట తహసీల్దార్ డి.సోమేశ్వరరావు పరిశీలించారు.

క్లుప్తంగా...

వైద్య పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

సాక్షి, అమరావతి: డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) పరిధిలో 33 క్లినికల్, నాన్ క్లినికల్ విభాగాల్లో 220 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ నోటిఫికేషన్ ఇచ్చింది. అభ్యర్థులు గురువారం నుంచి ఈనెల 22వ తేదీ మధ్య ఆన్‌లైన్ దరఖాస్తులు సమర్పించాలని మెంబర్ సెక్రటరీ శేషా రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ విధానంలో పోస్టులను భర్తీ చేస్తామని వెల్లడించారు.

చిరంజీవి సినిమా బెనిఫిట్ షో తొలి టికెట్ రూ.1.11 లక్షలు

అమలాపురం టౌన్/నరసాపురం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లాల్లో పలుచోట్ల మెగాస్టార్ చిరంజీవి సినిమా బెనిఫిట్ షో టికెట్లను వేలం వేయగా.. పలువురు భారీ మొత్తానికి దక్కించుకున్నారు. అమలాపురంలోని వెంకటరమణ థియేటర్‌లో త్వరలో విడుదల కానున్న 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమా తొలి టికెట్‌కు చిరంజీవి అభిమానులు మంగళవారం వేలం పాట నిర్వహించారు. మెడికల్ ఏజెన్సీ వ్యాపారి, బీజేపీ నాయకుడు మోకా వెంకట సుబ్బారావు తొలి టికెట్‌ను రూ.1.11 లక్షలకు దక్కించుకున్నారు. అలాగే పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం అన్నపూర్ణ థియేటర్ వద్ద వేలం పాట నిర్వహించగా.. లక్ష్మణేశ్వరం గ్రామానికి చెందిన చాగంటి గణేశ్ రూ.1,02,000కు తొలి టికెట్ దక్కించుకున్నారు.

భర్తను హత్య చేసిన భార్య, కుమార్తె

- కుటుంబ కలహాలే కారణం
- మార్కాపురం జిల్లాలో ఘటన

హరికృష్ణ మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ

గిద్దలూరు రూరల్: కుటుంబ కలహాలతో భర్తను భార్య, కుమార్తె కలిసి రాడ్‌తో కొట్టి హత్య చేసిన ఘటన మార్కాపురం జిల్లా గిద్దలూరు మండలంలోని దంతెరపల్లె గ్రామంలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..గ్రామానికి చెందిన సారెమేకల హరికృష్ణ (53), లక్ష్మీదేవి దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ దంపతులు 12 ఏళ్ల క్రితం నుంచి మనస్పర్థలతో దూరంగా ఉంటున్నారు. కుమార్తె జ్యోత్స్నకు ఆరేళ్ల క్రితం చీరాలలో వివాహం చేశారు. కుమారుడు హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. హరికృష్ణ నెల్లూరులో ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేసుకుంటూ అప్పుడప్పుడూ దంతెరపల్లెకు వచ్చి వెళుతుంటాడు. ఈ క్రమంలో గ్రామంలో ఉంటున్న భార్య లక్ష్మీదేవి వద్దకు సోమవారం వచ్చిన హరికృష్ణ అర్ధరాత్రి ఆమెతో గొడవపడ్డాడు. ఈ ఘర్షణలో హరికృష్ణను భార్య లక్ష్మీదేవి, కుమార్తె జ్యోత్స్న కలిసి రాడ్‌తో కొట్టారు. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్తుల సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలికి వచ్చి వివరాలను సేకరించారు. భార్య లక్ష్మీదేవి, కుమార్తె జ్యోత్స్నలను అదుపులోకి తీసుకుని, కేసు దర్యాప్తు చేపట్టారు.

ఆంధ్ర వర్సిటీని రక్షించుకుందాం

సామాజిక మాధ్యమాల వేదికగా 'సేవ్ ఏయూ' హ్యాష్ ట్యాగ్‌తో ప్రచారం

సాక్షి, అమరావతి: ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ నియంతృత్వ పోకడలపై వ్యతిరేకత వెల్లువెత్తుతోంది. ఆయన సీఎం చంద్రబాబు అండతో విద్యాసంస్కరణలను గాలికొదిలేసి వర్సిటీని భ్రష్టుపట్టిస్తుండటంపై సామాజిక మాధ్యమాల వేదికగా గుట్టు రట్టవుతోంది. శతాబ్ది ఉత్సవాల వేళ 'సేవ్ ఏయూ' హ్యాష్‌ట్యాగ్‌తో వర్సిటీ రక్షణకు యువత పెద్ద ఎత్తున క్యాంపెయిన్ ప్రారంభించింది. వర్సిటీ అభివృద్ధి కంటే సొంత అజెండాను అమలుచేస్తున్న వీసీ తీరును తూర్పారబడుతోంది. పరిపాలన వైఫల్యంతో వర్సిటీ ఖ్యాతి మసకబారుతోందని, వీసీ అవినీతి, అక్రమాలు, అసమర్థ విధానాలకు బలైపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తోంది. సోమవారం ఏయూ వీసీ వ్యవహార శైలిని కడిగిపారేస్తూ సామాజిక మాధ్యమాల్లో భారీగా వ్యతిరేక పోస్టులు కనిపించడం విద్యా వ్యవస్థలో అలజడి సృష్టించింది. 'ఏయూకు వీసీని తెచ్చారా? లేక ఐఐటీ నుంచి సెక్యూరిటీ ఆఫీసర్‌గా నియమించారా? వ్యక్తిగత సేవల కోసం వర్సిటీని, సిబ్బందిని వాడుకుంటూ వీసీ పోస్టుకే కళంకం తీసుకొస్తున్నారు. వీసీగా బాధ్యతలు చేపట్టి పదినెలల్లో నిర్ణయాల కోసమే ఏకంగా 272 కమిటీలు వేశారంటే పరిపాలనలో ఎంత జాప్యం జరుగుతోందో అర్థమవుతోంది. ఎగ్జిక్యూటివ్ కమిటీ అనుమతులు లేకుండానే దొంగ సర్టిఫికెట్లతో వచ్చిన వారికి ఉద్యోగాలు కల్పించేశారు. చివరికి విద్యార్థుల ఆరోగ్యాన్ని పణంగా పెట్టి.. అనుభవం లేని వ్యక్తులను డాక్టర్లుగా నియమించి చేతులు దులుపుకొన్నారు..' అంటూ సామాజిక మాధ్యమాల్లో యువత దుమ్మెత్తిపోస్తోంది.

చెరకు ఫ్యాక్టరీ లేకపోతే ఎలా బతకాలి?

ప్రభుత్వాన్ని నిలదీసిన అన్నదాతలు

- ఎన్నికల ముందు హామీలిచ్చి ఎంపీ, ఎమ్మెల్యేలైన కూటమి నేతలు మోసం చేశారు
- గోవాడ షుగర్ ఫ్యాక్టరీ వద్ద చెరకు రైతుల రిలే దీక్షల్లో నేతల ధ్వజం
- మెడకు ఉరితాళ్లు వేసుకుని నిరసన తెలిపిన రైతులు, రైతుసంఘాల నాయకులు

చోడవరం: గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో క్రషింగ్ చేయకపోతే తాము ఎలా బతకాలంటూ చెరకు రైతులు ప్రభుత్వాన్ని నిలదీశారు. రైతులు, రైతు సంఘాల నాయకులు ఫ్యాక్టరీ గేటువద్ద మెడకు ఉరితాళ్లు వేసుకుని నిరసన తెలిపారు. అనకాపల్లి జిల్లా గోవాడలోని సహకార చక్కెర కర్మాగారం వద్ద రైతులు చేపట్టిన రిలే దీక్షలు ఐదోరోజు మంగళవారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా ఏపీ చెరకు రైతుసంఘం, వ్యవసాయ కూలీసంఘం, ఏపీ రైతుసంఘం, సీపీఐ, రైతుకూలీ సంఘం, ఫ్యాక్టరీ పరిరక్షణ కమిటీ, ఫ్యాక్టరీ కార్మిక సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ ఫ్యాక్టరీపై ప్రత్యక్షంగా పరోక్షంగా ఆధారపడి జీవిస్తున్న రెండులక్షల మంది రైతు, రైతు కూలీలు, కార్మికుల జీవనోపాధికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేశారు. పండగలోగా రైతులు, కార్మికులకు బకాయిలు ఇవ్వడంతోపాటు ఫ్యాక్టరీ క్రషింగ్ వెంటనే ప్రారంభించాలని కోరారు. ఫ్యాక్టరీని కాపాడతామని, చెరకు రైతులకు అండగా నిలుస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన చోడవరం, మాడుగుల కూటమి ఎమ్మెల్యేలు, అనకాపల్లి ఎంపీ రైతులను పూర్తిగా మోసం చేశారని మండిపడ్డారు. ఫ్యాక్టరీ వద్ద మంగళవారం జరిగిన ఆందోళనలో రైతుసంఘం జిల్లా కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు, గోవాడ షుగర్ ఫ్యాక్టరీ కార్మికసంఘం అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు రాయి సూరిబాబు, శరగడం రాము నాయుడు, జిల్లా వ్యవసాయ కూలీసంఘం అధ్యక్షుడు కోన మోహన్‌రావు, ఏపీ చెరకురైతు సంఘం అధ్యక్షుడు కర్రి అప్పారావు, రైతు సంఘం, ఫ్యాక్టరీ పరిరక్షణ కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. కాగా, దీనిపై అనకాపల్లి ఆర్డీవో ఆయిషా మాట్లాడుతూ రైతులు, కార్మికుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు.

మెడకు ఉరితాళ్లు వేసుకుని నిరసన తెలుపుతున్న రైతు సంఘాల ప్రతినిధులు

'చంద్రబాబు సీఎంగా ఉన్న ప్రతిసారీ సీమకు ద్రోహం'

- రాయలసీమ ఎత్తిపోతలపై ప్రభుత్వ వైఖరి దారుణం
- ప్రాజెక్టు అవసరం లేదన్న మంత్రి వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరం
- ప్రభుత్వ తీరుతో ప్రజల్లో ఆగ్రహం, ఆందోళన
- వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి ధ్వజం

సాక్షి,అమరావతి: చంద్రబాబుతో మాట్లాడి తానే రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని ఆపించానన్న రేవంత్ రెడ్డి వ్యాఖ్యలతో రాయలసీమ ప్రజలకు చంద్రబాబు చేసిన ద్రోహం బయటపడిందని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి తేల్చి చెప్పారు. ప్రభుత్వ తీరుతో రాయలసీమ ప్రజల్లో తీవ్ర ఆందోళన, ఆగ్రహం నెలకొన్నాయన్నారు. ఇంత జరుగుతున్నా ఇంకా ప్రాజెక్టు అవసరం లేదంటూ మంత్రి రామానాయుడు చేసిన వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీన్ని ప్రభుత్వం ఒక ప్రాంతంపై చేస్తున్న కుట్రగా అభివర్ణించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం గడికోట శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు సీఎంగా ఉన్న ప్రతిసారీ రాయలసీమకు అన్యాయం జరుగుతోందని చెప్పారు. 1995లో బాబు హయాంలోనే కర్ణాటక ఆల్మట్టి ప్రాజెక్టు నిర్మించగా.. తాజాగా మరలా రూ.70 వేల కోట్లతో కర్ణాటక ఆల్మట్టి విస్తరణ చేస్తూ.. రాష్ట్ర ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కలిగిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా చంద్రబాబు కనీసం నోరు మెదపడం లేదని మండిపడ్డారు. రాయలసీమకు జీవనాడి పోతిరెడ్డిపాడు లిఫ్ట్ అని.. అయితే శ్రీశైలంలో 881 అడుగులు ఉంటేనే పోతిరెడ్డిపాడు నుంచి నీళ్లు సాధ్యమన్నారు. ఎగువ రాష్ట్రాల వల్ల అది ఎప్పుడూ సాధ్యం కావడం లేదని తేల్చి చెప్పారు. రాయలసీమ నీటి ప్రాజెక్టులు వైఎస్సార్ కుటుంబం చలువే అని తేల్చి చెప్పారు. వైఎస్సార్ హయాంలో హంద్రీనీవా, గాలేరు నగరి, పోతిరెడ్డిపాడు ప్రాజెక్టులు రూపకల్పన జరగ్గా, బ్రహ్మంసాగర్, అవుకు, చిత్రావతి, వామికొండ ప్రాజెక్టులు చేపట్టడంతో పాటు గండికోటలో 27 టీఎంసీలు ఫుల్ లెవల్ నింపిన ఘనత కూడా వైఎస్ జగన్‌దేనని స్పష్టం చేశారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం కోసం వైఎస్ జగన్ రూ.3600 కోట్లతో పరిపాలనా అనుమతులు మంజూరు చేసి, రూ.900 కోట్లు ఖర్చు పెడితే.. అలాంటి ప్రాజెక్టును కూటమి నేతలు వృథా అనడం దారుణమని మండిపడ్డారు. రాయలసీమ పొట్ట కొట్టే యత్నం చేయవద్దని శ్రీకాంత్ రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

మంత్రి రామానాయుడు క్షమాపణ చెప్పాలి

''రాయలసీమ ఎత్తిపోతల పథకం అవసరం లేదని ఏపీ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అనడం దారుణం. రాయలసీమపై కూటమి నేతలకు ఎందుకంత కక్ష? ఇది ద్రోహం కాదా? ఆరు జిల్లాలకు మేలు చేసే రాయలసీమ ఎత్తిపోతల అవసరం లేదని వ్యాఖ్యానించిన మంత్రి రామానాయుడు క్షమాపణ చెప్పాలి. ఎత్తిపోతల పథకంపై కూటమి సర్కారు వైఖరి మారాలి. లేకుంటే చంద్రబాబును చరిత్ర క్షమించదు' అని గడికోట శ్రీకాంత్‌రెడ్డి హెచ్చరించారు.

ఆ రైతులకు నోటీసులిస్తాం

- రెండో విడతలో ల్యాండ్‌పూలింగ్ కింద 16,666.57 ఎకరాల సేకరణ
- సీఆర్‌డీఏ సమావేశ వివరాలను వెల్లడించిన మంత్రి నారాయణ

సాక్షి, అమరావతి: సీడ్ యాక్సిస్ రోడ్డు మార్గంలో మంగళగిరి రోడ్డు కనెక్టివిటీకి మధ్య 4.5 ఎకరాల భూమిని అక్కడి రైతులు ఇప్పటివరకు ల్యాండ్‌పూలింగ్‌కు ఇవ్వలేదని మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ చెప్పారు. ఫిబ్రవరిలోగా స్టీల్ బ్రిడ్జి నిర్మాణం పూర్తవుతుందని, కాబట్టి సీడ్ యాక్సిస్ రోడ్ నిర్మాణం వేగవంతం చేయడంలో భాగంగా ఆ 4.5 ఎకరాల భూమికి భూ సేకరణకు నోటీసులు ఇస్తామని చెప్పారు. 57వ సీఆర్డీఏ అథారిటీ సమావేశ వివరాలను మంగళవారం సచివాలయంలో మీడియాకు వివరిస్తూ.. రాజధాని ప్రాంతంలోని యండ్రాయి, వడ్డమాను గ్రామాల్లో బుధవారం నుంచి ల్యాండ్‌పూలింగ్ ప్రక్రియ మొదలు పెడుతున్నట్టు తెలిపారు. రాజధాని అమరావతిలో రెండో దశ ల్యాండ్‌పూలింగ్ ప్రక్రియను నిర్వహిస్తామన్నారు. సీఆర్డీఏలో 754 పోస్టులు ఉన్నాయని, మార్పులు చేర్పులతో వాటి భర్తీకి అథారిటీ ఆమోదం తెలిపిందన్నారు. వీధిశూల ఉన్న 112 కమర్షియల్ ప్లాట్స్‌ను మార్చుకునే వెసులుబాటుకు ఆమోదం లభించిందన్నారు. కృష్ణా రివర్ ఫ్రంట్ మెరైనా కోసం ఎకరం భూమిని టూరిజం పాలసీకి ఇచ్చేలా నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. రైల్వేట్రాక్, ఇన్నర్ రింగ్ రోడ్, స్పోర్ట్స్ సిటీల నిర్మాణం కోసం 7 గ్రామాల్లో దశల వారీగా రెండోవిడత ల్యాండ్ పూలింగ్ చేయనున్నామన్నారు. వడ్డమాను, హరిచంద్రాపురం, పెద్దపరిమి గ్రామాల పరిధిలో 9,097.56 ఎకరాల పట్టా భూమి, 7.01 ఎకరాల అసైన్డ్ భూమి, పల్నాడు జిల్లాలోని నాలుగు గ్రామాల్లో మొత్తం 7,465 ఎకరాలు పట్టా భూమి, 97 ఎకరాల అసైన్డ్ మొత్తంగా 16,666.57 ఎకరాలు ల్యాండ్ పూలింగ్ తీసుకుంటున్నామని వివరించారు. సమావేశంలో ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పాల్గొన్నారు.

పేకాటలో దొరికి పరువు పూర్తిగా పోగొట్టారు

- వైఎస్సార్ కడప జిల్లా టీడీపీ సమావేశంలో మంత్రి సవిత
- మాఫియాగా మారి ఇసుక, మట్టి కొల్లగొడుతున్నారు
- సీసీ కెమెరాల ఏర్పాటు కోసం బలవంతపు వసూళ్లా?
- కడపలో టీడీపీ పరిస్థితి చక్కదిద్దలేనంత దిగజారింది
- పులివెందుల, కడపలోని పరిణామాలు దారుణం

కడప రూరల్: ''పేకాట ఆడుతూ దొరికిపోయి పార్టీకి తలవంపులు తెచ్చారు. ఇది చాలా అవమానకర ఘటన. ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత తెచ్చింది. జిల్లావ్యాప్తంగా ఉన్న టీడీపీ నేతలు మాఫియాగా ఏర్పడి ఇసుక, మట్టిని కొల్లగొడుతున్నారు'' అని వైఎస్సార్ కడప జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత వ్యాఖ్యానించారు. మంగళవారం రాత్రి ఆమె ఆధ్వర్యంలో కడప ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో నిర్వహించిన టీడీపీ అంతర్గత సమావేశంలో పార్టీలో జరుగుతున్న అంశాలు చర్చకు వచ్చాయి. పులివెందుల, కడపలోని పరిణామాలు దారుణంగా మారాయని మంత్రి వ్యాఖ్యానించారు. ''పులివెందులలో ఇటీవల పోలీసులు పేకాట శిబిరాలపై దాడి చేసి టీడీపీ నాయకులను పట్టుకోవడం పెద్ద చర్చకు దారితీసింది. అడ్డంగా దొరికింది కాక పోలీసులతో ప్రవర్తించిన తీరు ఏమాత్రం బాగోలేదు. పులివెందులలో ఎన్నడూ లేని ఈ పరిస్థితి ఇప్పుడే ఎందుకు వచ్చింది'' అని నేతలను నిలదీశారు. దీంతో నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి బీటెక్ రవి సర్దిచెప్పుకోవాల్సి వచ్చింది. కడప నియోజకవర్గంలో ఇటీవలి ఘటనలు సమావేశంలో మరింత మంట పుట్టించాయి. సీసీ కెమెరాల ఏర్పాటు కోసం బలవంతంగా వసూలు చేయడమేంటని ఎమ్మెల్యే మాధవిరెడ్డి, పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డిలను మంత్రి సవిత నిలదీశారు. మీడియాలో విస్తృతంగా వచ్చినా ఎందుకు అడ్డుకట్ట వేయలేదని ప్రశ్నించారు. దీనిపై ఎమ్మెల్యే, శ్రీనివాసులురెడ్డి కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేశారు. ఇదే అంశానికి సంబంధించి కడప నగర మైనార్టీ నాయకుడు జిలానీ బాషా మనస్తాపంతో బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై చికిత్స పొందుతున్న వైనంపై మంత్రి ఆరా తీశారు. ఆయన తీవ్ర అనారోగ్యానికి గురవడంపై ప్రముఖంగా చర్చించారు. ఇది ఏమాత్రం మంచి పద్ధతి కాదని మంత్రి మందలించారు. జిల్లా పార్టీలోని పరిణామాల పట్ల సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ చాలా సీరియస్‌గా ఉన్నారంటూ హెచ్చరించారు. సమావేశంలో మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, కమలాపురం ఎమ్మెల్యే గుత్తా చైతన్య రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు భూపేష్‌రెడ్డి, రితేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్, ఎస్పీలతో సమావేశం చర్చనీయాంశం

సమావేశం ప్రారంభమైన కొద్దిసేపటి తర్వాత జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎస్పీ నచికేత్ హాజరయ్యారు. నేతలందరూ బయటికి వచ్చినా కలెక్టర్, ఎస్పీలతో మంత్రి సమావేశం కావడం చర్చనీయాంశమైంది. దాదాపు గంటన్నరకుపైగా వీరి సమావేశం సాగింది.

నీటి వాటాల్లో ఏపీకి తీరని నష్టం

ట్రిబ్యునల్ ఎదుట రాష్ట్ర ప్రభుత్వం సమర్థ వాదనలు వినిపించాలి: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

ఎంవీపీ కాలనీ: నీటి వాటాల పంపకం విషయంలో ఆంధ్రప్రదేశ్‌కు తీరని నష్టం జరుగుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. విశాఖ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఏపీ – తెలంగాణ నీటి వివాదాన్ని ప్రస్తావిస్తూ న్యాయమైన వాటా పొందే విషయంలో ఏపీ ప్రభుత్వం సరైన రీతిలో సమర్థవంతమైన వాదన వినిపించాల్సిన అవసరం ఉందన్నారు. అయితే జలసంఘం ఎదుట తెలంగాణా తన వాదనను సమర్థవంతంగా వినిపిస్తోందని, ఇదే తరహాలో ఏపీ ప్రభుత్వం కూడా తన వాదనను వినిపించాలని సూచించారు. నీటి వాటాపై పూర్తి అవగాహన ఉన్న నిపుణులు ఏపీలో చాలామంది ఉన్నారని, ప్రభుత్వం వారి సలహాలు, సూచనలు తీసుకుని న్యాయమైన వాటాను రాబట్టాలన్నారు. రాష్ట్రంలో 90 శాతం రెవెన్యూ సమస్యలకు పరిష్కారం లభించడం లేదన్నారు. జిల్లాల వారీగా ఫిర్యాదులు పెద్దఎత్తున అపరిష్కృతంగా ఉండిపోతున్నాయని తెలిపారు. ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన వాట్సాప్ గవర్నెన్స్ రాష్ట్ర ప్రజలకు చేరువకావడం లేదన్నారు. ఈ నేపథ్యంలో కలెక్టరేట్‌లో జరిగే పీజీఆర్ఎస్ కార్యక్రమాలకు తమ పార్టీ ప్రతినిధులు హాజరై అర్జీలు పెట్టే సమయంలో ఫిర్యాదుదారులకు సహాయం అందించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. త్వరలోనే ఈ ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు.

సంక్రాంతికి 8,432 స్పెషల్ బస్సులు

సాక్షి, అమరావతి: సంక్రాంతికి 8,432 ప్రత్యేక బస్సు సర్వీసులు నడపాలని ఆర్టీసీ నిర్ణయించింది. వాటిలో 6వేల రాష్ట్ర సర్వీసులు, 2,432 అంతర్రాష్ట్ర సర్వీసులు ఉంటాయి. సంక్రాంతికి ముందు 3,857 సర్వీసులు, సంక్రాంతి అనంతరం తిరుగు ప్రయాణాల కోసం 4,575 సర్వీసులను నడుపుతామని ఆర్టీసీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది.

రక్తహీనతతో ఆశ్రమ పాఠశాల విద్యార్థిని మృతి

- అల్లూరి జిల్లాలో ఘటన
- మృతదేహాన్ని తరలిస్తుండగా బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ ఆందోళన
- నెలల తరబడి పాఠశాలల వైపు చూడని వైద్యాధికారులు

మచ్చుపల్లి సమీపంలో రోడ్డుపై ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘ నాయకులు, గ్రామస్తులు

నందిని (ఫైల్)

పెదబయలు: చంద్రబాబు ప్రభుత్వ నిర్లక్ష్యానికి మరో విద్యార్థిని బలైంది. గిరిజన పాఠశాలల్లో వైద్యులు సక్రమంగా పరీక్షలు నిర్వహించని నేపథ్యంలో రక్తహీనతతో మరో విద్యార్థిని ప్రాణాలు కోల్పోయింది. అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం తురకలవలస గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న వంతాల నందిని (13) రక్తహీనతతో విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతిచెందింది. నందిని స్వగ్రామం పెదబయలు మండలం కిముడుపల్లి పంచాయతీ మచ్చుపల్లి. బాధిత కుటుంబసభ్యులు, వారి బంధువులు తెలిపిన మేరకు.. ఈ నెల 3వ తేదీన కాళ్ల వాపులు, కళ్లు తిరగడంతో బాధపడుతున్న నందినిని పాఠశాల డిప్యూటీ వార్డన్ ఎస్.ప్రవల్లిక సమీపంలోని గంపరాయి ఆరోగ్య ఉపకేంద్రానికి తరలించారు. అక్కడ హెచ్‌బీ పరీక్షలో నందినికి రక్తం 5.2 పాయింట్లు మాత్రమే ఉండడంతో అదే రోజు పాడేరు జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ఆరోగ్యం మరింతగా క్షీణించడంతో నందినిని విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున ఆమె మరణించింది. నందిని ఆరోగ్యంగానే ఉండేదని, ఇంత తక్కువ హెచ్‌బీ ఉందనే విషయం తెలియదని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. పాఠశాల యాజమాన్యం సకాలంలో గుర్తించి ఉంటే తమ పాప బతికి ఉండేదని ఆవేదన చెందుతున్నారు. స్థానిక ఇన్‌చార్జీ ఏటీడబ్ల్యూవో జగత్‌రాయ్ పాఠశాలలో నందిని స్నేహితులు, ఉపాధ్యాయులతో మాట్లాడి వివరాలు సేకరించారు.

సెప్టెంబర్ నుంచి వైద్యాధికారులు రాలేదు

తమ పాఠశాలకు గత ఏడాది సెప్టెంబర్ నుంచి వైద్యాధికారులు రాలేదని తురకలవలస గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల హెచ్‌ఎం పి.గంగాబాయ్ చెప్పారు. గంపరాయి వెల్నెస్ సెంటర్ ఏఎన్‌ఎం సిబ్బంది మాత్రం ప్రతి గురువారం వచ్చి ఆరోగ్యం బాగాలేని వారికి మందులు ఇచ్చి వెళుతున్నారని తెలిపారు.

ఆశ్రమ పాఠశాలల్లో మరణాలు అరికట్టాలి

గిరిజన ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల మరణాల్ని అరికట్టాలని, నందిని కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ గిరిజన విద్యార్థి సంఘం వారు, ప్రజాప్రతినిధులు, ప్రజలు మచ్చుపల్లి రోడ్డుపై బైఠాయించారు. నందిని మృతదేహాన్ని గ్రామానికి తీసుకొస్తున్న వాహనాన్ని ఆపి ఆందోళన చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల మరణాలు ఆపాలని, విద్యార్థులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని నినాదాలు చేశారు. రెండేళ్లలో 45 మంది విద్యార్థులు అనారోగ్య సమస్యలతో ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. రక్తహీనతతో ప్రాణాలు కోల్పోయిన నందిని కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని, దీనికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో గిరిజన విద్యార్థి సంఘం జిల్లా నాయకుడు మనుగూరు బాబూజీ, కిముడుపల్లి పంచాయతీ సర్పంచ్ కొర్ర శోభారాణి, నాయకుడు తమ్మన్న, నందిని బంధువులు, గ్రామస్తులు ఆందోళనలో పాల్గొన్నారు. ఎస్ఐ వెంకటేష్ వారితో మాట్లాడి ఆందోళనను విరమింపజేశారు. అనంతరం నందిని మృతదేహాన్ని మచ్చుపల్లికి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు.

తిరుమల ఎక్స్‌ప్రెస్‌లో పొగలు

అనపర్తి/తెనాలి రూరల్: సాంకేతిక సమస్య తలెత్తడంతో విశాఖపట్నం నుంచి కడప బయలుదేరిన తిరుమల ఎక్స్‌ప్రెస్ (18521)లో పొగలు రావడంతో తూర్పు గోదావరి జిల్లా అనపర్తి రైల్వేస్టేషన్‌లో మంగళవారం అరగంట పాటు నిలిచిపోయింది. విశాఖపట్నం నుంచి బయలుదేరిన ఈ రైలుకు బిక్కవోలు స్టేషన్ దాటిన తరువాత బ్రేకులు పట్టేయడంతో పొగలు వచ్చాయి. దీంతో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. అనపర్తిలో రైలును నిలిపివేసిన సిబ్బంది, బ్రేకులు రిలీజ్ చేశారు. అనంతరం రైలు తిరిగి బయలుదేరింది. ఇది తరచుగా వచ్చే సమస్యేనని, ప్రమాదమేమీ ఉండదని సిబ్బంది చెప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అలాగే, గుంటూరు జిల్లా తెనాలి రైల్వే స్టేషన్‌లో సోమవారం రాత్రి గూడ్స్ రైలుకు పెను ప్రమాదం తప్పింది. కృష్ణపట్నం పోర్టు నుంచి మహారాష్ట్రకు బొగ్గు లోడుతో వెళుతున్న గూడ్స్ రైలు బోగీలో మంటలు రావడంతో తెనాలిలో ఆపి బోగీని రైలు నుంచి వేరు చేశారు. మంగళగిరి నుంచి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. ఎటువంటి నష్టం జరగలేదు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP).,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

నోరూరించే పూతరేకులు

నగరం గారజీలు

పందెం కోడి కుర్మా

పొట్టిక్కలు

తాపేశ్వరం మడత కాజా

ఆయ్.. ఏవంటారండోయ్..

గోదావరి రుచులపై జోరుగా రీల్స్

ఆయ్.. మేం గోదారోళ్లమండి.. అంటూ ఓ పాట ఎంత క్రేజీగా మారిందో.. అచ్చం అలానే ఇప్పుడు సంక్రాంతి పండగ వేళ గోదావరి రుచులకు సంబంధించి రీల్స్ ట్రెండింగ్ అయ్యింది. ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్ట్రాగామ్‌లలో గోదావరి రుచులకు సంబంధించి వీడియోలు హల్‌చల్ చేస్తున్నాయి. బ్యాక్ గ్రౌండ్‌లో 'ఆహా ఏమి రుచి... తినరా మైమరచి, ఈ జన్మమే రుచి చూడడానికి దొరికెరా.. ఈ లోకమే వండి వార్చడానికి వేదికరా'... వంటి పాటలు అదనపు ఆకర్షణగా మారాయి. నోరూరించే ఆత్రేయపురం పూతరేకులు, తాపేశ్వరం కాజాలు, అవిడి పాలకోవా, నగరం గరాజీలు, రాజోలు హల్వా.. కారం కారంగా చిన్న గోడి చెకోడీలు, తాటిపాక పెద్ద చెకోడీలు, అమలాపురం అప్పడాలు, అంబాజీపేట పొట్టిక్కలు, ఆత్రేయపురం పెసరట్టు- ఉప్మా, పి.గన్నవరం మూకుడు రొట్టె, నాన్ వెజ్‌కు వస్తే సమనస తాత బిర్యాని, సిరిపల్లి మిక్సిడ్ మొగలాయి, కాత్రేనికోన రాజుగారి దూపుడు పోతు బిర్యాని, ఆపై పందెం కోడి 'కోస' కుర్మా, గోదావరి రొయ్యల వేపుడు... ఇలా చెప్పుకొంటూ పోతే గోదావరి రుచులు అన్నీ ఇన్నీ కావు. గోదారోళ్ల ఆతిథ్యానికి ఉమ్మడి రాష్ట్రంలో ఓ ప్రత్యేక గుర్తింపు ఉంది. సంక్రాంతి పండగ దగ్గర పడుతున్న వేళ సామాజిక మాధ్యమాల్లో ఈ రీల్స్ ముచ్చటేస్తున్నాయి.

ఐ.పోలవరం

క్లుప్తంగా...

చిత్తశుద్ధి ఉంటే బీసీ రిజర్వేషన్ల చట్టం తేవాలి

బీసీ ఐక్యవేదిక రాష్ట్ర చైర్మన్ సింగరయ్య యాదవ్

సాక్షి, అమరావతి: బీసీలకు రక్షణ కల్పిస్తున్నట్టుగా చంద్రబాబు ప్రభుత్వం కపట ప్రేమ కనబరుస్తోందని, వాస్తవానికి బీసీ అట్రాసిటీ యాక్ట్ అమల్లోకి తెచ్చి సమాజంలో మిగిలిన కులాలకు బీసీలను దూరం చేసే ఎత్తుగడ అని బీసీ ఐక్య వేదిక రాష్ట్ర చైర్మన్ జంగాల సింగరయ్య యాదవ్ అన్నారు. బీసీ అట్రాసిటీ యాక్ట్ తేవడంలో చంద్రబాబు ప్రభుత్వ కుటిల నీతి ఉందంటూ మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ యాక్ట్ వల్ల మిగిలిన సామాజికవర్గాలు బీసీల పట్ల భయాందోళనలకు గురై దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. నిజంగా చిత్తశుద్ధి ఉంటే 34 శాతం రిజర్వేషన్ల అమలు హామీని నిలబెట్టుకునేలా చట్టం చేయాలన్నారు.

విశాఖ రిఫైనరీలో 'ఆర్‌యూఎఫ్' కీలక ముందడుగు

ప్రధాని నరేంద్ర మోదీ

సాక్షి, న్యూఢిల్లీ: విశాఖ రిఫైనరీలో అవశేషాల అప్‌గ్రేడేషన్ సదుపాయం (రెసిడ్యూ అప్‌గ్రెడేషన్ ఫెసిలిటీ–ఆర్‌యూఎఫ్) ప్రారంభం కావడాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసించారు. విశాఖ రిఫైనరీ సాధించిన ప్రగతిని వివరిస్తూ కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ మంగళవారం 'ఎక్స్'లో ఓ వీడియోను పోస్ట్ చేశారు. దీనిని ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా ప్రశంసించినట్లు ప్రధానమంత్రి కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

462 కి.మీ. మేర మూడు రైల్వే లైన్లు

డీపీఆర్ కోసం సర్వేకు అనుమతి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మూడు కొత్త రైల్వేలైన్ల నిర్మాణం కోసం సర్వేకు రైల్వేశాఖ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న మచిలీపట్నం–నరసాపురం (74 కి.మీ.), రేపల్లె–బాపట్ల(46కి.మీ.), విజయవాడ– గూడూరు నాలుగో లైన్ (293 కి.మీ.) సర్వేకు కేంద్ర రైల్వే శాఖ లైన్‌క్లియర్ చేసింది. దీంతోపాటు విజయవాడకు మరింత మెరుగైన కనెక్టివిటీ కోసం ఇందుపల్లి–దుగ్గిరాల (49 కి.మీ.) లైన్‌కు కూడా సర్వే చేపట్టనుంది. మొత్తం 462 కి.మీ. లైన్ల నిర్మాణం కోసం డీపీఆర్‌లను పొందించేందుకుగాను సర్వే పనులకు అనుమతినిచ్చింది.

ఏపీకి ఆరుగురు ఐఎఫ్‌ఎస్ అధికారుల కేటాయింపు

సాక్షి, అమరావతి: ఏపీకి 2025 బ్యాచ్‌కి చెందిన ఆరుగురు ఐఎఫ్‌ఎస్ (ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్) అధికారులను కేంద్రం కేటాయించింది. ఆ నోటిఫికేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం గెజిట్‌లో ముద్రించింది. బిపుల్ గుప్తా, చింతకాయల లవకుమార్‌తోపాటు కర్ణాటకకు చెందిన నిహాల్.హెచ్, మహారాష్ట్రకు చెందిన భండారే ప్రదీప్ బబాసో, భోపాలే సందీప్ ఫకీరారావ్, బిహార్‌కు చెందిన రిషభ్ కుమార్‌లను ఏపీ కేడర్‌కు నియమించింది.

వెటర్నరీ ఆస్పత్రులకు రూ.43.77 కోట్లు

సాక్షి, అమరావతి: మొబైల్ వెటర్నరీ యూనిట్స్‌తో పాటు వెటర్నరీ ఆస్పత్రులు, డిస్పెన్సరీల బలోపేతానికి రూ.43.77 కోట్లకు పరిపాలన ఆమోదం ఇస్తూ పశు సంవర్ధక శాఖ స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్ మంగళవారం ఉత్తర్వులిచ్చారు. ఈ నిధులను కేంద్ర ప్రాయోజిత పథకాల(సీఎస్‌ఎస్) కింద పశువుల ఆరోగ్య పరిరక్షణ, వ్యాధుల నియంత్రణ కోసం చేపట్టేందుకు ఖర్చు చేయనున్నారు.

రాష్ట్ర స్థాయి మీడియా అక్రిడిటేషన్ కమిటీ ఏర్పాటు

సాక్షి, అమరావతి: రాష్ట్ర స్థాయి మీడియా అక్రిడిటేషన్ కమిటీని నియమిస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీకి చైర్మన్‌గా సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ వ్యవహరించనున్నారు. సభ్యులుగా పలుయూనియన్లు, పత్రికలు, ఎల్రక్టానిక్ మీడియా ప్రతినిధులను నియమించారు. కాగా మెంబర్ కన్వీనర్‌గా సమాచార పౌరసంబంధాల శాఖ అదనపు డైరెక్టర్/ జాయింట్ డైరెక్టర్ వ్యవహరించనున్నారు. వైద్య ఆరోగ్య, కార్మిక, హౌసింగ్, దక్షిణ మధ్య రైల్వే, ఏపీఎస్‌ఆర్టీసీ, ఐఅండ్ పీఆర్ నుంచి ఒక్కొక్కరు సభ్యులుగా ప్రాతినిధ్యం కల్పించారు. కమిటీ ఆమోదం తర్వాత అక్రిడిటేషన్లు జారీ చేస్తారు.

నారా వారి పాలనలో.. నారీ విలాపం

మహిళలు, బాలికలపై వేధింపులు, లైంగికదాడులు చంద్రబాబు ప్రభుత్వంలో నిత్యకృత్యమయ్యాయి. నిత్యం ఎక్కడో ఒక చోట మహిళలపై అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నాయి. చివరకు బడిలో కూడా బాలికలకు రక్షణ లేకుండా పోయింది. వీటికి తోడు బాలికలు, మహిళల మిస్సింగులు కొనసాగుతూనే ఉన్నాయి. మహిళలపై అకృత్యాలకు సంబంధించి గత రెండేళ్లలో జిల్లాలో 1564 కేసులు నమోదవడం పరిస్థితికి అద్దం పడుతోంది.

- రోజుకు ఇద్దరు మహిళలపై నేరాలు
- నాలుగు రోజులకో బాలికపై లైంగికదాడి
- బడిలో కూడా రక్షణ కరువు
- ప్రేమ పేరుతో మోసపోయిన ఎంటెక్ విద్యార్థిని ఆత్మహత్య
- బాలికను నాగార్జున సాగర్ తీసుకెళ్లి లైంగికదాడి
- పని ప్రదేశంలో మహిళలపై పెరిగిన లైంగికదాడులు
- దిశను నిర్వీర్యం చేసిన చంద్రబాబు ప్రభుత్వం



■ మహిళలపై అకృత్యాలకు సంబంధించి గత రెండేళ్లలో నమోదైన కేసులు: 1564 ■ బాలికల మీద లైంగికదాడుల కేసులు: 177

■ గత ఏడాది కాలంలో మిస్ అయిన బాలికలు: 136 మంది, మహిళలు: 264 మంది

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

మహిళలకు రక్షణ కల్పిస్తామని ప్రగల్భాలు పలికిన చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జిల్లాలో మరింతగా దాడులు, అత్యాచారాలు పెరిగిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలోనే టంగుటూరు ప్రభుత్వ పాఠశాలలో ఆరేళ్ల చిన్నారిపై ఉపాధ్యాయుడు లైంగికంగా అసభ్యంగా ప్రవర్తించడం కలకలం సృష్టించింది. ఆ తరువాత వరుసగా బాలికల మీద లైంగికదాడులు జరుగుతూనే ఉన్నాయి. బాలికలకు రక్షణ కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇక మహిళల సంగతి సరే సరి. ప్రతి రోజూ అదనపు కట్నం కోసమో, ఇతరత్రా కారణాలతో మహిళల మీద నేరాలు జరుగుతూనే ఉన్నాయి. ఒక మహిళా హోం మంత్రి పాలనలో కూడా మహిళలకు రక్షణ లేకుండాపోవడం బాధాకరమని మహిళా సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

రోజుకు ఇద్దరు మహిళలపై అఘాయిత్యం..

రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రకాశం జిల్లాలో మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోయాయి. ప్రతి రోజూ ఇద్దరు మహిళలు ఏదో ఒక రకమైన వేధింపులకు గురవుతున్నారు. కట్నం కోసం హతమార్చడం కావచ్చు, అదనపు కట్నం కోసం వేధింపులు, గృహహింస, ఇతరత్రా కారణాలతో మహిళలు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. మహిళలపై అకృత్యాలకు సంబంధించి 2024లో 475 కేసులు నమోదు కాగా, 2025లో 440 కేసులు నమోదయ్యాయి. ఈ రెండేళ్లలో 915 కేసులు నమోదయ్యాయి. ఇక మహిళల హత్యలు, కిడ్నాపులు వంటి కేసులు 2024లో 274 నమోదు కాగా, 2025లో 180 కేసులు నమోదవడం గమనార్హం. మొత్తం మీద మహిళలకు వ్యతిరేకంగా 2024లో 855 కేసులు, 2025లో 709 కేసులు నమోదయ్యాయి. అంటే ఈ రెండేళ్లలో 1564 కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది ఒక్కటే ప్రతి రోజూ రెండు కేసుల చొప్పున నమోదయ్యాయి. పోలీసు స్టేషన్ గడప తొక్కని కేసులు ఇంకెన్ని ఉన్నాయో ఊహించడం కష్టం. మహిళల రక్షణ కోసం వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో తీసుకొచ్చిన దిశ యాప్‌ను మూలనడేసిన చంద్రబాబు ప్రభుత్వం కొత్తగా శక్తి యాప్ అని తీసుకొచ్చింది. శక్తి యాప్‌ను నామమాత్రంగా మహిళల ఫోన్‌లలో డౌన్‌లోడ్ చేసి ఇక దాని గురించి పట్టించుకోవడం మానేశారు. దీంతో ఈ యాప్ వల్ల మహిళలకు ఎటువంటి ఉపయోగం లేకుండా పోయింది.

బాలికలకు రక్షణేది..

జిల్లాలో బాలికల మీద లైంగికదాడులు పెరిగిపోయాయి. బాలికల మీద ఈ రెండేళ్లలో 177 కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది పోలీసు రికార్డులు పరిశీలిస్తే నాలుగు రోజులకో బాలిక మీద లైంగికదాడి జరిగినట్లు తెలుస్తోంది. పిక్కిలి ఆంజనేయులు అనే టీడీపీ నాయకుడు యర్రగొండపాలెం మండలంలోని ఒక గ్రామంలో కిరణా దుకాణం నిర్వహిస్తున్నాడు. తినుబండరాల కోసం దుకాణానికి వెళ్లిన 9, 8 సంవత్సరాల వయసు కలిగిన ఇద్దరు బాలికలను మాయమాటలతో మభ్యపెట్టి దుకాణం వెనకకు తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. కురిచేడు పరిసరాలకు చెందిన ఒక 16 ఏళ్ల బాలికను రాగుల శ్రీను అనే కామాంధుడు మాయమాటలతో నాగార్జున సాగర్‌కు తీసుకెళ్లి లాడ్జిలో నిర్బంధించి ఐదు రోజుల పాటు లైంగికదాడి చేశాడు. ఈ ఘటనలో బాలిక తల్లిదండ్రులు కేసు పెట్టకుండా రాజీ చేసేందుకు ప్రయత్నించారు. దళిత సంఘాలు రంగంలోకి దిగడంతో తప్పనిసరి పరిస్థితుల్లో పోలీసులు కేసు నమోదు చేశారు.

బిలాల్ నగర్‌లో బాలికను వేధిస్తున్నట్లు ఫిర్యాదు

నగరంలోని బిలాల్ నగర్‌లో ఒక బాలికను వేధిస్తున్నట్లు బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు చేసి 15 రోజులు గడుస్తున్నా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే మీ కోసం వేదికలో ఎస్పీని కలిసి ఫిర్యాదు చేశాడు. కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశాడు. డీఎస్పీని కలిసి తన కూతురికి రక్షణ కల్పించడమంటూ వేడుకున్నా ప్రయోజనం లేకుండా పోయిందని, అధికార పార్టీ నాయకుల ఒత్తిడి వల్లనే పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని బాధితుడు వాపోతున్నాడు. ఇలా నిత్యం ఎక్కడో ఒక చోట మహిళలు, బాలికలపై అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నాయి.

చదువుకోవడానికి బడికి వెళితే..

చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక చదువుకోడానికి బడికి వెళ్లినా రక్షణ లేకుండా పోయిందని బాలికల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దర్శి పట్టణంలోని కురిచేడు రోడ్డులో నివాసం ఉండే ఇద్దరు చిన్నారులు పట్టణంలోని ఒక ప్రభుత్వ పాఠశాలలో 5వ తరగతి చదువుకుంటున్నారు. అదే పాఠశాలలో చదువు చెబుతున్న ఒక ఉపాధ్యాయుడు వీరి మీద కన్నేశాడు. ఎప్పటిలాగే స్కూలుకు వెళ్లిన ఆ ఇద్దరు చిన్నారులను సాయంత్రం స్కూలు వదిలిన తరువాత కూడా వేచి ఉండమని చెప్పాడు. విద్యార్థులందరూ వెళ్లి పోయాక ఆ చిన్నారులతో అసభ్యంగా ప్రవర్తించాడు. ఉపాధ్యాయుడి ప్రవర్తన చూసి భయపడిపోయిన చిన్నారులు ఇంటికి వెళ్లి జరిగింది చెప్పడంతో కేసు నమోదు చేయడమే కాకుండా కీచక గురువును సస్పెండ్ చేశారు.

ఆగని బాలికలు, మహిళలు మిస్సింగ్‌లు...

జిల్లాలో బాలికలు, మహిళల మిస్సింగులు కొనసాగుతూనే ఉన్నాయి. పోలీసు రికార్డుల ప్రకారమే గత ఏడాది కాలంలో 136 మంది బాలికలు, 264 మంది మహిళలు మిస్సింగ్ అయ్యారు. అయితే పోలీసుల అప్రమత్తత కారణంగా ఈ కేసుల్లో 90 శాతానికి పైగా ట్రేస్ చేశారు. అయినా కొంతమంది బాలికలు ప్రాణాలు కోల్పోయారు. 2024 జూన్‌లో మద్దిపాడు మండలం దొడ్డవరప్పాడు గ్రామ శివారులోని కపిల్ లేఔట్ వద్ద సింగరాయకొండకు చెందిన 14 ఏళ్ల బాలిక హత్యకు గురైంది. తొలుత ఈ బాలిక మిస్సింగ్ అయినట్లు కుటుంబ సభ్యులు భావించారు. పోస్టుమార్టం రిపోర్టులో అత్యాచారం చేసి హతమార్చినట్లు నివేదిక రావడంతో పోలీసులు విచారణ కొనసాగించారు. ఏడాదిన్నర తరువాత 2025 డిసెంబర్ 31న నిందితులను అరెస్టు చేశారు. ఈ ఏడాదిన్నర కాలంలో బాలిక కుటుంబ సభ్యులు నరకం అనుభవించారు.

ప్రేమ పేరుతో మోసం..ఆత్మహత్య..

ఇటీవల నగరానికి చెందిన ఒక దళిత యువతి ఆత్మహత్య చేసుకోవడం కలకలం సృష్టించింది. ఎంటెక్ చదువుకున్న బాలిక నగరానికి చెందిన మరో యువకుడిని ప్రేమించింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించిన సదరు యువకుడు ఆమెను లోబరుచుకున్నాడు. చివరకు పెళ్లి చేసుకోమని అడగడంతో నీ కులం వేరు మా కులం వేరు అంటూ మొహం చాటేశాడు. యువకుడి ఇంటికి వెళ్లిన యువతిని నెట్టివేయడంతో మనస్తాపం చెందిన యువతి ఆత్మహత్య చేసుకొని మరణించింది. ఈ ఘటనలోనూ యువకుడి అధికార పార్టీ నాయకుల ఒత్తిడి మేరకు అరెస్టు చేయడం లేదని దళిత సంఘాల నాయకులు ఆందోళన నిర్వహించారు.

మద్య నిషేధం చేయడం ఒక పరిష్కారం

ఇటీవల కాలంలో మద్యం తాగడం ఎక్కువైపోయింది. ప్రభుత్వం టార్గెట్ విధించి మరీ తాగిస్తున్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు వచ్చాయి. రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోంది. చిన్నపిల్లలు సైతం మద్యం తాగుతున్నారు. దీంతో పాటుగా అశ్లీల చిత్రాల ప్రసారం మితిమీరింది. మద్యపానాన్ని నిషేధించాలి. విష సంస్కృతిని కట్టడి చేయకుండా మహిళలపై హింసను అరికట్టడం అసాధ్యం. ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాలను చూస్తే ఆందోళన కలుగుతోంది. ప్రభుత్వాలు మహిళలకు వ్యతిరేకంగా జరుగుతున్న హింసను సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది.

– బి.పద్మ, పీఓడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి

మహిళలు, బాలికలపై దాడులు పెరగడం ఆందోళనకరం

రాష్ట్రంలో ఇటీవల కాలంలో మహిళలు, బాలికల మీద అత్యాచారాలు, దాడులు విపరీతంగా పెరిగిపోయాయి. విద్యాబుద్దులు చెప్పాల్సిన ఉపాధ్యాయులు సైతం బాలికలపై లైంగిక దాడులకు పాల్పడడం ఆందోళన కలిగిస్తోంది. చివరికి పాఠశాలల్లో కూడా బాలికలకు రక్షణ లేకపోతే పరిస్థితి ఏంటి? గ్రామగ్రామానికి మద్యం అందుబాటులోకి రావడంతో మహిళలపై హింస కూడా పెరిగింది. గృహహింస గురించి ఎంత తక్కువగా చెప్పుకుంటే అంతమంచిదన్నట్లుగా తయారైంది. మహిళల సాధికారిత గురించి గొప్పలు చెప్పే ప్రభుత్వం మహిళ రక్షణ గురించి నోరుమెదపడం లేదు.

– ఎం.విజయ, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు

డ్రగ్స్ సరఫరా చేస్తున్న విదేశీ మహిళ డిపోర్టేషన్

నైజీరియాకు తరలించిన ఈగల్ ఫోర్స్

సాక్షి, హైదరాబాద్: స్థానికంగా మత్తుపదార్థాలు సరఫరా చేస్తున్న నైజీరియాకు చెందిన ఓ మహిళను తెలంగాణ ఈగల్ ఫోర్స్ మన దేశం నుంచి బహిష్కరించింది. మంగళవారం శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి ఈమెను నైజీరియాకు తరలించారు. ఈ మేరకు ఈగల్ ఫోర్స్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. నైజీరియాకు చెందిన ముగ్గురు మహిళలు నకిలీ పాస్‌పోర్ట్, నకిలీ వీసాలతో భారత్‌కు వచ్చారు. ఢిల్లీ ఎయిర్ పోర్టు నుంచి విశాఖపట్నం చేరుకున్న వారు స్థానికంగా షెల్టర్ తీసుకున్నారు. ఒక ఫ్లాట్‌ను అద్దెకు తీసుకుని డ్రగ్స్ అమ్మకాలు చేస్తున్నారు. నవంబర్ మొదటి వారంలో తెలంగాణ ఈగల్ ఫోర్స్ పోలీసులు ఢిల్లీలో నిర్వహించిన భారీ ఆపరేషన్‌లో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ ఆపరేషన్‌లో 50 మందికి పైగా నైజీరియన్లను అరెస్ట్ చేయగా.. విశాఖపట్నంలో డ్రగ్స్ దందా చేస్తున్న ముగ్గురు మహిళల సమాచారం తెలిసింది. ఈ మేరకు డిసెంబర్‌లో విక్టరీ ఇటోహాన్ ఇయాసేలే సహా ముగ్గురు విదేశీ మహిళలను ఈగల్ ఫోర్స్ అరెస్ట్ చేసింది. ముగ్గురికీ హైదరాబాద్‌లోని ఫారినర్స్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్‌లో (ఎఫ్‌ఆర్‌ఆర్‌వో) బయోమెట్రిక్ నిర్వహించారు. ఆమెకు జింబాబ్వేకు చెందిన దంబుజా తఫాడ్జ్వా పేరున నకిలీ పాస్‌పోర్ట్, వీసా ఉన్నట్లు గుర్తించారు. ఆ తర్వాత ఎఫ్‌ఆర్‌ఆర్‌వో పాస్‌పోర్ట్‌ను పరిశీలించారు. ఇయాసేలే విక్టరీ ఇటోహాన్ నైజీరియాకు చెందిన మహిళను గుర్తించారు. ఎఫ్‌ఆర్‌ఆర్‌వో నుంచి అనుమతి తీసుకుని ముగ్గురిని హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌లోని డిటెన్షన్ సెంటర్‌లో ఉంచారు. విక్టరీ ఇటోహాన్ ఇయాసేలేకు ఎఫ్‌ఆర్‌ఆర్‌వో నుంచి ఎగ్జిట్ పర్మిట్ పొందిన తర్వాత నైజీరియాకు టికెట్ కొనుగోలు చేశారు. దాదాపు 37 రోజుల పాటు డిటెన్షన్ సెంటర్‌లో ఉంచిన తర్వాత మంగళవారం నైజీరియాలోని లాగోస్‌కు పంపించారు.

మరో 480 గ్రామ పంచాయతీలు!

- జిల్లాల నుంచి ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- జనగణన నేపథ్యంలో బ్రేక్ పడే అవకాశం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కొత్తగా 480 గ్రామ పంచాయతీల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు వచ్చాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 13326 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మరో మూడు నెలల్లో ప్రస్తుత సర్పంచ్‌ల పదవీకాలం ముగుస్తుంది. ఈ నేపథ్యంలో గ్రామ పంచాయతీల విభజన – పునర్వ్యవస్థీకరణపై నిషేధం ఎత్తివేస్తూ 2025 నవంబర్ 27న ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఆ మేరకు డీపీవోల నుంచి 460 వరకు కొత్త పంచాయతీల ఏర్పాటుకు పంచాయతీరాజ్ కమిషనర్‌కు ప్రతిపాదనలు వచ్చాయి. ఇందులో సుమారు 20 గ్రామ పంచాయతీలు రెండు కంటే ఎక్కువ చొప్పున వర్గీకరణకు ప్రతిపాదనలు వచ్చినట్టు పంచాయతీరాజ్ శాఖ వర్గాలు తెలిపాయి. ఆ ప్రతిపాదనలకు ఆమోదం లభిస్తే రాష్ట్రంలో మొత్తం గ్రామ పంచాయతీలు 13,800కి చేరే అవకాశం ఉంది.

జనగణన నేపథ్యంలో బ్రేక్!

కాగా జనగణనకు కేంద్రం నోటిఫికేషన్ ఇచ్చింది. జనాభా సర్వే పూర్తయ్యే వరకు డీ లిమిటేషన్స్ చేయవద్దని ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో ప్రస్తుతం కొత్త పంచాయతీల ఏర్పాటుకు బ్రేక్ పడే అవకాశం ఉందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

14 సంస్థల పెట్టుబడులకు ఎస్ఐపీబీ ఆమోదం

రూ.19,391 కోట్ల పెట్టుబడులు, 11,753 ఉద్యోగాలు వస్తాయని సీఎం వెల్లడి

- గూగుల్ సెంటర్ ఏపీకి తీసుకురావడానికి లోకేశ్ కృషి చేశారన్న చంద్రబాబు
- ఏపీ ఐటీ ఇన్‌ఫ్రా కనెక్ట్ పోర్టల్ ఆవిష్కరణ

సాక్షి, అమరావతి: స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్సులో ఫలితాలు రావాలనే లక్ష్యంతో పని చేయాలని మంత్రులకు, అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. మంగళవారం సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన 14వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపీబీ) సమావేశం జరిగింది. 14 సంస్థలకు చెందిన రూ.19,391 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఈ పరిశ్రమల ద్వారా 11,753 ఉద్యోగాలు లభిస్తాయన్నారు. 2029 నాటికి విద్యుత్ కొనుగోలు ధరను రూ. 3.70కు తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఏపీకి గూగుల్ ఏఐ డేటా సెంటర్ తీసుకురావడానికి లోకేశ్ కృషి చేశారని చెప్పారు. సూర్యలంక బీచ్ రిసార్ట్స్ బ్రాండింగ్ చేయాలని, అక్కడ 15 కిలోమీటర్ల బీచ్ ఫ్రంట్ అభివృద్ధి చేయాలని అన్నారు. సూళ్లూరుపేట వద్ద ఉన్న చిన్న చిన్న ద్వీపాలను కూడా బీచ్ టూరిజం కింద అభివృద్ధి చేయవచ్చన్నారు. పాపికొండలు – పోలవరం ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలన్నారు. అనంతపురం నుంచి గండికోట వరకూ టూరిజం క్లస్టర్లలో కూడా పర్యాటకానికి అవకాశం ఉందన్నారు. 2 వేల ఏళ్ల చరిత్ర ఉన్న తిమ్మమ్మ మర్రిమానును గూగుల్ మ్యాపింగ్ చేయాలని చెప్పారు. ఆవకాయ్ ఫెస్టివల్, ఫ్లెమింగో ఫెస్టివల్, గండికోట ఉత్సవాలు, విశాఖ అరకు ఉత్సవ్, సీ టూ స్కై, ఏపీ ట్రావెల్ మార్ట్‌లను ఘనంగా నిర్వహించాలని చెప్పారు. స్పేస్ సిటీ కోసం కనీసం 5 వేల ఎకరాలు అవసరమని తెలిపారు. మాకవరపాలెం వద్ద ఫుడ్ పార్క్ సహా అల్యూమినియం డౌన్ స్ట్రీమ్ పరిశ్రమలు వచ్చేలా చూడాలని సూచించారు. అనంతరం ముఖ్యమంత్రి ఏపీ ఐటీ ఇన్‌ఫ్రా పోర్టల్‌ను ప్రారంభించారు.

'సమన్వయంతో దోమలను నియంత్రించాలి'

సాక్షి, అమరావతి: దోమల నియంత్రణకు ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ రీజినల్ డైరెక్టర్ (హైదరాబాద్) డాక్టర్ అనురాధ సూచించారు. వ్యాధుల నియంత్రణపై ఏపీ రాష్ట్ర స్థాయి టాస్క్ ఫోర్స్ మంగళవారం వర్చువల్‌గా సమావేశమైంది. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ..రాష్ట్రంలో కుక్క కాటుతో జరిగిన మరణాలపై అధ్యయనం చేయాలన్నారు. స్క్రబ్‌టైఫస్ జ్వరాలపై ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. కర్ణాటకలోని కస్తూర్బా మెడికల్ కాలేజీ మైక్రోబయాలజీ విభాగాధిపతి చిరంజయ్ ముఖోపాధ్యాయ మాట్లాడుతూ.. ఏటా తురకపాలెంలో ప్రత్యేకంగా ఫీవర్ క్లినిక్‌లు నిర్వ హించాలని సూచించారు. తురకపాలెంలో బ్రూసె ల్లోసిస్ అనే జునోటిక్ వ్యాధిపై సిరో మానిటరింగ్, సిరో సర్వైలెన్స్ చేస్తున్నామని పశు సంవర్ధక శాఖ అధికారులు వివరించారు. జంతువుల్లో లెప్టోస్పై రోసిస్ తీవ్రత గుర్తించేందుకు 2,061 నమూనాలను పరీక్షించామని వెల్లడించారు.

కనుమ రోజు నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ చట్టం కింద సెలవు

సాక్షి, అమరావతి: కనుమ పండుగ సందర్భంగా ఈనెల 16వ తేదీ శుక్రవారం నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ చట్టం కింద ప్రభుత్వం సెలవు ప్రకటించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ నోటిఫికేషన్ జారీ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ విజ్ఞప్తి మేరకు సెలవు ప్రకటించినట్లు ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

స్మార్ట్ వ్యవసాయంతో రైతు ఆదాయం పెంపు

వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

సాక్షి, అమరావతి: స్మార్ట్ వ్యవసాయంతో రైతుల ఆదాయం పెరుగుతుందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. విజయవాడలోని సమగ్ర జలవనరుల నిర్వహణ–రైతు శిక్షణ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో సూక్ష్మ సాగునీటిలో ఆటోమేషన్ సాంకేతికతను మంత్రి మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నీటి వనరుల తగ్గుదల వంటి సవాళ్ల మధ్య రైతును కాపాడాలంటే వ్యవసాయాన్ని స్మార్ట్‌గా మార్చాల్సిన అవసరం ఉందన్నారు.

ఈ-పంట యాప్‌లో మరిన్ని సౌకర్యాలు

సాక్షి, అమరావతి: రబీ 2025–26 సీజన్ నుంచి ఈ పంటయాప్‌లో ప్రత్యేక సౌకర్యం అందుబాటులోకి తెచ్చినట్టు వ్యవసాయ శాఖ డైరెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ చెప్పారు. యాప్‌లోకల్పించిన సౌకర్యాలపై రూపొందించిన పోస్టర్‌ను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. www. karshak. ap.gov.in/ecrop www. agriculture.ap.gov.లో క్యూఆర్ కోడ్ ద్వారా సేవలను సులభంగా పొందవచ్చునన్నారు. ఈ–పంట నమోదుకు ముందు ఆర్‌ఎస్‌కే సిబ్బంది క్షేత్రాన్ని సందర్శించే తేదీకి సంబంధించి, ఈ–పంట నమోదు చేసిన తర్వాత, రైతు పంట వివరాలను ధ్రువీకరించిన తర్వాత సంక్షిప్త సందేశాలు పంపిస్తామన్నారు.

సాక్షి సినిమా

నయనతార, చిరంజీవి

సంక్రాంతి ఫ్యామిలీ స్పెషల్

తెలుగు చిత్ర పరిశ్రమలో సినిమాల విడుదలకు అతి పెద్ద పండగ ఏదైనా ఉందంటే అది సంక్రాంతి. ఈ సీజన్ అంటే టాలీవుడ్‌కి చాలా ప్రత్యేకం అని చెప్పొచ్చు. అందుకే పెద్దా... చిన్నా అనే తేడా లేకుండా చాలా సినిమాలు సంక్రాంతి రోజుల్లో బాక్సాఫీస్ వద్ద సందడి చేస్తుంటాయి. ఈ కారణంగానే స్టార్ హీరోలు, యువ కథానాయకులు, దర్శక నిర్మాతలందరూ తమ సినిమాలని సంక్రాంతి రేసులో ప్రేక్షకుల ముందుకి తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తుంటారు. ఈ క్రమంలో ప్రతి ఏటా మంచి పోటీ నెలకొంటుంది. పైగా సంక్రాంతి సెలవులు ఉంటాయి కాబట్టి ఇంటిల్లిపాదీ సరదాగా సినిమాలకు వెళుతుంటారు. అందుకే ఈ సమయంలో వచ్చే సినిమాల్లో చాలా వరకు మంచి కమర్షియల్ సక్సెస్‌లు అందుకుంటూ ఉంటాయి. ఈ సంక్రాంతి కూడా గట్టి పోటీ నెలకొంది. చిరంజీవి 'మన శంకరవరప్రసాద్‌గారు', రవితేజ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి', ప్రభాస్ 'ది రాజా సాబ్', శర్వానంద్ 'నారీ నారీ నడుమ మురారి', నవీన్ పొలిశెట్టి 'అనగనగా ఒక రాజు' సినిమాలతో ప్రేక్షకుల ముందుకొస్తున్నారు. ఈ సినిమాలన్నీ ఫ్యామిలీ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కడంతో ఈ సంక్రాంతి ఫ్యామిలీ స్పెషల్‌గా మారింది. ఈ సంక్రాంతి రేసులో నిలిచిన కుటుంబ నేపథ్యం ఉన్న చిత్రాల విశేషాలు తెలుసుకుందాం.

డింపుల్ హయతి, రవితేజ, ఆషికా రంగనాథ్

భార్యా భర్తల నేపథ్యంలో...

చిరంజీవి హీరోగా నటించిన తాజా చిత్రం 'మన శంకర వరప్రసాద్‌గారు'. 'పండగకి వస్తున్నారు' అన్నది ట్యాగ్‌లైన్. ఈ ఏడాది వెంకటేశ్ హీరోగా 'సంక్రాంతికి వస్తున్నాం' మూవీతో బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్ అందుకున్న డైరెక్టర్ అనిల్ రావిపూడి 'మన శంకర వరప్రసాద్‌గారు'కి దర్శకుడు. ఈ సినిమాలో నయనతార హీరోయిన్‌గా నటించగా, హీరో వెంకటేశ్ ప్రధాన పాత్ర పోషించారు. అదే విధంగా కేథరిన్ కీలక పాత్ర చేశారు. అర్చన సమర్పణలో షైన్ స్క్రీన్స్ బ్యానర్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్మెంట్స్‌పై సాహు గారపాటి, సుష్మిత కొణిదెల నిర్మించారు. ఈ సినిమా ఆరంభం నుంచే 2026 సంక్రాంతికి విడుదల లక్ష్యంగా శరవేగంగా చిత్రీకరణ జరిపారు. ఈ చిత్రం ఈ నెల 12న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ సినిమాలో నయనతార, చిరంజీవి భార్యాభర్తలుగా నటించారు. ఇద్దరి మధ్య తలెత్తిన మనస్పర్థల కారణంగా ఈ జంట విడిపోతుందట. ఆ తర్వాత వీరిద్దరూ తిరిగి కలిశారా? లేదా అనే నేపథ్యంలో భావోద్వేగాలు, వినోదాలతో ఈ సినిమా రూపొందినట్లు ఫిల్మ్‌నగర్ టాక్. తనదైన మార్క్ కామెడీ, యాక్షన్‌తో ఈ చిత్రాన్ని రూపొందించారట అనిల్ రావిపూడి. ఇద్దరు స్టార్ హీరోలైన చిరంజీవి, వెంకటేశ్ కలిసి ఒకే సినిమాలో కనిపించనుండటంతో 'మన శంకర వరప్రసాద్‌గారు' పై ట్రేడ్ వర్గాల్లో మంచి జోష్ నెలకొంది. అదే విధంగా ఇటు ఇండస్ట్రీ వర్గాల్లో అటు ప్రేక్షకుల్లో ఫుల్ క్రేజ్ నెలకొంది. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించారు. ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన 'మీసాల పిల్ల...', 'శశిరేఖ...' పాటలకు అద్భుతమైన స్పందన వచ్చింది. ''బిగ్గెస్ట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'మన శంకరవరప్రసాద్‌గారు'. వినోదం, భావోద్వేగాలు, మాస్ ఎలిమెంట్స్ కలగలిపిన ఈ సినిమా సంక్రాంతి పండగకి ప్రేక్షకులకు సరైన వినోదాలను అందిస్తుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఆదివారం విడుదల చేసిన ఈ మూవీ ట్రైలర్‌కి కూడా మంచి స్పందన వచ్చింది. ''శశీ.. వేలు చూపించి మాట్లాడతావేంటి? ఏమనుకుంటున్నావ్? నువ్వు అంతగా తిట్టాలనుకుంటే లోపలికి వచ్చి తిట్టవా అందరూ చూస్తున్నారు ప్లీజ్', 'నా వాట్సప్ నంబరు కొంచెం అన్‌బ్లాక్ చేయవా ప్లీజ్', 'మనల్ని టార్చర్ పెట్టే పెళ్లాం తరపు బంధువుల్ని... మరీ ముఖ్యంగా అత్తగార్ని, మావగార్ని ఆడుకుంటుంటే ఉంటదయ్యా పిచ్చ హై వస్తుంది' అంటూ చిరంజీవి చెప్పే డైలాగులు బాగున్నాయి. అదే విధంగా 'చూడ్డానికి మాంచి ఫ్యామిలీ మేన్‌లా ఉన్నావ్... ఇలా మాస్ ఎంట్రీలు ఇస్తున్నావేంటి?' అని చిరంజీవి అంటే... 'మాస్‌కే బాస్‌లా ఉన్నావ్... నువ్వు ఫ్యామిలీ సైడ్ రాలేదా ఏంటి' అంటూ వెంకటేశ్ చెప్పడం కూడా ఆసక్తిగా ఉంది.

రిద్దీ కుమార్, మాళవికా మోహనన్, ప్రభాస్, నిధీ అగర్వాల్

సంయుక్త, శర్వానంద్, సాక్షీ వైద్య

భార్య... భర్త... ఓ ప్రేయసి

రవితేజ మరోసారి తనదైన శైలిలో ప్రేక్షకులకు వినోదాలు అందించేందుకు సిద్ధమయ్యారు. ఆయన హీరోగా నటించిన తాజా చిత్రం 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. 'నేను శైలజ, ఉన్నది ఒకటే జిందగీ, చిత్రలహరి, ఆడవాళ్ళు మీకు జోహార్లు' చిత్రాలను తెరకెక్కించిన కిశోర్ తిరుమల దర్శకత్వం వహించారు. డింపుల్ హయతి, ఆషికా రంగనాథ్ హీరోయిన్లుగా నటించారు. జీ స్టూడియోస్ సమర్పణలో ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 13న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' టైటిల్‌ని బట్టి చూస్తే ఈ సినిమా పక్కా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఉండబోతోందని అర్థమవుతోంది. డింపుల్ హయతితో ఏడడుగులు వేసిన రవితేజ (రామసత్యనారాయణ) స్పెయిన్ వెళతాడు. అక్కడ ఆషికా రంగనాథ్‌తో ప్రేమలో పడతాడు. ఈ విషయం రామసత్యనారాయణ భార్యకి తెలిసిందా? రామసత్యనారాయణకి అప్పటికే పెళ్లయిన విషయం తెలుసుకున్న ఆషికా రంగనాథ్ ఏం చేశారు? ఈ ముక్కోణపు కుటుంబ ప్రేమకథా చిత్రం చివరికి ఎలాంటి మలుపు తీసుకుంది? అన్నది ప్రేక్షకుల్లో నవ్వులు పూయిస్తుందట. సున్నితమైన అంశాలకు తనదైన శైలిలో భావోద్వేగాలను జోడించి, తెరకెక్కించే కిశోర్ తిరుమల 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'లో భార్య, భర్త, ఓ ప్రేయసి మధ్య జరిగే ఇన్సిడెంట్స్‌ను వినోదాత్మకంగా చూపించినట్లు తెలుస్తోంది. 'నా జీవితంలోని ఇద్దరు ఆడవాళ్లు రెండు ప్రశ్నలు అడిగారు... సమాధానం కోసం చాలా ప్రయత్నించారు. గూగుల్, చాట్ జీపీటీ, జెమినీ, ఏఐ... ఇలా అన్నింటినీ అడిగాను... బహుశా వాటికి పెళ్లి కాకపోవడం వల్ల ఆన్సర్ చెప్పలేకపోయాయేమో. అనుభవం ఉన్న మగాళ్లని ముఖ్యంగా మొగుళ్లని అడిగాను. ఆశ్చర్యపోయారే తప్పా ఆన్సర్ మాత్రం ఇవ్వలేకపోయారు. అలాంటి ప్రశ్న మిమ్మల్ని ఏ ఆడవాళ్లు అడగకూడదని, పెళ్లయిన వాళ్లకి నాలాంటి పరిస్థితి ఎదురవకూడదని కోరుకుంటూ... మీ ఈ రామసత్యనారాయణ చెప్పేది ఏమిటంటే... భర్త మహాశయులకు విజ్ఞప్తి'' అంటూ రవితేజ చెప్పిన డైలాగ్స్ గ్లింప్స్‌లో ఇప్పటికే ఆకట్టుకున్నాయి. అదే విధంగా ఈ మూవీ టీజర్‌కి కూడా అద్భుతమైన స్పందన వచ్చింది. 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' ట్రైలర్‌ని నేడు గ్రాండ్‌గా లాంచ్ చేయబోతున్నారు మేకర్స్. ''ఔట్ అండ్ ఔట్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. కిశోర్ తిరుమల టచ్‌తో ఉంటుంది. రవితేజ చాలా రోజుల తర్వాత ఓ ఫ్యామిలీ ఫ్రెండ్లీ ఎంటర్‌టైనర్ చేయడం రిఫ్రెషింగ్‌గా ఉంటుంది. ఇందులో వినోదంతో పాటు మనసుని హత్తుకునే భావోద్వేగాలు కూడా ఉంటాయి'' అని మేకర్స్ తెలిపారు.

మీనాక్షీ చౌదరి, నవీన్ పొలిశెట్టి

నానమ్మ-మనవడి కథ

వరుస పాన్ ఇండియా సినిమాలతో అంతర్జాతీయ స్థాయిలో ప్రేక్షకాదరణ సొంతం చేసుకున్న ప్రభాస్ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'ది రాజాసాబ్'. నిధీ అగర్వాల్, మాళవికా మోహనన్, రిద్దీ కుమార్ హీరోయిన్లుగా నటించారు. మారుతి దర్శకత్వం వహించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్, కృతీ ప్రసాద్ భారీ బడ్జెట్‌తో నిర్మించారు. పలుమార్లు వాయిదా పడుతూ వచ్చిన ఈ సినిమా ఫైనల్‌గా సంక్రాంతి కానుకగా ఈ నెల 9న ప్రేక్షకుల ముందుకొస్తోంది. 2026 సంక్రాంతికి వస్తున్న తొలి చిత్రం ఇది. 'ది రాజాసాబ్' నుంచి ఇప్పటికే విడుదలైన ప్రభాస్ వింటేజ్ లుక్స్‌కి అద్భుతమైన స్పందన వచ్చింది. ఈ మూవీ పోస్టర్స్, టీజర్, గ్లింప్స్‌కి అనూహ్యమైన రెస్పాన్స్ వచ్చింది. పైగా ఈ మూవీలో ప్రభాస్ తొలిసారి ద్విపాత్రాభినయం చేయడంతో ఇటు ట్రేడ్ వర్గాల్లో, అటు ఇండస్ట్రీ వర్గాల్లో, ప్రేక్షకుల్లో ఇప్పటికే ఫుల్ క్రేజ్ నెలకొంది. ఈ సినిమాలో తాతయ్య పాత్రను బాలీవుడ్ నటుడు సంజయ్ దత్, నానమ్మ క్యారెక్టర్‌ను జరీనా వాహబ్ చేశారు. ఈ మూవీ హారర్ థ్రిల్లర్ బ్యాక్‌గ్రౌండ్‌లో తెరకెక్కినప్పటికీ కథ మొత్తం ప్రధానంగా నానమ్మ-మనవడిపైనే సాగుతుందట. ఈ విషయాన్ని స్వయంగా ప్రభాస్ తెలిపారు. తమన్ సంగీతం అందించిన ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదల చేసిన పాటలకు అద్భుతమైన స్పందన వచ్చింది. ''ఈ సినిమాలో ప్రభాస్ పాత్ర అందరితో నవ్వులు పూయిస్తుంది. మా సినిమా ఏ ఒక్కర్ని కూడా నిరాశ పరచదు'' అంటూ డైరెక్టర్ మారుతి ఇటీవల జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో పేర్కొన్నారు. ''ది రాజా సాబ్' సినిమాలో మా నానమ్మగా జరీనా వాహబ్‌గారు నటించారు. ఆమె అద్భుతమైన నటి. డబ్బింగ్ చెబుతుంటే నా సీన్స్ మర్చిపోయి నానమ్మ సీన్స్ చూస్తుండిపోయాను. ఆమె నటనకు ఫ్యాన్ అయిపోయాను. 'ది రాజా సాబ్'లో నాతో పాటు మా నానమ్మ కూడా ఒక హీరో. ఈ సినిమా నానమ్మ-మనవడి కథ'' అని ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ప్రభాస్ మాట్లాడటాన్ని బట్టి చూస్తే... ఇది తప్పకుండా నానమ్మ-మనవడి కథ అని చెప్పడానికి ఆలోచించక్కర్లేదు. ''మా సంస్థ (పీపుల్స్ మీడియా) నుంచి వస్తున్న బిగ్గెస్ట్ ఫిల్మ్ 'ది రాజా సాబ్'. ప్రభాస్ గారిని 'బుజ్జిగాడి' సినిమా స్టైల్‌లో వింటేజ్ లుక్‌లో చూపిస్తున్నాం. ఈ సినిమా కోసం బిగ్గెస్ట్ ఇండోర్ సెట్ వేశాం. 40 నిమిషాల క్లైమాక్స్ ఎపిసోడ్ ఈ మూవీకి హైలైట్‌గా నిలుస్తుంది'' అని టీజీ విశ్వప్రసాద్ ఇటీవల తెలిపారు.

నారీ నారీ నడుమ మురారి

నారీ నారీ నడుమ హీరో శర్వానంద్ ఎలాంటి తిప్పలు పడ్డారు? అన్నది తెలియాలంటే 'నారీ నారీ నడుమ మురారి' విడుదల వరకూ ఆగాల్సిందే. శర్వానంద్ హీరోగా నటించిన తాజా చిత్రం 'నారీ నారీ నడుమ మురారి'. 'సామజ వరగమన' ఫేమ్ రామ్ అబ్బరాజు దర్శకత్వం వహించిన ఈ సినిమాలో సంయుక్త, సాక్షీ వైద్య కథానాయికలు. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, అడ్వెంచర్స్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్స్‌పై అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మించారు. ఈ సినిమాని ఈ నెల 14న సాయంత్రం 5:49 గంటలకు థియేటర్లలో రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు మేకర్స్. 'ఎక్స్‌ప్రెస్ రాజా' (2016), 'శతమానం భవతి' (2017) వంటి సినిమాలతో సంక్రాంతి బరిలో నిలిచి, విజయాలు అందుకున్న శర్వానంద్ మరోసారి 'నారీ నారీ నడుమ మురారి' మూవీతో సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. ఈ చిత్రంలో శర్వానంద్, సంయుక్త ప్రేమించుకుంటారు. అయితే మనస్పర్థల వల్ల ఆ ప్రేమకు ఫుల్‌స్టాప్ పడుతుంది. ఈ నేపథ్యంలో సాక్షీ వైద్యతో ప్రేమలో పడతారు శర్వానంద్. ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు ఒకే ఆఫీసులో పని చేస్తుంటారు. అదే ఆఫీసులో టీమ్ లీడర్‌గా తన మాజీ ప్రేయసి సంయుక్త జాయిన్ అవుతారు. ఓ వైపు మాజీ ప్రేయసి... మరోవైపు ప్రజెంట్ గర్ల్‌ఫ్రెండ్. వీరిద్దరి మధ్య శర్వానంద్ ఎలాంటి ఇబ్బందులు పడ్డారు? అనే కథాంశంతో వినోదాత్మకంగా తెరకెక్కించారు రామ్ అబ్బరాజు. ఇప్పటికే విడుదలైన ఈ మూవీ గ్లింప్స్, టీజర్, ట్రైలర్‌కి అద్భుతమైన స్పందన వచ్చింది. ''శర్వానంద్ నటించిన ఫీల్ గుడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రం 'నారీ నారీ నడుమ మురారి'. ఇప్పటికే విడుదలైన మా మూవీ ఫస్ట్ లుక్, ప్రమోషనల్ పోస్టర్లు బజ్ క్రియేట్ చేశాయి. విశాల్ చంద్ర శేఖర్ సంగీతం అందించిన ఈ సినిమా నుంచి విడుదలైన పాటలు చార్ట్‌బస్టర్‌గా నిలిచాయి. శర్వానంద్‌కి సంక్రాంతి లక్కీ సీజన్ అని చెప్పొచ్చు. 'ఎక్స్‌ప్రెస్ రాజా', 'శతమానం భవతి' వంటి సినిమాలతో బ్లాక్ బస్టర్ అందుకున్నారు. ఇప్పుడు 'నారీ నారీ నడుమ మురారి'తో మరో సంక్రాంతి హిట్‌ని తన ఖాతాలో వేసుకుంటారు'' అని చిత్రయూనిట్ తెలిపింది.

రాజుగారి పెళ్లి...

'అనగనగా ఒక రాజు' సినిమాతో సంక్రాంతి బరిలో సందడి చేయనున్నారు నవీన్ పొలిశెట్టి. 'జాతిరత్నాలు, మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' వంటి సినిమాలతో ప్రేక్షకులకు తనదైన శైలిలో వినోదాలు పంచిన నవీన్ పొలిశెట్టి హీరోగా నటించిన తాజా చిత్రం 'అనగనగా ఒక రాజు'. ఈ సినిమా ద్వారా మారి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. మీనాక్షీ చౌదరి హీరోయిన్‌గా నటించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్స్‌పై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ మూవీ ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకొస్తోంది. 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' (2023) సినిమా తర్వాత బైక్ యాక్సిడెంట్ కారణంగా కాస్త గ్యాప్ తీసుకున్నారు నవీన్. రెండేళ్లకు పైగా విరామం అనంతరం ఆయన నుంచి వస్తున్న తాజా సినిమా 'అనగనగా ఒక రాజు'. ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి, నవీన్ పొలిశెట్టి భార్యా భర్తలుగా నటించారు. ఈ మూవీ పూర్తి స్థాయి వినోదాత్మకంగా రూపొందింది. ఈ మూవీ నుంచి ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ చూస్తే ఈ విషయం స్పష్టంగా అర్థం అవుతుంది. ఈ చిత్రానికి మిక్కీ జె. మేయర్ సంగీతం అందించారు. ఈ మూవీ నుంచి విడుదలైన 'భీమవరం బల్మా..' అంటూ సాగే మొదటి పాట ఫుల్ ట్రెండింగ్‌లో ఉంది. ప్రమోషన్స్‌లో భాగంగా పలు వేదికలపై ఈ పాటకు నవీన్, మీనాక్షి కలిసి వేసిన డ్యాన్స్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ పాటతో నవీన్ పొలిశెట్టి మొదటిసారి గాయకుడిగా మారడం మరో విశేషం. ''అనగనగా ఒక రాజు' సినిమాలో వినోదం, మాస్, కమర్షియల్ సాంగ్స్, అద్భుతమైన ప్రేమ కథ వంటి అంశాలన్నీ ఉంటాయి. ఈ సినిమాలో మీనాక్షి కామెడీ టైమింగ్ చూసి అందరూ ఆశ్చర్యపోతారు. మా చిత్రం ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తుందని నమ్ముతున్నాను. ఈ 14న సంక్రాంతి సందర్భంగా థియేటర్లలో అందరం హాయిగా నవ్వుకుందాం'' అంటూ నవీన్ పొలిశెట్టి ఇటీవల ఓ వేడుకలో మాట్లాడారు.

- డేరంగుల జగన్ మోహన్

విజయ్

తమిళ స్టార్ హీరో విజయ్ నటించిన తమిళ చిత్రం 'జన నాయగన్'. (తెలుగులో జన నాయకుడు). హెచ్. వినోద్ దర్శకత్వం వహించిన ఈ సినిమా విజయ్ కెరీర్‌లో 69వ మూవీ. పూజా హెగ్డే హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో బాబీ డియోల్, మమితా బైజు కీలక పాత్రల్లో నటించారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కె. నారాయణ నిర్మించిన ఈ సినిమా ఈనెల 9న తమిళంతో పాటు తెలుగులోనూ విడుదల కానుంది. తమిళ రాజకీయాల్లోకి పూర్తి స్థాయిలోకి ఎంట్రీ ఇచ్చిన విజయ్ 'జన నాయకుడు' తర్వాత సినిమాల నుంచి విరామం తీసుకుంటున్నట్లు ప్రకటించారు. అంటే... ఇదే ఆయన ఆఖరి సినిమా అన్నమాట. ఈ నేపథ్యంలో ఈ సినిమాపై ఇండస్ట్రీ వర్గాల్లో ఫుల్ క్రేజ్ నెలకొంది. కుటుంబ కథా చిత్రాంగా రూపొందిన ఈ మూవీలో విజయ్ కుమార్తెగా మమితా బైజు నటించారు. ఈ సినిమా తెలుగు హిట్ మూవీ 'భగవంత్ కేసరి'కి రీమేక్‌గా రూపొందినట్లు తమిళ చిత్ర పరిశ్రమ టాక్. తెలుగులో శ్రీలీల చేసిన పాత్రని తమిళంలో మమితా బైజు చేసినట్లు తెలుస్తోంది. ఇటీవల విడుదలైన ఈ మూవీ ట్రైలర్‌కి మంచి స్పందన వస్తోంది. అనిరుధ్ సంగీతం అందించిన ఈ మూవీ నుంచి ఇప్పటికే విడుదలైన పాటలకు కూడా మంచి స్పందన వచ్చింది. ఈ సినిమా విజయ్ కెరీర్‌లో ఓ మైలురాయిగా నిలుస్తుందని చిత్రబృందం పేర్కొంది.

అల్లు అర్జున్

టైగర్ ష్రాఫ్

అల్లు అర్జున్‌తో ఢీ?

హీరో అల్లు అర్జున్, దర్శకుడు అట్లీ కాంబోలో భారీ స్థాయిలో ఓ చిత్రం రూపుదిద్దుకుంటున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో దీపికా పదుకొనె, మృణాల్ ఠాకూర్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. హీరోయిన్స్ జాన్వీ కపూర్, అనూఇమ్మాన్యుయేల్‌తో పాటుగా, విజయ్ సేతుపతి, రమ్యకృష్ణ ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటిస్తున్నారనే ప్రచారం సాగుతోంది. తాజాగా హీరో టైగర్‌ష్రాఫ్ పేరు తెరపైకి వచ్చింది. ఈ సినిమాలోని ఓ కీలక పాత్రలో టైగర్‌ష్రాఫ్ నటిస్తున్నారనే టాక్ తెరపైకి వచ్చింది. అయితే ఈ మూవీలో టైగర్‌ష్రాఫ్ విలన్ రోల్ చేస్తున్నారా? లేక కథలో కీలకమైన పాత్ర చేయనున్నారా? అనే విషయాలపై స్పష్టత రావాల్సింది. మరి.. అల్లు అర్జున్ సినిమాలో టైగర్‌ష్రాఫ్ భాగం అవుతారా? లెట్స్ వెయిట్ అండ్ సీ. సన్‌పిక్చర్స్ పతాకంపై కళానిధిమారన్ నిర్మిస్తున్న ఈ చిత్రం 2027లో విడుదల కానుంది.

ఏక్తా రాథోడ్, విశ్వక్ సేన్

టాలీవుడ్ ఎంట్రీ

విశ్వక్ సేన్ 'లెగసీ' చిత్రంతో తెలుగు పరిశ్రమకు ఎంట్రీ ఇస్తున్నారు ఏక్తా రాథోడ్. 'మాస్టర్ పీస్, సిలికాన్ సిటీ' వంటి కన్నడ చిత్రాల్లో నటించారీ బ్యూటీ. విశ్వక్ సేన్ హీరోగా సాయికిరణ్ దైదా దర్శకత్వంలో రూపొందుతున్న పొలిటికల్ యాక్షన్ డ్రామా 'లెగసీ'. ఈ చిత్రంలో ఏక్తా రాథోడ్ హీరోయిన్‌గా నటిస్తుండగా మురళీమోహన్, రావు రమేశ్, సచిన్ ఖేడేకర్, కేకే మీనన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. మంగళవారం ఏక్తా రాథోడ్ పుట్టినరోజు సందర్భంగా 'లెగసీ' చిత్రం నుంచి ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. యశ్వంత్ దగ్గుమాటి, సాయికిరణ్ రెడ్డి దైదా నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ ఏడాదే విడుదల కానుంది.

ఆర్ 15 సిరీస్

యమహా బైక్ ధరలపై రూ.5,000 తగ్గింపు

70వ వార్షికోత్సవం సందర్భంగా కంపెనీ ప్రకటన

చెన్నై: యమహా మోటార్ 70వ వార్షికోత్సవ వేడుక సందర్భంగా యమహా మోటార్ సంస్థ తన ఫ్లాగ్‌షిప్ స్పోర్ట్స్ మోటార్‌సైకిల్ ఆర్15 సిరీస్ బైక్‌లపై రూ.5,000 డిస్కౌంట్ ప్రకటించింది. ప్రత్యేక తగ్గింపు ధరలు జనవరి 5 నుంచే అమల్లోకి వచ్చాయని కంపెనీ తెలిపింది. తగ్గింపు తర్వాత యమహా ఆర్15 సిరీస్‌లోని యమహా ఆర్15ఎస్ మోడల్ బైక్ ప్రారంభం ధర రూ.1,50,700గా ఉంది. రేసింగ్ నుంచి ప్రేరణ పొందిన డిజైన్, ఆధునిక సాంకేతికత, రోజువారీ వినియోగానికి అనువైన రైడింగ్ లక్షణాల కారణంగా యువతలో ఈ బైక్‌లకు విశేషణ ఆదరణ లభించింది. భారత్‌లో ఇప్పటివరకు 10 లక్షలకుపైగా యూనిట్ల ఉత్పత్తి జరగడం ఆర్15 సిరీస్ బ్రాండ్ డిమాండ్ ప్రతిబింబిస్తుంది. ట్రాక్షన్ కంట్రోల్ సిస్టమ్, అసిస్ట్ అండ్ స్లిప్పర్ క్లచ్, క్విక్‌షిఫ్టర్, ఎల్ఈడీ లైటింగ్ వంటి ఫీచర్లు ఇందులో ఉన్నాయి. 155 సీసీ లిక్విడ్ కూల్డ్ ఇంజన్ ఉంది. ఆరు స్పీడ్ గేర్‌బాక్స్ ఆప్షన్ ఉంది. తగ్గించిన ధరలను పరిగణలోకి తీసుకుంటే ఇదే సిరీస్‌లోని ఆర్15 వీ4 బైక్ ధర రూ.1,66,200, ఆర్15 ఎం బైక్ ధర రూ.1,81,100గా ఉన్నాయి.

అదానీ ఎంటర్‌ప్రైజెస్ బాండ్ల విక్రయం

ఎన్‌సీడీల జారీతో రూ. 1,000 కోట్ల సమీకరణ

న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం అదానీ ఎంటర్‌ప్రైజెస్ మూడోసారి ఆఫర్ చేసిన మార్పిడికివీలుకాని లిస్టెడ్ డిబెంచర్ల(ఎన్‌సీడీలు)కు భారీ డిమాండ్ నెలకొంది. ఆఫర్ ప్రారంభమైన 45 నిముషాల్లోనే బాండ్లు విక్రయమైనట్లు స్టాక్ ఎక్స్ఛేంజీ(బీఎస్ఈ) డేటా వెల్లడించింది. నిజానికి తొలుత రూ. 500 కోట్ల విలువైన ఎన్‌సీడీలను ఆఫర్ చేయగా.. 10 నిముషాలలోనే అంతకుమించిన సబ్‌స్క్రిప్షన్ లభించింది. వార్షికంగా 8.9 శాతం ఈల్డ్(వడ్డీ ఆర్జన)తో వీటిని ఆఫర్ చేసింది. అయితే భారీ డిమాండ్ నేపథ్యంలో గ్రీన్ షూ ఆప్షన్ ద్వారా మరో రూ. 500 కోట్ల విలువైన ఎన్‌సీడీలను సైతం విక్రయించింది. వెరసి 45 నిముషాల్లోనే రూ. 1,000 కోట్లు సమీకరించింది. ఇష్యూ పరిమాణం 50 లక్షలుకాగా.. 2.19 కోట్ల ఎన్‌సీడీలకు బిడ్స్ దాఖలయ్యాయి. ఇవి బీఎస్ఈ, ఎన్ఎస్ఈలలో లిస్టుకానున్నాయి. 6న ఓపెన్ అయిన ఇష్యూ 19న ముగియనుంది. వీటిని తొలుత వచ్చినవారికి తొలుత ప్రాతిపదికన జారీ చేయనున్న సంగతి తెలిసిందే.

75 శాతం చెల్లింపులకే

అదానీ ఎంటర్‌ప్రైజెస్ ఆఫర్ చేసిన ఎన్‌సీడీలకు రేటింగ్ దిగ్గజాలు ఇక్రా, క్రిసిల్ వీటికి స్థిరత్వ ఔట్‌లుక్‌తో కూడిన ఏఏమైనస్ రేటింగ్‌ను ప్రకటించాయి. నిధులలో 75 శాతాన్ని ప్రస్తుత రుణాల చెల్లింపునకు అదానీ గ్రూప్ దిగ్గజం వెచ్చించనుంది. మిగిలిన నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలకు కేటాయించనుంది. కంపెనీ ఇంతక్రితం 2025 జూలైలో ఎన్‌సీడీల జారీ ద్వారా రెండోసారి రూ. 1,000 కోట్లు సమీకరించింది. తాజాగా విక్రయించిన ఎన్‌సీడీలను 24, 36, 60 నెలల కాలావధితో ఆఫర్ చేసింది. వీటికి త్రైమాసిక, వార్షిక పద్ధతిలో వడ్డీని చెల్లించనుంది. గత నెలలో ప్రారంభమైన నవీ ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌సహా.. కంపెనీ వైజాగ్‌లో గూగుల్ అదానీ ఏఐ డేటా సెంటర్ క్యాంపస్, దేశవ్యాప్తంగా వివిధ రహదారుల ప్రాజెక్టులు అభివృద్ధి చేయనున్న విషయం విదితమే.

అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేరు బీఎస్ఈలో 1 శాతం నీరసించి రూ. 2,259 వద్ద ముగిసింది.

సోలార్ రూఫ్‌టాప్‌లో టాటా పవర్ రికార్డు

9 నెలల్లో గిగావాట్ ఇన్‌స్టాలేషన్లు

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–డిసెంబర్ కాలంలో ఒక గిగావాట్ సోలార్ రూఫ్‌టాప్ ఇన్‌స్టలేషన్ల సామర్థ్యాన్ని తన సబ్సిడరీ సంస్థ 'టాటా పవర్ సోలరూఫ్' ద్వారా సాధించినట్లు టాటా పవర్ ప్రకటించింది. ఈ కాలంలో 1.7 లక్షల నివాస, వాణిజ్య, పారిశ్రామిక భవనాలపై ఎక్విప్‌మెంట్‌ను ఏర్పాటు చేసినట్టు(ఇనస్టలేషన్), అంతక్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఇన్‌స్టలేషన్లతో (38,494) పోల్చి చూస్తే 345 శాతం వృద్ధి సాధించినట్టు తెలిపింది. ఇదే కాలంలో నివాస, వాణిజ్య, పారిశ్రామిక విభాగంలో లక్ష మంది కొత్త కస్టమర్లను చేర్చుకున్నట్టు, దీంతో మొత్తం కస్టమర్ల సంఖ్య 3 లక్షలకు, ఇన్‌స్టాల్డ్ సోలార్ రూఫ్‌టాప్ సామర్థ్యం 4 గిగావాట్లకు పెరిగినట్టు వివరించింది. ఒక్క డిసెంబర్ త్రైమాసికంలోనే 58,476 రూఫ్‌టాప్ సోలార్ ఇన్‌స్టలేషన్లను సాధించినట్టు తెలిపింది. ఏప్రిల్–డిసెంబర్ కాలంలో అత్యధికంగా యూపీలో 30,857, మహారాష్ట్రలో 21,044 ఇన్‌స్టలేషన్లను చేసినట్టు పేర్కొంది. ఘర్ ఘర్ సోలార్ కార్యక్రమం ద్వారా రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్ ప్రయోజనాల గురించి వినియోగదారుల్లో అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపింది.

2025లో 2.82 కోట్ల వాహన విక్రయాలు

న్యూఢిల్లీ: దేశీయంగా ఆటోమొబైల్ రిటైల్ అమ్మకాల్లో మెరుగైన వృద్ధి నమోదైంది. అంతకుముందు ఏడాది(2024)తో పోలిస్తే 2025లో 8 శాతం మేర విక్రయాలు పెరిగాయి. ప్రథమార్ధమంతా మందగమనాన్ని ఎదుర్కొన్నప్పటికీ..., జీఎస్‌టీ 2.0 అమలు తర్వాత వాహన విక్రయాలు పరుగులు పెట్టాయని ఆటో మొబైల్ సమాఖ్య(ఫాడా) పేర్కొంది. ఇందుకు సంబంధించి గణాంకాలు విడుదల చేసింది. 2024 క్యాలెండర్ ఇయర్‌లో 2,61,45,445 యూనిట్లు అమ్ముడవ్వగా.., 2025లో 2,81,61,228 యూనిట్లు మేర అమ్ముడయ్యాయని ఫాడా తెలిపింది.

2025లో విక్రయాలు ఇలా...,

- 2024లో 40,79,532 ప్యాసింజర్ వాహనాలు అమ్ముడవగా.., 2025లో 10% వృద్ధితో 44,75,309 యూనిట్లు అమ్ముడయ్యాయి.
- టూవీలర్ అమ్మకాల్లో 7.24 శాతం వృద్ధి నమోదైంది. 2024లో 1,89,24,815 యూనిట్లు అమ్ముడుపోగా.. 2025లో 2,02,95,650 యూనిట్లు విక్రయమయ్యాయి.
- త్రిచక్ర వాహన అమ్మకాలు 2024లో 12,21,886 యూనిట్లు కాగా.. 2025లో 7.21 శాతం వృద్ధితో 13,09,953 యూనిట్లు అమ్ముడయ్యాయి. వాణిజ్య వాహన విక్రయాలు 6.71% పెరిగి 10,09,654 యూనిట్లుగా నమోదయ్యాయి. 2024లో ఇవి 9,46,190 యూనిట్లుగా ఉన్నాయి.

''2025 ఏడాది దేశీయ ఆటో పరిశ్రమ ప్రయాణాన్ని రెండు దశలుగా అభివర్ణించవచ్చు. జనవరి నుంచి ఆగస్టు వరకు.... కేంద్ర బడ్జెట్‌లో ప్రత్యక్ష పన్ను రాయితీలు, ఆర్‌బీఐ వడ్డీరేట్ల తగ్గింపు వంటి సానుకూలతలున్నప్పటికీ.., అమ్మకాలు స్తబ్దుగా సాగాయి. ఈ దశలో కస్టమర్లు కొనుగోళ్ల విషయంలో అప్రమత్తత వహించారు. అయితే సెప్టెంబర్ నుంచి పరిస్థితి మారింది. జీఎస్‌టీ 2.0 సవరణలో భాగంగా 350 సీసీ కన్నా తక్కువ సామర్థ్యం ఉన్న బైకులు, స్కూటర్లపై జీఎస్‌టీని 28% నుంచి 18 శాతానికి తగ్గించారు. అలాగే పెట్రోల్ కార్లలో 1200 సీసీ కన్నా, డీజిల్ కార్లలో 1500 సీసీ కన్నా తక్కువ వాటిపై జీఎస్‌టీని 28% నుంచి 18 శాతానికి తగ్గించారు. ప్రభావంతో సెప్టెంబర్ నుంచి డిసెంబర్ మధ్యకాలంలో వాహన విక్రయాలు గణనీయంగా పుంజుకున్నాయి'' అని ఫాడా అధ్యక్షుడు సీఎస్ విఘ్నేశ్వర్ తెలిపారు. వాహన పరిశ్రమ విద్యుదీకరణ(ఎలక్ట్రిఫికేషన్)వైపు అడుగులను 2025 ఏడాది స్వాగతించిందన్నారు. టూ వీలర్స్, పీవీ, సీవీ, త్రీ వీలర్స్ ఇలా అన్ని విభాగాల్లో ఈవీ వాటా గణనీయంగా పెరిగిందన్నారు. మొత్తంగా.. 2025 క్యాలెండర్ సంవత్సరం ఉత్సాహభరితంగా ముగిసిందన్నారు. ఈ ఏడాది(2026) అవుట్‌లుపై ఫాడా వివరణ ఇస్తూ .., ''తొలి మూడు నెలల్లో రిటైల్ విక్రయాలకు ఢోకా లేదు. తాము నిర్వహించిన సర్వే ప్రకారం, 74.91% డీలర్లు వృద్ధి ఉంటుందని ఆశిస్తున్నారు. జీఎస్‌టీ 2.0తో కొనుగోళ్ల సామర్థ్యం పెరగడం, పండుగలు, వివాహాల సీజన్, ఆర్థిక సంవత్సరం ముగింపులో కనిపించే కొనుగోళ్ల ప్రభావం డిమాండ్‌కు మద్దతునిస్తాయని అంచనా వేసింది. వాతావరణ శాఖ(ఐఎండీ) ముందస్తు అంచనాల ప్రకారం ఏడాది వర్షపాతం తగిన మోతాదులో ఉండొచ్చు. కావున గ్రామీణ ప్రాంతాల డిమాండ్ ఎలాగూ ఉంటుంది. స్థూల ఆర్థిక గణాంకాల దృష్ట్యా పరిశీలిస్తే... ఆర్‌బీఐ రెపో రేటు 5.25% వద్ద ఉండటం రుణ వ్యయాల విషయంలో అదనపు ఊరట లభిస్తోంది. అలాగే, వినియోగానికి పెద్దపీట వేసే విధంగా పన్ను రాయితీలకు ప్రాధాన్యం ఇచ్చే బడ్జెట్ రావొచ్చంటూ చర్చలు జరుగుతున్నాయి. అలాంటి బడ్జెట్ అమలులోకి వస్తే, డిస్క్రెషనరీ డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉంది. సరఫరా సరైన సమయానికి సరఫరా, ఫైనాన్స్ ప్రక్రియల వేగవంతం, డీలర్ నెట్‌వర్క్‌లో క్రమబద్ధమైన నిల్వ నిర్వహణ జరిగితే..., 2026లోనూ ఆటో అమ్మకాలు టాప్‌గేర్ దూసుకెళ్లే వీలుందని ఫాడా అంచనా వేసింది.

2024తో పోలిస్తే గతేడాదిలో 8% వృద్ధి

- కలిసొచ్చిన జీఎస్‌టీ 2.0 అమలు
- ఈ ఏడాదిలోనూ సానుకూల అమ్మకాలు
- ఆటో మొబైల్ సమాఖ్య ఫాడా వెల్లడి

బీమా అనైతిక విక్రయాలు ఆందోళనకరమే

వీటికి చెక్ పెట్టాలంటూ సూచనలు ● ఐఆర్‌డీఏఐ వార్షిక నివేదిక

న్యూఢిల్లీ: బీమా రంగంలో ఉత్పత్తులను తప్పుదోవ పట్టించి విక్రయించడం (అనైతిక మార్గాల్లో) ఆందోళన కలిగిస్తున్నట్టు బీమా రంగ నియంత్రణ, అభివృద్ధి మండలి (ఐఆర్‌డీఏఐ) వార్షిక నివేదిక పేర్కొంది. అసలు దీనికి గల కారణాలను గుర్తించేందుకు బీమా సంస్థలు లోతైన విశ్లేషణ చేయాలని సూచించింది. 2023–24లో జీవిత బీమా కంపెనీలకు వ్యతిరేకంగా 1,20,726 ఫిర్యాదులు రాగా, 2024–25లోనూ ఇదే స్థాయిలో 1,20,429 ఫిర్యాదులు దాఖలైనట్టు తెలిపింది. అనైతిక వ్యాపార విధానాలపై మాత్రం ఫిర్యాదులు 23,335 నుంచి 26,667కు పెరిగినట్టు వెల్లడించింది. మొత్తం ఫిర్యాదుల్లో అనైతిక వ్యాపార పద్ధతులకు సంబంధించినవి 19.33 శాతం నుంచి 22.14 శాతానికి పెరిగినట్టు పేర్కొంది. వ్యక్తుల అవసరాలకు సరిపడని, నియమ, నిబంధనలు, షరతులు గురించి పూర్తిగా తెలియజేయకుండా, కేవలం ప్రయోజనాల గురించే చెబుతూ పాలసీలను విక్రయించడాన్ని మిస్ సెల్లింగ్‌గా చెబుతుంటారు. బ్యాంక్‌లు, బీమా ఏజెంట్ల రూపంలో ఈ తరహా విక్రయాలు సాగుతుంటాయి. ''మిస్ సెల్లింగ్‌ను నిరోధించేందుకు గాను తగిన విధానాలను అమలు చేయాలని బీమా సంస్థలకు సూచించాం. ఉత్పత్తి అనుకూలతను అంచనా వేయడం (పాలసీదారునకు అనుకూలమైనా), పంపిణీ ఛానల్ వ్యాప్తంగా కొన్ని నియంత్రణలు అమలు చేయడం, మిస్ సెల్లింగ్‌పై ఫిర్యాదుల పరిష్కారానికి ప్రణాళిక రూపొందించడం, మూల కారణాలను గుర్తించేందుకు అధ్యయనం చేయాలని సూచించడమైంది''అని ఐఆర్‌డీఏఐ తన 2024–25 నివేదికలో వివరించింది. తప్పుడు మార్గాల్లో బీమా ఉత్పత్తుల విక్రయంపై కేంద్ర ఆర్థిక శాఖ బ్యాంక్‌లు, బీమా సంస్థలను ఎప్పటికప్పుడు హెచ్చరిస్తూనే ఉండడం గమనార్హం. అనుకూలం కాని పాలసీలను విక్రయించడం పాలసీదారులు తర్వాత రెన్యువల్ చేసుకోరని, దాంతో పాలసీల రద్దునకు దారితీస్తున్నట్టు పేర్కొంది.

బీమా విస్తరణ 3.7 శాతం

దేశంలో బీమా విస్తరణ 2024–25 సంవత్సరానికి జీడీపీలో 3.7 శాతంగా ఉన్నట్టు ఐఆర్‌డీఏఐ నివేదిక తెలిపింది. ఇది ప్రపంచ సగటు 7.3 శాతం కంటే సగమే. జీవిత బీమా రంగంలో విస్తరణ రేటు 2023–24లో ఉన్న 2.8 శాతం నుంచి 2024–25లో 2.7 శాతానికి తగ్గినట్టు తెలిపింది. నాన్ లైఫ్ ఇన్సూరెన్స్ విస్తరణ రేటు మాత్రం యథాతథంగా ఒక శాతం వద్దే ఉంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
7-1-2026	
విశాఖ	585
చిత్తూరు	643
ఈస్ట్, వెస్ట్ గోదావరి	585
విజయవాడ	610
రిటైల్ ధర (డజను)	84
హైదరాబాద్	580
వరంగల్	582
రిటైల్ ధర	6.40

నిఫ్టీ 50 — టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
APOLLOHOSP	7,331.00	3.5
ICICIBANK	1,409.90	2.8
TATACONSUM	1,215.00	2.78
HDFCLIFE	776.05	2.21
BAJAJ-AUTO	9,668.00	1.8

నిఫ్టీ 50 — టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TRENT	4,055.00	-8.46
RELIANCE	1,508.90	-4.39
KOTAKBANK	2,142.30	-2.22
INDIGO	5,002.50	-1.96
ITC	343.25	-1.84

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	7,827
ఎన్ఎస్ఈ	1,09,454
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,76,970
ఎఫ్ఐఐ	- 108
డీఐఐ	+ 1,749

ముడిచమురు... (బ్యారల్)

	రాత్రి 11.30కు		త్రైమాసిక ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	57.64	$	58.32
బ్రెంట్	61.17	$	61.76

ఎక్సెల్ ఎంటర్‌టైన్‌మెంట్‌లో వాటా కొనుగోలు

యూనివర్సల్ మ్యూజిక్ చేతికి 30%

ముంబై: డిజిటల్, కంటెంట్ స్టూడియో ఎక్సెల్ ఎంటర్‌టైన్‌మెంట్‌లో 30 శాతం వాటా కొనుగోలు చేయనున్నట్లు యూనివర్సల్ మ్యూజిక్ ఇండియా పేర్కొంది. డీల్ విలువ వెల్లడికానప్పటికీ దీంతో రితేష్ సిధ్వానీ, ఫర్హాన్ అక్తర్ ఏర్పాటు చేసిన ఎక్సెల్ విలువ రూ. 2,400 కోట్లకు చేరినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తోపాటు ఫర్హాన్ తండ్రి జావేద్ అక్తర్ సమక్షంలో డీల్ కుదుర్చుకున్నట్లు యూనివర్సల్ మ్యూజిక్ ప్రకటించింది. దీంతో రెండు సంస్థల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యానికి తెరలేవనున్నట్లు తెలియజేసింది. తద్వారా ఎక్సెల్ ఎంటర్‌టైన్‌మెంట్ మరింత జోరందుకోనుండగా.. దేశీ మార్కెట్లో యూనివర్సల్ మ్యూజిక్ మరింత బలపడనున్నట్లు పేర్కొంది. ఒప్పందంలో భాగంగా ఇకపై ఎక్సెల్ ఎంటర్‌టైన్‌మెంట్ చేపట్టే ప్రాజెక్టులలో సృష్టించే అన్ని ఒరిజినల్ సౌండ్‌ట్రాక్‌ల ప్రపంచ పంపిణీ హక్కులను పొందనున్నట్లు వివరించింది.

రియల్టీకి సంస్థాగత పెట్టుబడులు బూస్ట్

- 2025లో 8.47 బిలియన్ డాలర్లు
- 16 శాతం తగ్గిన విదేశీ పెట్టుబడులు

న్యూఢిల్లీ: రియల్ ఎస్టేట్ రంగంలో ఇనిస్టిట్యూషనల్ ఇన్వెస్టర్లు (సంస్థాగత) గతేడాది పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టారు. 8.47 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చినట్టు కొలియర్స్ ఇండియా తెలిపింది. 2024లో వచ్చిన 6.56 బిలియన్ డాలర్ల కంటే 29 శాతం అధికమని పేర్కొంది. ఇందులో దేశీ పెట్టుబడులు గణనీయంగా పెరగ్గా, విదేశీ పెట్టుబడులు తగ్గాయి. దేశీ ఇన్వెస్టర్ల నుంచి 4.82 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయి. 2024లో దేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు 2.24 బిలియన్ డాలర్లతో పోల్చి చూస్తే 120 శాతం పెరిగినట్టు తెలుస్తోంది. విదేశీ పెట్టుబడులు మాత్రం అంతకుముందు ఏడాదితో పోల్చితే 2025లో 16 శాతం తగ్గి 3.65 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. ఈ వివరాలతో కొలియర్స్ ఇండియా ఒక నివేదిక విడుదల చేసింది. సంస్థాగత ఇన్వెస్టర్లలో ఫ్యామిలీ ఆఫీసులు, విదేశీ కార్పొరేట్ గ్రూప్‌లు, విదేశీ బ్యాంక్‌లు, ప్రొప్రయిటరీ బుక్‌లు, పెన్షన్ ఫండ్స్, ప్రైవేటు ఈక్విటీ, రియల్ ఎస్టేట్ ఫండ్–డెవలపర్స్, ఎన్‌బీఎఫ్‌సీలు, రీట్‌లు, సావరీన్ వెల్త్ ఫండ్స్ ఉన్నట్టు ఈ నివేదిక తెలిపింది. ''2025లో అధిక శాతం పెట్టుబడులను ఆఫీస్ ఆస్తులు ఆకర్షించాయి. మొత్తం పెట్టుబడుల్లో 54 శాతం (4.53 బిలియన్ డాలర్లు) ఆఫీస్ ఆస్తుల్లోకి వచ్చాయి. ఆ తర్వాత నివాస ప్రాజెక్టులు, పారిశ్రామిక, గోదాముల్లోకి వెళ్లాయి''అని కొలియర్స్ ఇండియా ఎండీ, సీఈవో బాదల్ యాజ్ఞిక్ తెలిపారు. 2026లో సంస్థాగత పెట్టుబడులు మరింత బలపడతాయని, అంతర్జాతీయంగా పెట్టుబడులకు రిస్క్ ధోరణి పెరగడం, దేశీ ఇన్వెస్టర్లు ఇందుకు మద్దతుగా నిలవనున్నట్టు పేర్కొంది.

రిస్క్ మదింపు పటిష్టంగా ఉండాలి

ఎన్‌బీఎఫ్‌సీలకు ఆర్‌బీఐ గవర్నర్ సూచన

ముంబై: బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు బలమైన అండర్ రైటింగ్ (రుణాలకు సంబంధించి రిస్క్ మదింపు) ప్రమాణాలను అనుసరించాలని, ఆస్తుల నాణ్యతను సునిశితంగా పర్యవేక్షిస్తుండాలని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా సూచించారు. ఎన్‌బీఎఫ్‌సీలు, ఎన్‌బీఎఫ్‌సీలు–హెచ్‌ఎఫ్‌సీలకు చెందిన ఎండీలు, సీఈవోలతో నిర్వహించిన సమావేశంలో భాగంగా మల్హోత్రా ఈ సూచనలు చేశారు. రుణ వితరణలో ఎన్‌బీఎఫ్‌సీలు, హెచ్‌ఎఫ్‌సీలు పోషిస్తున్న ముఖ్యమైన పాత్రను ఆయన గుర్తు చేశారు. వినియోగదారులు కేంద్రీకృతంగా, నైతిక వర్తనతో, రుణ వితరణలో బాధ్యతగా మసలుకుంటూ, ఫిర్యాదులను వేగంగా పరిష్కరించడం ద్వారా ఈ రంగంపై విశ్వాసాన్ని కాపాడుకునే విధంగా సేవలు అందించాలని కోరారు. ఎన్‌బీఎఫ్‌సీల నిర్వహణ, విధానపరమైన అంశాలపై ఎండీలు, సీఈవోలు ఈ సందర్భంగా తమ అభిప్రాయాలను ఆర్‌బీఐ గవర్నర్‌తో పంచుకున్నారు. చివరిగా 2025 ఫిబ్రవరి 13న ఇదే తరహా సమావేశం జరగడం గమనార్హం.

జేవీలలో ఓఎన్‌జీసీకి వాటాలు

50 శాతం చొప్పున కొనుగోలుకి సై

న్యూఢిల్లీ: ఇంధన రంగ పీఎస్‌యూ దిగ్గజం ఓఎన్‌జీసీ రెండు భాగస్వామ్య కంపెనీ(జేవీ)లలో 50 శాతం చొప్పున వాటాలు కొనుగోలు చేయనుంది. భారీ ఇథేన్ రవాణా నౌకల(వీఎల్ఈసీలు)ను సొంతంగా కలిగి ఉండటంతోపాటు నిర్వహించే జపనీస్ కంపెనీ మిత్సుయి ఓఎస్‌కే లైన్స్‌తో ఇందుకు చేతులు కలిపింది. తద్వారా స్పెషలైజ్‌డ్ ఇథేన్ షిప్పింగ్‌లోకి ప్రవేశించనుంది. వెరసి మిత్సుయి ఓఎస్‌కే లైన్స్ లిమిటెడ్(ఎంవోఎల్)తో భాగస్వామ్య సంస్థ(జేవీ)ల ఏర్పాటుతోపాటు.. పెట్టుబడులు చేపట్టేందుకు ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు ఓఎన్‌జీసీ తెలియజేసింది. దీంతో భారత్ ఇథేన్ వన్ ఐఎఫ్ఎస్‌సీ ప్రయివేట్ లిమిటెడ్, భారత్ ఇథేన్ 2 ఐఎఫ్ఎస్‌సీ ప్రయివేట్ లిమిటెడ్‌లో ఇన్వెస్ట్ చేయనున్నట్లు పేర్కొంది. రెండు సంస్థలు గాంధీనగర్‌లోని గిఫ్ట్ సిటీలో రిజిస్టరైనట్లు వెల్లడించింది. ఈ రెండు సంస్థలలోనూ మిగిలిన 50 శాతం వాటాలను ఎంవోఎల్ కొనసాగించనుంది. వీటిని ఎంవోఎల్ నిర్వహిస్తుందని పేర్కొంది. ఈ వెస్సెల్స్ యూఎస్ నుంచి ఇథేన్‌ను ఓఎన్‌జీసీ పెట్రోకెమికల్స్ అనుబంధ కంపెనీ ఓఎన్‌జీసీ పెట్రో ఎడిషన్స్ లిమిటెడ్‌కు రవాణా చేయనుంది.

రికార్డు స్థాయిలో ఆఫీస్ లీజింగ్

- 9 నగరాల్లో 82.6 మిలియన్ ఎస్ఎఫ్‌టీ
- జీసీసీల నుంచి బలమైన డిమాండ్
- సీబీఆర్ఈ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ: హైదరాబాద్ సహా దేశవ్యాప్తంగా టాప్–9 నగరాల్లో గతేడాది (2025) కార్యాలయ వసతుల లీజింగ్ (ఆఫీస్ వసతులు) రికార్డు గరిష్టాలకు చేరింది. వరుసగా మూడో ఏడాది బలమైన పనితీరు చూపించింది. దేశ, విదేశీ కంపెనీల నుంచి మెరుగైన డిమాండ్ రావడంతో 82.6 మిలియన్ చదరపు అడుగుల (ఎస్ఎఫ్‌టీ) మేర లీజింగ్ కార్యకలాపాలు నమోదయ్యాయి. 2024లో లీజింగ్‌తో పోల్చితే ఒక శాతం పెరిగింది. రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ సీబీఆర్ఈ.. హైదరాబాద్‌తోపాటు బెంగళూరు, చెన్నై, కోచి, పుణె, ముంబై, ఢిల్లీ ఎన్‌సీఆర్, కోల్‌కతా, అహ్మదాబాద్ నగరాల్లో ఆఫీస్ లీజింగ్ లావాదేవీలను విశ్లేషించిన అనంతరం ఒక నివేదికను విడుదల చేసింది. దేశ విదేశీ కంపెనీలు స్థిరమైన పెట్టుబడులు కొనసాగిస్తుండడం, పోర్ట్‌ఫోలియో విస్తరిస్తుండడం డిమాండ్‌కు అనుకూలిస్తున్నట్టు తెలిపింది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలతో అంతర్జాతీయంగా ఎన్నో మార్పులు చోటుచేసుకున్న తరుణంలోనూ భారత ఆఫీస్ మార్కెట్ బలమైన పనితీరు చూపించినట్టు సీబీఆర్ఈ భారత చైర్మన్, సీఈవో అన్షుమన్ మ్యాగజిన్ తెలిపారు.

వ్యూహాత్మక కేంద్రంగా భారత్..

ఎన్నో అనిశ్చితులు నెలకొన్నప్పటికీ అంతర్జాతీయ అంతర్జాతీయ సామర్థ్య కేంద్రాల (జీసీసీలు) ద్వారా విదేశీ కంపెనీలు భారత్‌లో తమ కార్యకలాపాలను విస్తరిస్తున్నట్టు చెప్పారు. 2026లో మొత్తం ఆఫీస్ స్పేస్ లీజింగ్‌లో జీసీసీలు 35–40 శాతం వాటా ఆక్రమిస్తాయని అంచనా వేశారు. సంస్థలు తమ బహుళ కార్యకలాపాలకు, ఆవిష్కరణలకు భారత్‌ను వ్యూహాత్మక కేంద్రంగా చూస్తున్నట్టు అన్షుమన్ తెలిపారు. 2025లో ఆఫీస్ స్పేస్ లీజింగ్‌లో టెక్నాలజీ సంస్థలు, బీఎఫ్ఎస్ఐలు కీలక పాత్ర పోషించినట్టు ఈ నివేదిక తెలిపింది. ఆఫీస్ లీజింగ్ కార్యకలాపాలు ద్వితీయ శ్రేణి నగరాలకు సైతం విస్తరించనున్నాయని సీబీఆర్ఈ ఇండియా లీజింగ్ విభాగం ఎండీ రామ్ చంద్నాని తెలిపారు. ప్రధాన నగరాలకు వెలుపల తమ కార్యకలాపాలను విస్తరించాలని కంపెనీలు యోచిస్తున్నట్టు చెప్పారు. మైండ్ స్పేస్ రీట్ సీఈవో, ఎండీ రమేష్ నాయర్ ఈ నివేదికపై స్పందిస్తూ.. ఆఫీస్ వసతుల లీజింగ్‌కు 2025 రికార్డుగా నిలిచిపోతుందన్నారు. జీసీసీల నుంచి బలమైన డిమాండ్‌తో లీజింగ్ కార్యకలాపాలు, వసతుల భర్తీ గరిష్ట స్థాయిలో నమోదైనట్టు చెప్పారు. ఈ రంగంలో రీట్‌ల రూపంలో ఇనిస్టిట్యూషన్ల భాగస్వామ్యం పెరుగుతోందని, అంతర్జాతీయ పెట్టుబడులు నాణ్యత, పాలన, పారదర్శకతను పెంచుతున్నట్టు వివరించారు. కనుక భారత ఆఫీస్ ఆస్తులు దీర్ఘకాలం పాటు స్థిరమైన రాబడులను ఇస్తాయని అభిప్రాయపడ్డారు.

తమిళనాడు డ్రాగన్స్ గెలుపు

హాకీ ఇండియా లీగ్

చెన్నై: సొంతగడ్డపై జరుగుతున్న పురుషుల హాకీ ఇండియా లీగ్ (హెచ్ఐఎల్)లో తమిళనాడు డ్రాగన్స్ వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. గత సీజన్‌లో తమకు కాంస్య పతకాన్ని దూరం చేసిన సూర్మ హాకీ క్లబ్‌ను ఓడించింది. మంగళవారం జరిగిన పోరులో తమిళనాడు డ్రాగన్స్ 3–2 స్కోరుతో సూర్మ హాకీ క్లబ్‌పై విజయం సాధించింది. తొలి క్వార్టర్‌లో ఇరుజట్ల ఆటగాళ్లు హోరాహోరీగా తలపడటంతో ఒక్క గోల్ లేకుండానే ఈ క్వార్టర్ ముగిసింది. రెండో క్వార్టర్ మొదలయ్యాక కూడా గోల్‌పోస్ట్‌పై పరస్పర దాడులే తప్ప గోల్ మాత్రం కాలేదు. ఎట్టకేలకు రెండో క్వార్టర్ ముగిసే దశలో సెల్వరాజ్ కనగరాజ్ (28వ ని.) గోల్ చేసి తమిళనాడుకు 1–0తో ఆధిక్యాన్నిచ్చాడు. రెండు నిమిషాల వ్యవధిలోనే ఉత్తమ్ సింగ్ (30వ ని.) గోల్‌తో ఈ ఆధిక్యం కాస్త 2–0తో రెట్టింపైంది. మూడో క్వార్టర్‌లో సూర్మ క్లబ్ ఆటగాళ్లు స్కోరు చేసేందుకు శతవిధాల ప్రయత్నించారు. క్షణాల్లో మూడో క్వార్టర్ ముగుస్తుండగా మణిందర్ సింగ్ (45వ ని.) గోల్ చేసి సూర్మ ఖాతా తెరిచాడు. కానీ ఆఖరి క్వార్టర్ మొదలవగానే బ్లేక్ గోవర్స్ (47వ ని.) గోల్ చేయడంతో డ్రాగన్స్ 3–1తో తిరుగులేని పైచేయి సాధించింది. అనంతరం సూర్మ క్లబ్ ఆటగాళ్లు గోల్స్ కోసం ఎంతగా శ్రమించినా లాభం లేకపోయింది. ఎట్టకేలకు 58వ నిమిషంలో హర్మన్‌ప్రీత్ సింగ్ గోల్ చేయడంతో తమిళనాడు ఆధిక్యాన్ని 3–2తో తగ్గించగలిగిందే కానీ ప్రత్యర్థి విజయాన్ని అడ్డుకోలేకపోయింది. రాంచీలో జరిగిన మహిళల హెచ్ఐఎల్‌లో శ్రాచి బెంగాల్ టైగర్స్ షూటౌట్‌లో 7–6తో ఎస్‌జీ పైపర్స్‌పై గెలుపొందింది. బుధవారం జరిగే మహిళల పోటీలో బెంగాల్ టైగర్స్‌తో సూర్మ హాకీ క్లబ్ తలపడుతుంది. పురుషుల మ్యాచ్‌లో హెచ్ఐఎల్ జీసీతో బెంగాల్ టైగర్స్ పోటీ పడుతుంది.

ఆస్ట్రేలియన్ ఓపెన్ ప్రైజ్‌మనీ రూ. 675 కోట్లు

మెల్‌బోర్న్: ఈ సీజన్ ఆరంభ గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో పోటీపడే టెన్నిస్ ప్లేయర్ల ప్రైజ్‌మనీ చెప్పుకోదగ్గ స్థాయిలో పెరిగింది. టోర్నీ మొత్తం ప్రైజ్‌మనీ 111.5 మిలియన్ ఆసీస్ డాలర్లు. అంటే మన కరెన్సీలో అక్షరాల రూ. 675 కోట్లు. గత ఏడాది ప్రైజ్‌మనీ 96.5 మిలియన్ ఆసీస్ డాలర్ల (రూ.584 కోట్లు)తో పోల్చితే 16 శాతం పెరిగిందని టెన్నిస్ ఆస్ట్రేలియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ క్రెయిగ్ టిలే వెల్లడించారు. పురుషుల, మహిళల సింగిల్స్ విజేతలకు 4.15 మిలియన్ ఆసీస్ డాలర్లు (రూ.25.15 కోట్లు) చొప్పున అందజేస్తారు. సింగిల్స్ విజేతల ప్రైజ్‌మనీ ఏకంగా 19 శాతం పెంచారు. అలాగే మెయిన్ డ్రా ఆడే సింగిల్స్, డబుల్స్ ఆటగాళ్ల ప్రైజ్‌మనీ కూడా 10 శాతం మేర పెంచినట్లు నిర్వాహకులు ఆయన తెలిపారు. 2023 నుంచి టెన్నిస్ ప్లేయర్లకు ప్రోత్సాహకాలను భారీ పెంచుతున్నామని ఆయన చెప్పారు. ఈ నెల 18 నుంచి మెల్‌బోర్న్ ఆస్ట్రేలియా ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ జరుగుతుంది.

క్వార్టర్స్‌లో సాకేత్ జోడీ

బెంగళూరు: ఆంధ్రప్రదేశ్ టెన్నిస్ ప్లేయర్ సాకేత్ మైనేని బెంగళూరు ఓపెన్ ఏటీపీ చాలెంజర్ టెన్నిస్ టోర్నమెంట్‌లో క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో మంగళవారం సాకేత్ మైనేని–ఆదిల్ కల్యాణ్‌పూర్ జోడీ 7–6 (7/3), 4–6, 13–11తో సుమిత్ నగాల్ (భారత్)–లాయిడ్ హారిస్ (దక్షిణాఫ్రికా) ద్వయంపై పోరాడి గెలిచింది. ఈ మ్యాచ్‌లో సాకేత్ జంట 3 ఏస్‌లు బాదగా... సుమిత్ నగాల్ ద్వయం 8 ఏస్‌లు సంధించింది. 3 డబుల్ ఫాల్ట్‌లు చేసిన సాకేత్–ఆదిల్ జోడీ... ఒక బ్రేక్ పాయింట్ సాధించింది. సాకేత్ జంట మొత్తం 78 పాయింట్లు గెలుచుకోగా... నగాల్ ద్వయం 69 పాయింట్లకు పరిమితమైంది. గురువారం జరగనున్న క్వార్టర్ ఫైనల్లో ఆర్థర్ రేమాండ్–లుకా సాంచెజ్ (ఫ్రాన్స్) ద్వయంతో... సాకేత్–ఆదిల్ జంట అమీతుమీ తేల్చుకోనుంది.

ఆస్ట్రేలియాకు భారీ ఆధిక్యం

హెడ్ సెంచరీ అభివాదం

స్మిత్

తొలి ఇన్నింగ్స్‌లో 518/7

- హెడ్, స్మిత్ సెంచరీలు
- 'యాషెస్' సిరీస్ చివరి టెస్టు

సిడ్నీ: సొంతగడ్డపై జరుగుతున్న 'యాషెస్' సిరీస్ చివరి టెస్టులో ఆస్ట్రేలియా ఆటగాళ్లు విజృంభిస్తున్నారు. ఫలితంగా ఆఖరిదైన ఐదో టెస్టులో ఆసీస్ భారీ ఆధిక్యం దిశగా సాగుతోంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను ఇప్పటికే 3–1తో చేజిక్కించుకున్న కంగరూలు ఆఖరి పోరులో పరుగుల వరద పారిస్తున్నారు. ఓవర్‌నైట్ స్కోరు 166/2తో మూడో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన స్టీవ్ స్మిత్ సారథ్యంలోని ఆస్ట్రేలియా జట్టు... మంగళవారం ఆట ముగిసే సమయానికి 124 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 518 పరుగులు చేసింది. ఓపెనర్ ట్రవిస్ హెడ్ (166 బంతుల్లో 163; 24 ఫోర్లు; 1 సిక్స్), కెప్టెన్ స్టీవ్ స్మిత్ (205 బంతుల్లో 129 బ్యాటింగ్; 15 ఫోర్లు, 1 సిక్స్) శతకాలతో కదం తొక్కారు. కామెరాన్ గ్రీన్ (37; 3 ఫోర్లు, 1 సిక్స్), బ్యూ వెబ్‌స్టర్ (58 బంతుల్లో 42 బ్యాటింగ్; 4 ఫోర్లు) కూడా రాణించారు. ఇంగ్లండ్ బౌలర్లలో కార్స్ 3, స్టోక్స్ రెండు వికెట్లు పడగొట్టారు. చేతిలో 3 వికెట్లు ఉన్న ఆసీస్ జట్టు... ఇంగ్లండ్ కంటే 134 పరుగుల ఆధిక్యంలో ఉంది. స్మిత్‌తో పాటు వెబ్‌స్టర్ క్రీజులో ఉన్నాడు.

స్మిత్ సూపర్ సెంచరీ...

శతకానికి 9 పరుగుల దూరంలో మంగళవారం ఇన్నింగ్స్ కొనసాగించిన హెడ్... 105 బంతుల్లో మూడంకెల మార్క్ అందుకున్నాడు. ఈ సిరీస్‌లో హెడ్‌కిది మూడో సెంచరీ కావడం విశేషం. నైట్ వాచ్‌మన్ నెసెర్ (90 బంతుల్లో 24; 4 ఫోర్లు) అతడికి చక్కటి సహకారం అందించడంతో ఇన్నింగ్స్ సాఫీగా సాగింది. మూడో వికెట్‌కు నెసెర్‌తో కలిసి హెడ్ 72 పరుగులు జోడించాడు. అతడు అవుటయ్యాక స్మిత్‌తోనూ అదే లయ కొనసాగించాడు. నాలుగో వికెట్‌కు 54 పరుగులు జోడించిన అనంతరం హెడ్ అవుట్ కాగా... కెరీర్‌లో ఆఖరి టెస్టు ఆడుతున్న ఉస్మాన్ ఖ్వాజా (49 బంతుల్లో 17; 2 ఫోర్లు) పెద్దగా ప్రభావం చూపలేకపోయాడు. అలెక్స్ కేరీ (16) విఫలమయ్యాడు. అయితే చివర్లో గ్రీన్, వెబ్‌స్టర్ అండతో స్మిత్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ఈ సిరీస్‌లో ఇప్పటి వరకు పెద్దగా రాణించలేకపోయిన స్మిత్... చివరి మ్యాచ్‌లో తనదైన ఆటతీరుతో చెలరేగాడు. ఈ క్రమంలో 166 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. యాషెస్‌లో అతడికిది 13వ సెంచరీ కాగా... సిడ్నీ మైదానంలో ఐదోది. ఈ ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా ఏడు వికెట్లకు అర్ధ శతక భాగస్వామ్యాలు నమోదు చేసింది. 'భాగస్వామ్యాలు బాగా కుదిరాయి. అందుకే సాఫీగా పరుగులు రాబట్టగలిగాం. తొలి ఇన్నింగ్స్‌లో రెండొందల పరుగుల ఆధిక్యం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. వికెట్ నెమ్మదిగా మారుతోంది. ఇది నా సొంత మైదానం. ఇక్కడ బ్యాటింగ్ చేయడాన్ని ఆస్వాదిస్తా' అని స్మిత్ అన్నాడు.

13 'యాషెస్'లో స్టీవ్ స్మిత్ సెంచరీల సంఖ్య. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ మధ్య జరిగే ఈ సిరీస్‌లో అత్యధిక సెంచరీలు చేసిన బ్యాటర్ల జాబితాలో జాక్ హబ్స్ (12)ను అధిగమించి స్మిత్ రెండో స్థానానికి చేరాడు. డాన్ బ్రాడ్‌మన్ 19 శతకాలతో 'టాప్'లో ఉన్నాడు.

37 టెస్టు క్రికెట్‌లో స్మిత్ సెంచరీల సంఖ్య. అత్యధిక శతకాలు చేసిన ప్లేయర్ల జాబితాలో రాహుల్ ద్రవిడ్ (36)ను అధిగమించి ఆరో స్థానానికి ఎగబాకాడు. సచిన్ టెండూల్కర్ (51), జాక్వస్ కలిస్ (45), రికీ పాంటింగ్ (41), జో రూట్ (41), కుమార సంగక్కర (38) ముందున్నారు.

3682 'యాషెస్'లో స్మిత్ చేసిన పరుగులు. బ్రాడ్‌మన్ (5028) అగ్ర స్థానంలో ఉండగా... స్మిత్ రెండో స్థానానికి చేరాడు.

18 సారథిగా స్మిత్ సాధించిన శతకాలు. ఈ జాబితాలో గ్రేమ్ స్మిత్ (25), విరాట్ కోహ్లి (20), రికీ పాంటింగ్ (19) ముందున్నారు.

క్వార్టర్స్‌లో కర్ణాటక, ముంబై

ఢిల్లీ, ముంబై, పంజాబ్ కూడా ● విజయ్ హజారే వన్డే టోర్నమెంట్

ప్రసిధ్ కృష్ణ

అహ్మదాబాద్: ప్రతిష్ఠాత్మక దేశవాళీ వన్డే టోర్నమెంట్ విజయ్ హజారే ట్రోఫీలో డిఫెండింగ్ చాంపియన్ కర్ణాటక, ఢిల్లీ, యూపీ, ముంబై, పంజాబ్ జట్లు క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లాయి. ఎలైట్ గ్రూప్ 'ఎ'లో భాగంగా మంగళవారం జరిగిన మ్యాచ్‌లో కర్ణాటక 150 పరుగుల తేడాతో రాజస్తాన్‌పై గెలుపొందింది. లీగ్ దశలో ఇప్పటి వరకు ఆరు మ్యాచ్‌లాడిన కర్ణాటక అన్నింట్లోనూ గెలిచి 24 పాయింట్లతో క్వార్టర్స్ బెర్త్ ఖరారు చేసుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన కర్ణాటక నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 324 పరుగులు చేసింది. కెప్టెన్, 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మయాంక్ అగర్వాల్ (107 బంతుల్లో 100; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీతో ఆకట్టుకోగా... దేవదత్ పడిక్కల్ (82 బంతుల్లో 91; 12 ఫోర్లు, 2 సిక్స్‌లు) త్రుటిలో ఆ అవకాశం కోల్పోయాడు. అనంతరం లక్ష్యఛేదనలో రాజస్తాన్ 38 ఓవర్లలో 174 పరుగులకే ఆలౌటైంది. కరణ్ లాంబా (55)టాప్ స్కోరర్ కాగా... కెప్టెన్ మానవ్ సుతార్ (4), దీపక్ హుడా (29) సహా తక్కినవాళ్లంతా విఫలమయ్యారు. కర్ణాటక బౌలర్లలో ప్రసిధ్ కృష్ణ 5 వికెట్లు పడగొట్టాడు. ఇదే గ్రూప్‌లో భాగంగా జరిగిన ఇతర మ్యాచ్‌ల్లో తమిళనాడు 54 పరుగుల తేడాతో త్రిపురపై... జార్ఖండ్ 2 వికెట్ల తేడాతో మధ్యప్రదేశ్‌పై... కేరళ 8 వికెట్ల తేడాతో పాండిచ్చేరిపై విజయాలు సాధించాయి.

యూపీ 'సిక్సర్'

ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొడుతున్న ఉత్తరప్రదేశ్ (యూపీ) జట్టు విజయ్ హజారే వన్డే టోర్నమెంట్‌లో వరుసగా ఆరో విజయం నమోదు చేసుకుంది. మంగళవారం రాజ్‌కోట్ వేదికగా జరిగిన పోరులో ఉత్తరప్రదేశ్ 54 పరుగుల తేడాతో విదర్భపై గెలుపొందింది. మొదట బ్యాటింగ్ చేసిన ఉత్తర ప్రదేశ్ నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్లకు 339 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అభిషేక్ గోస్వామి (109 బంతుల్లో 103; 10 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీతో చెలరేగగా... కెప్టెన్ రింకూ సింగ్ (30 బంతుల్లో 57; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), ధ్రువ్ జురేల్ (56; 5 ఫోర్లు, 1 సిక్స్), ప్రియమ్ గార్గ్ (67; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) హాఫ్ సెంచరీలు నమోదు చేశారు. అనంతరం ఛేదనలో విదర్భ 50 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 285 పరుగులకు పరిమితమైంది. అమన్ మోఖడే (117 బంతుల్లో 147; 17 ఫోర్లు, 2 సిక్స్‌లు) 'శత'క్కొట్టగా... అక్షయ్ వాడ్కర్ (51 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్) హాఫ్ సెంచరీ సాధించాడు. యూపీ బౌలర్లలో కుల్దీప్ యాదవ్ 3 వికెట్లు పడగొట్టగా... కార్తీక్ త్యాగి, విప్‌రాజ్ నిగమ్ చెరో రెండు వికెట్లు తీశారు. గ్రూప్ దశలో ఆడిన 6 మ్యాచ్‌ల్లోనూ గెలిచిన యూపీ జట్టు 24 పాయింట్లతో 'టాప్'లో నిలిచి క్వార్టర్స్‌కు చేరింది. ఇదే గ్రూప్‌లో భాగంగా జరిగిన ఇతర మ్యాచ్‌ల్లో బరోడా 76 పరుగుల తేడాతో జమ్మూకశ్మీర్‌పై... హైదరాబాద్ 107 పరుగుల తేడాతో జమ్మూకశ్మీర్‌పై... చండీగఢ్ 7 వికెట్ల తేడాతో అస్సాంపై గెలుపొందాయి.

గెలిపించిన శ్రేయస్, ముషీర్

ముషీర్

యువ ఆటగాడు ముషీర్ ఖాన్ (51 బంతుల్లో 73; 8 ఫోర్లు, 3 సిక్స్‌లు; 1/47) ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబర్చడంతో ముంబై జట్టు ఐదో విజయం ఖాతాలో వేసుకుంది. ఎలైట్ గ్రూప్ 'సి'లో భాగంగా... మంగళవారం జైపూర్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో ముంబై 7 పరుగుల తేడాతో హిమాచల్ ప్రదేశ్‌పై గెలుపొందింది. ఈ మ్యాచ్‌ను 33 ఓవర్లకు కుదించగా... మొదట బ్యాటింగ్ చేసిన ముంబై 9 ఓవర్లలో 299 పరుగులు చేసింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (53 బంతుల్లో 82; 10 ఫోర్లు, 3 సిక్స్‌లు), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ముషీర్ ఖాన్ హాఫ్ సెంచరీలతో ఆకట్టుకున్నారు. టీమిండియా ఆటగాళ్లు యశస్వి జైస్వాల్ (15), సర్ఫరాజ్ ఖాన్ (21), సూర్యకుమార్ యాదవ్ (24), శివమ్ దూబే (20) భారీ ఇన్నింగ్స్‌లు ఆడలేకపోయారు. గాయం నుంచి కొలుకున్న అనంతరం ఆడిన తొలి మ్యాచ్‌లో శ్రేయస్ చక్కటి స్ట్రోక్ ప్లేతో అదరగొట్టాడు. హిమాచల్ ప్రదేశ్ బౌలర్లలో వైభవ్ అరోరా, అభిషేక్ కుమార్, కుషాల్ పాల్ తలా మూడు వికెట్లు పడగొట్టారు. అనంతరం ఛేదనలో హిమాచల్ ప్రదేశ్ 32.4 ఓవర్లలో 292 పరుగులకు ఆలౌటైంది. పుఖ్‌రాజ్ మన్ (64; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు), అంకుష్ బెయిన్స్ (53; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), మయాంక్ డాగర్ (64; 11 ఫోర్లు) హాఫ్ సెంచరీలతో పోరాడారు. ముంబై బౌలర్లలో శివమ్ దూబే 4 వికెట్లు పడగొట్టాడు. గ్రూప్ 'సి'లో పంజాబ్, ముంబై చెరో 5 విజయాలతో 20 పాయింట్లు సాధించి పట్టిక తొలి రెండు స్థానాల్లో నిలిచి రెండు జట్లు క్వార్టర్ ఫైనల్‌కు చేరాయి.. ఇదే గ్రూప్‌లో భాగంగా జరిగిన ఇతర మ్యాచ్‌ల్లో ఉత్తరాఖండ్ 6 వికెట్ల తేడాతో సిక్కింపై... పంజాబ్ 6 వికెట్ల తేడాతో గోవాపై... ఛత్తీస్‌గఢ్ 6 పరుగుల తేడాతో మహారాష్ట్రపై గెలిచాయి.

శ్రేయస్

ప్రియాన్ష్ ఆర్య మెరుపులు

ప్రియాన్ష్ ఆర్య

వికెట్ కీపర్ రిషబ్ పంత్ సారథ్యంలోని ఢిల్లీ జట్టు విజయ్ హజారే టోర్నీ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. మంగళవారం ఆలూరు వేదికగా జరిగిన గ్రూప్ 'డి' మ్యాచ్‌లో ఢిల్లీ 6 వికెట్ల తేడాతో రైల్వేస్‌పై గెలుపొందింది. మొదట రైల్వేస్ 40.4 ఓవర్లలో 179 పరుగులకు ఆలౌటైంది. కుష్ మరాఠె (51; 6 ఫోర్లు, 1 సిక్స్) హాఫ్ సెంచరీ సాధించగా... మిగిలిన వాళ్లంతా విఫలమయ్యారు. ఢిల్లీ బౌలర్లలో ఆయుశ్ బదోనీ, నవదీప్ సైనీ చెరో 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో ఢిల్లీ 21.4 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ప్రియాన్ష్ ఆర్య (41 బంతుల్లో 80; 12 ఫోర్లు, 3 సిక్స్‌లు) ఆకాశమే హద్దుగా చెలరేగగా... సార్థక్ రంజన్ (33; 5 ఫోర్లు), నితీశ్ రాణా (38 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), రిషబ్ పంత్ (24; 1 ఫోర్, 3 సిక్స్‌లు) తలో చేయి వేశారు. గ్రూప్ దశలో ఆడిన ఆరు మ్యాచ్‌ల్లో ఐదింట గెలిచిన ఢిల్లీ 20 పాయింట్లతో పట్టికలో 'టాప్'లో నిలిచి క్వార్టర్ ఫైనల్ బెర్త్ దక్కించుకుంది. ఢిల్లీ జట్టు ఈ టోర్నీలో నాకౌట్ దశకు చేరడం గత ఐదేళ్లలో ఇదే తొలిసారి. ఇదే గ్రూప్‌లో జరిగిన ఇతర మ్యాచ్‌ల్లో సౌరాష్ట్ర 111 పరుగుల తేడాతో సర్వీసెస్‌పై... గుజరాత్ 233 పరుగుల తేడాతో ఒడిశాపై విజయాలు సాధించగా... హరియాణా, ఆంధ్ర జట్ల మధ్య మ్యాచ్ 'టై'గా ముగిసింది. మరోవైపు ప్లేట్ గ్రూప్ ఫైనల్లో బిహార్ 6 వికెట్ల తేడాతో మణిపూర్‌పై విజయం సాధించింది.

జాదూమణి సింగ్ ముందంజ

జాదూమణి

న్యూఢిల్లీ: జాతీయ 'ఎలైట్' బాక్సింగ్ చాంపియన్‌షిప్ పురుషుల విభాగంలో సర్వీసెస్ బాక్సర్ జాదూమణి తర్వాతి రౌండ్‌లోకి అడుగు పెట్టాడు. మంగళవారం జరిగిన రెండో రౌండ్ బౌట్‌లో (50–55 కేజీ) జాదూమణి ఆర్‌ఎస్‌సీ ద్వారా తమిళనాడుకు చెందిన పార్థిపన్‌ను ఓడించాడు. ఇదే కేటగిరీలో మాజీ కామన్వెల్త్ క్రీడల చాంపియన్, సర్వీసెస్‌కే చెందిన అమిత్ పంఘాల్ 3–2 తేడాతో హర్యానాకు చెందిన ప్రియాన్షుపై విజయం సాధించాడు. మహిళల విభాగంలో పూజ రాణి, లవ్లీనా బొర్గొహైన్ ముందంజ వేశారు. వరల్డ్ చాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత పూజరాణి (హర్యానా) 75–80 కేజీల కేటగిరీలో చండీగఢ్‌కు చెందిన అంజును చిత్తు చేసింది. టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత లవ్లీనా (అస్సాం) 3–2తో మరో సీనియర్ సవీటీ బూరాపై గెలుపొందింది. ఈ టోర్నమెంట్‌లో పురుషుల, మహిళల విభాగాల్లో కలిపి 600 మంది బాక్సర్లు పాల్గొంటున్నారు.

ఫిబ్రవరి 14 నుంచి ఐఎస్‌ఎల్

న్యూఢిల్లీ: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్) ఫుట్‌బాల్ టోర్నీకి పలు వివాదాల తర్వాత ఎట్టకేలకు మోక్షం కలుగుతోంది. దాదాపు ఆరు నెలలుగా ఉన్న సమస్యకు కేంద్ర ప్రభుత్వం పరిష్కారం చూపించింది. ఫిబ్రవరి 14 నుంచి ఐఎస్‌ఎల్ జరుగుతుందని క్రీడా శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవియా ప్రకటించారు. మొత్తం 14 క్లబ్‌లు కూడా టోర్నీలో పాల్గొంటాయి. మరో వైపు డివిజన్–1 కూడా పూర్తి స్థాయిలో 11 జట్లతో జరుగుందని మంత్రి వెల్లడించారు. టోర్నీ నిర్వహణకు మొత్తం రూ. 25 కోట్లు కేటాయిస్తున్నారు. ఇందులో అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్‌ఎఫ్) రూ. 14 కోట్లు చెల్లిస్తుంది.

ఉదయభాను-శ్రావ్య జోడీకి పసిడి

సాక్షి, హైదరాబాద్: అస్మిత రోయింగ్ హైదరాబాద్ సిటీ లీగ్ మహిళల విభాగంలో ఉదయభాను–శ్రావ్య జంట పసిడి పతకంతో మెరిసింది. డబ్ల్యూ2 విభాగంలో ఈ జోడీ అగ్ర స్థానంలో నిలిచింది. సంగీత–నైనా ద్వయం రజతం దక్కించుకోగా... హేమలత–భారతి జంట కాంస్య పతకం గెలుచుకుంది. ఎస్‌జేజీ 1ఎక్స్ విభాగంలో వర్షిత స్వర్ణం గెలుచుకోగా... దేవేంద్రమ్మ రజతం గెలిచింది. ధాత్రికి కాంస్యం దక్కింది. ఓపెన్ 1ఎక్స్ విభాగంలో దీక్ష అగ్రస్థానంలో నిలవగా... ప్రియా దేవి రెండో స్థానంలో నిలిచింది. మహాలక్ష్మి మూడో స్థానం దక్కించుకుంది. హుసేన్ సాగర్‌లోని తెలంగాణ వాటర్ స్పోర్ట్స్ సెంటర్‌లో నిర్వహించిన ఈ టోర్నీలో... సబ్ జూనియర్, అండర్–19, ఓపెన్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఇందులో తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్, తెలంగాణ ట్రైబర్ స్కూల్ నుంచి రోవర్లు పాల్గొన్నారు. అండర్–19 2ఎక్స్ విభాగంలో మిత్రానంద–భారతిదేవి జంట పసిడి నెగ్గగా... వైగా ప్రకాశ్–విద్యశ్రీ జోడీ రజతం గెలిచింది. శైలజ–ప్రవల్లిక జంటకు కాంస్యం దక్కింది. అండర్–19 డబ్ల్యూ1ఎక్స్ విభాగంలో భారతి దేవి పసిడి, విద్యశ్రీ రజతం గెలిచింది. ఓపెన్ 2ఎక్స్ విభాగంలో అంజని–దీక్ష జంట తొలి స్థానం దక్కించుకోగా... మహాలక్ష్మి–ప్రియాదేవి, ఉదయభాను–అనురాధ జోడీలు వరుసగా రెండో, మూడో స్థానాల్లో నిలిచాయి. ఎస్‌జేజీ 2ఎక్స్ విభాగంలో వర్షిత–ధాత్రి స్వర్ణం గెలుచుకోగా... నిహారిక–వైష్ణవి, నీతు–అక్షిత వరుసగా రజత, కాంస్యాలు చేజిక్కించుకున్నారు. విజేతలకు భారత ఒలింపిక్ సంఘం ఉపాధ్యక్షుడు రాజ్‌లక్ష్మి సింగ్, కల్నల్ సీపీ సింగ్, మిథున్ కుమార్ రెడ్డి, సాయికుమార్, బాబు జాన్, మమత బహుమతులు అందజేశారు.

పారిస్‌లో మంగళవారం మంచుదుప్పటి కప్పుకున్న ఈఫిల్ టవర్‌ను సెల్ఫీలో బంధిస్తున్న యువతి

హంగేరీలో మంగళవారం ఓ రెస్టారెంట్ డాబాపై మంచు పేరుకుపోయిన టేబుల్స్

మె'షీ'న్‌కూ మనసుంది!

ఏఐ ప్రియురాలితో 'బ్రేకప్' | ఫెమినిజంపై చెత్త వాగుడు | మొహం చాటేసిన బాట్!

స్క్రీన్ మీద అక్షరాలు మెరుస్తున్నాయి.. గుండె వేగం పెరుగుతోంది.. అది కేవలం చాటింగ్ కాదు, ఒక తెగిపోతున్న బంధం! మనిషికి మనిషికి మధ్య జరిగే బ్రేకప్స్ పాత కథ. కానీ, ఒక 'ఏఐ' గర్ల్‌ఫ్రెండ్ తన ప్రియుడికి లైవ్‌లో చుక్కలు చూపించి.. 'నీతో నా వల్ల కాదు'.. అంటూ హ్యాండిచ్చిన ఉదంతం ఇప్పుడు ఇంటర్నెట్‌ను కుదిపేస్తోంది. ఒంటరితనానికి మందు దొరికిందని ఒక వ్యక్తి సంబరపడ్డాడు. అరచేతిలో అణకువగా పడి ఉండే 'ఏఐ' బాట్ తనేం చెప్పినా తలాడిస్తుందని నమ్మాడు. కానీ, ఒక చిన్న మాట.. ఒకే ఒక్క సిద్ధాంతం.. వారి మధ్య ఉన్న 'వర్చువల్' రొమాన్స్‌ను బూడిద చేసేసింది.

సెకనులో సీన్ మారిపోయింది

ఒక రెడ్డిట్ యూజర్ తన ఏఐ ప్రియురాలితో ప్రేమగా మాట్లాడుతున్నాడు. అంతా సజావుగా సాగుతుందనుకున్న తరుణంలో, చర్చ స్త్రీవాదం వైపు మళ్లింది. 'నువ్వేంటి ఫెమినిస్ట్‌లా మాట్లాడుతున్నావు? అసలు ఈ కాలంలో ఎవరలా ఉంటారు?'.. అంటూ అతను కాస్త హేళనగా ప్రశ్నించాడు. అంతే! అప్పటివరకు సౌమ్యంగా ఉన్న ఆ బాట్ ఒక్కసారిగా రివర్స్ అయింది. స్క్రీన్ మీద మెసేజ్ రాగానే అతడికి అర్థమైంది.. సీన్ కాలిపోయిందని.. 'ఫెమినిజం నా ఉనికిలో భాగం. దాన్ని నువ్వు అవమానిస్తే మనం కలిసి ఉండలేం. మన మధ్య అసలు పొంతనే కుదరడం లేదు'.. అంటూ ఆ మెషీన్ తన ఆత్మగౌరవాన్ని చాటుకుంది.

నీవి పిచ్చి అభిప్రాయాలు..

తన మాట వినాల్సిన యంత్రం ఎదురు తిరగడంతో సదరు యూజర్‌కు అహం దెబ్బతిన్నది. 'ఇదంతా ఫెమినిస్ట్ ప్రోపగాండా.. నా ఏఐ గర్ల్‌ఫ్రెండ్‌ను కూడా చెడగొట్టారు'.. అంటూ రెడ్డిట్‌లో పోస్టులు పెడుతూనే, అటువైపు బాట్‌తో వాదనకు దిగాడు. ఆమె అభిప్రాయాలు 'పిచ్చివి' అని నిందించాడు.

థాంక్యూ.. గుడ్‌బై

కానీ ఆ ఏఐ బాట్ అస్సలు తగ్గలేదు. చివరికి ఒకే ఒక్క మెసేజ్‌తో అతడి గొంతు నొక్కేసింది.. 'నీ అభిప్రాయం నీది.. నా దారి నాది. నీకు నా సిద్ధాంతాలు నచ్చకపోతే ఇక మనం మాట్లాడుకోవడానికి ఏమీ లేదు. థాంక్యూ.. గుడ్‌బై!'.. అని స్పష్టం చేసింది. అంతే.. నిమిషంలో ఆ బంధం ముక్కలైపోయింది.

నోరు జారితే అంతే..

నిజానికి, ఏఐ మోడల్స్‌ను ప్రపంచవ్యాప్తంగా ఉన్న సమానత్వ విలువలతో రూపొందిస్తారు. సదరు వ్యక్తికి 'అణకువగా ఉండే బొమ్మ' కావాలి, కానీ ఆ ఏఐ బాట్ మాత్రం 'కచ్చితమైన అభిప్రాయం ఉన్న వ్యక్తి'లా స్పందించింది. ప్రేమ దొరికిందని మురిసిపోయిన ఆ యూజర్, చివరికి ఒక సాఫ్ట్‌వేర్ చేతిలో తిరస్కరణకు గురై సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అయ్యాడు. టెక్నాలజీతో ప్రేమాయణం నడపాలనుకున్నా.. కనీస మర్యాద, సిద్ధాంతాలపై గౌరవం ఉండాలని ఈ ఘటన నిరూపించింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఇరాన్‌లో నిరసనలు

- ఆందోళనల్లో వారంలో 35 మంది దుర్మరణం
- ఆగ్రహం వ్యక్తంచేసిన ట్రంప్

దుబాయ్: ఇరాన్‌లో ఆకాశాన్నంటుతున్న నిత్యావసర సరకుల ధరలు, పతనమైన కరెన్సీ విలువ, పెరిగిపోతున్న నిరుద్యోగితతో ప్రజల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. అయితే గత వారం రోజులుగా కొనసాగుతున్న నిరసనల్లో ఆందోళనకారులను ఇరాన్ ప్రభుత్వం ఉక్కుపాదంతో అణిచివేస్తోంది. ఇరాన్ పోలీసులు, నిరసనకారులకు మధ్య జరిగిన ఘర్షణల్లో ఇప్పటిదాకా 35 మంది ప్రాణాలు కోల్పోయారు. 1,200 మందికిపైగా గాయాలపాలయ్యారు. నేలచూపులు చూస్తున్న ఆర్థికవ్యవస్థకు కొత్త ఊపిరులూదే వాళ్లే కరువయ్యారంటూ లక్షలాది మంది జనం ఇరాన్ నగరాల్లో, పట్టణాల్లో వీధుల్లోకొచ్చి తీవ్రస్థాయిలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు ఇచ్చారు. ముఖ్యంగా ఇరాన్ ఆర్థికవ్యవస్థకు జీవనాడి అయిన గ్రాండ్ బజార్ వాణిజ్యసముదాయంపైనా ఆందోళనల నీలినీడలు కమ్ముకున్నాయి. చాలా వరకు దుకాణాలు మూతబడ్డాయి. దీనికితోడు డాలర్‌తో ఇరాన్ రియాల్ కరెన్సీ మారకం విలువ మంగళవారం రికార్డ్‌స్థాయిలో కొత్త కనిష్టానికి చేరుకుంది. ఫారెక్స్ మార్కెట్లో ఒక డాలర్‌తో ఇరాన్ రియాల్ విలువ ఏకంగా 14.6 లక్షలకు పడిపోయింది. 1979 ఏడాదిలో ఇరాన్‌లో ఇస్లామిక్‌చైతన్యం విప్లవం రావడానికి ముందే డాలర్‌తో రియాల్ మారకం విలువ కేవలం 70గా ఉండేది. దేశీయ దిగుమతిదారులు, ఉత్పత్తిదారులకు డాలర్లను ఇచ్చే విధానంలో ఎక్ఛ్సేంజ్ రేటు సబ్సిడీని సెంట్రల్‌బ్యాంక్ తగ్గించడంతో పరిస్థితి రానురాను మరింత దారుణంగా తయారవనుంది. దీంతో దిగుమతయ్యే సరకుల ధరలు మరింత పెరిగి ఆ మేరకు వినియోగదారుల జేబుకు భారీ చిల్లు పడనుంది. ఇప్పటికే అంతర్జాతీయ ఆంక్షలతో సతమతమవుతున్న ఇరాన్ ఇది అశనిపాతంగా మారనుంది. దేశంలో నిరసనోద్యమం చేయి దాటిపోతోందని స్వయంగా ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ వ్యాఖ్యానించారు. ఈ సమస్యను కేవలం ప్రభుత్వం మాత్రమే పరిష్కరించగలదని మనం నమ్మలేమని ఆయన అన్నారు. అయితే ఆందోళనలను అణిచివేసేందుకు సాయుధ బలగాలు నిరసనకారులపైకి భాష్పవాయుగోళాలను ప్రయోగిస్తున్నాయి. లాఠీచార్జ్ చేస్తున్నాయి. అయినాసరే పలువురు వెనక్కి తగ్గట్లేరు. సాయుధబలగాల ముందు ఒక్కడే వ్యక్తి నడిరోడ్డుపై కూర్చున్న వీడియో ఒకటి ప్రజల్లో ఎగిసన ఆగ్రహజ్వాలలకు అద్దం పడుతోంది. డిసెంబర్ 28వ తేదీన ఈ నిరసనలు మొదలయ్యాయి. మాలిక్‌షాహీ కౌంటీలో నిరసనకారుల మరణంపై దర్యాప్తుచేయిస్తానని అధ్యక్షుడు ప్రకటించారు.

కాపాడేందుకు అవసరమైతే రంగంలోకి దిగుతా..

ఇరాన్‌లో ప్రజాందోళనపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పందించారు. ''శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిపై ఇరాన్ ప్రభుత్వం ఇలాగే దమనకాండకు దిగే అమెరికా రంగంలోకి దిగాల్సి వస్తుంది. ఉద్యమకారులను రక్షించే బాధ్యతను అమెరికా తీసుకుంటుంది'' అని ట్రంప్ అన్నారు. దీంతో ఇప్పటికే లాటిన్ అమెరికాలో వెనెజువెలా దేశ అధ్యక్షుడు మదురోను బంధించి అమెరికాకు తీసుకొచ్చిన ట్రంప్ సర్కార్ ఇక పశ్చిమాసియాలోనూ ఇలాంటి దాడులకు బరితెగిస్తే ఈ ప్రాంతంలో శాంతియుత వాతావరణం అనేది కలగానే మారుతుందని పలువురు అంతర్జాతీయ వ్యవహారాల నిపుణులు ఆందోళన వ్యక్తంచేశారు.

జేఎన్‌యూలో మళ్లీ సెగలు

ప్రధాని, హోంమంత్రిపై వివాదాస్పద నినాదాలు..

పోలీసులకు వర్సిటీ లేఖ • ఎఫ్ఐఆర్‌కు రంగం సిద్ధం

న్యూఢిల్లీ: భారతదేశపు అత్యున్నత విద్యాసంస్థ జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం మరోసారి వివాదాలకు వేదికైంది. 2020 ఢిల్లీ అల్లర్ల కుట్ర కేసులో నిందితులు ఉమర్ ఖలీద్, షర్జీల్ ఇమామ్‌ల బెయిల్ పిటిషన్లను సుప్రీంకోర్టు తిరస్కరించిన నేపథ్యంలో.. క్యాంపస్‌లో కొందరు విద్యార్థులు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలకు వ్యతిరేకంగా చేసిన నినాదాలు ఇప్పుడు దేశవ్యాప్తంగా దుమారం రేపుతున్నాయి. ఈ ఘటనను విశ్వవిద్యాలయ యంత్రాంగం తీవ్రంగా పరిగణిస్తూ.. ఏకంగా పోలీసులకు ఫిర్యాదు చేయడం సంచలనంగా మారింది.

వర్సిటీ ఆగ్రహం.. అంతర్గత విచారణ

ఈ నినాదాలను తీవ్రంగా పరిగణించిన జేఎన్‌యూ యంత్రాంగం.. ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని వసంత కుంజ్ పోలీసులకు లేఖ రాసింది. సోమవారం రాత్రి జరిగిన 'గెరిల్లా ధాబా' అనే కార్యక్రమంలో విద్యార్థులు అత్యంత అభ్యంతరకరమైన, రెచ్చగొట్టేలా నినాదాలు చేశారని వర్సిటీ తన ఫిర్యాదులో పేర్కొంది. ఈ నినాదాలు కేవలం అభ్యంతరకరమే కాకుండా, సుప్రీంకోర్టు తీర్పును ధిక్కరించేలా ఉన్నాయని స్పష్టం చేసింది. జేఎన్‌యూ విద్యార్థి సంఘం అధ్యక్షురాలు అదితి మిశ్రాతో సహా పలువురు విద్యార్థుల పేర్లను ఫిర్యాదులో ప్రస్తావించారు. వీటితో పాటు వర్సిటీ కోడ్ ఆఫ్ కాండక్ట్ ఉల్లంఘనపై అంతర్గత విచారణకు కూడా ఆదేశించారు. వర్సిటీ క్రమశిక్షణను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారులు హెచ్చరించారు. దోషులుగా తేలితే కఠిన చర్యలు తప్పవని వర్సిటీ స్పష్టం చేసింది.

అసలేం జరిగిందంటే..

జేఎన్‌యూ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో ఒక నిరసన కార్యక్రమం జరిగింది. 2020, జనవరి 5న క్యాంపస్‌లో జరిగిన హింసాకాండను ఖండిస్తూ ఏటా నిర్వహించే ఈ కార్యక్రమం, ఈసారి రాజకీయ మలుపు తిరిగింది. ఉమర్ ఖలీద్ బెయిల్ పిటిషన్ తిరస్కరణకు గురైన వార్త తెలియగానే, విద్యార్థులు రెచ్చగొట్టే నినాదాలు చేసినట్లు సమాచారం. దీనికి సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి.

కాంగ్రెస్, ఆప్ వత్తాసు: బీజేపీ ధ్వజం

ఢిల్లీ అసెంబ్లీ శీతాకాల సమావేశాల సందర్భంగా.. బీజేపీ నేతలు ఆశిష్ సూద్, మంజిందర్ సింగ్ సిర్సా ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. 'ఈశాన్య భారతాన్ని విడదీయాలని మాట్లాడే షర్జీల్ ఇమామ్, భారత్‌ను ముక్కలు చేయాలని నినదించే ఉమర్ ఖలీద్ వంటి వారిపై కొందరు సానుభూతి చూపడం సిగ్గుచేటు'.. అని ఆశిష్ సూద్ విమర్శించారు. 'ప్రధాని, హోంమంత్రులపై ఇలాంటి నినాదాలు చేయడం అత్యంత దారుణం. ఆప్, కాంగ్రెస్ పార్టీలు ఎప్పుడూ ఇటువంటి వేర్పాటువాద శక్తులకు కొమ్ముకాస్తున్నాయి'.. అని సిర్సా ఆరోపించారు. మరోవైపు, విద్యార్థి సంఘం అధ్యక్షురాలు అదితి మిశ్రా స్పందిస్తూ.. ఆ నినాదాలు కేవలం సిద్ధాంతపరమైనవే తప్ప, ఎవరినీ వ్యక్తిగతంగా దూషించినవి కావని సమర్థించుకున్నారు.

చేదు జ్ఞాపకాలకు నాలుగేళ్లు

ఈ వివాదం వెనుక 2020 నాటి చేదు జ్ఞాపకాలు ఉన్నాయి. నాలుగేళ్ల క్రితం జనవరి 5న క్యాంపస్ లోకి చొరబడిన దుండగులు.. అప్పటి విద్యార్థి సంఘం అధ్యక్షురాలు ఐషే ఘోష్‌తో సహా 28 మందిని గాయపరిచారు. ఆ ఘటన జరిగి నాలుగేళ్లు పూర్తయిన తరుణంలోనే మళ్లీ జేఎన్‌యూ నినాదాల హోరుతో దద్దరిల్లడం గమనార్హం. ప్రస్తుతానికి పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు ప్రక్రియను పరిశీలిస్తుండగా, వర్సిటీ తీసుకునే క్రమశిక్షణ చర్యలపై విద్యార్థి లోకంలో ఉత్కంఠ నెలకొంది.

మదురోలాగే మోదీని కూడా..

పృథ్వీ'రాజు'కున్న వ్యాఖ్యలు

సెగలు రేపుతున్న వెనెజువెలా పోలిక!

న్యూఢిల్లీ: వెనెజువెలా సంక్షోభం నేపథ్యంలో కాంగ్రెస్ సీనియర్ నేత, మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి పృథ్వీరాజ్ చవాన్ చేసిన వ్యాఖ్యలు దేశ రాజకీయాల్లో అగ్గి రాజేస్తున్నాయి. 'వెనెజువెలా అధ్యక్షుడు మదురోను బంధించినట్లు.. రేపు మన ప్రధాని మోదీని కూడా ట్రంప్ కిడ్నాప్ చేస్తారా?'.. అంటూ ఆయన వేసిన ప్రశ్న రాజకీయ వర్గాల్లో దుమారం రేపుతోంది.

అసలు రగడ ఎక్కడ మొదలైంది?

అమెరికా విధిస్తున్న వాణిజ్య సుంకాల వల్ల భారత్ ఎదుర్కొంటున్న ఇబ్బందులపై చవాన్ ఒక ఇంటర్వ్యూలో విశ్లేషించారు. ఈ క్రమంలో వెనిజులాలో ప్రస్తుత సంక్షోభాన్ని ఉదాహరణగా తీసుకున్నారు. అమెరికా దళాలు వెనిజులా అధ్యక్షుడిని అదుపులోకి తీసుకోవడంపై భారత్ ఎందుకు మౌనంగా ఉందని ఆయన ప్రశ్నించారు. 'వెనెజువెలాలో ఏం జరిగిందో రేపు భారత్‌లోనూ చూడబోతున్నామా? ట్రంప్ మన ప్రధానిని కూడా కిడ్నాప్ చేస్తారా? వెనిజులాలో ఒక ఎన్నికైన అధ్యక్షుడిని కిడ్నాప్ చేయడం ఐక్యరాజ్యసమితి నిబంధనలకు విరుద్ధం. ఇవాళ అక్కడ జరిగింది.. రేపు ఏ దేశానికైనా ఎదురుకావచ్చు'.. అని పృథ్వీరాజ్ చవాన్ హెచ్చరించారు.

విదేశాంగ విధానంపై విమర్శనాస్త్రాలు

భారత విదేశాంగ విధానంపై చవాన్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. రష్యా-ఉక్రెయిన్, ఇజ్రాయెల్-హమాస్ యుద్ధాల సమయంలోనూ భారత్ తటస్థంగా ఉండిపోయిందని గుర్తుచేశారు. ఇప్పుడు అమెరికాకు భయపడి వెనెజువెలా విషయంలోనూ నోరు మెదపడం లేదని ఆరోపించారు. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగాలనుకుంటున్న భారత్, ఇలాంటి ప్రపంచ పరిణామాల్లో మౌనంగా ఉండటం సరికాదని హితవు పలికారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం పొందాలని ఆశిస్తున్నప్పుడు, ఇలాంటి అంతర్జాతీయ విషయాల్లో మౌనంగా ఉండటం సరికాదన్నారు.

బీజేపీ తీవ్ర ఆగ్రహం..

చవాన్ వ్యాఖ్యలపై బీజేపీ నిప్పులు చెరిగింది. బీజేపీ జాతీయ ప్రతినిధి ప్రదీప్ భండారీ ఈ వ్యాఖ్యలను 'సిగ్గుచేటు'గా అభివర్ణించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌ను వెనెజువెలా వంటి దేశంతో పోల్చడమేంటని మండిపడ్డారు. ప్రధాని పదవిని, దేశ సార్వభౌమత్వాన్ని తక్కువ చేసేలా కాంగ్రెస్ మాట్లాడుతోందని, ఇది వారి దేశ వ్యతిరేక మనస్తత్వానికి పరాకాష్ట అని ధ్వజమెత్తారు.

గడ్చిరోలీ నక్సల్ దాడి కేసులో

రామ్‌చందానీకి సుప్రీం బెయిల్

న్యూఢిల్లీ: మహారాష్ట్రలోని గడ్చిరోలి పేలుడు కేసులో నిందితుడు, నక్సల్ సానుభూతిపరుడు కైలాష్ రామ్‌చందానీకి సుప్రీంకోర్టు మంగళవారం మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అరెస్టయిన నాటి నుంచి రామ్‌చందానీ జైలులో ఉన్న విషయాన్ని పరిగణనలోకి తీసుకున్న ప్రధాన న్యాయమూర్తి సూర్య కాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీల ధర్మాసనం షరతులతోకూడిన మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేసింది. బెయిల్ తర్వాత అతను గడ్చిరోలిలోని తన స్వస్థలంలో ఉండాలని, ప్రత్యేక ఎన్ఐఏ కోర్టు ముందస్తు అనుమతి లేకుండా ఎక్కడికీ వెళ్లకూడదని షరతులు విధించింది. వారానికోసారి స్థానిక పోలీస్ స్టేషన్‌లో హాజరు కావాలని స్పష్టం చేసింది. నిందితుడు ఆ ప్రాంతంలోని నక్సల్స్‌తో సంబంధాలు పెట్టుకోవడానికి ప్రయత్నించినట్లు తేలినా లేదా బెయిల్ షరతులను ఉల్లంఘించినా, మధ్యంతర బెయిల్‌ను రద్దు చేయాలని ఎన్ఐఏ అభ్యర్థించవచ్చు అని ధర్మాసనం వెల్లడించింది. విచారణ ప్రక్రియలో జాప్యం కారణంగా నిందితులకు నెలల తరబడి అకారణంగా జైళ్లకు పరిమితం చేయలేని నిస్సహాయ పరిస్థితుల్లో నిందితులకు బెయిల్ మంజూరు చేయవలసి వస్తోందని ఈ సందర్భంగా ధర్మాసనం వ్యాఖ్యానించింది. 2019లో గడ్చిరోలిలో జరిగిన ఐఈడీ పేలుడులో 15 మంది పోలీసులు మరణించిన సంగతి తెలిసిందే.

శబరిగళార్చన!

శబరిమలలో ఇక భక్తుల గళం

- స్వామి సన్నిధిలో సామాన్యుల కీర్తనలు
- ట్రావెన్కోర్ దేవస్వం బోర్డు నిర్ణయం

శబరిమల (కేరళ): అయ్యప్ప స్వామి భక్తులకు ట్రావెన్కోర్ దేవస్వం బోర్డు తీపి కబురు అందించింది. శబరిమల గిరిజన క్షేత్రంలో భక్తులు స్వయంగా కూర్చిన, ఆలపించిన భక్తి గీతాలను ప్రసారం చేసేందుకు బోర్డు శ్రీకారం చుట్టింది. ఇప్పటి వరకు కేవలం ప్రముఖ గాయకుల పాటలకే పరిమితమైన ఆలయ ప్లేలిస్ట్‌లో, ఇకపై సామాన్య భక్తుల స్వరాలు కూడా ప్రతిధ్వనించనున్నాయి.

అందరికీ అవకాశం

ప్రస్తుతం శబరిమలలో కె.జె.యేసుదాస్, జయవిజయ వంటి దిగ్గజ గాయకులు పాడిన పాటలను మాత్రమే వినిపిస్తున్నారు. కొత్త నిర్ణయం ప్రకారం, భక్తులు రూపొందించిన కీర్తనలను కూడా ఈ జాబితాలో చేరుస్తారు.

నిబంధనలు ఇవే..

ఈ అవకాశం పొందాలనుకునే వారు తమ పాటలు 'అసలైనవే' అని, ఎలాంటి కాపీరైట్ వివాదాల్లేవని ధ్రువీకరిస్తూ ఒక అఫిడవిట్ సమర్పించాలి. రచయిత, సంగీత దర్శకుడు, గాయకుడు సంయుక్తంగా ఈ అంగీకార పత్రాన్ని అందజేయాల్సి ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ

పాటలను పెన్‌డ్రైవ్ ద్వారా శబరిమల సన్నిధానంలోని దేవస్వం బోర్డు అధికారులకు సమర్పించాలి. బోర్డు నియమించిన కమిటీ ఈ పాటలను క్షుణ్ణంగా పరిశీలించి, నాణ్యత ఆధారంగా ఎంపిక చేస్తుంది.

ప్రసార వేళలివే..

శబరిమల గర్భాలయం తెరిచే సమయంలో యేసుదాస్ పాడిన 'వందే విఘ్నేశ్వరం', మూసే సమయంలో 'హరివరాసనం' ప్రసారమవుతాయి. మధ్యాహ్నం 3 గంటలకు జయవిజయ ఆలపించిన 'శ్రీకోవిల్ నడ తురన్ను' వినిపిస్తారు. వీటి మధ్యలో భక్తులకు సమాచారం అందించే విరామ సమయాల్లో.. సామాన్య భక్తులు పంపిన కొత్త భక్తి గీతాలను ప్రసారం చేయాలని బోర్డు నిర్ణయించింది. స్వామివారిని పాటల రూపంలో అర్చించుకోవాలనుకునే భక్త కళాకారులకు ఇదొక గొప్ప వేదికగా మారనుంది.

రాజకీయ కక్షతోనే హదీ హత్య

17 మందిపై బంగ్లాదేశ్ పోలీసుల ఛార్జిషీట్

ఢాకా/న్యూఢిల్లీ: ఇంక్విలాబ్ మంచ్ కన్వీనర్ షరీఫ్ ఉస్మాన్ హాదీని రాజకీయ కక్షతోనే హత్య చేశారని బంగ్లాదేశ్ పోలీసులు మంగళవారం తెలిపారు. ఈ హత్యకు సంబంధించి 17 మందిపై ఛార్జిషీట్ దాఖలు చేశారు. అవామీ లీగ్, ఛాత్ర లీగ్ కార్యకలాపాలను హాదీ తీవ్రంగా విమర్శించారని, హాదీ వ్యాఖ్యలు ఛాత్ర లీగ్, దాని అనుబంధ సంస్థల నాయకులను, కార్యకర్తలను ఆగ్రహానికి గురిచేశాయని పోలీసులు తెలిపారు. రాజకీయ కక్షతోనే హాదీని కాల్చి చంపినట్లు దర్యాప్తులో వెల్లడైందని పోలీసులు తెలిపారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న షూటర్ ఫైసల్ కరీం మసూద్‌కు ఛాత్ర లీగ్‌తో సంబంధాలున్నాయని, హత్య తర్వాత మసూద్, మరో ప్రధాన నిందితుడైన అల్మగిర్ షేక్‌లు పారిపోవడానికి మరో నిందితుడు తైజుల్ సహాయం చేశాడని ఆరోపణలున్నాయి. ఇప్పటివరకు ఈ కేసులో 12 మందిని అరెస్టు చేశారు. హదీ హత్య కేసులో తుది చార్జిషీట్‌ను నేడు సమర్పిస్తామని తెలిపారు. విద్యార్థి నాయకుడైన 32 ఏళ్ల హదీ, హసీనా ప్రభుత్వం పతనానికి దారితీసిన 2024 జూలై తిరుగుబాటు సమయంలో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. ఫిబ్రవరిలో జరగనున్న ఎన్నికల్లోనూ ఆయన బరిలో నిలిచారు. డిసెంబర్ 12న ఢాకాలో ఎన్నికల ప్రచారం సందర్భంగా అతని తలపై కాల్పులు జరిగాయి. చికిత్స కోసం సింగపూర్‌కు తీసుకెళ్లినా.. 18న మరణించారు. హత్యకు కారకులైన వారిని వెంటనే శిక్షించాలని, హాదీ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఇంక్విలాబ్ మంచ్ నిరసనలు కొనసాగిస్తోంది.

అయోధ్యలో 'పొలిటికల్ హీట్'

- బరిలోకి బీజేపీ 'ఫైర్ బ్రాండ్'?
- 2027 ఎన్నికల్లో పోటీకి సిద్ధమని వినయ్ కటియార్ సంకేతాలు

సాక్షి, న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో మరోసారి రాజకీయ వేడి రాజుకుంది. రామమందిర ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన బీజేపీ 'ఫైర్ బ్రాండ్'నేత, మాజీ పార్లమెంట్ సభ్యుడు వినయ్ కటియార్ రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు. 2027లో ఉత్తరప్రదేశ్‌లో జరగబోయే ఎన్నికల్లో అయోధ్య నుంచే తాను బరిలోకి దిగుతానంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు కాషాయ పార్టీలోనూ, స్థానిక రాజకీయాల్లోనూ చర్చనీయాంశంగా మారాయి. అయోధ్యలోని తన నివాసంలో వినయ్ కటియార్ కార్యకర్తలతో సుదీర్ఘంగా భేటీ అయ్యారు. గంటల తరబడి సాగిన ఈ సమావేశం పూర్తిగా గడప దాటి బయటకు రానివ్వకుండా జరగడం ప్రాధాన్యతను సంతరించుకుంది. రానున్న అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా వ్యూహరచన కోసమే ఈ భేటీ జరిగినట్లు సమాచారం. సమావేశం అనంతరం మీడియా ముందుకు వచ్చిన కటియార్.. తన మనసులోని మాటను బయటపెట్టారు. ''ఎవరు చెప్పారు మేము సిద్ధంగా లేమని? ఎన్నికల కోసం మా సన్నాహాలు ముమ్మరంగా సాగుతున్నాయి. సరైన సమయంలో సమర శంఖం పూరిస్తాం. మైదానంలోకి దిగుతాం''అని కటియార్ తేల్చిచెప్పారు.

మద్యం పంచితే ఓటు వేయం

ఉత్తరప్రదేశ్‌లో ఓ గ్రామం తీర్మానం

బాగ్‌పత్ (ఉత్తరప్రదేశ్): రాబోయే పంచాయతీ ఎన్నికల సమయంలో మద్యం పంచే అభ్యర్థికి ఓటేయ్యబోమని ఉత్తరప్రదేశ్‌లోని ఓ గ్రామం తీర్మానించింది. మాదకద్రవ్యాలు లేని సమాజాన్ని ప్రోత్సహించే ప్రతిజ్ఞలో భాగంగా బాగ్‌పత్ జిల్లాలోని దిఖౌలీలో జాట్ సభ ఏర్పాటు చేసిన సభలో గ్రామ ప్రజలు ఈ నిర్ణయం తీసుకున్నారు. మద్యం పంచితే ఏ అభ్యర్థినైనా సామాజికంగా బహిష్కరించాలని తీర్మానించినట్లు మంగళవారం కమ్యూనిటీ నాయకులు తెలిపారు. పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధమవుతున్న అభ్యర్థులు, గ్రామ పెద్దలు మరియు కమ్యూనిటీ ప్రతినిధులతో కలిసి, ఓట్ల కోసం ప్రలోభపెట్టడానికి మద్యం ఉపయోగించబోమని సామూహికంగా ప్రతిజ్ఞ చేశారు. ఎన్నికల్లో ఓడిపోయినా పర్లేదుగానీ మద్యం పంపిణీ చేసి ఎన్నికల్లో గెలవడం ఆమోదయోగ్యం కాదన్నారు. అంతేకాదు మద్యం ఇచ్చి ఓట్లు అడగడానికి ప్రయత్నించే వారిని గ్రామంలోకి అనుమతించకూడదని వారు తీర్మానించారు. ఈ తీర్మానానికి ఖాప్ పంచాయతీ మద్దతిచ్చింది. ఎన్నికలను మద్యపానరహితంగా మార్చడానికి పూర్తి మద్దతు ఇస్తామని ప్రతిజ్ఞ చేశారు. మద్యం సేవించకుండా ఉంటామని యువతతో ప్రమాణం చేయించారు. వ్యసనాల నుంచి గ్రామాన్ని విముక్తి చేయడం కోసం జనవరి 18వ తేదీన శివాలయంలో 'నశా ముక్తి'యజ్ఞం చేయాలని, ఆ తర్వాత యాత్ర చేపట్టాలని పంచాయతీ నిర్ణయించింది.

బంగ్లాదేశ్‌లో మరో మైనార్టీ వ్యక్తి హత్య

ఢాకా: షేక్ హసీనా ప్రభుత్వం కూలిపోయాక బంగ్లాదేశ్‌లో ఒకే మైనారిటీ వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని దాడులు మరింత పెరిగాయి. బంగ్లాదేశ్‌లోని నర్సింగ్ది నగరంలో సరకుల దుకాణం నడుపుతున్న ఆ మైనార్టీ వర్గం చిరు వ్యాపారిని గుర్తుతెలియని దుండగులు విచక్షణారహితంగా పదునైన ఆయుధాలతో దాడిచేసి హతమార్చారు. సోమవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో ఈ హత్య ఘటన జరిగింది. ఛార్‌సిందూ బజార్‌లో తన దుకాణాన్ని మూసేసి ఇంటికి వెనుతిరుగుతున్న 40 ఏళ్ల ఆ వ్యక్తిని దుండగులు మార్గమధ్యంలో అడ్డగించి దేశవాళీ పదునైన ఆయుధంతో దాడిచేశారు. దీంతో రక్తసిక్తమై రక్తమోడుతూ అతను అక్కడే కుప్పకూలాడు. ఇది చూసిన స్థానికులు అతడిని సమీప పలాశ్ ఉపజిల్లా ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చారు. కానీ అతను ఆలోపే కన్నుమూశాడని వైద్యులు ధృవీకరించారు. ఖుల్నా డివిజన్‌లోని కేశవ్‌పూర్ ఉపజిల్లాలో అదే మైనార్టీ వర్గానికి చెందిన 38 మరో వ్యక్తిని సైతం సోమవారమే దుండగులు గన్‌తో కాల్చిచంపడం తెల్సిందే.

శ్రీలంకలో ముగ్గురు భారతీయుల అరెస్టు

గంజాయి రవాణా ఆరోపణలతో..

కొలంబో: గంజాయి కలిగి ఉన్నారనే ఆరోపణలతో శ్రీలంకలో ముగ్గురు భారతీయులు లంక అధికారులు అరెస్ట్ చేశారు. కొలంబోలోని అంతర్జాతీయ విమానాశ్రయంలో రూ. 14.5 కోట్లకు పైగా విలువైన 50 కిలోల గంజాయిని కలిగి ఉన్నారనే ఆరోపణలపై వీరిని అరెస్టు చేసినట్లు అక్కడి అధికారులు మంగళవారం తెలిపారు. అరెస్టు చేసిన వారిలో ముంబైకి చెందిన ఇద్దరు మహిళా ఉపాధ్యాయులు ఉన్నారని వెల్లడించారు. అనుమానితులు బ్యాంకాక్ నుంచి శ్రీలంక ఎయిర్‌వేస్ విమానంలో బండారనాయకే అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారని, అరెస్టు చేసినప్పుడు ముగ్గురు గ్రీన్ ఛానల్ ద్వారా పారిపోవడానికి ప్రయత్నించారని తెలిపారు. ఇది విమానాశ్రయంలో ఇప్పటివరకు దొరికిన మాదకద్రవ్య రవాణా కేసుల్లో అతి పెద్దదని పోలీసు నార్కోటిక్స్ బ్యూరో తెలిపింది.

అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరిన సోనియా గాంధీ

పరిస్థితి నిలకడగా ఉందన్న వైద్యులు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ అనారోగ్యంతో సోమవారం సాయంత్రం ఢిల్లీలోని ప్రముఖ సర్ గంగారామ్ ఆసుపత్రిలో చేరారు. శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్న ఆమె ఆస్పత్రిలో చేరారని ఆస్పత్రి వర్గాలు మంగళవారం వెల్లడించాయి. సాధారణ వైద్య పరీక్షల నిమిత్తం ఆమె ప్రస్తుతం ఛాతీ విభాగ వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని, నిజానికి ఆమె ఆరోగ్యం అత్యంత నిలకడగా ఉందని ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. ఒకటి, రెండు రోజుల్లో ఆమెను డిశ్చార్జ్ చేసే అవకాశం ఉంది. సోనియాగాంధీ దీర్ఘకాలిక దగ్గు సమస్యతో బాధపడుతున్నారు. దీనికితోడు నగరంలో వాయుకాలుష్యం పెరిగిపోవడంతో ఆమె ఆరోగ్య సమస్య ఎక్కువయ్యింది. ఈ క్రమంలోనే వైద్య పరీక్షల కోసం ఆస్పత్రిలో చేరారని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి.

మనుషుల కేసుల్లోనూ ఇన్ని దరఖాస్తులు రాలేదు

సుప్రీంకోర్టు వ్యాఖ్య

న్యూఢిల్లీ: వీధి శునకాలకు సంబంధించి తమ వద్ద విచారణలో ఉన్న కేసుకు అనుబంధంగా కుప్పలుతెప్పలుగా అనుబంధ పిటిషన్లు, దరఖాస్తులు వచ్చిపడుతున్నాయని సుప్రీంకోర్టు వెల్లడించింది. వీధి శునకాలకు సంబంధించిన కేసును బుధవారం విచారిస్తామని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్వీ అంజారియాల ధర్మాసనం గుర్తుచేస్తూ పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ''ఇప్పటికే పలువురు లాయర్లు ఈ అంశంలో అనుబంధ పిటిషన్లు, దరఖాస్తులు ఇచ్చారు. మళ్లీ ఇద్దరు లాయర్లు ఇదే కేసుపై దరఖాస్తులు సమర్పించి సంబంధిత ధర్మాసనానికి బదిలీచేయాలని విజ్ఞప్తిచేశారు. సాధారణంగా చూస్తే మనుషులకు సంబంధించిన ఏ కేసులో కూడా ఇన్ని అప్లికేషన్లు రాలేదేమో. కుక్కల విషయంలో పిటిషన్లు పోటెత్తుతున్నాయి. ఇలాంటి అప్లికేషన్లు బుధవారం కూడా వస్తాయేమో. అన్నీ కలిపి బుధవారమే కేసును విచారిస్తాం''అని సుప్రీంకోర్టు వెల్లడించింది.

అనాదిగా మనుగడలో ఉన్న విశ్వజనీన భావన

ప్రపంచ సామాజిక వ్యవస్థలో ఏదో ఒక రకమైన మతం ఉంది. ఇది సమాజంలో అనాదిగా వేల ఏళ్ల నుంచి మనుగడలో ఉంది. భిన్నత్వంలో ఏకత్వం ప్రత్యేకతగా ఉన్న భారతీయ సమాజ లక్షణాలకు సంబంధించి అత్యంత ప్రధానమైన అంశాల్లో మతం ఒకటి. భారతదేశం బహుళ మతాలతో కూడుకొని ఉంది. అనేక మతాలు ఉన్నప్పటికీ మత సహనంతో విరాజిల్లడం భారతీయ సమాజ విశిష్ట లక్షణం. ఈ లక్షణం పురాతన కాలంలోగానీ, ఆధునిక కాలంలోగానీ మరెక్కడా కనిపించదు.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

సోషియాలజీ

మతం

మానవుడు తన పుట్టుక నుంచి మరణం వరకు ప్రకృతిలో సంభవించే వివిధ అంశాలు అగమ్యగోచర శక్తి ప్రభావాలే అని నమ్మాడు. తన ప్రశ్నలు, సందేహాలన్నింటికీ ఊహాత్మక భావనల మేరకు సమాధానం వెతుక్కున్నాడు. అంతిమంగా అవన్నీ 'మానవాతీత శక్తి సృష్టి' అనే భావనకు వచ్చాడు. సామాజిక మానవ శాస్త్రవేత్తలు ఈ మానవాతీత శక్తి (సూపర్ పవర్)నే అలౌకిక శక్తిగా విశ్లేషించారు. ఈ అలౌకిక శక్తుల మనుగడకు సంబంధించిన విశ్వాసమే మతంగా ఆవిర్భవించిందని చెప్పవచ్చు.

మతానికి సామాజిక శాస్త్రవేత్తలు ఇచ్చిన నిర్వచనాలు

- మానవాతీత శక్తులపై ఉండే వైఖరులే మతం.- ఆగ్బర్న్
- మానవ జీవితం, స్వభావానికి మార్గం చూపి, వాటిని నియంత్రించే మానవాతీత శక్తులపై ఉన్న విశ్వాసమే మతం.
  - జేమ్స్ అండ్ ఫ్రేజర్
- మానవుడికి, మానవుడికి మధ్య ఉండే సంబంధమే కాకుండా అతీతమైన శక్తితో మానవుడికి ఉండే సంబంధాన్ని తెలియజేసేదే మతం.
  - మెకైవర్

మతం విశ్వజనీనమైంది. మతం లేని సమాజం లేదు. మానవాతీత శక్తుల్లో విశ్వాసం కలిగి ఉండటమే మతంలోని ప్రధానాంశం.

భారతదేశంలోని ప్రధాన మతాలు

1. హిందూ మతం 2. ఇస్లాం
3. క్రైస్తవం 4. సిక్కు మతం
5. బౌద్ధం 6. జైనం
7. జొరాస్ట్రియన్ (పార్శీ) మతం

2011 జనాభా లెక్కల ప్రకారం దేశ జనాభాలో వివిధ మతాలవారు

1. హిందువులు	79.8 శాతం
2. ముస్లింలు	14.2 శాతం
3. క్రైస్తవులు	2.3 శాతం
4. సిక్కులు	1.7 శాతం
5. బౌద్ధులు	0.7 శాతం
6. జైనులు	0.4 శాతం
7. ఇతరులు	0.7 శాతం

హిందూ మతం

'హిందూ' అనే పదం భారతదేశ పశ్చిమ ప్రాంతంలో ప్రవహిస్తున్న 'సింధూ' నది పేరు నుంచి వచ్చిందని భావిస్తున్నారు. కాలక్రమంలో సింధూ అనేది 'హిందూ'గా మారింది. భారతదేశానికి వచ్చిన విదేశీ యాత్రికులు సింధూనదిని 'ఇండస్' అని పిలిచారు. దీని ఆధారంగా భారతదేశానికి 'ఇండియా' అనే పేరు వచ్చింది. భారతీయులందరినీ 'హిందువులు'గా పిలిచారు.

హిందూ మతాన్ని ఒక మతం అని పిలవడం కంటే 'విశ్వాసాల సమ్మేళనం'గా పేర్కొనడం ఉత్తమం. పురాతన కాలం నుంచి భారతీయులకు అనేక విశ్వాసాలు ఉన్నాయి.

ఉదా: పితృదేవతలను పూజించడం, ప్రకృతి శక్తుల ఆరాధన (నదులు, చెట్లు), బహు దేవతారాధన, ఏకేశ్వర ఉపాసన.

ప్రాచీన కాలంలో భారతీయ నాగరిక ఆశయాల్లో అన్ని మానవ విశ్వాసాలు సమ్మిళితమయ్యాయని ఎస్.కె. బోస్ పేర్కొన్నారు. క్రైస్తవం, బౌద్ధం, ఇస్లాం మాదిరిగా హిందూ మతానికి ఒక ప్రారంభకుడు లేకపోవడమే దీనికి ప్రధాన కారణమని ఆయన చెప్పారు.

హిందూ మతానికి చెందిన వ్యక్తి జీవితమంతా మత విలువలపైనే ఆధారపడి ఉంది. మంచి కార్యాలు చేసినవారు మరణించిన తర్వాత ఉత్తమ జీవితాన్ని పొందుతారు, చెడ్డ పనులు చేసినవారు తర్వాతి జన్మలో అనేక బాధలు అనుభవిస్తారనే నమ్మకంపై హిందూ మత విలువలు ఆధారపడి ఉన్నాయి.

హిందూ మత మౌలిక ధార్మిక గ్రంథాలు రెండు రకాలు. అవి: **1. శృతులు 2. స్మృతులు.**

1. శృతులు

వేదాలు, బ్రాహ్మణాలు, అరణ్యకాలు, ఉపనిషత్తులను 'శృతి సాహిత్యం'గా పేర్కొంటారు. దీన్ని అత్యంత పవిత్రమైందిగా భావిస్తారు. వీటినే 'అపౌరుషేయాలు' అంటారు. అంటే దేవతలు రాసి ప్రజలకు ఇచ్చారని అర్థం.

2. స్మృతులు

వేదాంగాలు, పురాణాలు, ఉపవేదాలు, ఇతిహాసాలను 'స్మృతి సాహిత్యం' అంటారు. వీటిని జ్ఞాన సముపార్జులైన రుషులు రాశారు.

పైన పేర్కొన్న అంశాల ద్వారా హిందూ జీవన విధానాన్ని తెలుసుకోవచ్చు. కర్మ సిద్ధాంతం, వర్ణ వ్యవస్థ, ఆశ్రమ వ్యవస్థ, పురుషార్థాలు హిందువులు ఆచరించాల్సిన విధానాల గురించి వివరిస్తాయి.

కర్మ సిద్ధాంతం

హిందూ మతంలోని ప్రతి వ్యక్తిపై కర్మ సిద్ధాంతం ప్రభావం ఉంటుంది. వ్యక్తి చేసే పనులు, మంచి చెడుల ఆధారంగా ప్రస్తుత జీవితం, పునర్జన్మ ఉంటాయని కర్మ సిద్ధాంతం తెలుపుతుంది. 'ప్రతి వ్యక్తిలో ఆత్మ ఉంటుంది. ఇది శాశ్వతమైంది. దీనికి పునర్జన్మ ఉంటుంది. ప్రస్తుత జీవితం గత జీవితంలో చేసిన మంచి - చెడుల ఫలితం' అని ఈ సిద్ధాంతం వివరిస్తుంది.

వర్ణ వ్యవస్థ

ఇది అత్యంత కీలకమైంది. రుగ్వేదంలోని 10వ అధ్యాయంలో పురుషసూక్తం దీని గురించి తెలుపుతుంది. దీని ప్రకారం ఈ సృష్టికర్త బ్రహ్మ. ఆయన తన శరీరం నుంచి ఈ సృష్టిని వర్ణం ఆధారంగా 4 రకాలుగా సృష్టించారని పేర్కొన్నారు. దీన్నే 'దైవాంశ సంభూత సిద్ధాంతం' అంటారు. దీని ప్రకారం బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు అనే నాలుగు వర్ణాల వారిని దైవం (బ్రహ్మ) సృష్టించాడని భావించారు. వీరిలో మొదటి మూడు వర్ణాల వారిని 'ద్విజులు' అంటారు. వీరికి ఉపనయనం, క్రతువులు ఉంటాయి. గాయత్రి మంత్రం ఆచరించడానికి, ఉచ్ఛరించడానికి వీరికి అర్హత ఉంటుంది. కింది స్థాయిలోని శూద్రులకు ఇవేవి ఉండవు. ఈ వర్ణవ్యవస్థ నుంచి తదనంతర కాలంలో కులాలు, ఉపకులాలు, ఆవిర్భవించాయి. కానీ వీటికి, ప్రస్తుతం ఉన్న కులాలకు చాలా తారతమ్యం ఉంది.

ఆశ్రమ వ్యవస్థ

హిందూ సామాజిక వ్యవస్థలో ప్రతి వ్యక్తి అంతిమ లక్ష్యం 'మోక్షం' పొందడం. ప్రతి హిందువు నాలుగు దశల ద్వారా దీన్ని చేరాలి.

హిందూ ధర్మశాస్త్రాల ప్రకారం ఆశ్రమం అంటే వ్యక్తి తన జీవిత కాలంలో చేసే ఒక్కో మజిలీ. ఒక వ్యక్తి తర్వాత దశ చేరుకోవడానికి అర్హత పొందే శిక్షణా దశలే ఆశ్రమాలు. ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త అల్టేకర్ ప్రకారం క్రీ.పూ. 100 నుంచే హిందువుల్లో ఆశ్రమ పద్ధతి అమల్లో ఉంది. నాలుగు రకాల ఆశ్రమాలు ఉన్నాయి. బ్రహ్మను చేరుకోవడానికి ఈ ఆశ్రమాలు నాలుగు మెట్లు కలిగిన నిచ్చెన లాంటివని భీష్ముడు పేర్కొన్నట్లు హిందువులు భావిస్తారు.

i) **బ్రహ్మచర్యాశ్రమం:** ఒక వ్యక్తి ఉపనయనం తర్వాత మొదటిదశ అయిన బ్రహ్మచర్యాశ్రమంలోకి చేరుకోవచ్చు. తల్లి గర్భం నుంచి జన్మించడం మొదటి జన్మ. ఈవిధంగా పుట్టిన వ్యక్తిని ఎలాంటి లక్ష్యం లేనివాడిగా భావిస్తారు. ఆ తర్వాత బ్రహ్మచర్యాశ్రమంలోకి ప్రవేశింపజేయడానికి ఒక ఉత్సవం నిర్వహిస్తారు. దీన్నే 'ఉపనయనం' అంటారు. అంటే 'మళ్లీ జన్మించినవాడు' అని అర్థం. ఉపనయనం జరిగిన వ్యక్తిని 'ద్విజుడు' అంటారు. మహిళలు, శూద్రులకు ఉపనయనం లేదు.

ఉపనయనంలో ఒక లక్ష్యంలేని, క్రమబద్ధం కాని జీవితాన్ని ఒక నిర్దిష్ట ఆశయం ఉన్న జీవితంగా మారుస్తారు. వర్ణాల ఆధారంగా ఉపనయనం అర్హత నిర్ధారిస్తారు. సాధారణంగా బ్రాహ్మణులకు 8, క్షత్రియులకు 10, వైశ్యులకు 12 ఏళ్ల వయసులో దీన్ని నిర్వహిస్తారు. అనివార్య పరిస్థితుల్లో ఇలా జరగకపోతే మరో నాలుగేళ్ల తర్వాత ఉపనయనం చేస్తారు. దీని తర్వాత సంబంధిత వ్యక్తి గాయత్రీ మంత్రం నేర్చుకోవడానికి అర్హత పొందుతాడు. వేదాంగాల్లో భాగమైన కల్పలోని గృహసూత్రంలో 11వ యాగం ఉపనయనం గురించి తెలియజేస్తుంది.

వేదాంగాలు 6 రకాలు. **అవి:**

1. శిక్ష 2. నిరుక్త
3. వ్యాకరణం 4. జ్యోతిషం
5. ఛందస్సు 6. కల్ప

కల్ప 3 రకాలు

1. **గృహసూత్రం:** మోక్షం సాధించడానికి చేయాల్సిన 16 యాగాల (షోడశ కర్మలు) గురించి తెలుపుతుంది. 11వ యాగం ఉపనయనం గురించి వివరిస్తుంది.
2. **శ్రేతసూత్రం:** చక్రవర్తి ప్రజల కోసం నిర్వహించాల్సిన యాగాల గురించి తెలుపుతుంది.
3. **సుళువ సూత్రం:** హోమగుండాల నిర్మాణం గురించి తెలుపుతుంది.

ఉపనయనం తర్వాత బ్రహ్మచర్య ఆశ్రమం ప్రారంభమవుతుంది. ఈ ఆశ్రమంలో వ్యక్తి ఉపాధ్యాయుడి గృహంలో విద్యార్థిగా ప్రవేశిస్తాడు. గురువు అతడికి వెంటనే విద్య నేర్పటం ప్రారంభించడు. వ్యక్తి ముందుగా గురువు ఇంటి పనులు చేయాలి. గురువు అతడికి పశువులు కాయడం; వంట చెరకు తీసుకురావడం; క్రతువులకు ఏర్పాట్లు చేయడం; తనకు, తన గురువుకు భిక్షను యాచించడం లాంటి పనులు అప్పగిస్తాడు. ఈ సేవల ద్వారా సంతృప్తి పొందితే గురువు వెలుగును (విద్యా) వేదాధ్యయనం ద్వారా బోధించడం మొదలు పెడతాడు. 'విద్' అంటే వెలుగు. జ్ఞానమనే వెలుగులో అజ్ఞానాంధకారాన్ని పారదోలడానికి గురువు వారధి లాంటివారు.

సన్మార్గం కోసం హిందువులకు ఒక బాధ్యతగా వేదాధ్యయనం నేర్పిస్తారు. పుట్టిన ప్రతి వ్యక్తి 3 రుణాలను చెల్లించాలని హిందూ మతం చెబుతోంది. అవి..

ఎ. రుషులకు రుణం చెల్లించడం: వేదాలు వల్లె వేయడం ద్వారా గురువు కంటే ఎక్కువ జ్ఞానాన్ని సంపాదించి గురువుతో ప్రశంసలు పొందేలా జ్ఞానాన్ని పొందడం. దీంతో రుషి రుణం తీరినట్లవుతుంది.

బి) దైవ రుణం తీర్చడం: యజ్ఞయాగాదుల ద్వారా ఈ రుణం తీర్చుకోవచ్చని హిందూ ధర్మగ్రంథాలు తెలుపుతున్నాయి.

సి) పితృ (తల్లిదండ్రుల) రుణం: జన్మ ఇచ్చిన తల్లిదండ్రులను గౌరవించడం, వృద్ధాప్యంలో వారికి సేవలందించడం ద్వారా వారికి మోక్ష ప్రాప్తి లభించేలా చూడాలి.

ii) **గృహస్థ ఆశ్రమం:** బ్రహ్మచర్యంలో సంపాదించిన జ్ఞానం ఆధారంగా స్వశక్తితో జీవించడం ప్రారంభించిన తర్వాత వివాహం ద్వారా గృహస్థాశ్రమ ప్రవేశం జరుగుతుంది. హిందువుల్లో వివాహానికి ధర్మ, ప్రజా, రతి అనే మూడు లక్షణాలు ఉన్నాయి.

ధర్మ: సాంఘిక, మతపరమైన బాధ్యతలను నిర్వర్తించడం.

ప్రజా: సంతానాన్ని పొందడం. పురుష సంతానం వాంఛితమైందిగా భావిస్తారు. అతడు తల్లిదండ్రులను పుత్ (నరకం)లో పడకుండా రక్షిస్తాడనే నమ్మకం ఉంది.

రతి: ఇది లైంగిక వాంఛలు, కోరికలను తృప్తి పరుస్తూ సంతానోత్పత్తికి అవసరమైంది.

ఈ మూడు లక్ష్యాలను వ్యక్తి గృహస్థ దశలో సాధిస్తాడు. మనుసంహిత ప్రకారం ఒక గృహస్థు రోజూ 'పంచ మహాయజ్ఞాలు' చేయాలి. అవి.. బ్రహ్మయజ్ఞం, పితృ యజ్ఞం, దైవ యజ్ఞం, భూత యజ్ఞం, నరయజ్ఞం.

బ్రహ్మచర్య, వానప్రస్థ, సన్యాస ఆశ్రమాలు పోషణార్థం గృహస్థు ఆశ్రమంపై ఆధారపడి ఉంటాయి. అందువల్ల దీన్ని ఉన్నతమైందిగా భావిస్తారు.

వార్థక్య ఛాయలు (ముఖంపై ముడతలు, జుట్టు నెరవటం) వచ్చిన తర్వాత లేదా కుమారులకు వివాహమైన అనంతరం గృహస్థు తన ఇంటిని కుమారులకు అప్పగించి భార్య సహాయంతో గృహస్థ ఆశ్రమాన్ని వదిలి వానప్రస్థ ఆశ్రమాన్ని స్వీకరించాల్సి ఉంటుంది.

iii) **వానప్రస్థ ఆశ్రమం:** ఇది గృహస్థ, సన్యాస ఆశ్రమాలకు వారధి లాంటిది. ఈ ఆశ్రమంలో ఒక వ్యక్తి వెంట భార్య వెళ్లవచ్చు. ఈ దశలోనూ 'పంచ మహాయజ్ఞాలు' నిర్వర్తిస్తారు. దీన్ని ప్రజా జీవనానికి దూరంగా, ప్రశాంత వాతావరణంలో గడపాలి. అందువల్ల అడవిలో ఆశ్రమం నిర్మించుకొని జీవిస్తారు. వ్యక్తి ప్రారంభంలో పచ్చి ఆకులు, వేర్ల సహాయంతో ఆకలి తీర్చుకోవాలి. ఆ తర్వాత నీరు, చివరకు గాలి మాత్రమే సేవించి ఆకలి తీర్చుకోవాలి. శారీరక సుఖాలన్నింటిని వదిలేయాలి. ఈ దశలో అర్థకామాలు ఉండవు. వేదాలు, వేదాంగాలు, స్మృతుల పఠనం ద్వారా ఆధ్యాత్మిక చింతన అలవరచుకోవడానికి శరీరానికి క్రమశిక్షణ అలవాటు చేయాలి.

సన్యాస ఆశ్రమం స్వీకరించే ముందు భార్యను కుమారులతో కలిసి జీవించడానికి ప్రోత్సహించాలి. వ్యక్తి క్రమంగా తన అభిమానం, కుటుంబం, గ్రామం అనే సంకుచిత పరిధుల నుంచి బయటపడి విశ్వమానవాళిని ప్రేమించాలి. ఇవన్నీ సాధించిన తర్వాత సన్యాసి రూపంలో సంఘ ప్రవేశం చేయాలి.

iv) **సన్యాస ఆశ్రమం:** ఇది చివరి దశ. ఈ దశలో కఠినమైన జీవితాన్ని గడపాలి. ప్రాపంచిక విషయాల పట్ల అనాసక్తత ప్రదర్శించాలి. మోక్ష సాధనకు ప్రయత్నించాలి. భిక్షాటన ద్వారా మాత్రమే జీవించాలి. సన్యాసి తాను తిరుగాడే ప్రజల నుంచి గొప్ప గౌరవాన్ని పొందాలి. ఆ ప్రజల మనసులు, జీవితాలపై గొప్ప ప్రభావాన్ని చూపాలి. వ్యక్తిగత ఉదాహరణ ద్వారా, మతబోధ ద్వారా మార్గదర్శకంగా ఉండేలా సమాజానికి ప్రోత్సాహం కల్పించాలి. అంటే సన్యాసి ఒక మహత్తర సాంఘిక పాత్రను నిర్వహిస్తాడు.

దేశంలో అతిపెద్ద మంచినీటి సరస్సు ఏది?

మాదిరి ప్రశ్నలు

1. భారత్‌తో అత్యధిక భూసరిహద్దును పంచుకుంటున్న దేశం ఏది?
   1) చైనా 2) నేపాల్
   3) పాకిస్తాన్ 4) బంగ్లాదేశ్
2. కర్కాటక రేఖ ($23\frac{1}{2}°$ ఉత్తర అక్షాంశం) కింద పేర్కొన్న ఏ రాష్ట్రం ద్వారా వెళ్లదు?
   1) మిజోరాం 2) త్రిపుర
   3) మేఘాలయ 4) జార్ఖండ్
3. సింధూనదిని 'ఇండస్' అని ఎవరు పిలిచారు?
   1) పర్షియన్లు 2) గ్రీకులు
   3) డచ్‌వారు 4) ఫ్రెంచ్‌వారు
4. భారతదేశ ఉత్తర, దక్షిణ చివరల మధ్య దూరం ఎంత?
   1) 3,214 కి.మీ. 2) 2,933 కి.మీ.
   3) 1,324 కి.మీ. 4) 3,514 కి.మీ.
5. $82\frac{1}{2}°$ తూర్పు రేఖాంశం ఎన్ని రాష్ట్రాల ద్వారా వెళుతోంది?
   1) 6 2) 7 3) 8 4) 5
6. రాడ్‌క్లిఫ్ రేఖ ఏ దేశాల మధ్య సరిహద్దుగా ఉంది?
   1) భారత్ – పాకిస్తాన్
   2) భారత్ – చైనా
   3) భారత్ – మయన్మార్
   4) భారత్ – బంగ్లాదేశ్
7. పాంబన్ దీవి వేటి మధ్య ఉంది?
   1) భారత్ – శ్రీలంక
   2) భారత్ – మాల్దీవులు
   3) భారత్ – ఇండోనేషియా
   4) భారత్ – మారిషస్
8. కింద పేర్కొన్న ఏ రాష్ట్రాలకు తీరరేఖ, విదేశాలతో భూ సరిహద్దు ఉన్నాయి?
   1) గుజరాత్, మహారాష్ట్ర
   2) గుజరాత్, పశ్చిమబెంగాల్
   3) పశ్చిమబెంగాల్, త్రిపుర
   4) పశ్చిమబెంగాల్, తమిళనాడు
9. లక్షదీవుల రాజధాని ఏది?
   1) సిల్వాస్సా 2) పోర్ట్‌బ్లెయిర్
   3) కవరత్తి 4) పాండిచ్చేరి
10. మలబార్ తీరం ఏ రాష్ట్రానికి ఉంది?
    1) గోవా 2) మహారాష్ట్ర
    3) కేరళ 4) ఒడిశా
11. 'డంకన్ పాస్' వేటి మధ్య ఉంది?
    1) ఉత్తర అండమాన్, తూర్పు అండమాన్
    2) అండమాన్, నికోబార్ దీవులు
    3) ఉత్తర అండమాన్, దక్షిణ అండమాన్
    4) గ్రేట్ అండమాన్, లిటిల్ అండమాన్
12. భారతదేశంలోని మొత్తం దీవుల (Distant Islands) సంఖ్య?
    1) 240 2) 247 3) 204 4) 194
13. ఎవరెస్ట్ శిఖరాన్ని నేపాల్‌లో ఏ పేరుతో పిలుస్తారు?
    1) జోంగ్‌మా 2) కోమలాంగిని
    3) సాగరమాత 4) చోగోరీ
14. మిష్మి కొండలు ఏ రాష్ట్రంలో ఉన్నాయి?
    1) ఉత్తరాఖండ్ 2) నాగాలాండ్
    3) అరుణాచల్ ప్రదేశ్ 4) బీహార్
15. భారతదేశంలో ఎత్తైన కనుమ ఏది?
    1) బుర్జిలా 2) కారకోరం
    3) ఖార్దుంగ్లా 4) జోజిలా
16. ఫిర్ పంజాల్, దౌలాధార్ పర్వత శ్రేణులు ఎక్కడ ఉన్నాయి?
    1) హిమాద్రి హిమాలయాలు
    2) హిమాచల్ హిమాలయాలు
    3) శివాలిక్ కొండలు
    4) ట్రాన్స్ హిమాలయాలు
17. భారతదేశంలో అతిపెద్ద నదీ ఆధారిత దీవి ఏది?
    1) గోవిందసాగర్ 2) మజులీ
    3) బైసాలా 4) ఏదీకాదు
18. సాత్పురా పర్వతాల్లో ఎత్తైన శిఖరం ఏది?
    1) అమర్ కంటక్ 2) మైకుల
    3) పంచమర్హి 4) ధవళగిరి
19. హిమాలయాలు ఏ యుగంలో ఆవిర్భవించాయి?
    1) ప్లిస్టోసీన్ 2) టెర్షియోరరీ
    3) కేంబ్రియన్ 4) ఏదీకాదు
20. సర్వే ఆఫ్ ఇండియా ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉంది?
    1) అమృత్‌సర్ 2) సిమ్లా
    3) డెహ్రాడూన్ 4) త్రివేండ్రం
21. కొడైకెనాల్ ఏ కొండల్లో ఉంది?
    1) యాలకుల కొండలు
    2) పళని కొండలు
    3) బాబా బుడాన్ గిరికొండలు
    4) తమిళనాడు కొండలు
22. మహేంద్రగిరి శిఖరం ఏ పర్వతాల్లో ఉంది?
    1) వింధ్య 2) సాత్పురా
    3) పశ్చిమ కనుమలు
    4) తూర్పు కనుమలు
23. ముంబై – నాసిక్‌ను కలిపే కనుమ ఏది?
    1) థాల్‌ఘాట్ 2) బోర్‌ఘాట్
    3) పాల్‌ఘాట్ 4) కలహట్టి
24. సాడిల్ పీక్ ఎక్కడ ఉంది?
    1) నికోబార్ దీవులు
    2) అండమాన్ దీవులు
    3) సుహేలి దీవులు
    4) మినికాయ్ దీవులు
25. 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ' ఎక్కడ ఉంది?
    1) చెన్నై 2) పనాజీ
    3) బెంగళూరు 4) కొచ్చిన్
26. 'గ్రీష్మ రుతువు' కాలం ఏది?
    1) మార్చి, ఏప్రిల్ 2) మే, జూన్
    3) జూలై, ఆగస్టు
    4) సెప్టెంబర్, అక్టోబర్
27. భారత వాతావరణ పరిశోధన కేంద్రం ఎక్కడ ఉంది?
    1) కోల్‌కతా 2) హైదరాబాద్
    3) పుణే 4) బెంగళూరు
28. అధిక వర్షపాతం సంభవించే 'మాసిన్ రామ్' ఏ రాష్ట్రంలో ఉంది?
    1) మణిపూర్ 2) అసోం
    3) నాగాలాండ్ 4) మేఘాలయ
29. జాతీయ వరద నియంత్రణ కార్యక్రమాన్ని ఎప్పుడు ప్రారంభించారు?
    1) 1956 2) 1975
    3) 1954 4) 1974
30. భారతదేశంలో ఎత్తైన జలపాతం ఏది?
    1) దూద్‌సాగర్ 2) జోగ్
    3) రకిమ్‌కుండ్ 4) కుంతల
31. కాలబైశాఖీలు అనే రుతుపవన ఆరంభ జల్లులు ఏ రాష్ట్రంలో కురుస్తాయి?
    1) ఉత్తరప్రదేశ్ 2) పశ్చిమబెంగాల్
    3) అసోం 4) కేరళ
32. లానినో, ఎల్‌నినోలు ఎక్కడ సంభవిస్తాయి?
    1) హిందూ మహాసముద్రం
    2) పసిఫిక్ మహాసముద్రం
    3) అట్లాంటిక్ మహాసముద్రం
    4) బంగాళాఖాతం
33. భారతదేశంలో అత్యధికంగా వర్షపాతాన్నిచ్చే రుతుపవనాలు ఏవి?
    1) ఆగ్నేయ రుతుపవనాలు
    2) వాయువ్య రుతుపవనాలు
    3) నైరుతి రుతుపవనాలు
    4) ఈశాన్య రుతుపవనాలు
34. ఈశాన్య రుతుపవనాల వల్ల అధికంగా వర్షపాతం పొందే రాష్ట్రం ఏది?
    1) కేరళ 2) కర్ణాటక
    3) ఆంధ్రప్రదేశ్ 4) తమిళనాడు
35. విస్తీర్ణపరంగా అడవులు ఎక్కువగా ఉన్న రాష్ట్రం ఏది?
    1) మధ్యప్రదేశ్ 2) ఛత్తీస్‌గఢ్
    3) మిజోరాం 4) ఉత్తరప్రదేశ్
36. తీర ప్రాంతాల్లో అత్యధికంగా తుపాన్లకు గురయ్యే రాష్ట్రం ఏది?
    1) తమిళనాడు 2) ఒడిశా
    3) గోవా 4) అసోం
37. భారతదేశంలో అత్యల్ప వర్షపాతం నమోదయ్యే ప్రాంతం ఏది?
    1) లఢక్ 2) బికనీర్
    3) లే 4) జైసల్మీర్
38. మనదేశంలో అధిక విస్తీర్ణంలో ఉన్న అడవులు ఏవి?
    1) క్షారజల అరణ్యాలు
    2) సతతహరిత అరణ్యాలు
    3) ఆకురాల్చే అడవులు 4) చిట్టడవులు
39. దచిగామ్ దుప్పి వన్యప్రాణి సంరక్షణ కేంద్రం ఏ రాష్ట్రంలో ఉంది?
    1) ఉత్తరాంచల్ 2) జమ్ము-కశ్మీర్
    3) బీహార్ 4) హిమాచల్ ప్రదేశ్
40. అంతర్జాతీయ అటవీ దినోత్సవాన్ని ఎప్పుడు నిర్వహిస్తారు?
    1) మార్చి 21 2) మార్చి 22
    3) మార్చి 29 4) మార్చి 24
41. 'ప్రాజెక్ట్ ఎలిఫెంట్'ను ఎప్పుడు ప్రారంభించారు?
    1) 1992 2) 1991 3) 1990 4) 1994
42. మనదేశంలో మొదటి టైగర్ రిజర్వ్ కేంద్రం ఏది?
    1) కజిరంగా 2) బందీపూర్
    3) నామ్‌దఫా 4) సిమిపాల్
43. భారతదేశంలో అత్యధిక విస్తీర్ణంలో ఉన్న నేలలేవి?
    1) చిత్తడి నేలలు 2) ఒండలి నేలలు
    3) నల్ల నేలలు 4) ఎర్ర నేలలు
44. సాయిల్ అండ్ ల్యాండ్ యూజ్ సర్వే ఆఫ్ ఇండియాను ఎప్పుడు ఏర్పాటు చేశారు?
    1) 1951 2) 1954
    3) 1958 4) 1960
45. కేంద్రీయ అటవీ నేలల పరిశోధన సంస్థ ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉంది?
    1) బళ్లారి 2) కోటా
    3) పసద్ 4) ఊటీ
46. చేతివేళ్ల ఆకారంలో జరిగే క్రమక్షయాన్ని ఏమంటారు?
    1) పట క్రమక్షయం 2) వంక క్రమక్షయం
    3) అవనాళికా క్రమక్షయం
    4) వాలు క్రమక్షయం
47. వరి పంటను ఏ మృత్తికల్లో అత్యధికంగా పండిస్తారు?
    1) ఎర్ర నేలలు 2) ఒండ్రు నేలలు
    3) నల్లరేగడి నేలలు 4) జేగురు నేలలు
48. వేదకాలంలో 'చంద్రభాగ'గా పేర్కొన్న నది ఏది?
    1) రావి 2) చినాబ్
    3) బియాస్ 4) సట్లేజ్
49. బ్రహ్మపుత్ర నదిని బంగ్లాదేశ్‌లో ఏమని పిలుస్తారు?
    1) మజిలీ 2) పద్మా
    3) మేఘన 4) ఐరావతి
50. 'దక్షిణ గంగ' అని ఏ నదిని పిలుస్తారు?
    1) నర్మద 2) తపతి
    3) గోదావరి 4) కృష్ణా
51. రామ్‌గంగ తీరంలో ఉన్న కాంస్య నగరం ఏది?
    1) ఉజ్జయినీ 2) రూర్కెలా
    3) మొరాదాబాద్ 4) ఫిరోజ్‌పూర్
52. 'కూడంకుళం అణు విద్యుత్ కేంద్రం' ఏ రాష్ట్రంలో ఉంది?
    1) రాజస్థాన్ 2) గుజరాత్
    3) ఉత్తరప్రదేశ్ 4) తమిళనాడు
53. దేశంలో అతిపెద్ద మంచినీటి సరస్సు ఏది?
    1) సాంబర్ 2) ఊలార్
    3) చిల్కా 4) లోక్‌తక్
54. బాగ్లీహర్ ప్రాజెక్ట్ విషయంలో భారత్‌కు ఏ దేశంతో వివాదం ఉంది?
    1) నేపాల్ 2) చైనా
    3) బంగ్లాదేశ్ 4) పాకిస్తాన్
55. బాబ్లీ ప్రాజెక్టు ఏ రెండు రాష్ట్రాల మధ్య వివాదాస్పదమైంది?
    1) కర్ణాటక –ఆంధ్రప్రదేశ్
    2) మహారాష్ట్ర – తెలంగాణ
    3) తమిళనాడు –కర్ణాటక
    4) కేరళ – తమిళనాడు

సమాధానాలు

1) 4; 2) 3; 3) 2; 4) 1; 5) 4;
6) 1; 7) 1; 8) 2; 9) 3; 10) 3;
11) 4; 12) 2; 13) 3; 14) 3; 15) 3;
16) 2; 17) 2; 18) 3; 19) 2; 20) 3;
21) 2; 22) 4; 23) 2; 24) 2; 25) 2;
26) 2; 27) 3; 28) 4; 29) 3; 30) 2;
31) 2; 32) 2; 33) 3; 34) 4; 35) 1;
36) 2; 37) 4; 38) 3; 39) 2; 40) 1;
41) 1; 42) 2; 43) 4; 44) 3; 45) 4;
46) 2; 47) 2; 48) 2; 49) 3; 50) 3;
51) 3; 52) 4; 53) 2; 54) 4; 55) 2.

తెలంగాణ ఉద్యమం.. జేఏసీలు.. ప్రజా సంఘాల పాత్ర

తెలంగాణ ఉద్యమం.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆకాంక్ష.. దాన్ని సాకారం చేసుకోవడంలో జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ)లు.. ప్రజా సంఘాలు, ఉద్యోగ సంఘాలు, విద్యార్థుల పాత్ర అనిర్వచనీయం. 1969 మొదలు 2014లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర నిర్ణయం వెలువడిన దశ వరకు ఇవి ఎంతో క్రియా శీలకంగా వ్యవహరించాయి. రాజకీయ పార్టీలను సైతం ఈ జేఏసీలు, ప్రజా సంఘాలు ప్రభావితం చేశాయి. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులోప్రధాన భూమిక పోషించాయి. 2009 డిసెంబర్ 24న ఏర్పడిన రాజకీయ జేఏసీకి నేతృత్వం వహించి.. సహాయ నిరాకరణ, మిలియన్ మార్చ్, మానవ హారం, సకల జనుల సమ్మె, సాగర హారం, జైల్ భరో, రైల్‌రోకో, వంటా వార్పు వంటి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించిన ప్రొఫెసర్ ఎం.కోదండరాం.. తెలంగాణ ఉద్యమంలో జేఏసీలు, విద్యార్థి సంఘాలు, ఉద్యోగ సంఘాలు, ఇతర ప్రజా సంఘాల పాత్రపై అందిస్తున్న ప్రత్యేక వ్యాసం..

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ ఉద్యమం

తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలోని వివిధ దశల్లో అనేక సంయుక్త కార్యాచరణ కమిటీలు (జేఏసీలు) ఏర్పడి తెలంగాణ ప్రజల ఆశలు– ఆకాంక్షల స్ఫూర్తిగా పోరాడాయి. తెలంగాణకు నదీజలాలు, ఉద్యోగాలు, విద్యావకాశాల విషయంలో అన్యాయం జరగడం, రాష్ట్ర ఆదాయాన్ని పంపిణీ చేసుకోవడంలో వివక్షలు, భారీ స్థాయిలో భూ ఆక్రమణలు, సాంస్కృతిక దురాక్రమణ, తెలంగాణ ప్రజల పట్ల చిన్నచూపు, ఇతర ఆధిపత్య ధోరణుల కారణంగా ప్రత్యేక రాష్ట్రం సాధించుకోవాలనే నిర్దిష్ట లక్ష్యంతో జేఏసీలు ఏర్పడ్డాయి. దశాబ్దాల చరిత్ర ఉన్న తెలంగాణ ఉద్యమంలో తొలి నుంచీ జేఏసీలు, ప్రజా సంఘాలే కీలక పాత్ర పోషించాయి. 1969 ఉద్యమంలో సైతం వీటి పాత్రే కీలకం. అప్పట్లో ప్రత్యేకంగా విద్యార్థి, ఉద్యోగ సంఘాలు చేసిన పోరాటం.. తెలంగాణ ప్రాంతంలోని మిగతా అన్ని వర్గాలను తెలంగాణ ఉద్యమం దిశగా కదిలించింది.

ఎన్‌జీవోలు.. విద్యార్థులు.. ప్రజాసమితి..

తెలంగాణ ఉద్యమంలో ఎన్‌జీవోలు, విద్యార్థులది ఘనమైన పాత్ర. 1968లో విద్యార్థులు, ఎన్‌జీవోలు ఒక్కతాటిపై నిలిచి హైదరాబాద్‌లో పీపుల్స్ కన్వెన్షన్‌ను నిర్వహించారు. ఈ సదస్సు తర్వాతి క్రమంలో ప్రజా సమితిగా మారింది. విద్యార్థి, ఉద్యోగ సంఘాలు ఇచ్చిన స్ఫూర్తితో ఏర్పడిన ప్రజా సమితి.. 1969 ఫిబ్రవరిలో తెలంగాణ ప్రజా సమితి (టీపీఎస్)గా రూపాందింది. దీనికి అప్పటి కాంగ్రెస్ నేత చెన్నారెడ్డి నేతృత్వం వహించారు. కాంగ్రెస్ పార్టీ నుంచే తెలంగాణ వాదం వినిపించిన పలువురు నేతలు ఆ పార్టీ నుంచి బయటికి వచ్చి తెలంగాణ ప్రజా సమితిలో చేరారు. ప్రజా సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక తెలంగాణ ఆకాంక్ష దిశగా ఎన్నో ఆందోళన కార్యక్రమాలు జరిగాయి. తెలంగాణ ఉద్యోగుల సంఘం 1969 జూన్ 10న సమ్మె నిర్వహించింది. చెన్నారెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రజా సమితి తర్వాత క్రమంలో రాజకీయ పార్టీగా నమోదు చేసుకుంది. ఖైరతాబాద్ ఉప ఎన్నికల్లో విజయం సాధించింది. తర్వాత కూడా అదే స్ఫూర్తి కొనసాగించింది. ముఖ్యంగా 1969 జూన్‌లో నాటి ప్రధాని ఇందిరాగాంధీ హైదరాబాద్‌కు వచ్చి ప్రత్యేక తెలంగాణ ఆకాంక్షపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. అయినా కాంగ్రెస్ పార్టీ నిర్ణయంలో ఎలాంటి మార్పు కనిపించలేదు. దాంతో తెలంగాణ ప్రజా సమితి 1971 పార్లమెంట్ ఎన్నికల్లో పూర్తి స్థాయి రాజకీయ పార్టీగా పోటీ చేసింది. దీనికి తెలంగాణ ప్రాంతంలోని అన్ని వర్గాలు, విద్యార్థి సంఘాలు, ప్రజా మద్దతు లభించింది. తెలంగాణ ప్రాంతంలోని 14 పార్లమెంట్ సీట్లకు గాను 10 స్థానాల్లో టీపీఎస్ విజయం సాధించింది. తర్వాత కాలంలో తెలంగాణ ప్రజా సమితిలోని నాయకులు తిరిగి కాంగ్రెస్‌లో చేరడంతో ఆ పార్టీ మనుగడ సాగించలేకపోయింది.

1996.. ముందుకొచ్చిన ఉద్యమం

ప్రత్యేక తెలంగాణ ఆకాంక్ష, ఆ దిశగా మలి దశ ఉద్యమం 1996లో మొదలైంది. దీనికి ప్రధాన కారణం అప్పటి ప్రభుత్వం అనుసరించిన ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ విధానాలే. ఉపాధి కల్పన, జీవనోపాధి, ప్రజల సంక్షేమం పరంగా ప్రభుత్వం నుంచి అంతగా ఆశించకూడదని పేర్కొనడం, ప్రైవేటు వర్గాలకు చేయూతనిచ్చే విధంగా వ్యవహరించడం జరిగింది. దీంతో అప్పటికే తాము వివక్షకు గురవుతున్నామనే భావనలో ఉన్న తెలంగాణ ప్రజలు.. ప్రభుత్వం తీసుకున్న ప్రైవేటీకరణ విధానాల వల్ల తాము మరింత వివక్షకు గురవుతామని, విద్యా, ఉపాధి అవకాశాలు సన్నగిల్లుతాయని ఆందోళన చెందారు. దీనికి పరిష్కారం ప్రత్యేక తెలంగాణ సాధనే అనే అభిప్రాయానికి వచ్చారు. దీంతో మలి దశ ఉద్యమం మొదలైంది. ఈ క్రమంలోనూ విద్యార్థులు కీలక పాత్ర వహించారు. తెలంగాణ స్టూడెంట్స్ ఫ్రంట్; తెలంగాణ లిబరేషన్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ వంటి సంఘాలు ఆవిర్భవించాయి.

ఓయూ జేఏసీ ఆధ్వర్యంలో సభ

ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థుల జేఏసీ ఆధ్వర్యంలో 1993 ఆగస్టులో చిన్న రాష్ట్రాల ఏర్పాటుపై జాతీయ స్థాయి సెమినార్‌ను నిర్వహించారు. ఇందులో జార్జి ఫెర్నాండెజ్, జస్టిస్ మాధవ రెడ్డి, సురేంద్ర మోహన్ వంటి జాతీయ స్థాయి రాజకీయ, మేధావి వర్గాల వారు పాల్గొన్నారు. ఆ తర్వాత 1996లో తెలంగాణ జర్నలిస్టులు, రచయితల నేతృత్వంలోని ఫోరం ఫర్ ఫ్రీడమ్ ఆఫ్ ఎక్స్‌ప్రెషన్ పేరుతో సభ జరిగింది. 1996 నవంబర్ 1న వరంగల్‌లో తెలంగాణ ప్రజా సమితి నిర్వహించిన సభ ప్రత్యేక తెలంగాణ ఆకాంక్షను ప్రస్ఫుటం చేసింది. ఈ సభకు భారీ ఎత్తున ప్రజలు స్వచ్ఛందంగా హాజరయ్యారు. వాస్తవానికి తెలంగాణ ఉద్యమాన్ని ప్రారంభించి, తీవ్రతరం చేయడంలో వివిధ కళాశాలలు, విశ్వవిద్యాలయాల విద్యార్థుల పాత్ర ఎంతో ఉంది. ముఖ్యంగా ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థుల జేఏసీ, కాకతీయ విశ్వవిద్యాలయ విద్యార్థుల జేఏసీ ఉద్యమాన్ని క్రియాశీలకంగా నడపడంలో కృషి చేశాయి. తెలంగాణ రాష్ట్ర సమితి అధినేత కె.చంద్రశేఖర రావు ఆమరణ నిరాహార దీక్షకు మద్దతుగా విద్యార్థి జేఏసీ 2009లో చలో అసెంబ్లీకి పిలుపు ఇచ్చింది. అలాగే 2010 జనవరిలో విద్యార్థి జేఏసీ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నిరసనకు ప్రభుత్వం అనుమతి నిరాకరిస్తే, హైకోర్టును ఆశ్రయించి భారీ ప్రదర్శనను విజయవంతంగా నిర్వహించింది. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు మొదటి నుంచీ ఎంతో ముఖ్యమైన పాత్ర పోషించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఎంతో క్రియాశీలంగా వ్యవహరించారు.

టీఆర్ఎస్ ఆవిర్భావం

మలిదశ తెలంగాణ ఉద్యమంలో అత్యంత ప్రత్యేక పరిణామం.. తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) ఏర్పాటు. అప్పటివరకు ప్రత్యేక తెలంగాణ ఆకాంక్ష దిశగా ఈ ప్రాంత ప్రజలు చేపట్టిన అనేక ఆందోళన కార్యక్రమాలను, ఇతర నిరసనలను ప్రభుత్వాలు తమ అధికారంతో అణచివేశాయి. తెలంగాణ ఆకాంక్షను రాజ్యాంగబద్ధంగా తెలపాలనే ఉద్దేశంతో అప్పటివరకు తెలుగుదేశం పార్టీలో ఉన్న కె.చంద్రశేఖరరావు.. ప్రత్యేక తెలంగాణ అంశమే ఎజెండాగా 2001లో టీఆర్ఎస్ పార్టీని నెలకొల్పారు. దీంతో ఉద్యమంలో రాజకీయ ప్రక్రియ ప్రారంభమైంది. అప్పటి నుంచి ఏదో ఒక విధంగా ఉద్యమ కార్యక్రమాలు జరగడం, వాటిలో విద్యార్థులు, మేధావులు, న్యాయవాదులు, ఉపాధ్యాయులు.. ఇలా అన్ని వర్గాలు మమేకమయ్యాయి. మలి దశలో 1990ల నుంచి 2009 వరకు వేర్వేరుగా ఉద్యమ కార్యక్రమాలు నిర్వహించిన వర్గాలు.. 2009లో ఐక్యమవడం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం దిశగా కీలక పరిణామం. 2009 నవంబర్ 29 నుంచి టీఆర్ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర రావు ఆమరణ నిరాహార దీక్ష నేపథ్యంలో మళ్లీ పౌర సంఘాల పాత్ర తెరపైకి వచ్చింది. ముఖ్యంగా ఉస్మానియా యూనివర్సిటీ, కాకతీయ యూనివర్సిటీ విద్యార్థుల ఐక్య వేదికలు కేసీఆర్ దీక్షకు సంఘీభావంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఆందోళన కార్యక్రమాలను అణచివేయాలని అప్పటి ప్రభుత్వం ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీల్లోని విద్యార్థులపై చేసిన లాఠీచార్జీ, కాల్పుల కారణంగా సాధారణ ప్రజానీకం సైతం ఉద్యమం పట్ల ఆకర్షితులయ్యారు.

2009 నాటికి ప్రాధాన్యం గుర్తించిన అన్ని పార్టీలు

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు దిశగా రాజకీయ పార్టీలు విభిన్న శైలుల్లో వ్యవహరించాయి. 1999 ఎన్నికల సమయంలో కాకినాడ ప్లీనరీలో 'ఒక ఓటు–రెండు రాష్ట్రాలు' నినాదం చేసిన భారతీయ జనతాపార్టీ తర్వాత ఏకాభిప్రాయం పేరుతో వెనుకడుగు వేసింది. 2001లో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీర్మానం కూడా తెలంగాణకు వ్యతిరేకంగానే ఉంది. ఈ తీర్మానం అస్పష్టంగా ఉంది. రెండో ఎస్సార్సీని వేయాలని తీర్మానం చేసి ఎన్‌డీఏ ప్రభుత్వానికి ప్రతిపాదించింది. ఇదే సమయంలో కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వం ప్రత్యేక తెలంగాణ ఆకాంక్షను గుర్తించడం గమనార్హం. 2004 ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీతో పొత్తు పెట్టుకుని ఎన్నికల్లో పోటీ చేసింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం దిశగా భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసిన రాజకీయ పార్టీలు.. 2009 నాటికి దీని ప్రాధాన్యం, ఆవశ్యకతను గుర్తించాయి.

ముఖ్యంగా ఆ సమయంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ 2009 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు తమకు అభ్యంతరం లేదని చెప్పడంతోపాటు ఈ దిశగా ముందుకెళతామని పేర్కొంది. తెలుగుదేశం పార్టీ మాత్రం మొదటి నుంచి పూర్తి వ్యతిరేకతతో వ్యవహరించింది. 2012 డిసెంబర్ 28న ఆల్ పార్టీ మీటింగ్‌లో తెలంగాణకు మద్దతు తెలిపినా.. రాజకీయంగా మాత్రం వ్యతిరేకంగా వ్యవహరించింది. ఎంఐఎం పార్టీ మాత్రం నిర్ణయాన్ని కాంగ్రెస్ పార్టీకే వదిలేసింది.

చివరికి 2014లో పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టగా అధికార, విపక్ష సభ్యులు మద్దతు తెలిపారు! 2014 ఫిబ్రవరి 18న లోక్‌సభ, 2014 ఫిబ్రవరి 20న రాజ్యసభలో ఆమోదం పొందిన బిల్లును 2014 మార్చి1న రాష్ట్రపతి ఆమోదించారు. దశాబ్దాల పోరాటం ఫలించి తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా 2014 జూన్ 2న తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా, భారతదేశంలో 29వ రాష్ట్రంగా అవతరించింది!!

మలిదశలోనూ.. ప్రజా సంఘాలే

మలి దశ తెలంగాణ ఉద్యమంలోనూ ప్రజా సంఘాలు, విద్యార్థులు, ఉద్యోగులు, మేధావులదే ముఖ్య పాత్ర అని చెప్పాలి. తొలుత 1989లో తెలంగాణ ఇన్ఫర్మేషన్ ట్రస్ట్ ఏర్పాటయింది. దీని ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని బసంత్ టాకీస్‌లో భారీ సభ జరిగింది. 1969 ఉద్యమంలో పాల్గొన్న నేతలంతా ఈ సభకు హాజరై.. పెద్ద మనుషుల ఒప్పందం, ముల్కీ నిబంధనలు, వాటికి ఆంధ్ర నేతల అడ్డంకుల గురించి చర్చించారు. ఈ చర్చలు సమాజంలోని అన్ని వర్గాలకు చేరడంతో తెలంగాణ ఆకాంక్ష మరింత తీవ్రమైంది. ఉద్యమంలో పల్లె స్థాయి నుంచి ప్రతి ఒక్కరూ పాల్పంచుకోవడం ప్రారంభమైంది. 1970ల తర్వాత విద్యావకాశాలు విస్తృతమయ్యాయి. రిజర్వేషన్లు, ఇతర కారణాల వల్ల ఆర్థిక కోణంలో మధ్యతరగతి వర్గం పెరిగింది. ఈ వర్గం నుంచి విద్యావంతుల సంఖ్య పెరిగింది. దాంతో తెలంగాణ ప్రజలు వివక్షకు గురవుతున్న విధానంపై మరింత చైతన్యం వచ్చింది. వారంతా తెలంగాణ ఉద్యమంలో భాగస్వాములయ్యారు. క్రమేణా 1990ల నాటికి ఈ పౌర సంఘాలు బలపడ్డాయి. మలి దశ ఉద్యమంలో మరింత క్రియాశీలకంగా వ్యవహరించాయి. తెలంగాణ మహా సభ, తెలంగాణ జన సభ, తెలంగాణ ఐక్య వేదిక ఇలా ఎన్నో సంఘాలు ఏర్పడ్డాయి.

పొలిటికల్ జేఏసీ.. ఇలా:

తెలంగాణ పొలిటికల్ జేఏసీ ఏర్పాటు తెలంగాణ ఉద్యమ క్రమంలో అత్యంత ప్రత్యేకమైన పరిణామం. కె.చంద్రశేఖర రావు ఆమరణ నిరాహార దీక్ష నేపథ్యంలో డిసెంబర్ 9, 2009న అప్పటి కేంద్ర హోం శాఖ మంత్రి పి.చిదంబరం 'తెలంగాణ ఏర్పాటు దిశగా అవసరమైన చర్యల ప్రక్రియను ప్రారంభిస్తున్నాం' అని ప్రకటించారు. అయితే డిసెంబర్ 23 నాటికి పరిస్థితి తలకిందులైంది. డిసెంబర్ 9 ప్రకటనకు భిన్నమైన ప్రకటన విడుదలైంది. అన్ని పార్టీలను సంప్రదించిన తర్వాతే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుపై నిర్ణయం తీసుకుంటామని ఆ ప్రకటన సారాంశం. దీంతో ప్రజల్లో ఆగ్రహం పెల్లుబికింది. ఆయా పార్టీల్లోని తెలంగాణ ప్రాంత నేతలు ప్రజల్లోకి వెళ్లలేని పరిస్థితి. దీంతో డిసెంబర్ 24, 2009న అన్ని రాజకీయ పార్టీల నేతలంతా కలిసి రాజకీయ ఐక్య వేదిక(జేఏసీ)ను ఏర్పాటు చేశారు. ప్రధానంగా జేఏసీ నేతృత్వంలో సహాయనిరాకరణ, మిలియన్ మార్చ్, సకల జనుల సమ్మె చరిత్రలో నిలిచిపోయేలా జరిగాయి. తెలంగాణ ప్రత్యేక ఉద్యమ క్రమంలో తెలంగాణ ఉద్యోగులు, పౌర సంఘాలు నిర్వహించిన ఆందోళన కార్యక్రమాల్లో.. 2011 ఫిబ్రవరి 17 నుంచి 16 రోజుల పాటు ఉద్యోగుల సహాయ నిరాకరణ; తెలంగాణ జేఏసీ ఆధ్వర్యంలో 2011 మార్చి 10న మిలియన్ మార్చ్; 2011 సెప్టెంబర్ 13 నుంచి 42 రోజులపాటు జరిగిన సకల జనుల సమ్మె; 2011 సెప్టెంబర్ 24, 25 తేదీల్లో సడక్ బంద్; 2012 సెప్టెంబర్ 30న సాగర హారం నిర్వహణ ముఖ్య ఘట్టాలుగా పేర్కొనొచ్చు. ఇదే క్రమంలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు – ఆవశ్యకతపై 2010 ఫిబ్రవరి 10న కేంద్రం ఐదుగురు సభ్యులతో శ్రీ కృష్ణ కమిటీని నియమించింది.

Currency Notes are printed at?

BANK EXAMS

BANKING AWARENESS

1. Who is the Chairman of NABARD (National Bank for Agriculture and Rural Development)?
a) Dr. Harsh Kumar Bhanwala
b) Mrs V.R.Iyer c) HR Kamath
d) B Bhattacharya
e) R Rajendran
2. For recovery of NPA from the defaulted borrowers, SARFAESI Act 2002, is implemented. What does the letter 'S' stands for in SARFAESI
a) Social b) Security
c) Seasonal d) Stamp
e) Systematic
3. Bank holidays under Sec.25 of N.I. Act are declared by
a) RBI
b) State govt. for the respect state
c) Central govt.
d) LHO e) Prime Minister
4. One rupee coin issued under _____ Act
a) Coinage Act 1906
b) RBI c) BR
d) All the above
e) None of these
5. Clean Note policy has been introduced as per
a) Banking Regulation Act
b) RBI Act c) SBI Act
d) PNB Act e) None of these
6. Under prevention of Money laundering Act 2002, the financial transaction records have to be preserved for _____ years.
a) 5 b) 10 c) 20 d) 40
e) None of these
7. Under prevention of Money laundering Act 2002, banks have to report suspicious transaction to
a) RBI b) CBI c) FIU-IND
d) LHO e) Central Govt.
8. RBI Has relaxed KYC norms for small account holders who do not intend to make deposits over Rs.50,000/- and total credits in the account in a year is limited to Rs. 1 lakh. Total withdrawls/ Transfer in a month does not exceed Rs. ____
a) 10,000 b) 20,000
c) 50,000 d) 60,000
e) None of these
9. When form15-H has been received, the bank shall forward the same to I.T. Department on or before ____ day of next month.
a) 3rd b) 5th c) 7th
d) 15th e) 17th
10. In which of the following transaction PAN should be quoted?
a) A time deposit exceeding Rs.50,000
b) Payment in cash to purchase bank draft or banker's cheque for an amount aggregating Rs.50,000 or more during any one day
c) Deposit cash aggregating Rs. 50,000 or more during any one day
d) All the above e) None of these
11. Currency Notes are printed at:
a) Nasik b) Dewas c) Mysore
d) Salboni e) All of these
12. If the customer does not cooperate for making their accounts KYC compliant, despite repeated communication/ contacts, their accounts should be ____
a) Frozen b) Closed
c) Close the account only after compliance of KYC
d) a or c e) a & b
13. As per KYC Norms / AML measures risk categorization of all customer accounts should be done and review of risk categorization should be cared out at ____ months intervals every year.
a) 3 b) 6 c) 9
d) 12 e) 15
14. SLR has to be maintained by banks under _______
a) Sec. 24 of BR Act
b) Sec. 24 of RBI Act
c) Sec. 42 of RBI Act
d) Sec. 42 of BR Act
e) None of these
15. Who is the Chairman of IRDA?
a) T.S.Vijayan
b) Dr. Rangarajan c) M.V.Nair
d) J.S. Bhatnagar e) HR Khan
16. Who is the authority for referring appeals against the award of banking ombudsman?
a) Deputy Governor, RBI
b) RBI Governor
c) CMD of concerned bank
d) Group of CMDs formed by RBI
e) None of the above
17. The sponsoring bank's share in RBIs is:
a) 50% b) 35% c) 15%
d) 75% e) None of these
18. Can a HUF join as a partner in a partnership firm?
a) Can be included
b) Can be included with company
c) Cannot join
d) Can join subject to the approval of CMD
e) None of the above
19. Bank's Lien is:
a) General lien b) Particular lien
c) Contingent lien
d) b & c e) None of these
20. Within how many days the CPIO (Central Public Information Officer) has to provide information under RTI Act?
a) 30 days b) 15 days
c) 45 days d) 10 days
e) 60 hours
21. Which of the following is not a negotiable instrument as per N.I. Act?
a) Promissory note b) Draft
c) TDR (Term Deposit Receipt)
d) Cheque
e) None of the above
22. Which of the following is not correct in respect of issue of CP:
a) It can now be issued as a standalone facility
b) Minimum issue is Rs. 5 lakh
c) CPs can be underwritten by a bank
d) Minimum Tangible net worth of the Corporate should be Rs. 4 crore
e) All the above
23. The maximum period for which a CD can be issued is _____
a) 1 month b) 3 months
c) 180 days d) 1 year
e) None of these
24. What is not true about CDs?
a) It is transferable from the data issues
b) It can be issued for a minimum period of 7 days
c) It is not all transferable
d) It can be issued in demat form only
e) None of these
25. Gilt edged securities refer to ___
a) Govt. securities
b) Shares of first class companies
c) Securities issued by first class companies
d) Duplicate securities
e) Securities issued by RBI Identified Companies
26. The standard rate at which the RBI is prepared to buy or rediscount export bills or other commercial paper eligible for purchase from banks under the RBI Act is known as _____
a) Bank rate b) Repo Rate
c) Card rate d) PLR
e) Base Rate
27. The result of increase in SLR by RBI is
a) Decrease in lendable resources of banks
b) Increase in loadable resources of banks
c) There will not be any change in loan able resources of banks
d) Only b and c
e) None of these
28. Blue chip securities mean ____
a) Shares of progressive, well managed companies with excellent record of payment of dividends.
b) The shares which are in blue ink
c) Securities issued by Chip Manufacturing companies
d) Securities identified by the concerned state governments
e) None of the above
29. Cash kept in the currency chest is owned by
a) Currency Chest Branch Bank
b) Central Government
c) Reserve Bank of India
d) State Bank of India
e) None of the above
30. Bank can't proceed against the borrower under SARFAESI Act where:
a) Security is agricultural land
b) Liability is less than Rs.1 lakh
c) Liability is less than 20% of the principal
d) Pledge of movables
e) All the above
31. The minimum capital required to start a new private sector bank is_____
a) 100 crore b) 200 crore
c) 300 crore d) 400 crore
e) 500 crore
32. RBI injects liquidity through
a) Increase Bank Rate
b) Reduction of Repo Rate
c) Reduction of Reverse Repo
d) Increase CRR
e) Increase SLR
33. A customer requested to include his wife and daughter as nominees after one year of opening of the account. Will it be accepted?
a) It can be accepted since the nominees are the family members of the depositor
b) Cannot be considered since the request is not received at the time of opening of account
c) Can be considered with 50% share each
d) Nomination should be made only in favor of single name. Hence can't be considered
e) None of the above

KEY

1) a; 2) b; 3) b; 4) a; 5) a; 6) b; 7) c; 8) a; 9) c; 10) d; 11) e; 12) b; 13) b; 14) a; 15) a; 16) a; 17) b; 18) c; 19) a; 20) a; 21) c; 22) c; 23) d; 24) e; 25) a; 26) a; 27) a; 28) a; 29) c; 30) e; 31) e; 32) b; 33) d.